రచయిత ప్రచురణలు

ఆధునిక స్త్రీ
మనం దేనికి బానిసలం
తల్లే పిల్లను చంపితే
విముక్తి ఉద్యమాలు : మహనీయులు
ఓ మహిళా! ముందుకు సాగిపో
మారుతున్న సమాజం మహిళలు
మహిళాభ్యుదయము — వ్యాస సంకలనాలు
మాతృత్వానికి మరోముడి — కథా సంపుటి
వెలిగిన జ్యోతి — నవల

అచ్చులో

చీకటి వెలుగులు — నవల
రాణి రుద్రమదేవి — బాలల నవల
ఈ దేశం నాదేనా — చిన్న నవల
నవోదయం — నవల
వలపు పంజరం — నవల
ఇస్లాం : స్త్రీలు
క్రైస్తవం : స్త్రీలు

రాబోవు రచనలు

వివాహ వ్యవస్థ
ఆంధ్రప్రదేశ్‌లో మహిళోద్యమం
Women's Movement & Organisations
Women : Tradition & Culture

మహిళా అభ్యుదయము

మల్లాది సుబ్బమ్మ



ప్రజాస్వామ్య ప్రచురణలు (ప్రై) లిమిటెడ్
8, ఎం. ఐ. జి. హెచ్. కాలనీ, మెహిదీపట్నం,
హైదరాబాద్ - 500 028

ప్రజాస్వామ్య ప్రచురణలు నెం. **19**

మహిళా అభ్యుదయము

రచన: మల్లాది సుబ్బమ్మ

ప్రథమ ముద్రణ 1983
ప్రతులు 1000

పబ్లిషర్సు:-
ప్రజాస్వామ్య ప్రచురణలు (ప్రై) లిమిటెడ్.
9, ఎం. ఐ. జి. హెచ్. కాలనీ
మెహిదీపట్నం, హైదరాబాద్ 500 028.

సోల్ డిస్ట్రిబ్యూటర్సు:-
వికాసం
9, ఎం. ఐ. జి. హెచ్. కాలనీ
మెహిదీపట్నం, హైదరాబాద్ 500 028
ఫోన్ నెం. 31423

(రెండు భాగాలు)
వెల రు. **15-00**

ముద్రణ
లిబర్టి ప్రింటర్సు
చీరాల - 523 155.

విషయసూచిక

మహిళా అభ్యుదయం

మహిళా దశాబ్దము



స్వవిషయం

"ప్రజాస్వామ్య ప్రచురణలు" ఒక వినూత్న ప్రయత్నం. ఇతర సంస్థలతో రూపసామ్యం వున్న ఆదర్శాలలో, లక్ష్యసాధనా విధానాలలో, కార్యాచరణ రీతులలో భిన్నమైనది.

వ్యక్తి జీవితంలో, సమాజ జీవితంలో అన్ని రంగాలలో ప్రజాస్వామ్యం వెల్లి విరిసి మూడు పూవులు, ఆరు కాయలుగా వర్ధిల్లాలని ఈ సంస్థ అభిమతం, ఆశయం కూడాను.

ఇలాంటి ప్రయత్నాలు పూర్వం జరిగినవి. ప్రస్తుతం జరుగు చున్నవి. కాని, వానికీ-ఈ ప్రయత్నానికీ తారతమ్య మున్నది. ఉదాత్తమయిన ఆశయాలతో, ఉత్తేజంపొందిన మేధావుల సమిష్టి సహకార కృషి ఫలితంగా ఈ సంస్థ ఉద్భవించింది.

విశ్వ జనీనతే దీని విశిష్టత. మొత్తం మానవ ప్రపంచ సంస్కృతీ సాహిత్యాలు దీని వారసత్వం. ముఖ్యంగా భారతదేశ సంస్కృతిలో ఇంత వరకు మరుగున పడిన మాణిక్యాలు—చార్వాక, కపిల, కణాదుల మతాలు, సిద్ధాంతాలు దీని సొమ్ము. తెలుగుదేశమే కాదు, తెలుగు భాష విస్తరించిన ప్రాంతమంతా దీని కార్యక్షేత్రము.

ప్రపంచంలో విప్లవాలు ఎక్కడ వచ్చినా, ఏ కాలమందు జరిగినా, అవన్నీ దీనికి అధ్యయన యోగ్యాలే. ఇంగ్లండులో 1689లో బ్రిటిషు రాచరికానికి పరిమితులు, హద్దులు విధించిన విప్లవం: అమెరికాలో 1773 లో ప్రాతినిధ్యాధికారమున్నవారే పన్నులు విధించగల హక్కుదారులనే 'ప్రజాస్వామ్యం' సూత్రాన్ని ఎలుగెత్తిచాటిన విప్లవం: 1789 లో స్వేచ్ఛ, సమానత్వము, సౌభ్రాతృత్వము ఆదర్శాలుగా విజయుపంతమయిన ఫ్రెంచి విప్లవం; 1917 లో 'భూమి, తిండి, శాంతి' నినాదాలతో కార్మికవర్గం, మధ్యతరగతి రష్యాలో సాధించిన విప్లవం: 1947 లో భారతదేశం పొందిన స్వాతంత్ర్యం; 1949లో కర్షకబలం చైనాలో జరిగిన విప్లవం మొదలయిన చారిత్రాత్మక సంఘటనలను లోతుగా, సునిశితంగా, సమ్యక్‌దృష్టితో పరిశీలించి తదనుగుణమైన ప్రచురణలు చేయాలని ఈ సంస్థ ఆదర్శం.

సామాజిక పరివర్తనకూ, భావగమనానికీ అవినాభావ సంబంధ మున్నదనే విషయం జగద్విదితం. అయితే భావాలు ప్రాతిభాసికాలేనా

లేక మానవ మస్తిష్కములో ఉదయించిన తరుణం నుంచీ ప్రత్యేక గమన సూత్రాలతో స్వతంత్ర లక్షణాలు కలిగి పెంపొందుచున్నవా? రెండవ స్వరూపం అవశ్య పరిగ్రహణయోగ్యం. ఈ సూత్రాన్ని విశ్వవిఖ్యాత విప్లవవాది, మేధావి అయిన యమ్. ఎన్. రాయ్ 1946 లో ప్రవచించాడు. ఈ భావన యీ సంస్థకు జీవగర్ర.

వ్యక్తివాదం, హేతువాదం, మానవవాదం ఈ సంస్థను శాసించే త్రికము (త్రిగుణాలు). మానవులంతా ఒకటే; మానవ సమాజానికి మూలం మానవుడే; మానవుని అభ్యున్నతియే మానవ సమాజ అభ్యుదయానికి, శ్రేయస్సుకు కొలమానం లేక వరుమానం; ప్రకృతి నియమబద్ధమైనది కనుక ప్రకృతినుంచే ఉద్భవించిన మానవుడుకూడా వస్తుతః నియమబద్ధుడు అంటే హేతువాది. కనుక అతడు నీతివంతుడుగా మనగలడని ప్రకటించిన రాడికల్ హ్యూమనిజం యొక్క తాత్విక సిద్ధాంతం ఈ సంస్థకు వెలుగు బాటగా అడుగడుగునా ప్రభావితం చేస్తుంది.

మానవవాదం యీనాటిది కాదు. మానవజాతి సహజంగా మనుగడ సాగించినప్పటినుంచీ యీ తాత్విక చింతన జరుగుతూనే వచ్చినది. కాని ఆధునిక యుగంలో మానవ విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందటంతో ప్రస్తుతం నూతన భాష్యాలతో, వినూత్న విషయ పరిజ్ఞానంతో ఆ పాత కాలపు మానవవాదాన్ని పరిశీలించి, సవరించి, పునరుద్ధరించవలసిన అవసరమేర్పడినది. ఆకృషి ఫలితమే యమ్.ఎన్.రాయ్ నవ్యమానవవాదం.

స్వేచ్ఛాపిపాస, సత్యాన్వేషణ మానవ మనుగడ ప్రేరకాలని పేర్కొనటం ఈ నవ్యమానవవాద విశిష్టత. (1) అంతరాత్మ ప్రేరిత నీతి లేక దైవ నిర్దేశిత నీతి: (2) ప్రయోజనాత్మక నీతి; అనే రెంటికీ ప్రత్యామ్నాయంగా హేతుబద్ధమయిన నీతిని చాటిచెప్పినది. రాజకీయరంగంలో పార్టీ రహిత ప్రజాస్వామ్యాన్ని ప్రతిపాదించినది. ఆర్థిక రంగంలో సహకార సంబంధమయిన ప్రణాళికా రచనలను రూపొందించినది. సాంస్కృతిక రంగంలో భావ స్వతంత్ర ప్రతిపత్తిని గుర్తించినది. సాంఘికంగా కుల, మత, వర్గ, లింగ, ప్రాంతీయ, భాష, జాతి, దేశ విభేదాలను నిరసించినది; విశ్వజనీయ సంస్కృతికి విలువనిచ్చినది. ఏకత్వంలో భిన్నత్వాన్ని, భిన్నత్వంలో ఏకత్వాన్ని చూడగల్గినది. అంధ విశ్వాసాలకు గొడ్డలి పెట్టు. ప్రబోధ కార్యక్రమాలను బలపరుస్తుంది. అందులో ఒక భాగమే ఈ సంస్థ ప్రచురణ యత్నం.

ఈ ప్రకృతికి అతీతమయిన మరే యితర శక్తి లేదని తెలుసుకొనటం తన మనుగడకు, భవిష్యత్తుకు తానే బాధ్యుడనని గుర్తెరగటం, తన క్షేమానికీ, అభ్యున్నతికీ, తోటి మానవుల శ్రేయస్సుకూ వైరుధ్యంలేదనే విషయాన్ని గ్రహించి సమాజ స్థితిగతులను మెరుగు పరచటానికి ఉద్యుక్తుడు కావడం ఉత్తమ మానవలక్షణం.

ఈ మానవవాద లక్ష్యాలనే 1952 లో నెలకొల్పబడిన అంతర్జాతీయ హ్యూమనిస్టు నైతిక సంఘం మరోరూపంలో ప్రకటించినది. భారత రాడికల్ హ్యూమనిస్టు సంఘాన్ని ఆ ప్రపంచ సంస్థ గుర్తించి పూర్తి సభ్యత్వాన్నిచ్చినది. ఆ అంతర్జాతీయ సంఘం ఐదు ఖండాలలోని అనేక దేశాలలో అనుబంధ సంస్థలు కలిగి అసమానమైన కృషి సాగిస్తున్నది.

ప్రస్తుతం ప్రపంచ మానవాళి సాంస్కృతికంగా విషమస్థితిలో చిక్కుకొని యున్నది. ఒకవైపు మత ప్రాబల్యాలు, మరోవైపు ఫాసిజం, కమ్యూనిజంలాంటి నియంతృత్వ విధానాలు చలామణి అవుతూ ప్రజల సంక్షేమం కొరకు ప్రజల ఆశయాలను నెరవేర్చకపోగా హీనస్థితికి దిగజార్చు చున్నవి. దీని ఫలితంగా తృతీయ మార్గాన్వేషణ ప్రారంభ మయినది. విజ్ఞానం పెరుగుదల, మానవ మేధస్సు-సృజనాశక్తి అభివృద్ధి చెందడంతో నూతన తాత్విక చింతనలకు ప్రాతిపదిక ఏర్పడినది.

దీనినే నైతిక హ్యూమనిజం అని పిలవటం కూడా కద్దు. ఇది ప్రజాస్వామ్య సూత్రానికి కట్టుబడి వున్నది. ప్రతివ్యక్తి సాధ్యమైనంతగా వికాసం పొందటానికి హక్కు కలిగి యున్నాడు. కేవలం ప్రభుత్వ పరిధిలోనేగాక జీవిత సంబంధాలన్నింటిలోనూ, ఈ ప్రజాస్వామ్య సూత్రం వర్తిస్తుంది. విజ్ఞానాన్ని మానవ వినాశనానికి కాక క్షేమానికి, శ్రేయస్సుకు, నిర్మాణ యుతంగా వినియోగించటం ఈ సిద్ధాంతపు ఆదర్శ ముఖ్య లక్షణాలలో ఒకటి. విజ్ఞానము లక్ష్యాలను నిర్దేశించదు. మానవ శ్రేయస్సును సాధించటానికి అనువైన మార్గాలను సూచిస్తుంది.

హ్యూమనిజం నైతిక దృక్పథం కలది. మానవుని హుందాతనాన్ని, సాధ్య మైనంతలో ప్రతివ్యక్తి ఇతోధికంగా ఇతరుల హక్కులకు భంగం కలుగని రీతిగా స్వయంగా వికాసాన్ని పొందగల హక్కును గుర్తిస్తుంది. సామర్థ్యం, క్రమశిక్షణ పేరుతో మానవ జీవితాన్ని యాంత్రికం చేసే వ్యవస్థను వ్యతిరేకిస్తుంది. యాంత్రీకరణ మానవ విలువలను వమ్ము చేస్తుంది. కనుక, తాత్కాలిక లక్ష్యాలను సాధించే ప్రయత్నంలో సమగ్ర

నియంతృత్వ సిద్ధాంతాలు అమలుపరచ జూచే సమగ్ర యాంత్రీకరణను త్రోసి రాజంటుంది. సమాజం యెడ బాధ్యతతో సమ్మిళితమైన వ్యక్తి స్వేచ్ఛను లక్ష్యంగా స్వీకరిస్తుంది. భౌతిక అవసరాలను తీర్చటం, భౌతిక పరిస్థితులను మెరుగుపరచటం అనే పేరుతో పైన పేర్కొనబడిన వ్యక్తి స్వేచ్ఛను త్యజించ నిచ్చగించదు. మానసిక స్వేచ్ఛ, మౌలిక చింతన లేనప్పుడు అభ్యుదయం అసాధ్యం.

పిడివాదాన్ని, పిడివాదపు సిద్ధాంతాన్ని త్రోసిరాజని హ్యూమనిజం స్వేచ్ఛను ప్రబోధిస్తుంది. నైతిక విలువలను, సృజనాశక్తులతో సమ్మిళిత మైన జీవిత విధానాన్ని, వ్యక్తి వికాసాన్ని లక్ష్యంగా అంగీకరిస్తుంది. మారుచున్న సమాజానికి అనుగుణంగా అభ్యుదయ పథంలో అనుసరించ దగిన మౌలిక జీవిత సూత్రం ఇది.

విజ్ఞానాన్ని ప్రపంచ శాంతి కొరకు వినియోగించ గలిగితే ప్రస్తుత విషమ స్థితినుంచి మానవాళి విముక్తి చెందగలదు. భయవిముక్తుడైన మానవునిపరిపూర్ణ వికాసానికి పరిమితులుండకూడదు. ఈ తాత్విక ఆలోచనా రీతిని మానవ ప్రపంచం ప్రస్తుతం ఎదుర్కొనే సవాలుకు సరియైన జవా బుగా భావించవచ్చును.

ఇలాంటి తాత్విక ధోరణి స్వేచ్ఛా భావుకతను పోషిస్తుంది. కనుక అన్ని సామాజిక రంగాలలోను వినూత్నమయిన రీతిలో స్వేచ్ఛను పెంపొం దించి అభ్యుదయ మార్గాన అడుగుల వేయించగల నూతన భావాన్వేషణయే 'ప్రజాస్వామ్య ప్రచురణల సంస్థ' ధ్యేయం.

అట్టి భావాలను ప్రజాబాహుళ్యానికి ఎరుకపరచటం ఈసంస్థ ప్రథమ కర్తవ్యంగా భావిస్తుంది. ఇది సాహసమే కావచ్చు. ప్రమాదభరితం కూడా కావచ్చు. కాని లక్ష్యసాధన కొరకు చేసే ఇట్టి కృషిని విస్మరించ జాలము. ఈ ప్రయత్నానికి, వ్యాపారానికి స్వేచ్ఛాపిపాసకల వ్యక్తు లందరి సానుభూతి సహకారాలను అర్థిస్తున్నాము.

సభ్యులు : శ్రీ ఎం. వి. రామమూర్తి
శ్రీ కోగంటి రాధాకృష్ణమూర్తి
శ్రీ గుంటుపల్లి గోపాలరావు
శ్రీమతి మల్లాది సుబ్బమ్మ
శ్రీ గురిజాల సీతారామయ్య
శ్రీ కొల్లా సుబ్బారావు

ఎం. వి. రామమూర్తి
అధ్యక్షుడు
బోర్డు ఆఫ్ డైరెక్టర్స్

నా సాహితీ యాత్ర

ఆమె ఆడది. ఈదేశంలో పుట్టిన ఆడది. విద్యలేక, విజ్ఞానం అసలే లేక మతకబంధహస్తాలలో, పురుషుల ఇనుపసంకెళ్ళలో బంధింపబడ్డ ఆడది. వాళ్ళ కాళ్ళక్రిందపడి నల్లిలా నలిగి అణగారిపోతున్న ఆడది. సంరక్షకత్వంవల్లఆర్థిక స్వేచ్ఛపోగొట్టుకున్న అబల. ద్వంద్వనీతివల్ల సామాజిక దోపిడీకి గురి అయిన నిర్భాగ్యురాలు కాదంటారా? ఔనంటే మరేంచెయ్యాలి? అందుకే సాంఘిక ఔన్నత్యం కోసం, సమసమాజ నిర్మాణంకోసం, భారతనారీస్వేచ్ఛా, సమానత్వాలకోసం రచనయే మార్గదర్శకమనే ధ్యేయంతో నేనీవ్యాసావళిని ముద్రిస్తున్నాను. ఇలాంటి సాహిత్య సమిధలతో సాంఘిక దురాచారాలను, మహిళలపై జరిగే అత్యాచారాలను కాల్చివేసి, మహిళా లోకానికి సేవచేయాలనే తీవ్రమైన ఆకాంక్ష నాలో ఉత్తేజాన్ని కలిగించింది. నా కలాన్ని కదిపింది. ఈనాటి వ్యవస్థలోని లోపాలను స్త్రీల కొరకు ఏర్పరచిన దురాచారాలను, అరాజకాలను ఎత్తిచూపాలనేదే నా ఆరాటం. స్త్రీ స్వేచ్ఛకోసం, సమానత్వం కోసం సమాజంలోని కుళ్ళును, అవినీతిని బట్టబయలు చే ~~యాలనే~~ దే నా ధ్యేయం.

సమతా నినాదం ఈనాడొక ఫ్యాషను అయింది. ఈనాడు వేదికలెక్కి స్త్రీలకు సమానత్వం అక్కరలేదని, వారికి ప్రాతినిధ్యం ఇవ్వరాదని, వారిని తక్కువగా చూడాలని, వారి శ్రమకు తక్కువ ఫలితం ఇవ్వాలని అనగల ధైర్యమున్నవారు అరుదు. కాని ఈనాటి ఉపన్యాసాలు, శాసనాలు కాగితాలకే పరిమిత మవుతున్నాయి. మహిళాభ్యుదయం ఆచరణలోమాత్రం మృగ్యం అయింది. స్త్రీ పూజనీయురాలని, చట్టంముందు, దైవంముందు హెచ్చు తగ్గులు లేవని అన్ని మతాలవారు బీరాలు పలుకుతారు. అందువల్లే ఈ 'పురుషసూక్తులు' స్త్రీలు నమ్మేరోజులు పోయినాయి.

అసలు స్త్రీ జీవితమే సమస్యల విషవలయం. ప్రతి సమస్యను ఒక వ్యాసంగా వ్రాయవచ్చు; ఒక కథగా, నవలగా వ్రాయవచ్చు. సమస్యలకు పరిష్కారం చూపేవారు కొందరైతే, అవి పాఠకులకే వదలి వేయాలనేవారు మరికొందరు. వ్యాధి లక్షణాన్ని వివరిస్తేచాలదు; వ్యాధికి మూలకారణమేదో

కనిపెట్టి దానికి తగిన చికిత్స చేయగలవారే నిజమైన వైద్యులు. అలాగే సృజనాత్మకశక్తి, వాస్తవిక అవగాహన, సామాజికస్పృహ, విమర్శనాపటిమ గల రచయితే జీవిత సత్యాలను శోధించగలరు. నేటి స్త్రీల ఆర్థిక, సాంఘిక, నైతిక పరమైన వర్తమానస్థితిగతులను వెలికితెచ్చి సమ్యక్ దృష్టితో వాటిని పరిశీలించి పరిష్కారమార్గాలను సూచిస్తూ పాఠకులకు అందివ్వాలనే తపనే నన్ను సాహిత్య ప్రక్రియకు ప్రోత్సహించింది. ఇదే నా సాహితీ యాత్రకు నిజమైన ప్రాతిపదిక.

తరం మారినప్పుడల్లా సంప్రదాయాలు, ఆచారాలు, సిద్ధాంతాలు మారుతూవుంటాయి. అలా మార్పుచెందనిచో వాటి ఉనికే లేనట్లు. భావ విప్లవంతోపాటు సాహితీ విప్లవం రాకతప్పదు. మానవ జీవితపు సంస్కృతికి అద్దంవంటిది సాహిత్యం. ఆ సాహిత్యం ద్వారా నలిగిన స్త్రీ జీవితాన్ని వెలికితెచ్చి ఆమెలో ఆశాజ్యోతులు వెలిగించాలనేదే నా తపన.

పురుష సంస్కృతి అనే కాలసర్పం నేటి స్త్రీని కాటేసింది. సంప్రదాయం, ఆచారం, పవిత్రత అనే విషసర్పాలు ఆమెపై ఆజన్మాంతం బుసకొడుతూనే వున్నాయి. వివాహ వ్యవస్థ, దాంపత్యజీవితం ఆమె స్వేచ్ఛను, సుఖాన్ని అరికడుతున్నాయి. తన కోసం సృష్టించుకొన్న సంఘానికి, చట్టానికి తానే బంధీ అయినట్లు స్త్రీ అనేక కట్టుబాట్లలో బంధింపబడి, గందరగోళంలో పడిపోయి తన కర్తవ్యాన్ని విస్మరిస్తుంది. స్త్రీ పట్ల పురుషదౌష్ట్యాన్ని, సామాజిక కుళ్ళును, రాజకీయ నిరసనను, ఆర్థిక అసమానత్వాన్ని బహిర్గత పర్చటానికే నేనీ సాహితీ యత్నాన్ని చేపట్టటం జరిగింది. అందుకే నవలలు, కథలు, వ్యాసాలు, ఉపన్యాసాలు నేను ఎన్నుకున్న సాహితీ రీతులు.

'నాకు పురుషద్వేషి, స్త్రీ పక్షపాతి, కుటుంబ శాంతి విధ్వంసకురాలు' అనే బిరుదాలిస్తూ ఎగతాళి చేస్తుంటారు. ఆ గుసగుసలు వింటూంటే నాకు బాధఅనిపించదు. కాని ఆడవాళ్ళను 'అయ్యోపాపం' అంటూ కనికరించడం, 'దిక్కుమాలినది' అంటూ జాలితో చూడటం, నీచంగా మాట్లాడటం 'ఈ పనికి ఆడదే తగినది' అని వేలెత్తి చూపడం, సానుభూతితో ఏదో ఒక

పదవి మోహాన పారేయుటం, ప్రతి కమిటీలో ఒకస్థానం కేటాయించడం లాంటి వ్యక్తులను, వారి వ్యవస్థను చూస్తుంటే ఒళ్ళు భగ్గున మండుతుంది. పని విభజనతో టీచరు, నర్సు, టైపిస్టులాంటి విసుగుపుట్టే పనులకు "ఆడాళ్ళే" తగుదురన్నట్లు ఇవ్వటం చూస్తుంటే "అది వారి దృష్టిదోషమా? బధిరత్వమా? అన్నంత ఆవేదన కలుగుతుంది. మహిళలు నోరుమూసుకుని పడివున్నన్నాళ్ళు ఈ భాగోతం ఇంతే ! !

మానవ హక్కుల్ని అమెరికను, ఫ్రెంచి, రష్యను విప్లవాలు ఉద్ఘాటన చేసిన తదుపరి స్త్రీలను మానవులుగా పరిగణించడం జరిగింది. కనుక సమాజ సమస్యలను పరిష్కరించటానికి స్త్రీలు సైతం భాగస్వాములు కావాలి. అసలు స్త్రీల సమస్యలు భారత సమాజ సమస్యలలో భా గ ం కాపనే దుష్ట భావనవల్లే మనమూ, మన సమాజము అల్లకల్లోలంలో పడిపోయాం. సమాజంలో స్త్రీస్థానానికి, సామాజిక వ్యవస్థకూ సన్నిహితత్వం లేదనుకొనటం భ్రమ; అవివేకం కూడాను. ఈనాటి మహిళోద్యమ లక్ష్యం తమ సమస్యలను, స్థితిగతులను సరిదిద్దుకొనటం మాత్రమేకాదు. యావత్ ప్రపంచ సమస్యలను, అశాంతిని పరిష్కరించటంలో మహిళలు భాగస్వాములు కావాలనేదే లక్ష్యం కావాలి. దేశ సమస్యలను పురుషులు సరిదిద్దే వరకూ స్త్రీలు మిన్నకుండటం భావ్యంకాదు. తాము సమాన హక్కులకోసం పోరాడుతూ దేశ సమస్యలను పురుషులకే వదలివేయుటం అసమంజసం, నిష్ప్రయోజనం కూడా. వివేకం, చైతన్యంకల మహిళలు సామాజిక మార్పు ప్రగతికోసం పోరాటం, తిరుగుబాటులాంటి ఉద్యమాలలో భాగస్వామ్యం వహించాలి. ఏ ఇతర మానవుడితోనైనా సమాన హోదా పొందాలంటే తమ బాధలు, సమస్యలు భారత ప్రజానీకపు దుఃఖంలో, బాధలలో మిళితమయి ఉంటాయి కాని పూర్తిగా వేరుకాదు అనేభావం అవసరం. ఈనాటి మహిళోద్యమవైఖరిలో సిద్ధాంతపరంగాను ఆచరణలోనూ కొంతమార్పుఅనివార్యం అవుతున్నది. ఆ మార్పును గుర్తించగలస్థాయి ప్రజలలో రాక తప్పదు; వస్తుంది: రావాలి.

పురుషద్వేషంతో స్త్రీల సమస్యలు చక్కబడతాయని నమ్మిన వారిలో నేను మొదటిదాన్ని. స్త్రీలంతా మ హా గు ణ వంతులని, పురుషులందరూ

నియంతలని నిర్వచించటం అమానుషమేకాదు, మహాపరాధం కూడా అవుతుంది. ఏదయినా 90% జరిగేదాన్ని మొత్తంమీద నిజంగాచెప్తాం. కనుక నేటి పురుషాధిపత్య సమాజ ధోరణిని ఈ చిన్న వ్యాసావళిలో విమర్శించటం జరిగింది. ఇందులో భారత దేశంలో స్త్రీల పరిస్థితిని, దేశదేశాల స్త్రీల సమస్యలను కొంతవరకు చర్చించాను. 'నాకు తెలిసింది బహు తక్కువ; తెలియాల్సింది చాలాఎక్కువ. అలాగే రాసిందిఅతిస్వల్పం; రాయాల్సింది అనంతంగా ఉంది' అని సవినయంగా మనవి చేస్తున్నాను. ఇందులోని పొరపాట్లను, తప్పులను సహృదయంతో చదువరులు మన్నించగలరు.

కృతజ్ఞతలు

ఈ వ్యాసాలు అనేక వార, మాస, పక్ష పత్రికలలో ప్రచురణ యోగ్యత పొందాయి. కొన్ని రేడియోలో, టి.వి. లో ప్రసారమయినాయి. సెమినార్లలో, చర్చావేదికలలో, సభలలో చేసిన ప్రసంగాలు కొన్ని ఉన్నాయి. విన్ (Win: Women's International Network News) అనే అమెరికను పత్రిక అందించిన సమాచారం ఆధారంతో రాసినవి మరికొన్ని. వీరి అందరి సౌజన్యానికి నేను కృతజ్ఞురాలను.

ఈ పుస్తక రచన సందర్భంగా అనేక సలహాలనిచ్చి తోడ్పడి పరిచయ వాక్యం కూడా వ్రాసియిచ్చిన నా సహచరుడు ఎం. వి. రామమూర్తి గారి సహకారాన్ని నేను విస్మరించలేను గ్రంధ ప్రచురణలో నాకు సహాయం చేసిన మిత్రుడు రావిపూడి వెంకటాద్రిగారికి నేను రుణపడి ఉన్నాను. సకాలంలో ఈ పొత్తాన్ని అచ్చువేసి అందించిన లిబర్టి ప్రింటర్స్, చీరాల వారికి నా కృతజ్ఞత.

రచయిత్రి.

మల్లాది సుబ్బమ్మ

పరిచయం

స్త్రీ పురుషులు సమానులుని విశ్వమానవ హక్కుల పత్రంలో, భారత రాజ్యాంగంలో పేర్కొనడం జరిగింది. కొన్ని దేశాలలో స్త్రీలకు రాజకీయ స్వాతంత్ర్యంవుంటే సామాజిక, సాంస్కృతిక స్వేచ్ఛలు లేకుండావున్నాయి. మరికొన్ని దేశాలలో సామాజిక స్వేచ్ఛవున్నా, రాజకీయాధికారం మహిళలకు అల్లంతదూరానవుంది. పెట్టుబడిదారీ అమెరికాలో ఇంటిపనిలో పురుషుడు పాల్గొంటే, సోషలిస్టు రష్యాలో ఇంటిపని అంతా ఇల్లాలే చెయ్యాలి. మధ్య ప్రాచ్యంలో స్త్రీలకు ముసుగు తప్పనిసరి అయితే, కొన్ని దేశాలలో ఆమెకు సాంఘిక స్వాతంత్ర్యం హెచ్చుగావుంది. పురుషాధిక్యసమాజపు దేశాలయిన ఇజ్రాయిల్, శ్రీలంక, ఇండియాలాంటి దేశాలు మహిళలను ప్రధాన మంత్రుణిలుగాచేసి తృప్తి పడ్డాయి. మొత్తంమీద స్త్రీ పురోగతి నత్తనడక నడుస్తుంది. ఆమె శరీరంపై ఆమెకు హక్కులేదు. సంతానం కనే విషయంలో ఆమెకు స్వేచ్ఛలేదు. ఆమెను ఎంతసేపూ భోగ్యవస్తువుగా చూడటం పరిపాటి అయింది. ఆమెకు తాము విద్యను అందివ్వక ఆ అర్హత ఆమెకు లేదని నిందించి అధికార కేంద్రాలకు దూరంగా వుంచుతున్నారు. నిరక్షరాస్యత నిర్మూలనమైన దేశాలలోకూడా రాజకీయాధికారానికి ఆమె సుదూరంగా ఉంచబడుతుంది. ఈ లక్షణం పెట్టుబడిదారీ దేశాలలోను సోష లిస్టు దేశాలలోను-రెంటిలోను ప్రస్ఫుటంగా కనబడుతుంది. అందువల్ల స్త్రీ విమోచనోద్యమం విప్లవోద్యమంతో ఎలాంటి సంబంధం కలిగివుండాలనేది ప్రపంచం మొత్తంమీద చర్చనీయాంశమయింది. స్త్రీ విమోచన విప్లవ కార్యక్రమంలో విధిగా భాగంకావాలని కొంతమంది వాదిస్తుంటే, మరికొందరు విప్లవోద్యమం సఫలమయ్యే వరకూ మహిళోద్యమాన్ని ఉధృతం చేయ రాదని వాదిస్తున్నారు. విముక్తి ఉద్యమాల తదనంతరం వచ్చిన మార్పు లను గమనించిన వారు ఈ వాదాన్ని నిరసిస్తున్నారు. తోడునీడగావుండి పోరాడిన మహిళ గెరిల్లాలను వంటఇళ్ళకు పంపించిన తర్వాత వారికి స్త్రీ విమోచన ఆవశ్యకత యొక్క తీవ్రత, గాఢత అర్థమయ్యాయి. స్త్రీవిమోచన ప్రధానాంశం కాని, విప్లవం నేతి బీరకాయ లాంటిది.

మహిళాభ్యుదయాన్ని అహరహము కాంక్షించే శ్రీమతి సుబ్బమ్మ స్త్రీల సమస్యలను పరిశీలించి తమభావాలు వ్యాసరూపంగా వెలువరించింది. స్త్రీ విమోచనపట్ల ఆసక్తిని, ఆర్తిని, ఆకాంక్షను ఈ వ్యాస పఠనం పెంచ గలదని నేను ఆశిస్తున్నాను.

ఎం. వి. రామమూర్తి

మనస్త్రీలు : మతసంస్కృతి

" సంప్రదాయాన్ని మీరు పోషిస్తున్నారు. సంస్కృతిని మీరే పరిరక్షిస్తున్నారు. కుటుంబానికి మీరే ఆధారం. మీరు రాజకీయాల్లోకి రావద్దు. రాజకీయాల్లో స్త్రీలకు స్థానంలేదు. గతంలో మీకు ఓటులేదు; మీ మాటకు విలువలేదు. మీరు మా సంరక్షకత్వంలోనే వుండండి. కుటుంబ పెద్ద అయిన మీ భర్త సేవచెయ్యండి. వంశాన్ని ఉద్ధరించండి. అది మీ విద్యుక్తధర్మం అదే భారతనారీ సంస్కృతి దాన్నే తిరిగి పునరుద్ధరించండి. ఆ అవకాశం మీకు లభించినందువల్ల మీరు ధన్యులైనారు." వేదికలెక్కి రాజకీయ నాయకులు, ప్రొఫెసర్లు, మతాధికారులు స్త్రీలను ఇలా ఉద్వేగపర్చటం అన్ని దేశాల్లో, అన్ని కాలాల్లో జరుగుతూనేవుంది. ఇలాంటి వ్యవస్థను ప్రపంచంలోని పురుషులంతా బలపరిచి పోషిస్తున్నారు. ఎదురు తిరిగిన స్త్రీల ప్రాణాలను తీసి అయినాసరే వారు ఆ సంస్కృతిని నిలబెడతారు. ప్రతి సమాజంలోనూ, ప్రతి సంస్కృతిలోనూ స్త్రీలపై పెత్తనం సాగించటం ద్వారా పురుషులు లాభిస్తున్నారనే విషయం స్పష్టంగా రుజువయింది. జాతీయ ఉత్పత్తిలో స్త్రీలు ఇళ్ళల్లో చేసే బండచాకిరి పరిగణనలోకిరాదు. సంప్రదాయం పేరుతో స్త్రీలను పాతకాలపు సంస్కృతిలోకి నెట్టి వాళ్ళను తమ అదుపులో వుంచటానికి పురుషులు అవలంభించే మార్గాలు కాలానికి, దేశానికి మారవచ్చు; కాని వారి లక్ష్యాలు మాత్రం ఒకటే ఇది సర్వత్రా గోచరిస్తున్న నగ్నసత్యం. విశ్వవ్యాప్తంగా ఉన్న ఈ అంతస్తుల సమాజంలో స్త్రీ తలవంచి పురుషాధిపత్యానికి శరీర, ధన, మాన, ప్రాణాలను అర్పించి వ్యక్తిత్వంలేని ఆట బొమ్మగా జీవిస్తోంది. ఇదీ జరుగుచున్న కథ.

ప్రపంచ వ్యాప్తంగా స్త్రీ పురుషుల మధ్య తారతమ్యాలకు ముఖ్య కారణం మత సంస్కృతి, సనాతన సంప్రదాయం. ఎందరో మత ప్రవక్తలు ఉద్భవించారు. మరెన్నో మత సంస్కరణోద్యమాలు వెలిసాయి. ఇవన్నీ పురుషాధిపత్యాన్ని బలపరచినవే భగవద్గీత స్త్రీలు పాపగర్భంనుండి జన్మించారంటుంది. ఇస్లాం స్త్రీలను జంతువులతో, దున్నే పొలంతో పోల్చింది. క్రైస్తవం స్త్రీ పాపాలకు మూల కారణం అంటూ దేవుడు పురుషుని ముందు సృష్టించి అతని సంతోషంకోసం స్త్రీని సృష్టించాడని ఉద్ఘాటించింది.

హిందూమత సంస్కర్తల్లో ముఖ్యుడైన బుద్ధుడుసైతం సంస్కరణలలో స్త్రీల పాత్రను నిరశించాడు. శంకరాచార్యుడు స్త్రీలు నరకానికి సింహద్వారం వంటి వారన్నాడు. మనుస్మృతి స్త్రీలకు అజన్మాంతం సంరక్షత్వం ప్రతిపాదించింది; స్త్రీని బానిసత్వానికి చిహ్నంగా, ఆటబొమ్మగా మార్చేసింది. ఇలా అన్ని మతాలు స్త్రీని విధేయత చూపమని నిర్దేశించాయి. ఈ భావాలు తరతరాలుగా నరనరాన జీర్ణించుకొన్న స్త్రీలు 1955 లో హిందూకోడ్ బిల్లుకు వ్యతిరేకంగా స్త్రీలకు హక్కు లివ్వరాదని వాదించిన మతవాదుల్ని బలపరచి తమకు తామె ఉన్న బానిసత్వాన్ని ఇంకాఘట్టిగా బలపరచుకున్నారు. ఇలా ఆడది జన్మించినదాది మతం నిర్దేశించిన ధర్మాన్ని మనో వాక్కాయ కర్మల ఆచరించేటట్లు ఆమెకు 'బ్రెయిన్‌వాష్' చెయ్యబడింది. ఈ సమాజ పు పంప్రదాయానికి,సంస్కృతికి విరుద్ధమైన ఆలోచనఆమెచెయ్యలేదు.కనుకనే ఆధునిక భావాలు, శాస్త్రీయ దృక్పథం స్త్రీలలో మృగ్యమై వంటఇంటికీ, పడకటింటికి పరిమితమైనారు. ఈనాడు చట్టం, సమాజం కొన్ని హక్కులు, విద్యా, ఉద్యోగావకాశాలు కల్పించినా వారు స్వీకరించే స్థితిలోవున్నారా? అనేదొక బలీయమైన ప్రశ్నగానే మిగిలిపోయింది.

స్త్రీలలో చైతన్యం కావాలని కొందరూ, వారిని అదుపులో వుంచాలని మరికొందరూ వాదిస్తున్నారు. చైతన్యమూ, అదుపూ పరస్పర విరుద్ధాలు. అయినా పాశ్చాత్యదేశాల్లో, పారిశ్రామికంగా అభివృద్ధి చెందినదేశాల్లోకూడా స్త్రీలు రెండో తరగతి పౌరులుగానే చలామణి అవుతున్నారు. వారు మహిళా విమోచనోద్యమాలద్వారా పోరాడుతూనే వున్నారు. కొన్ని దేశాల్లో సాంఘికంగా, సాంస్కృతికంగా సమానత్వం పాటిస్తారు. కాని రాజకీయాల్లో చోటు పెట్టరు. బ్రిటన్‌లో ఆక్స్ఫర్డు యూనివర్శిటీలో స్త్రీలకు ప్రొఫెసర్ల పదవిగాని, ఆఖరికి వారికి సీట్లుకూడా ఇచ్చేవారుకారు ఇటీవలివరకు, మూడు దశాబ్దాలు అడుగడుగునా పోరాడివారు ఓటుహక్కు మరికొన్ని హక్కులు పొందగలిగారు. అమెరికన్ స్త్రీలు నర్సులుగాను, టీచర్లుగాను, టెక్నీషియన్లు సెక్రెటరిలేగాని సెనేట్‌లో, రాజకీయాది కీలకస్థానాలన్నీ పురుష పరంగావుంటాయి. 1917 రష్యన్‌విప్లవానికి పూర్వం జారుప్రభుత్వంలో స్త్రీలఅగచాట్లు వర్ణనాతీతం. ఈనాటికీ కొన్నిదేశాల శాసనసభల్లో స్త్రీలే లేరు. సిరియా, పాకిస్తాన్ ఇథియోపియా, ఈజిప్టు, కంబోడియా దేశాల్లో

స్త్రీలు ఎన్నికవటమే దుర్లభం, డిప్లమాటిక్ సర్వీసుల్లో స్త్రీలను పరిత్యజించే దేశాలనేకం. అసలు విద్యలేని, బ్యాంకు అంకౌంట్లు లేని స్త్రీలున్న దేశాలింకా వున్నాయి. మసీదుల్లోకి స్త్రీలు రాకూడదని, ప్రార్థనల్లో పురుషులతో కలసి పాల్గొనరాదని, శరీరంనిండా నల్లబురఖావేసుకొని (భర్తతోమాత్రమే) బైటికిరావచ్చని ముస్లిం స్త్రీలకు ఆంక్షలున్నాయి. నలుగురు భార్యలుండ వచ్చనే సంప్రదాయం ముసల్మానుల కింకా అమల్లోవుంది. అంగాంగ ప్రదర్శనలిచ్చే హాకీలాంటి ఆటల్లో స్త్రీలకు ప్రవేశార్హతలేదు. అదికాక ఈ మధ్య ముస్లింమహిళలు సినిమాలు చూడరాదనే ఫర్మానాలు జారీచేయ బడ్డాయి. ఉల్లంఘించినవార్ని చిత్రహింసలు పెట్టినట్లు వార్తలొచ్చినాయి. ఆడవాళ్ళు దెబ్బలు తినటం ప్రపంచమంతటావుంది. సమానత్వం ఏ దేశంలో నూలేదు. స్త్రీ కూడా ఒకవ్యక్తి అనిగుర్తించని దేశాలు కోకోల్లలు. అవి సాంస్కృతికంగా మధ్యయుగంలోవున్నట్లే. మనదేశం ఈ కోవకుచెందిందే.

ఈ దేశంలో స్త్రీ స్థానం పాదాలచెంతనే. బాలికకు శైశవం దాటగానే "మెల్లిగా మాట్లాడాలి; తలెత్తుకొని తిరగరాదు; నిటారుగా నిలబడ రాదు; భర్తకు అణిగి, మణిగివుంటూ మాకు కీర్తి ప్రతిష్టలు తేవాలి" అని శిక్షణ ఇస్తారు. ఆ హద్దు దాటిన స్త్రీకి పుట్టింటా, మెట్టినింటా చోటువుండదు. అసలు ఆడపిల్ల పుడితేదుఃఖపడి ఆ బిడ్డను హత్యచేసే జాతులింకా ఈదేశంలో వున్నాయి. ఒకానొక సామాజికదశలో మాతృస్వామిక వ్యవస్థవుండేదని చరిత్రకారులు తేల్చారు. కాని ఏకాలంలో, ఏదేశంలో, ఏరాజ్యంలో ఏజాతిలో, ఏమతంలో కాని స్త్రీ పురుషుడితో సమానహోదా అనుభవించినట్లు రికార్డయిన ఆధారాలులేవు. ఎక్కడో ఒక జంట తప్ప పురుషుడే అధికుడన్న ఆధారాలు అసంఖ్యాకం.

వేదకాలంలో గార్గి, మైత్రేయిలాంటి పండితురాండ్రు వుండేవారని గర్వపడతాం. కాని వేదాలు చూచినా, నాటి సంఘవ్యవస్థచూచినా స్త్రీకి ప్రత్యేక విశిష్టతఏమీ కన్పించదు. గర్భస్థశిశువు మగబిడ్డకావాలని ప్రార్థించి నట్లు ఆధారాలువున్నాయి. అసలు వేదప్రవచనం చేసిన ఋషులలో ఏవక్కస్త్రీలేదు. పైగా స్త్రీలు వేదం చదువరాదనే ఆంక్షకూడావుంది. ఇలా పెరుగుతూవచ్చిందే భారతనారి సంప్రదాయం; ఇదే మన సంస్కృతి.

" ఎక్కడ స్త్రీ గౌరవించబడదో అక్కడ శుభశాంతులుండ " వనే మరీచిలక పలుకుంది. మనదొక చిత్రాతిచిత్రమైన సంస్కృతి. స్త్రీ జనాభ్యుదయమే సమాజానికి గీటురాయి అంటారు పైకి. స్త్రీ పురుషు లిద్దరూ కలిసి తిరిగితేనే నిజమైన స్వేచ్ఛా, సమానత్వం అంటారు. దానికి భారత స్త్రీ నూరామడల దూరంలో వుంటుంది. అందుకే ఇక్కడ విప్లవం గాఢనిద్ర పోతోంది.

స్త్రీల హోదా అంటే సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలలో, సామాజిక వ్యవహారాలలో ప్రముఖ పాత్ర వహించడమే. స్త్రీల సామాజిక, ఆర్థిక స్థాయిని పెంచే ప్రయత్నాలు ఈ దేశంలో అత్యల్పంగా జరిగినై. ఉన్న వనరులను సైతం వారు స్వీకరించలేని స్థితికి కారణం అవిద్య, అజ్ఞానం, అసమానత, మూఢ విశ్వాసాలేనని చెప్పక తప్పదు. ఇలా అనేక పరిమితులకు లోనైన స్త్రీలు స్త్రీల సమస్యలను, పరిష్కారమార్గాలను గురించి ఆలోచించరు. తమ ఉనికిని గురించి పట్టించుకోరు. ప్రముఖమైన రాజకీయరంగంలో, శాసన నిర్మాణంలో తమ పాత్రను గురించి విస్మరించుటే విచక్షణకు నిదర్శనం. ఈనాటి 594 పార్లమెంటు మెంబర్లలో 19 మంది మాత్రమే స్త్రీలున్నారంటే రాజకీయ సమస్యలపై తగు నిర్ణయాలు చేయగల సమర్థత వారిలోలేదా? ప్రశ్నించుకోవాలి.

ఇక సాంఘికంగా ఆలోచిస్తే స్త్రీలపై జరిగే అత్యాచారాలకు అంతే లేదు. ఆమెనొక వస్తువుగా భావించి మానభంగాలు చేసేవారు కొందరయితే, వెట్టిచాకిరి చేయించుకొని తక్కువ వేతనాలిచ్చే వారనేకమంది. ఇక కట్నం తేలేదని కాల్చిచంపే రాక్షసుల కబంధ హస్తాలలో ప్రాణాలు విడిచే అబలలు అనంతంగా వుంటున్నారు. దుష్టుడైనా, క్రూరుడైనా ఆమె అణగి, మణిగి హారతులివ్వాలి, లేదా నల్లిలా నలిపేస్తాడు భర్త. ప్రేమించినవాణ్ణి పెళ్ళాడే యోగ్యతకు నోచుకోని అభాగినులెందరో ఆత్మార్పణంచేసుకోవటం సర్వ సామాన్యం. స్త్రీ విడాకులు పొందితే ఆమెను వివాహమాడే పురుషులు లేరనే చెప్పొచ్చు. బాల వితంతువైనా వివాహానికి నోచుకోనీయని దౌర్భాగ్యులున్న కృత్రిమ సమాజం మనది. వారు జీవచ్ఛవాల్లా బ్రతకాలి. వికృతమైన రూపంతో జీవించాలి ఇలా అనేకవిధాల బాధితులై, ప్రాణావశిష్టులై వువచ్ఛావాల్లా బ్రతికే స్త్రీలు కోట్లసంఖ్యలో ఈదేశంలోనే కాదు దేశదేశాలలో జీవిస్తున్నారనేది నగ్నసత్యం.

కారణాలేమయినాకాని స్త్రీ బానిసయి కట్టుబడి పోవటం జరిగిన విషయం. దానినుండి విముక్తి పొందటం జరగాల్సినపని. ఇది అతి క్లిష్టమైన సమస్య. సంప్రదాయాన్ని భేదించటం ఎంతకష్టమో ఆధునికతను స్థాపించటం అంతకన్నా కష్టం. కాని ఎప్పుడో ఎక్కడో అది ప్రారంభించక తప్పదుగదా! దానికి కొన్ని మౌలికమైన మార్పులు రావాలి. అంటే సామాజిక విలువల్లోనే మార్పులు తేవాలి. మేధా సంపత్తిలో, మానసిక ప్రవృత్తిలో స్త్రీ పురుష తేడాలు లేవని స్త్రీ పురుషులు మున్ముందుగా నమ్మాలి. అసలు చైతన్యవంతమైన స్త్రీ తమ ఆధీనంలో వుండాలనడం సామాజిక దోపిడిగా పురుషులు భావించిననాడే మహిళాభ్యుదయానికి నాంది ఏర్పడుతుంది. స్త్రీలు సైతం మున్ముందు తమ సమస్యల్ని గుర్తించాలి. తమలో మానసిక విప్లవంరావాలి. మూఢాచారాలపై తిరుగుబాటు చెయ్యాలి. ఆర్థిక భద్రతకై పాటుపడాలి. తమలో సాంఘిక, రాజకీయ పరిజ్ఞానం పెంపొందించుకోవాలి అక్షరాస్యత, విద్య, ఉపాధి శిక్షణాఅవకాశాల్లో స్త్రీ పురుష వివక్షత నేరంగా, సామాజిక విద్రోహంగా పరిగణించాలి. చిత్తశుద్ధి, నిస్వార్థచింతన, సేవా దృక్పథం, సంస్కరణాభిలాషగల స్త్రీలు అత్యధిక సంఖ్యలో ముందుకు రావాలి. తాత్వికచింతన, తార్కికదృష్టి, ప్రజాస్వామిక విలువలపై విశ్వాసమున్న స్త్రీలు స్త్రీల సంఘాలను స్థాపించి మానవ విలువలపై మగువలకు ఆసక్తిని కల్గించాలి. నిజాయితీగల స్త్రీల నాయకత్వంలో స్త్రీ విమోచనోద్యమాలు పురోగమించగలవు. స్త్రీలంతా సంఘటితమై సంఘాలను నిర్మించుకొని అవసరమైతే తిరుగుబాటు ద్వారానైనా తమ వ్యక్తిత్వాన్ని, హక్కులను నిల్పుకొన్ననాడే సామాజిక ప్రగతి వుంటుంది.

ప్రతి సంస్కరణ అభివృద్ధీ స్త్రీ జీవితంతో ముడిపడి వుంటుందని ముందుగా పురుషులు గ్రహించాలి. స్త్రీకి సమాన గౌరవం, అవకాశంలేని స్థితిని పురుషులు తమకు అవమానంగా భావించిననాడే సామాజిక మార్పు తథ్యమనే విషయంపురుషుల గ్రహించిననాడేమార్పులుశరవేగంగా రాగలవు.

ఏది ఏమయినా స్త్రీలు గత చరిత్రను నెమరువేసుకొని, వర్తమానాన్ని తిలకిస్తూ భవిష్యత్తుకై పరితపించాలి. దానికి స్త్రీలు తమ అస్తిత్వాన్ని తెలుసుకుంటే చాలదు. దానికి ఒక గొంతుచాలదు.

మత సంస్కృతిలో మహిళ

భారతదేశం పతివ్రతలకు పుట్టినిల్లు. 'సీతా, సావిత్రి, ద్రౌపతి, చంద్రమతులు ఈ గడ్డపైనేపుట్టి భారతీయ సంస్కృతికి మంచిపేర్లు తెచ్చారు; వారు గొప్పపేరు ప్రఖ్యాతులు గడించారు' అని పొగుడుతారు సనాతనులు. అనాదినుండి భారత మహిళలకు మాతృమూర్తి అనే టైటిలిచ్చి, సంతానమనే లంకె తగిలించి, పతివ్రత అనే ముళ్ళ కిరీటాన్ని నెత్తినపెట్టి ఆమెను నాలుగు గోడలమధ్య కట్టిపడేసింది మతం. మన సంస్కృతికి ఉన్న అనేకజాడ్యాలలో పాతివ్రత్యం ఒకటి.ఒకపురుషుడికి స్త్రీనిఎన్ని విధాల లొంగదీయడానికి అవకాశమున్నదో అన్ని విధాలైన రూపాంతరాలలో ఆమెను నిబద్ధంచేసి ఆ సూత్రాలు అమలు జరపటానికి ప్రయత్నించారు ఆర్యరుషులు. స్త్రీకి స్వేచ్ఛ అన్నపదానికిగాని, వ్యక్తిత్వం అన్నమాటకు గాని అర్ధం తెలియని రీతిలో మలిచింది మతం. రత్నహారాలు, అందెలు, కంకణాలు, దండ కడియాలులాంటి ఏడువారాల నొమ్ములిచ్చి మహిళను మచ్చిక చేశారు. అవి చూసుకొని మురిసిపోతోంది నాటి మహిళ, నేటిమహిళ కూడా.ఒకనాడు స్త్రీ స్వేచ్ఛను అరికట్టి. బంధించటానికి సమాజం తగిలించిన ఆ బంగారు సంకెళ్ళు ఈ నాటికీ విడివడనిరీతిలో బిగిసి ఆమెను బంధించి వుంచినై. ఈనాడు ఆ సంకెళ్ళు తెంపినా పారిపోని ఖైదీలుగా మలచబడ్డారు మన పతివ్రతలు. సాంఘికంగా,ఆర్థికంగా, నైతికంగా అణగి మణిగి వుండటానికి మహిళకు ఎన్ని కట్టుబాట్లకు అవకాశమున్నదో అన్నివిధాలా తరతరాలుగా మారని రీతిలో ఆమె 'బ్రెయిన్‌వాష్' చెయ్యబడ్డది.

ఏదేశమైనా, ఏమతమైనా, ఏనాడూ స్త్రీకి సమానహోదా, తాహతు ఇవ్వలేదు. వేదాలు చదివినా నాటి వ్యవస్థ చూచినా స్త్రీకి ప్రత్యేక విశిష్టత వున్నట్లు కన్పించదు. మత దృష్టిలో "సమాజం" అంటే పురుషులేనని, వారి ఆవసరాలు తీర్చేయంత్రాలు మాత్రమే స్త్రీలు అని స్పష్టీకరించారు. స్త్రీని శృంగార సాధనంగా, పిల్లల్నికనే యంత్రంగా, గొడ్డుచాకిరిచేసే బానిసగా తయారుచేశాయి మతాచారాలు. అసలు మత ఆవిర్భావంలోనే కర్మ అని, తలరాత అని, దైవనిర్ణయమనే ప్రవచనాలు వున్నాయి. అందులో స్త్రీకి

అనేక ఆంక్షలు, కట్టుబాట్లు, కఠిన నియమాలు నిర్దేశింపబడ్డాయి. మతం స్త్రీ స్థానాన్ని పురుషుడి పాదాల చెంతనే వుంచింది. శైశవం దాటగానే మెల్లిగా మాట్లాడాలని, తలెత్తుకొని తిరగరాదని, నిటారుగా నిలబడరాదని శాసించింది. "స్త్రీ ఎప్పుడూ భర్తకు వినయ విధేయతలతో లొంగివుండాలి. భర్తముందు వాచా ప్రాబల్యం పనికిరాదు. మగడు కోపించినా అలుగరాదు. భర్త సంతోషిస్తే తానూ సంతోషించాలి. భర్త దుఃఖిస్తే తానూదుఃఖించాలి ఏకాంతవేళల్లో మనస్సులో దుఃఖమున్నా దాచుకొని భర్తముందు నవ్వుతూ, ఆయన్ను పొగడుతూ వుండాలి" కాశీఖండంలో చెప్పారు.

"స్త్రీలు నరకానికి సింహద్వారంవంటివారు"అన్నాడు శంకరాచార్యుడు. ఆడది పాపగర్భంనుండి జన్మించింది అంటుంది భగవద్గీత-"న స్త్రీస్వాతంత్ర్య మర్హతి" అంటూ ఆడదానికి ఆ జన్మాంతం సంరక్షకత్వం ప్రతిపాదించింది మనుస్మృతి. స్త్రీని బానిసత్వానికి చిహ్నంగా, ఆటబొమ్మగా మార్చేశాయి ధర్మశాస్త్రాలు.అంతేకాదు భర్త క్రూరుడైనా,కొట్టినా,తిట్టినా,చంపినా ఆమగణ్ణి ప్రత్యక్ష దైవంలా పూజించాలని నిర్వచించింది హిందూమతం. ఇస్లాంస్త్రీలను జంతువులతో పోల్చింది.స్త్రీని దున్నేపొలంగా పేర్కొంటూ దానిపై సర్వాధికారాలు దున్నేవాడివేనంటూ కొరాన్ చెప్పింది. "స్త్రీ మీద పురుషుడికి సర్వాధికారాలు వున్నాయి. 'అల్లా' పురుషుణ్ణి అధికుణ్ణిగా సృష్టించాడు. ఆమె పోషణకోసం అతను తన సంపదను వెచ్చిస్తున్నాడు కనుక, ఆమె విధేయత చూపాలి. అవిధేయురాలిని నీ పడక మీదికి రానీయకు, కొట్టు. ఆమె మారితే ఇక ఏచర్య తీసుకోకు" (కొరాన్ 4 : 34 ఉవాచ)

స్త్రీని పాపాలకు మూలకారణమైన"ఈవ్"గా పేర్కొన్నది క్రైస్తవం క్రిష్టియన్ల పెళ్ళిలో స్త్రీ చేత మాత్రం "నీకు విధేయతచూపుతా **(Love & Obey)** అనీ; పురుషుడి చేత" నిన్ను రక్షిస్తాను **(Cherish & Protect)"** అని ప్రమాణాలు చేయిస్తారు. పురుషుణ్ణి ముందు సృష్టించి, అతని సంతోషం కోసమే స్త్రీని దేవుడు సృష్టించాడని ప్రచారం చేస్తోంది బైబిలు. అసలు పురుష పతనానికి మూలకారణం ఆడదే (ఈవ్) అని ఈసడిస్తుంది.

మతసంస్కర్తలలో ముఖ్యుడైన బుద్ధుడుసైతం మొదట్లో బిక్షుణిలుగా స్త్రీలను స్వీకరించనన్నాడు. సర్వసంగ పరిత్యాగం చేయగలమని, త మ కు మోక్షార్థతకావాలని తల్లిగౌతమి వాదించిన తర్వాతే ఆ అవకాశమిచ్చాడు నారికి బౌద్ధ సన్యాసినులుగా. "ముక్తికి, మోక్షానికి స్త్రీ అనర్హురాలు" అని జైన మతం ప్రతిపాదించింది. ఆమెకు ముక్తికావాలంటే మరోజన్మలో పురుషుడుగా పుట్టాలని జైన మత ప్రవక్త మహావీరుడన్నాడు. స్త్రీ ల కు గృహ సంబంధమైన విద్యచాలని రూసో అన్నాడు, ప్రేఢన్ అంతటివాడు స్త్రీ మేధాశక్తి, నైతిక విలువలు పురుషునిలో 3/4 వంతుఅన్నాడు.

"స్త్రీలకు పురుషులకన్నా పళ్ళు తక్కువ వుంటాయి. అంతేకాక ఆమెకు స్వేచ్ఛనిస్తే ఈ లోకాన్నే దిగమింగుతుంది" అన్నాడు విష పానీయాన్ని సేవిస్తూ గ్రీకు తత్వవేత్త సోక్రటీసు. బహుశా తన భార్య పరమ గయ్యాళి కనుక అలాంటి సందేశమిచ్చివుండవచ్చు- "సిల్లీ ఉమన్" అన్నాడు సెయింట్ పాల్. ఆడది మగవాని కొరకు సృష్టింపబడ్డది కాని పురుషుడు మాత్రం స్త్రీ కొరకు సృష్టింపబడలేదని ప్రతి మతం పేర్కొన్నది. స్త్రీలు తమకు తెలియని విషయాలను భర్తలద్వారా మాత్రమే తెలుసుకొని వారి ఆజ్ఞలను జవదాటరాదని నిర్దేశించారు. అలా మత గ్రంథాలన్నీ పురుషాధిక్యతను వేయినోళ్ళ చాటాయి.

లండన్ చర్చిలో ఆడవాళ్ళకు ఆత్మలు లేవని, వాళ్ళ మెదడుచాలా చిన్నదిగా వుంటుందని చర్చలు జరిపారట. భార్య చేసే కొన్ని అపరాధాలకు, పాపాలకు శిక్షలేదనీ -ఎందుకంటే భార్యకుప్రత్యేక అస్తిత్వం లేదట-బ్రిటిష్ న్యాయస్థానంలోభావించేవారు.అంటే భార్య భర్తఅదుపు ఆజ్ఞలనుజవదాటదు కనుక, ఆమెను భర్త బానిసగా పరిగణించారు. ఇది బ్రిటిష్ సమాజంలో స్త్రీ యెడగల న్యూనతా భావానికి నిదర్శనం. ఇంకా చర్చిలో స్త్రీని నోరు మూసుకుని, నెత్తిన ముసుగేసుకుని కూర్చోమని ఆజ్ఞాపించారు 'ఆర్చి బిషప్పులు". అసలు ఏ మతంలోనూ స్త్రీకి ఆచార్యకత్వంలేదు; పూజారిణిగా అసలే అనర్హురాలు. ఇస్లాం వివాహంలో 'నికా' రిజిష్టరులో వరుడు సంతకం పెట్టాలి. వధువు తరపున వకీలు పెడితేచాలు అది చెల్లుతుంది. ముస్లిం పురుషుడు ఏకకాలంలో నలుగురు భార్యలను వివాహ మాడవచ్చు. ఆమె ఆపాదమస్తకం ముసుగు ధరించి తిరగాలి.

చాణుక్యనీతి దర్పణంలో స్త్రీలు నిజాయితీలేనివారని, నీతిహీనులని రాసిఉంది. స్త్రీ ఆజన్మాంతం ఎలా అదుపు, ఆజ్ఞల్లో జీవించాలో కుమారి శతకం లాంటివి రాయించి వివరంగా బోధించారు హిందూమతస్తులు. ఇలా అన్నిమతాలు స్త్రీని అణగద్రొక్కాయి. ఆమె పురుషుని భోగ్యవస్తువని, పిల్లల్ని కని వంశాన్ని వృద్ధిచేయటానికే సృష్టింపబడ్డదని మత గ్రంధాలన్నీ ధృవీకరించాయి. పాకశాస్త్రం, లలిత కళలు తప్ప మరే విద్యకు స్త్రీలు అనర్హులని నిన్నమొన్నటిదాకా అమాటకువస్తే ఇప్పటికీ భావించేవారు కోకొల్లలుగా వున్నారు.

స్త్రీ కూడా మనిషేనని, ఆమెకు స్వేచ్ఛా, వ్యక్తిత్వం వుండాలని ఏమతమూ, ఏనాడూ బోధించలేదు. అందువల్లనే పురాణయుగం నాటి పాతివ్రత్యాన్ని, నోములు, వ్రతాలు, పూజలు లాంటి మతపరమైన క్రతువులను స్త్రీలింకా పాటిస్తున్నారు. వారు ఏదో ఒక మతంలో నమ్మిక కలిగి వుంటారు. వారి కాలమంతా ప్రార్థనలకు, పురాణ శ్రవణాలకు, పూజలకు నోములకు, వ్రతాలకు వినియోగిస్తారు. ఇది తరతరాలుగా జరిగిన మత పరిణామ చరిత్ర. ఏది ఎలా జరిగినా మతవాదుల విజృంభణ మహిళను బలిచేసింది. రెండవ తరగతి మనిషిగా మార్చింది. బానిసగా ఆమెను సంకెళ్ళతో బిగించింది. ఇది జరిగిపోయిన విషయం. ఇప్పుడు జరగాల్సింది ఆ సంకెళ్ళనుండి అమెకు విముక్తి; తద్వారా సమాజ ప్రగతి. ఇది దుస్సాధ్యంకాక పోయినా,చాలా చిక్కు సమస్య. తరతరాలుగా మన రక్తంలో జీర్ణించిన బానిస ప్రవృత్తి అంతతేలిగ్గా మార్పుచెందదు.

సంప్రదాయాన్ని పారద్రోలటం ఎంత కష్టమో ఆధునికతను ప్రవేశ పెట్టటం అంతకన్నా కష్టం. అయినా మార్పులేనిదే ప్రగతిలేదు. ఎంతకాలం స్త్రీ అజ్ఞానంలో వుంటుందో, దరిద్రంలో వుంటుందో, వ్యక్తిత్వాన్ని చంపు కుంటుందో, దాస్యంలో మగ్గుతుందో అంతకాలం సాంప్రదాయ శక్తుల బలప్రదర్శనం ఆమెపై విజృంభిస్తూనే వుంటుంది.

స్త్రీల కన్నీళ్ళకూ, ప్రార్థనలకూ, ఆత్మహత్యలకూ మత దుర్నీతి నశించదు; రాక్షస మనస్తత్వాలు కరగవు. విషసంస్కృతి నమసిపోదు; రాకాసి వ్యవస్థమార్పుచెందదు. ఎవరోవచ్చి బాధితుల్ని రక్షిస్తారనుకొనుట భ్రమ. కనుక ముందుగా నిర్దాణమైన స్త్రీ జాతి మేల్కొని ఆత్మస్థయిర్యంతో తమ స్థాయిని, హోదాను, గౌరవాన్ని నిలుపుకోవాలి. స్త్రీలు గానే కాకుండా సమాజంలో చైతన్యంకల వ్యక్తులుగా సంచరించాలి. దానికై స్త్రీలలో మార్పురావాలి.

)o(—)o(

మ హి ళా భ్యు ద య ము

మహిళాభ్యుదయం, లేక మహిళోద్యమం అంటే పురుషులపై తిరుగు బాటని, పురుషజాతి విధ్వంసమని, అదేదో దేశానికి ప్రళయం తెస్తుందని వితండవాదం చేస్తారు. స్త్రీ స్వేచ్ఛ, సమానత్వం అంటే అది విచ్చలవిడి ప్రవర్తన అని కొందరంటే ఇల్లూ, పిల్లల్నీ విడిచేసి స్వైరవిహారం చేస్తారని మరికొందరూ అక్షేపిస్తున్నారు. సంసారపు బాధ్యతల్ని కాలదన్ని గంగి రెద్దులా తిరుగుతారని ఇష్టంవచ్చినట్లు విమర్శిస్తారు సనాతన తిరోగమన వాదులు. వారికి అసలు విషయం తెలియకకాదు. ఇష్టంలేని విషయానికి, వారు వింత వ్యాఖ్యానంచేస్తూ కథలు చెప్పగలరు. స్త్రీ వ్యక్తిత్వాన్ని గుర్తించదలచుకోని గ్రుడ్డివాళ్ళు గుడ్డికళ్ళతో చూస్తారు. పచ్చకామెర్ల వాళ్ళకు లోకమంతా పచ్చగా వున్నట్లు గోచరిస్తుంది. తరతరాల బానిసత్వానికి సంకెళ్ళకూ అలవాటుపడ్డ మహిళలు, పురుషుణ్ణి దైవంగా ఆరాధించే స్త్రీలు విముక్తికై పోరాడితే తమపలుకుబడి తగ్గుతుందని, వారి వ్యక్తిత్వం వికసిస్తే తమ నీతిబోధలు వినరని, తమకు శుశ్రూషచెయ్యరని, భయభక్తు లతో మెలగరని భర్తలకు భయం ఆవహిస్తున్నది. అందుకే తిరుగుబాటంటే వాళ్ళకు 'హడల్' వాళ్ళ గుండెల్లో రైళ్ళు పరిగెడతాయి; మనస్సులలో గాలం పడుతోంది. ఇది బైటికి చెప్పుకోలేక 'మీకేమయిందీ? బాగానేచూస్తున్నాంగా?' అంటూ కప్పదాటేస్తారు. ఒకవర్గపు ప్రజానీకం ఏదితప్పో, ఏదిన్యాయమో వారి అంతరాత్మకు తెలుసు. తెలిసి చేస్తే అది ఆత్మవంచన అవుతుంది.

మహిళాభ్యుదయమంటే కేవలం మహిళల అభివృద్ధేనని, అది సమాజానికి గాని, పురుషులకుగాని, కుటుంబానికిగాని సంబంధించిన సమస్యకాదనే భావం మరోవర్గం వారిలోవుంది. అసలు సమాజంలో సమూలమైనమార్పువస్తే మిగతా సమస్యలతో పాటు స్త్రీల సమస్యలుకూడా సమసిపోయి సరిక్రొత్త సమాజ అవిర్భావం జరుగుతుందనేభావం కొందరిలో వుండబట్టే మ హి ళా భ్యుదయ ప్రాముఖ్యత, మహిళల ప్రగతి విస్మరించబడుతోంది; తద్వారా సమాజం నష్టపడుతోంది. మానవదేహానికి శిరస్సూ, మొండెమూ రెండూ ఎంతప్రాముఖ్యమో సమాజ ప్రగతికీ, దేశాభ్యున్నతికి పురుషులతో పాటు

స్త్రీలుకూడా అంత జీవగ్రరలని మహిళాభ్యుదయానికి ప్రత్యేక పాత్రవుందని భావించిన నాడు పురుషాధిపత్యమూ నశిస్తుంది. మహిళల సమస్యలూ సమసిపోతాయి. అసలు వ్యాధి గురించిన అవగాహనలేనందువల్లే మన ప్రయత్నాలన్నీ మట్టిపాలవుతున్నాయి. ఇంతవరకు స్త్రీని వేరుగా, ఆట బొమ్మగా, సెక్సు 'సింబల్' గా పరిగణించబట్టె మన పథకాలు తగిన ఫలితాన్ని ఇవ్వడంలేదు. ఇంతవరకూ మహిళాభ్యుదయానికి జరిపినకృషి వుందా? ఏ పరిధిలో జరిగింది? ప్రభుత్వ పథకాలేమిటి? ప్రజాసంఘాల పాత్ర ఏమిటి? వీటినిగురించి ఆలోచిద్దాం.

స్వాతంత్ర్యానికి పూర్వం స్త్రీల నిస్సహాయస్థితిని, అవమాన పరిస్థితిని గుర్తించినవారు లేకపోలేదు. అయినా స్త్రీల అభ్యున్నతికి ఆర్థిక తోడ్పాటుకు రాజకీయ అభినివేశానికి, సామాజికాభివృద్ధికి పాటుపడినవారు అత్యల్పం. ఆనాడు మహిళాభ్యుదయానికి కృషిజరుగకపోలేదు. స్త్రీలకు విద్యావకాశాలు, ఆస్తిహక్కు, వివాహవయస్సు, పెంపుదల, పతిత జనోద్ధరణలాంటి సంస్కరణలు బహుకొద్దిగా జరిగాయి.నాటి సమస్యలూవేరు, లక్ష్యాలూవేరు. తదుపరి మహిళాభ్యుదయం నత్తనడక నడిచింది. కొన్ని సంఘాలు కేవలం వంటలకు, కుట్టుపనులకు, భజనలకు, 'ఫ్యాషన్ పెరేడ్'లకు దేశాటనలకే పరిమితమయ్యాయి. కొన్ని సంఘాలు అధికధరలు, అత్యాచారాలు, కత్తీలు, అవినీతి లాంటివాటికి నిరసనలు తెలిపాయి.

రామ్మోహనరాయ్, గురజాడ, కందుకూరి, విద్యాసాగర్, ఎం. ఎన్. రాయ్ లాంటి మేధావులు, కొంత కృషిచేశారు; కొన్నిమార్పులు తెచ్చారు. దేశంలో పెద్ద రాజకీయ పార్టీలవారు మహిళా సంఘాలను కూడా పార్టీ అనుబంధ సంస్థలుగా **(Front organizations)** స్థాపించారు. కాని అసలు స్త్రీ స్వేచ్ఛా సమానత్వాలకై వారి ప్రతిపత్తికై ఏకకంఠంతో, ఐక్యతగా కొన్ని లక్ష్యాలకై పోరాటమనేది మనదేశ చరిత్రలోనే జరగలేదు.

1971 లో ఫూల్‌రేణుగుహా అధ్వర్యాన స్త్రీల స్టేటస్ కమిటీ **(Committee on Status of Women in India)**ని నియమించి భారత స్త్రీల హోదాను పరిశోధించమని అడిగింది భారత ప్రభుత్వం.

వారిపరిశోధనకు మూడు సంవత్సరాల కాలము పట్టింది. తొమ్మిదిలక్షల యాభై వేల రూపాయలు ఖర్చు అయింది. "దేశ స్వాతంత్ర్యానంతరం భారత స్త్రీలకు చట్ట రూపంలో కొన్ని హక్కులు వచ్చాయి. వాటికి రాజ్యాంగం హామీ (Guarantee) ఇచ్చింది. అయినప్పటికీ స్త్రీలు ఆ హక్కులను అనుభవించలేదని మా సర్వేలో తేలినముఖ్య విషయం" అని రాశారు. ఇది వారు తమ 'రిపోర్టు'లో ఇచ్చిన సారాంశము.

ఈ 'భారత స్త్రీల స్థాయి జాతీయ కమిటీ' అంతర్జాతీయ మహిళా సంవత్సరంలోనే ఒక నివేదికను తయారుచేసి ఆ రిపోర్టును ప్రభుత్వానికి అందజేశారు. భారత స్త్రీల హోదాను పెంచటానికి అనువయిన సూచనలు ఎన్నో ఈ నివేదికలో వున్నాయి. వారు 1975 లో సమర్పించిన నివేదికలో 36 సిఫారసులు వున్నాయి. స్త్రీలలో నిరక్షరాస్యత అధికం కావటంవల్ల తమ హక్కుల విలువకాని, ఆ హక్కులను అమలు పరచటం యొక్క అవసరం కాని, వాటిని రక్షించుకోవలసిన బాధ్యతగాని తెలుసుకోలేని అజ్ఞానదశలో మహిళలు వున్నారని ఆ కమిటీవారు ఆవేదన పడ్డారు. ఈ పరిస్థితిని మార్చవలసిన బాధ్యత ప్రభుత్వానిదేనని వారు హెచ్చరించారు. స్త్రీ విద్యపై విముఖతవల్ల రెండువందల తొంభైమిలియన్ల స్త్రీశక్తి నిరుపయోగమవుతోందని, ఇలాగే కొనసాగితే ఈ నిరుపయోగ ప్రమాదం మరింత క్లిష్టమై దేశ భవిష్యత్తునే తారుమారు చేస్తుందని ఈ స్త్రీల ప్రతిపత్తి సంఘంవారు తమ నివేదికలో ముఖ్యాంశంగా పేర్కొన్నారు. ఏరెండో తప్ప వారి సిఫారసులు మనం పట్టించుకోలేదు ఈ నాటికీ.

ఈ స్త్రీలహోదా కమిటీ తమ రెండవ ముఖ్యాంశంలో స్త్రీలు వెనుకబడిన తనంవల్ల సంఘపురోభివృద్దే నశిస్తుందని, తద్వారా కుటుంబం విచ్ఛిత్తి అయ్యే ప్రమాదం లేకపోలేదని తెలియజెప్పారు. స్త్రీ పురుషుల మధ్యతేడాను అఖాతాన్ని తొలగించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, ఆ విషయాన్ని విస్మరిస్తే దేశాభ్యుదయానికే అరిష్టం వాటిల్లుతుందని నిర్మొగమోటంగా ఆ కమిటీవారు తమ నివేదికలో పొందుపరిచారు.

స్త్రీ పురుషవివక్షతను కేవలం చట్టాలుకాని, ఆర్డినెన్సులు కాని తొలగించలేవు. ఈనాడు స్త్రీలయెడ సామాజిక దృక్పథంలో మార్పు రా వా లి; పురుషుల ప్రవర్తనలో మార్పు అనివార్యం కావాలి. ఎలిమెంటరీ విద్యనుండి డిగ్రీల వరకు బాలబాలికలు ముఖ్యంగా కలిసి చదువుకోవాలి. వారి విద్యా ప్రమాణాలలో మార్పుతేవాలి. వృత్తివిద్యల్లో, పారిశ్రామిక రంగంలో ఇతర శిక్షణారంగాల్లో 50% స్త్రీలకు అవకాశమివ్వాలి. కులం మతాతీత వివాహాలకు సమాజపరంగా స్థాయిని పెంచాలి. ముస్లిం న్యాయచట్టాలను సవరించాలి; వారిలోని బహుభార్యాత్వాన్ని తొలగించాలి. ఇప్పటి వరకు అమల్లోవున్న ఏకపక్షంగా విడాకులు పొందగలిగే హక్కును సవరించాలి. ఇద్దరు కలిసి చేసిన వ్యభిచారంలో స్త్రీని మాత్రమే దోషినిచేసి శిక్షించే పక్షపాత దుర్నీతిని శిక్షాస్మృతినుండి తొలగించాలని ఇలాంటివి చాలాముఖ్యమైనవి, అవసరమైనవి, ఆచరణయోగ్యమైనవి ఆ కమిటీ రిపోర్టులో పొందుపరచి నందుకు నిజంగా స్త్రీలోకం వారికి కృతజ్ఞులై వుండాలి. "ఇందులో ఎన్ని సూచనలు ఆచరణలో చేశాము? ఎన్ని చెయ్యబోతున్నాం" అ నే ది మన స్త్రీల మీద, మగవారిమీద, మన ప్రభుత్వంమీద ఆధారపడివుంటుంది. 'దానికి తగిన సంస్కారం, ముందుచూపు మనలో వున్నాయా? లేవా?' అనేది మన ఆసక్తినిబట్టి వుంటుంది.

మహిళాభ్యుదయం గురించి సభలు, మహాసభలు, చర్చలు, సెమినార్లు, ప్రభుత్వంవారు, ప్రజాసంఘాలవారూ జరుపుతూనే వున్నారు. కాని ప్రగతిమాత్రం గొర్రెతోకలావుంది. కారణం, ఈ కార్యక్రమాలు ఒక 'రొటీన్‌వర్కు'గా' ఆమాటకొస్తే ఒక 'ఫ్యాషన్'గా తయారయింది. దానికి నిర్దుష్టమైన రూపురేఖలు, చొరవ, ఆసక్తి, పట్టుదల లోపిస్తున్నాయి. మనలో వున్న భావదాస్యం, నిస్తబ్ధత, అసమర్థతలే కారణాలు అని మనం ఆత్మ విమర్శచేసుకోవాలి. తిరిగి ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని, ఉ ద్వే గా న్ని తెచ్చుకొని కార్యరంగంలోకి దిగాలి.

మహిళాభ్యుదయం అభ్యుదయం అంటూ అరిస్తే అభ్యుదయంరాదు. శాసనాలు అమలు పర్చటంద్వారా, ప్రభుత్వ చర్యలద్వారా, ప్రజాభిప్రాయం ద్వారా మూడువిధాలా కలిసి పనిచేస్తేనే అభ్యుదయాన్ని సాధించగలం.

ఉపన్యాసాలతో, వాగ్దానాలతో స్త్రీలు తృప్తిపడే రోజులు గతించాయి. ఈనాటి మహిళలు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని పొంది, సమాజ వ్యవహారాల్లో ప్రధానపాత్రవహించటానికి తగిన అవకాశాలు కావాలని కోరుకుంటున్నారు.

ముందుగా నిరక్షరాస్యతా నిర్మూలన జరగాలి. వివిధవృత్తులలో స్త్రీలకు శిక్షణ, వయోపరిమితిని స్త్రీల విషయంలో అధిగమించి ఉద్యోగాలిచ్చుట, సమానవేతన చట్టాన్ని ఖచ్చితంగా అమలు పర్చడం, ఉపాధి కల్పనలో ఉన్నత స్థానాలలో రాజకీయ సామాజిక ప్రాతినిధ్యంలో నిష్పత్తిప్రకారం స్త్రీలకు ప్రాతినిధ్యమిచ్చుట లాంటి కార్యక్రమాలు అమలు పరచాలి. మతాలనుబట్టి కాక ప్రజలందరికీ వర్తించే వివాహ శాసనం వెంటనే ప్రవేశ పెట్టాలి. భార్యాభర్తల తగాదాలను విచారించేందుకు రహస్యంగా కుటుంబన్యాయస్థానాలు పెట్టాలి. వరకట్న నిషేధచట్టాన్ని సమర్ధవంతగా అమలు పర్చాలి. అసభ్యంగా చిత్రించే స్త్రీల బొమ్మల ప్రకటనలను నిరసించాలి. స్థానిక సంస్థలలో అసెంబ్లీలలో, పార్లమెంటులో 30 స్థానాలను, స్త్రీలకు విధిగా కేటాయించాలి. భూమిపైనహక్కు, వారసత్వపుహక్కు స్త్రీకి పురుషునితో సమానంగా ఇవ్వాలి. అత్యుత్సాహంతో, పట్టుదలతో స్వచ్ఛందంగా సేవాదృక్పథంతో పనిచేస్తేనే మహిళాభ్యుదయం సాధించగల్గుతాం.

రచయిత్రులు: స్త్రీ పాత్ర చిత్రణ.

ఈనాడు రచయిత్రులు వేల సంఖ్యలో రచనలు చేస్తున్నారు. కాని వారి సాహిత్యంవల్ల సాంఘికంగా స్త్రీల పరిస్థితి మారిందా? రాజకీయంగా స్త్రీలు చైతన్యం పొందగలిగారా? ఆర్థికంగా వారు సమానత్వాన్ని సాధించ గలిగారా? సాంస్కృతికంగా పురోగమించారా? ఎందరిలో శాస్త్రీయదృష్టి కలిగింది? ఆధునికత, అభ్యుదయ భావాలు ఎందరిలో ప్రోదిచేసుకున్నాయి? ఆర్థిక అసమానత్వాన్ని, సామాజిక దోపిడిని వ్యతిరేకించిన వారెందరు? స్త్రీల ప్రతిపత్తికి, స్వావలంబనకు పోరాటాలు నడిపిస్తున్న మహిళలెందరు? స్త్రీలపై అత్యాచారాలకు, స్త్రీ పురుషుల హెచ్చుతగ్గులకు తిరుగుబాటును, అసంతృప్తిని ప్రకటిస్తున్న పాఠకులెందరు? కనీసం సామాజిక స్పృహనైనా మహిళాలోకం పొందగలుగుతొందా? ఇవి రచయిత్రుల రచనలకు, వారి సాహిత్యస్థాయికి గీటురాళ్ళు.

అది కథ, నవల, నాటకం మరేసాహిత్య ప్రక్రియయైనా పాఠకునికి మానసిక జాగృతిని, వికాసాన్ని, సామాజిక నీతిని కలిగించగలిగిందే అసలైన సాహిత్యం. కాలక్షేపానికి, వినోదానికి రచించేది నిజమైన సాహిత్యం అనబడదు. ధనంకోసం పేరు ప్రఖ్యాతులకోసం రచించే సాహిత్యానికి, ఆ రచయిత్రికి చరిత్రలో స్థానంవుండదు. చదువరులలో విజ్ఞానాన్ని చైతన్యాన్ని, శాస్త్రీయదృక్పథాన్ని రేకెత్తించ గలిగిందే సిసలైనసాహిత్యం. సమకాలీన సమస్యలను ఎత్తిచూపి, వాటి మూలానికిపోయి, ఆపరిస్థితికి కారణమేమిటో సూచించి, సమస్యలకు పరిష్కారమార్గాన్ని చూపగల రచయితే అసలైన సృష్టి. ఈనాటి సాహితీరీతుల్లో అలాంటి రచనలు వస్తున్నయా అనేదొక శేషప్రశ్నగా మిగిలిపోయింది.

అది క్షుద్రసాహిత్యమైనా, మరే సాహిత్యమైనా తన రచనలవల్ల ఏ ఒక్క వ్యక్తియైనా ప్రభావితం కావచ్చు. కనుక రచయిత్రికి సామాజిక బాధ్యత వుంటుందనే విషయం విస్మరించరాదు. రచయిత్రి తన అభివ్యక్తీకరణకు ముందు తన సందేశాన్ని తాను నమ్మాలి; ఆచరించాలి. ఆతర్వాతే ప్రజలకు ప్రబోధించాలి. అలాంటి నిబద్ధతగల వ్యక్తులే రచానా ప్రక్రియకు అర్హులు. రచయిత్రి స్పష్టమైన భావపరంపరలతో పాత్రలను నడిపించాలే కాని పాత్రలే రచయిత్రులను నడిపిస్తే అలాంటి సాహిత్యం గర్హ్యనీయమవుతుంది. రచయిత్రికి ముఖ్యమయినది చిత్తశుద్ధి; సమస్యలను నిర్లిప్తంగా ఆలోచించగల శక్తి, స్పందన, ఆర్తి, అనుభూతి. అప్పుడే వర్తమాన పరిస్థితులు, స్త్రీల సమస్యలు, సామాజిక దురంతాలు, రాజకీయ అవగాహన రచయిత్రి హృదయంలో చోటు చేసుకుంటాయి. తద్వారా తన అనుభూతులను, అభిరుచులను తన రచనలద్వారా విశ్లేషిస్తుంది. ఉత్తమ రచనకు సూత్రధారి అవుతుంది.

అసలు సాహిత్యమంటే ఏమిటి? అది ఎలా ఉద్భవిస్తుంది? ఎందుకు రచనలు చేస్తారు? ఎన్ని విధాలుగా చేస్తున్నారు? ఉత్తమ సాహిత్యానికి గీటురాయి ఏది? సాహిత్యానికి స్త్రీల సమస్యలకు సంబంధమేమిటి? రచయిత్రులు స్త్రీల పాత్రను ఎలా చిత్రీకరిస్తున్నారు? అనేవి చర్చనీయాంశాలు.

హృదయ స్పందనను వ్యక్తపరిచే ఒక భావాన్ని రచనలో వెలువరిస్తే అది సాహిత్యమవుతుంది. సమాజ ప్రతిబింబమే సాహిత్యమని కొందరి భావం. ఒక సంఘటన చూచిన రచయిత్రి హృదయం ద్రవిస్తుంది. ఆమెకు ఉత్తేజం జనిస్తుంది. ఆమె మనోవీథిలో అనేక భావాలు ఉద్భవిస్తాయి. తన సునిశిత మేధాశక్తితో ఉద్దీపన కలిగించే పాత్రల ద్వారా తన హృదయగత మనోభావాన్ని వ్యక్తీకరించగల రచనాశక్తి కొందరికి మాత్రమే వుంటుంది. అయితే రాసిందంతా సాహిత్యం కాదు. కేవలం నేల విడిచి ఊహాలోకంలో విహరించే సాహిత్యాన్ని సృష్టిస్తారు. కొందరు. సమాజాన్ని వాస్తవిక దృష్టితో చూస్తామంటూ ఉన్నదున్నట్లు చిత్రీకరించేవారు మరి కొందరు. వాస్తవ చిత్రీకరణతోపాటు సమస్యా పరిష్కారాన్ని పాత్రద్వారా సూచిస్తారు కొంతమంది రచయిత్రులు.

పాత్రద్వారా పరిష్కారమార్గాన్ని వాచ్యంచేయకుండా పాత్ర నడత ద్వారా విశదీకరిస్తారు నిష్ణాతులైన సాహితీపరులు. ఇలాంటి పలువిధాల జరిగే సాహితీసృష్టిలో ఏదీమంచీ ఏదిచెడు అనే అంశం, ఏ సాహిత్యానికి శాశ్వతత్వంవుందీ దేనికి లేదు అనే విషయం, ఏది ఉత్తమకళా సృష్టి ఏది కాదు అనే ప్రశ్నలు ఉదయిస్తాయి.

సమాజంలో కష్టాలకు, నైచ్యానికి, బాధలకు లోనైన కొందరు దుఃఖానుభూతిని పొందుతున్నారు. నైచ్యం, దైన్యం, దౌర్భాగ్యం, ఆకలి వీరిని వెన్నాడుతోంది. కనుక సాహిత్యంలోకూడా వీటిని గురించి ఎందుకు చెప్పాలి? వీరిని ఈ కష్టాలనుండి మరచిపొయ్యే పరిస్థితిని అంటే ఊహా లోకంలో విహరించేటట్లు చేద్దాం అంటూ అదేపనిగా పుంఖాను పుంఖాలుగా సాహిత్యంరాసి మార్కెట్‌ని విపరీతంగా పెంచారు కొందరు రచయిత్రులు. ఇలాంటి సాహిత్యం మత్తుమందు లాంటిది. వాస్తవాన్ని నిరాకరించే స్వభావాన్ని పెంచుతుంది. వాస్తవాన్ని విస్మరించినవారు కలలు కనక తప్పదు. ఒక గుడిశలో నివశించే ఒక కన్య ఏ రాకుమారుడో ఒక తెల్లగుఱ్ఱం మీదవచ్చి, తన పాణిని గ్రహించి, అంతఃపుర ఉద్యానవనాంతర పుష్ప గృహంలోకి తనను తీసుకొని వెళ్ళినట్లు, పొదరింటి చుట్టూ పాలరాతి స్థంభాలు, అందాల శిల్పాలు ఉన్నట్లు తానొక అజంతా శిల్పసుందరిలాంటి నవవధువైనట్లు ఊహిస్తుంది. అదిసాధ్యమా? ఆపిల్ల స్థాయి ఎక్కడా! ఆ కోరికలెక్కడ! ప్రతి కన్నెపిల్ల తనకు కాబొయ్యే భర్త అందంలో, ఆస్థిలో, హోదాలో, సమాజంలో అందరికన్నా అధికుడు కావాలని కలలు కంటుంది ఆ ఊహా సాహిత్యాన్ని చదివినందువల్ల. ఆలా ఆశించింది జీవితంలో వాస్తవరూపం తాల్చకపోతే నైరాశ్యంతో కృంగిపోతుంది. బలహీన మనస్కురాలయితే ఆత్మహత్య చేసుకుంటుంది. లేక పిచ్చిఎక్కి ఉన్మాదిని అవుతుంది. మనిషికి ఆలోచించే శక్తివుంది. ఊహించేశక్తివుంది. కనుక కలలు కనడం సహజమే అయినప్పుడు ఊహాత్మక రచనను చేయడమూ సహజమే. దీనిని పూర్తిగా చంపెయ్యాలా అంటేకాదు. అయితే అక్కర లేదని వాదిస్తున్నవారువాస్తవ సంఘటననుండి ఊహాచిత్రాన్ని గీయటానికి అవకాశంవుంది. అంటే భావనకు వాస్తవికత ప్రాతిపదికకావాలి. కనుక నేల విడిచి సాము చెయ్యరాదు.

'మేము సమాజాన్ని వాస్తవిక దృష్టితోచూస్తాం. సమాజంలోని మంచి, చెడూ రెంటినీ దర్పణం పడతాం, సాహిత్యం ఎప్పుడూ సామాజిక స్థితిగతులను చిత్రిస్తుంది. కాని సమస్యాపూర్వకమైన పరిష్కారం చూపాల్సిన బాధ్యత మాకులేదు.' అంటారు రెండోరకపు సాహితీ పరులు. ఇదొక రకంగా విచిత్రమైనవాదన. పరిష్కారమార్గం చూపకపోవటం అటుంచి, వాస్తవాన్ని చిత్రించడమనేది సాహిత్యంగాను, కళగాను పరిగణించబడదు. వాస్తవ సంఘటనను ఫొటోతీస్తే సరిపోతుందికదా! మనం రోడ్డు మీద ఒక శవాన్ని చూశామనుకోండి. గోపీచంద్ ఎగతాళిచేసినట్లు 'రోడ్డోరోడ్డు, శవమోశవం, చూచాను చూచాను' అన్నామనుకోండి ఏంప్రయోజనం. వాస్తవంపేరుతో సమాజానికి ఫొటోతీస్తే వుపయోగంలేదు. అంటే ఇక్కడ రచయిత్రి స్పష్టగాఏమిచేసింది అనేప్రశ్న ఎదురవుతుంది. ఒక దృశ్యం చూచినప్పుడు ఆమె మనోవీధిలో ఏభావాలు వెలిశాయో, ఆ భావాలకు వున్న పూర్వాపర సందర్భాలేమిటో వివరిస్తే అప్పుడు సమాజాన్ని వాస్తవంగా చిత్రించినట్లవుతుంది. వాస్తవీకరణపేరుతో వున్నదున్నట్లు రాయడంజరుగుతోంది. కాని ఈ రచనా విధానం కూడా అనుసరణీయం కాదని చెప్పవచ్చు.

వాస్తవాన్ని చూపిస్తూనే సమస్య పరిష్కారానికి ఇలా చెయ్యాలని ఒకపాత్ర ద్వారా చెప్పిస్తారు మూడోవర్గపు సాహితీవేత్తలు.ఇక్కడ సమస్యా పరిష్కారం జరుగుతుంది. కాని రచయిత వ్యక్తిత్వం ప్రతిఫలించడంలేదు. రచయిత యొక్క వ్యక్తిత్వం, రచనా పద్ధతిలో, భాషలో, శైలిలో, శయ్యలో, కథా సంవిధానంలో కనపడవచ్చు. కాని అసలు పాత్రలు ఏయే శక్తులకు, ఏయే సామాజిక ధోరణులకు, ఏయే మానసిక వైచిత్రీరూపాలకు సంకేతాలో విశదీకరించడంలేదు. కనుక ఆ రచన అసమగ్రం, అసంపూర్ణం అవుతుంది. అంతేకాక బోధనాపద్ధతి బాహాటంగా కనపడి కళకు అపచారం జరుగుతుంది; రసభంగమవుతుంది. రచయిత్రికి ఉత్తేజం కలిగించే సంఘటనలు ప్రకోపింపజేసేదృశ్యాలు సమాజంలో ఆమెకు గోచరిస్తాయి. ఉద్దీపన కలిగించే పాత్రలు, వ్యక్తులు కూడా ఆమెకు కనపడతారు. అప్పుడామె తనకున్న విశాలదృష్టితో, సునిశితమేధా శక్తితో విశేషానుభవంతో ఆసంఘటనలను ఆదృశ్యాలను విశ్లేషణచేసి వాటి మౌలికాంశాలను గ్రహిస్తుంది.

అప్పుడు వాటికి సంకేతాలుగావున్న పాత్రలచేత కథాసంవిధాన రచనా నైపుణ్యంతో ఒక కావ్యాన్నో, నవలనో, కథనో, కవితనో సృష్టిచేస్తుంది. ఇక్కడ ఒక విషయం జ్ఞప్తిచేసుకోవాలి. ప్రపంచం ఒక రకంగాచూస్తే పూర్తిగా అద్వైతస్థితిలో ఉన్నట్లు కన్పడుతుంది. జీవరాసులలో, అజీవ రాసులలో శక్తి అంతర్యాప్తంగా వుంటుంది. కనుకనే యదేనియం అణువును బ్రద్దలుకొట్టి కొండలను పిండిచేసి, నదీప్రవాహాలను మళ్ళించి, విద్యుత్‌ను అందించే అణుశక్తిని వెలిదీయగలిగాము. ఈ శక్తి ప్రపంచమంతటా ఆవరించి ఉంది; ఇది ఏకత్వస్వరూపాన్ని కలిగిఉంది. కాని అ ఏకత్వంలోనే భిన్నత్వంకనపడుతుంది. సమాజంలో అయిదారు వందల కోట్ల జనాభావుంటే ప్రతివ్యక్తీ విలక్షణమైనజీవి. ఇన్నికోట్లమందీ విభిన్నమనస్తత్వాలుకల వ్యక్తులుగా కనపడతారు. కనుక వీరందరూ ఎవరికి వారు సంపూర్ణవిశిష్టత కల వ్యక్తులు; ఒకరు మరొకరికి నమూనా కారు. అందుచేత ఈ విశ్వాన్ని దర్శించేటపుడు భిన్నత్వంలోఉన్న ఏకత్వాన్ని మనంచూస్తాం. అంతేకాక ఏకత్వం ఎలా భిన్నత్వంగా పరిణమించిదో తెలుసుకుంటాము. ఈ సమ్యక్ దృష్టి అలవడినప్పుడు రచయిత్రులు విశ్వజనీన విలువలకు ప్రాధాన్యతనిస్తారు. రంగు, జాతి, కులం, దేశం, ప్రాంతం, భాష, లింగభేదమూ వాటిలాంటివల్ల కలిగే తేడాలను శాశ్వతమైనవిగా భావించరు. సామాజిక పరిణామ ప్రక్రియలో ఈ విభిన్నమయిన రూపాలు, అంశాలు సందర్భాన్నిబట్టి అవతరిస్తాయి. ఈవిషయాన్ని అమూలాగ్రంగా తెలుసుకున్న రచయిత్రి వాస్తవిక దృక్పథంతోనే సమాజంలోని విభిన్న వ్యక్తుల మనస్తత్వాలను ఊహించి రచనలు చేస్తుంది. అయితే ఇలాంటి రచనలలో 'ఈ సమస్యకు ఇది పరిష్కారం' అనిబండగా కొట్టవచ్చినట్లుగా కన్పడదు; కనపడాల్సిన అవసరమూలేదు. అలాంటిబోధ జరగాలనుకుంటే అది మామూలుగా ఉపాధ్యాయుడుచేసేపని అవుతుంది; ప్రష్ట అయిన రచయిత చేయాల్సిన పనికాదు. కాగా పరిష్కార మార్గాన్ని సూచించకుండా ఇలాంటి రచయిత్రి వదలివేయదు. ఏదోఒక పాత్ర దానిని సూచిస్తుంది. ఆ పాత్ర ప్రబోధఫక్కీలో "ఇది పరిష్కారమార్గం" అని చెప్పాల్సిన పనిలేదు. ఆ పాత్రయొక్క నడవడి పరిష్కారమార్గాన్ని స్ఫురింపచేస్తుంది. అందువల్ల మామూలు ప్రచార సాహిత్యానికి ఉండే

దోషం ఈరచనలో వుండదు. కనుక కళాత్మక విధానానికి భంగంకలుగదు. సామాజిక ప్రయోజనం పరోక్షంగా ఒనగూడుతుంది. ఇలాంటి సమస్యా పరిష్కారాన్ని సూచించే పద్ధతిని రచయిత్రులు అవలంబించాలి.

నేటిసాహిత్యాన్ని పరిశీలిస్తే నాలుగురకాల రచనా విధానాలు మనకు దర్శనమిస్తాయి. చదువరులను మరోలోకంలో విహరింపచేసే సాహిత్యం మత్తుమందులాంటిది. సమాజంలోవున్న రుగ్మతలను పోగొట్టటానికి ఉద్యుక్తులవకుండా, ప్రజలు మైకంలోపడి వుండటానికి ఇలాంటిసాహిత్యం ఉపయోగపడుతుంది. దీనిని సమాజం యెడల తీవ్రమయిన అపచారంగా చెప్పవచ్చు. సమాజానికి అర్థంపడుతున్నామని చెప్పే రెండవరకపువారు వాస్తవంగా తాము సమాజాన్ని చిత్రిస్తున్నామని చెపుతున్నారు. దీనికి పెద్దగా ప్రతిభ అక్కరలేదు. రచనావిధానంతో కాస్త-పరిచయమున్న ప్రతి వారూ ఈ పనిచేయగలరు. ఈమధ్య నినాదాల కవిత్వంవచ్చింది. దానికి కవిత్వపు విలువలే లేవని నిబ్బరంగా చెప్పవచ్చు.

మరోరకపు సాహిత్యప్రక్రియలో ఒక పాత్ర ద్వారా స్పష్టంగా, బహిరంగంగా, ప్రత్యక్షంగా పరిష్కారమార్గం చూపడం జరుగుతుంది. ఈ కృషికి పూనుకునే రచయిత్రులలో సమాజాన్ని వివరించి దానిని మార్చాలనే ధోరణి కనబడుతుంది. మరోరకంగా చెప్పాలంటే సామాజిక నిబద్ధత ప్రస్ఫుటంగా దర్శనమిస్తుంది. కాని కళాత్మకత లోపించినందువల్ల దీనిని ద్వితీయశ్రేణి సాహిత్యంగా పేర్కొనవచ్చు.

ఉన్నత శ్రేణికి చెందిన సాహిత్యంలో ఏదో ఒక పాత్ర నడవడి చదువరి యొక్క దృష్టినీ, మనస్సునూ ఆకర్షిస్తుంది. పాఠకుని మానసిక స్థాయి, జీవితానుభవం, విషయపరిజ్ఞానాలనుబట్టి ఆ పాత్ర ద్వారా నర్మగర్భితమయిన సందేశాన్ని పొందడం జరుగుతుంది ఇలాంటి సాహిత్యంలో కళారూపానికి భంగం కానిరీతిలో వస్తుదర్శనం చేసుకోవడానికి వీలవుతుంది. అంతేకాదు. ఉదాత్తమయినపాత్ర మేధాసంపత్తివలన, మానవస్వభావ గుణాలయిన కరుణ, సానుభూతి, ప్రేమ, అనురాగం, వాత్సల్యం, నిజాయితి, సోదరభావం ఇలాంటి గుణాలుకల్గిన ఆ పాత్రవల్ల పాఠకులు ప్రభావితులవుతారు. తద్వారా ఉత్తమ సమాజానికి ఆ రచయిత్రి బాటను

సుగమం చేసిందని చెప్పవచ్చు. ఇలాంటి రచయిత్రి సమస్యను, సంఘర్ష ణను క్రమపద్ధతిలో వివరణచేస్తూ శాస్త్రీయ పద్ధతితో ముగింపు చేస్తుంది. అలా సమస్యల విషవలయం నుండి బైట పడగల చైతన్యాన్ని, ఆలోచనల్ని మనో నిబ్బరాన్ని, వ్యక్తిత్వాన్ని అందివ్వగల రచయిత్రులే చిరస్మరణీయులు. ఆ రచనలకే శాశ్వతస్థాన ముంటుంది.

o)(—)(o

సాహిత్యము ! స్త్రీల సమస్యలు

సాహిత్యానికీ, స్త్రీల సమస్యలకూ సంబంధం ఏమిటి అనేది ఒక ప్రశ్న అయితే, రచయిత్రులు తమ రచనలలో స్త్రీ స్థానాన్నీ, స్థాయినీ ఎలా చిత్రిస్తున్నారనేది మరో ప్రశ్న అయింది. ఈనాడు స్త్రీల రచనలు అసంఖ్యాకంగా వస్తున్నాయి. వారి సాహిత్యం కేవలం వంట ఇంటి ముచ్చట్లకే పరిమితమయిందని న్యూనతగా మాట్లాడటం వింటున్నాం. పురుషులను రాయవద్దని రచయిత్రులు అడ్డుపడటంలేదు. ఎన్నో అవరోధాలు, మరెన్నో అడ్డంకులు ఉన్నా తమకున్న పరిమిత జ్ఞానానికి పదును పెట్టి సాహిత్య ప్రక్రియను యథోచితంగా పోషిస్తున్న రచయిత్రులు నిజంగా శ్లాఘనీయులు. వారి రచనలు తీసుకుని వీటిలో సాహిత్యపు విలువలున్నాయని, లేదా ఈ కథలో పసలేదని, లేదా ఈ నవలలో శిల్పం, శైలి, ముగింపు అసంబంద్ధంగా ఉన్నాయని సమీక్షించాలి కాని ఆడది రాసిందని అసహనంతో విమర్శించటం క్షంతవ్యంకాదు; సభ్యత అంతకన్నా కాదు. అయితే ఇక్కడ ఒక్క ముఖ్య విషయాన్ని గమనించాలి. వ్యక్తిత్వం కోసం సంప్రదాయంతో సంఘర్షణ పడుతున్న మహిళాలోకానికి ఈ రచన వల్ల ప్రయోజనముందా? స్త్రీ జనాభ్యుదయం కాని సామాజిక స్పృహకాని ఒనకూడుతుందా? ఈనాడున్న స్త్రీ స్వేచ్ఛను పెంపొందించేదిగా వుంటుందా? లేక ఇంకా నీచస్థితికి దిగజార్చేదిగా ఉంటుందా? యథాతథవాదంతో స్త్రీల బానిసత్వాన్ని బలపరుస్తుందో? లేక కేవలం కాలక్షేప వినోదాలకే పరిమితంగా వుంటున్నదా అనేది చర్చనీయాశం.

ఈ దశాబ్దపు రచయిత్రులు సైతం స్త్రీల స్థానాన్ని హోదాను వంట యింటికీ, పడకటింటికి మాత్రమే పరిమితంచేస్తూ రాస్తున్నారనేది నగ్న సత్యం. 'నీపాదదాసినై నీకు సేవ చేసుకుంటాను' అంటూముగిస్తున్నారు అత్యధిక సంఖ్యాకులు. 'జుట్టూ, గోళ్ళూ అవివుండాల్సిన చోట ఉంటేనే వాటికిగౌరవం. వాటికి స్థానభ్రష్టత్వం కలిగిననాడు అవి ఎలా పనికి మాలినవిగా పరిగణిస్తాయో అలాగే స్త్రీలు సహితం సంప్రదాయ పరంపరగా వారికి నిర్దేశించిన స్థానంలో వుంటేనే గౌరవం. ఆ లక్ష్మణరేఖ దాటినస్త్రీ

అధోగతి పాలవుతుంది' అంటూ వీరంతా లక్ష్మణరేఖనే సమానాగా చిత్రిస్తున్నారు. పిల్లల్నికంటూ భర్తసేవచేసే గృహిణిగా జీవించడమే ఆమెకు ధ్యేయమని స్తుతిపాత్రమనిచెప్తూ ఆమె జీవితానికి సఫలత ఇంట్లో నే అంటూ ముగిస్తారు. భద్రతకల కుటుంబాల వలననే భద్రతకల సమాజాలు ఏర్పడతాయని, దానికి స్త్రీ జాతే మార్గదర్శకంగా వుంటున్నదని పొగడటం పరిపాటి అయింది. స్త్రీ కోల్పోయిన వ్యక్తిత్వాన్ని సహనమని, ఆమె అజ్ఞానాన్ని త్యాగమని, ఆమె మూగబాధను ఓర్పుఅని, లొంగుబాటును భారతీయ సంస్కృతి అంటూ స్త్రీలకు బ్రహ్మాండమయిన 'బ్రెయిన్‌వాష్' ఇస్తోంది మన సాహిత్యం.

స్త్రీలు ఇష్టపూర్వకంగా బానిసత్వాన్ని వరించే పద్ధతిని బోధించింది పురాణసాహిత్యమంతా. స్త్రీలకు పాతివ్రత్యానికి, పవిత్రతకు, స్వామిభక్తికి నాటి స్త్రీ ప్రతీక అయింది. మంచి 'భార్య' అయితేనే అమెను ఉత్తమ జాతి స్త్రీయని పొగిడేవారు. నలదమయంతులు, సీతా రాములు, సావిత్రీ సత్యవంతుల కథలలో స్త్రీ భర్తయెడ విధేయతతో ప్రవర్తించాలని, త్యాగంచేయాలని నాటి సాహిత్యం నిర్దేశించింది. నాటినుండి దమయంతి, సావిత్రి, సుమతి, అహల్య ద్రౌపదులను ఆదర్శమహిళలుగా పొగుడుతున్నారు. పతివ్రతగా మాత్రమే అనాటి స్త్రీకి వ్యక్తిత్వముండేది. అగ్నిలో దూకమంటే దూకింది సీత. భర్తచే అమ్ముడుపోయింది చంద్రమతి. రేణుకా దేవి తండ్రి ఆజ్ఞాపిస్తే కొడుకుచే చంపబడింది. సుమతి భర్తను వేశ్యవద్దకు మోసుకెళ్ళింది. పంచభర్తృక అయింది పాంచాలి. గాంధారి భర్తకోసం గ్రుడ్డిగా జీవించింది. భర్త కామంకోసం శర్మిష్ట కన్యగా జీవితాంతం బ్రతికింది. సతిగా నాటి స్త్రీ సహగమనం చేసింది. ఇలా వందలవేల సంఖ్యలో పతివ్రతలుగా పేరుపొందిన 'ఆదర్శమహిళలు' ఉన్నారు అసలు స్త్రీకి పతి సేవతప్ప ఏకోరిక ఉండరాదనేది పవిత్ర ధర్మమయింది. తనకు సెక్సు వాంఛ ఉందన్న శూర్పణఖను అవమానపరచారు. తప్పు చేసింది ఇంద్రుడయినా అతనికన్న అహల్యకే ఎక్కువ శిక్షపడింది. భర్తసమ్మతితో కుంతి ఇతరులకు సంతానం కనడంకూడా స్త్రీకి పతివ్రతాధర్మమే; అయినా కన్యకుపుట్టిన కర్ణుడ్ని గంగపాలుచెయ్యటంకూడా పవిత్రమేననిపొగిడారు.

ధర్మశాస్త్రాల సారస్వతం, పురాణాల సాహిత్యమంతా స్త్రీని పుట్టుబానిసగా బ్రతకాలని సృష్టీకరించాయి. ఠాగూరులాంటి రచయితలు సైతం సంప్రదాయ విలువలను హేతుబద్ధంగా చిత్రించారు. "పురుషుడు స్వేచ్ఛలో ఆనందాన్ని పొందుతాడు. ప్రేమలో స్త్రీ ఆనందాన్ని పొందుతుంది." అంటూ స్త్రీ స్వభావం పురుషస్వభావానికి తోడయినదని "ఇంటాబయటా" అనే నవలలో ఠాగూరు చెప్తూ పురుషాధిపత్యాన్ని నర్మగర్భితంగా సమర్థించాడు.

సమకాలీన స్త్రీల సమస్యలు నేడు కోకొల్లలుగావున్నా రచయిత్రులు వాటిని చర్చించడం లేదనడం సాహసంకాదు. సతీసహగమన నిరోధం, బాల్యవివాహనిషేధం విధవవివాహాలు, కన్యాశుల్కం లాంటి సమస్యలపై పోరాడింది, తమరచనలచే ప్రభావితం చేసింది ఎక్కువగా పురుషులేనని మనకు తెలుసు. ఈనాటి సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలలోవున్న స్త్రీల సమస్యలన్నింటి మీదికి రచయిత్రులందరి దృష్టి ప్రసరించటం లేదని చెప్పక తప్పదు.

ఈనాటి స్త్రీల సమస్యలు అత్యల్పాలు కావు. స్త్రీల కష్టగాథలెన్నో వున్నాయి. ఇంటింటికొక కన్నీటిగాథ వుంది. కొన్ని మనకుగోచరమవుతాయి మరికొన్ని కథలు కన్నీటి వెనుక దాగివుంటాయి. కొన్నిటిని ఊహిస్తాం. మరి కొన్నిటిని అసలే విస్మరిస్తాం. ప్రతి స్త్రీ ఎప్పుడోఅప్పుడు తాను ఆత్మహత్య చేసుకొంటే సరిపోదా అనేభావం స్ఫురించని గృహిణి ఉండనే ఉండదంటే నమ్ముతారా? వైవిధ్యంతోకూడిన సమస్యలు అనేకరకాలు.ఆమెకు వ్యక్తిత్వలేమి, ఆర్థికఅసహాయత్వం, రాజకీయనిరాదరణ, సాంఘిక దోపిడి, వరకట్నం, పరదా, వ్యభిచారం, బాల్యవివాహం, నిర్బంధ వైధవ్యం, మానసికక్షోభ, తిట్టటం, కొట్టటం, చంపటం, అత్యాచారాలు, మానభంగాలు, "సాడిస్టు" భర్తల దురహంకారం లాంటివి చాల ఉన్నాయి. ఈబాధలు భరించలేక ఆత్మహత్యల పాలయ్యేవారు వేల సంఖ్యలోఉన్నారు. మానవజీవితం ఏఒక్క సూత్రానికీ, ఏఒక్క పద్ధతికి ఎలాకట్టువడదో మహిళల సమస్యలు ఒకేరీతిలో, ఒకే విధంగా ఉండవు. అసలు స్త్రీ జీవితం ఒక సుడిగుండం. తన భద్రతకోసం ఆమె అనుక్షణం ఒడ్డునపడ్డ చేపలా కొట్టుకుంటూ ఉంటుంది.

వ్యక్తి జీవితానికి రాజకీయం, సామాజికం బొమ్మబొరుసూ లాంటివి. సాంఘిక జీవితాన్ని, సామాజిక పరిణామాన్ని నిర్దేశించే రాజకీయాన్ని సాహిత్యానికి దూరం చేయటం నిర్హేతుకమూ అనర్ధమూ అనకతప్పదు. కీలకమయిన రాజకీయ వ్యవస్థలో స్త్రీల ప్రాతినిధ్యం అత్యల్పం. జనాభాలో సగభాగమున్నారు స్త్రీలు. అయిదువందల ఇరువదిమంది సభ్యులున్న పార్లమెంటులో స్త్రీలు 18 మంది మాత్రమే. ప్రజాప్రాతినిధ్యం వహించటానికి తామే అర్హులమనే భావం పురుషరాజకీయ నాయకులకు ఉండబట్టే తమ పార్టీలో స్త్రీలను పైకిరానీయరు. ప్రభుత్వ రంగంలోని కీలకస్థానాలన్నీ పురుషులవశమే. చట్టాలన్నీ పురుషులే తయారుచేస్తున్నారు. ఏ రెండో మూడో ముఖ్యస్థానాలలో స్త్రీలు ఉన్నంతమాత్రాన స్త్రీలంతా ముందజ వేశారనుకోవడం భ్రమ. సంఘర్షణ, విప్లవం, పోరాటం, తిరుగుబాటు లాంటి పదాలు రాజకీయాలని, అవికేవలం పురుషులకు మాత్రమే సంధించినవనే భావన స్త్రీలలోనూ, రచయిత్రులలోనూ ఉండబట్టే సాహిత్యాన్ని రాజకీయాలకు దూరం చేస్తున్నారు. రాజకీయవ్యవస్థలోని బాగోగులను, ముఖ్యంగా స్త్రీల విద్య, ఉద్యోగం, ప్రాతినిధ్యంలాంటి సమస్యలను ఎత్తి చూపే బాధ్యతను రచయిత్రులు స్వీకరించాలి.

ఆర్థికపరమైన వ్యత్యాసం విపరీతంగాఉంది. ఒకే పనిని ఇద్దరు చేస్తుంటే పురుషుడి వేతనం 100 రూపాయలయితే స్త్రీకి 70 రూపాయలు ఇవ్వటంవల్ల స్త్రీ తక్కువ అనేభావం స్ఫురిస్తుంది. వివిధరకాల వృత్తులలో నిపుణత్వానికి పురుషులకిచ్చే శిక్షణ స్త్రీలపట్ల మృగ్యమవుతున్నది. స్త్రీలను తక్కువ స్థాయిఉద్యోగాలకు నియమించడం జరుగుతున్నది. ఎంతో అంత సంపాదించుకుందామనే తాపత్రయంతో గతిలేక పనిచేస్తున్నారుస్త్రీలు. పెట్టుబడిదారీ సమాజంలో స్త్రీలకు తక్కువ వేతనాలు ఇచ్చి వారిశ్రమను దోపిడీచేస్తున్నారు. జపాను, దక్షిణకొరియాలలో స్త్రీలచే తక్కువ ఖర్చులతో వస్తువులను తయారుచేయించి వాటిని చౌకగా విదేశాలలో అమ్ముతున్నారు. స్త్రీల ఆర్థిక అసమానత్వంవల్లనే పురుషాధిపత్యం పెరిగింది. ఆర్థికలేమివల్ల ఆమె ఆజన్మాంతంపురుషునిమీద ఆధారపడి అణగారి అణకువతోజీవించాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్త్రీల ఈదైన్యస్థితిని గ్రహించని రచయిత్రులు దోపిడీ పరిస్థితులకు అనుగుణంగా వ్యవస్థీకృత పురుషస్వామ్యాన్ని

బలపరుస్తూఉన్న సాహిత్యాన్ని తయారుచేస్తున్నారు. తరతరాల బానిస మనస్తత్వాన్ని విస్మరించలేని రచయిత్రులే ఈ దారుణాన్ని పోషిస్తున్నా రనకతప్పదు. రకరకాల సమస్యలలో ఆర్థిక సమస్య ముఖ్యమయినది. ఈ విషవలయంనుండి బయట పడగల చైతన్యాన్ని, ఆలోచనలను ప్రేరే పించగల రచనలు చేసి మార్గదర్శకులు కావాలి కాని సెంటిమెంట్ల ముసు గులో ఆలంబనజీవితాన్ని ఆదర్శమంటూ ప్రోత్సహించటంనింద్యమవుతుంది.

సమకాలీన సామాజిక వ్యవస్థలో ఆధునిక స్త్రీ అగచాట్లు అసంఖ్యాకం. ఆమె జన్మించినదాది పెంపకంలో, విద్యలో, వివాహంలో, దాంపత్య జీవితంలో అన్ని విధాల రెండోరకపు వ్యక్తిగా జీవిస్తున్నదనేది సత్యదూరం కాదు. ఆఖరుకు ఆమె ఎందరినికనాలో నిర్ణయించేది భర్త; కాని పుట్టిన పిల్లలపై సర్వాధికారాలు భర్తవే. ఏ విషయాన్ని ఆమెతో సంప్రదించడు భర్త. ఆమె ఇంటా బయటా అనుక్షణం అవహేళన చెయ్యబడుతున్నది. "అది" అనే నీచ పదప్రయోగం స్త్రీని అవమానించటమే. ఇద్దరూ కలిసి సంపాదించినా అస్తులు కొనేది భర్తపేరనే. కొట్టినా, చంపినా, వ్యభిచరించినా పురుషుణ్ణి నిరశించని సమాజం స్త్రీని మాత్రం అనుక్షణం విమర్శిస్తున్నది. ఇలా ఎన్నో పరిమితులకు లోనయిన స్త్రీని, కేవలం ఆటబొమ్మగా మనగల్గుతున్న మహిళను, పురుషుడు విధించినఆంక్షలలో ఊపిరాడక స్వంత ఆలోచనలేక స్వతంత్ర జీవనంలేని అమెను అబల, లత అంటూ ఎప్పుడూ ఆమెకు ఏదో ఆధారం, రక్షణ కావాలని రచయిత్రులు సైతం తమ కథలను ముగించటం నిజంగా స్త్రీ జాతికే గొడ్డలిపెట్టు. దురాచారాలపట్ల ఉపేక్ష, ఉదాసీనత సంప్రదాయాలమీద విశ్వాసం రచయిత్రులు విడనాడాలి.

సాంస్కృతికంగా స్త్రీని చాల చులకన భావంతో చూస్తారు- "నీకు తెలియదు, పో" అంటారు. మూడువేల సంవత్సరాలనుండి భారతీయ సంస్కృతి మన నరనరాన నిండిపోయింది. తమకే సర్వహక్కులున్నాయని పురుషులు భావిస్తున్నారు. ఇది ఈ ఒక్కదేశ సమస్యకాదు. ఏ దేశమేగినా ఇదేకథ. కొన్ని విషయాలు మాత్రమే ఆమెకు కేటాయించారు."నీవుగృహిణివి, మాతృమూర్తివి, నీకుప్రేమ అనురాగం సహజం" అంటూ ఈ సంస్కృతిని

స్త్రీ జాతికి అందిస్తే వారు మురిసిపోయి అది నిజమని నమ్మారు. పిల్లల్ని కనడమనేది స్త్రీజాతి విశిష్టత; అది ఆమె ప్రకృతికి సహజలక్షణం. దానిని స్త్రీజాతి గొప్పతనంగా భావించాలి. కాని పిల్లల్ని పెంచటానికి స్త్రీలే అర్హులంటూ తాము జబర్దస్తీగా కూర్చుని ఆజ్ఞలు జారీచేస్తుంటారు పురుష పుంగవులు. ఇలాఎన్నో రకాల స్త్రీ పురుష అసమానత్వం మన కళ్ళకు కనిపిస్తున్న నగ్నసత్యం. ఇక సినిమాలలో స్త్రీ చిత్రణ సరేసరి. నీ పాదదాసిని, నీపాదాలచెంత ఇంతచోటు ఇస్తే చాలునని స్త్రీచే పలికిస్తూ కథముగిస్తారు.

స్త్రీల సమస్యలు, అవమానాలు, ఆత్మహత్యలను చూస్తున్న రచయిత్రులు వీటి విషయాలపై ధ్వజమెత్తి స్త్రీ విమోచనను సాహిత్యంలో ప్రముఖాంశంగా ఎందుకు ఎంచుకోరనేది బాధాకరమైన ప్రశ్న. అభ్యుదయ కరమైన రచనలు చెయ్యాలంటే ముందుగా రచయిత్రులు చిత్తశుద్ధి అలవరుచుకోవాలి; స్పందన, ఆర్తి వారిలో ఉండాలి. సామాజికస్పృహ, శాస్త్రీయదృక్పథం, హేతుదృష్టి వారికవసరం. తక్షణ సమస్యలను, దీర్ఘకాల సమస్యలను, అలాగే వ్యక్తిగత, సామాజిక సమస్యలను సమన్వయం చేసుకోగలగాలి. వ్యక్తిగత విశ్వాసాలను వక్రీకరించి సమాజ విశ్వాసాలుగా, సామాజిక శ్రేయోదాయకాలుగా చిత్రించరాదు. భావవాదులయిన రచయిత్రులు శాస్త్రీయదృష్టిలేక, అశాస్త్రీయమైన కర్మసిద్ధాంతానికి కష్టాలకు ముడిపెట్టి ఏమీ చెప్పలేక, తెలియదని ఒప్పుకోలేక, అర్థంకాక ఈశ్వరేచ్ఛఅని, కర్మఅని యథాతథస్థితిని సమర్థిస్తారు. ఆర్థిక ఇక్కట్ల నివారణకు, మానసిక శారీరక రుగ్మతల నిర్మూలనకు నోములూ పూజలూచెయ్యాలని, బాబాలకు దేవుళ్ళకు మొక్కాలని పాత్రలచేత పలికిస్తారు. పరిమాణపరిణామ చరిత్ర అంతా తెలిసినమనం, శాస్త్ర విజ్ఞానంద్వారా భౌతిక ప్రపంచాన్నిగుర్తించిన మనం భావవాదాన్ని బలపరచటం అర్థరహితం.

స్త్రీ సమస్యలకు సరియయిన పరిష్కారమార్గాన్ని సూచించలేక కొందరు రచయిత్రులు పలాయనవాదాన్ని అనుసరిస్తున్నారు. సమస్యల నుండి దూరంగా జరిగి చిత్ర విచిత్రాతి సన్నివేశాలతో కేవలం వినోదం కోసం కాలక్షేపంకోసం రాస్తున్నారు. ఊహాలోకంలో-వాస్తవప్రాతిపదికలేని ఊహాలోకంలో - విహారయానం చేయిస్తున్నారు. ఒక ప్రముఖ నవలా రచయిత్రి ఒకభేటీలో"నాకు ఆకలి, దరిద్రం, చావులు అంటే పరమచికాకు;

వ్యక్తిని ఉక్కిరి బిక్కిరి చేసే సమస్యలంటే నాకు గిట్టదు. అందుకని ప్రేమలు, పెళ్ళిళ్ళు, అనురాగాలు, ఆప్యాయతలే నారచనకు ఆలంబనాలు. నేనుకోరేది కేవలం ధనం మాత్రమే. నాకు కావాల్సింది పేరు ప్రఖ్యాతులే" అనేఅర్థం వచ్చేటట్లు నిర్మొహమాటంగా చెప్పింది. ఇలాంటివారి నవలలకు మంచి మార్కెట్టు పెరగటం మన దౌర్భాగ్యం. కేవలం నవలలు సినిమాలుగా రావడం, పత్రికలలో సీరియల్సుగా వస్తూఉండడం, నవలల సంఖ్య పెరగడం మాత్రమే గీటురాయి అనుకుంటే అంతకన్నా దారుణమైన విషయం మరేదీ ఉండదు. ఇలాంటి సాహిత్యం అజ్ఞానం, అవిద్య, మూఢాచారాలలో మునిగివున్న పాఠకులను ఇంకా దిగజార్చుతుందే కాని వారిలో ఆధునికత చైతన్యం, పురోగమన శక్తిని కలిగించవు.

రచయిత్రులందరూ సామాజిక స్పృహ నివారని, వాస్తవ దృక్పథంతో రాయటంలేదని, స్త్రీల జీవితసమస్యలను స్పృశించటంలేదని వాదించటం సాహసమవుతుంది. కాని సామాజిక ప్రయోజనాన్ని ఆశించి సమస్యకు పరిష్కారాన్ని శాస్త్రీయదృష్టితో చూపుతూ రాయగలవారు నూటికొకరున్నారు. స్త్రీ బానిసబ్రతుకును నిరసించినవారు, పురుషుల అమానుషత్వాన్ని ఖండించేవారు, ఆర్థిక విషవలయంలో చిక్కుపడ్డ పడతులను గుర్తించి వారి సమస్యలను తమ సాహిత్యంలో పొందుపరిచినవారు అల్ప సంఖ్యలో ఉన్నారు. అలాగే రాజకీయాలలో స్త్రీలయెడ వివక్షను కథాంశంగా ఎంచుకున్నవారిని వ్రేళ్ళమీద లెక్కించవచ్చు. చాలమంది సంస్కృతి సంప్రదాయాలపేరుతో స్త్రీ స్థానం ఇంట్లోనే వున్నదనే యథాతథవాదాన్ని బలపరచటం శోచనీయం.

దరహం మీసచూస్తే ఇంతవరకు స్త్రీల సామాజిక, కుటుంబ విషయాల పైననే రచయిత్రులు విరివిగా వ్రాశారు. కాని రాజకీయార్థిక సాంస్కృతిక సమస్యలపై రచనలు కొద్దిగానే ఉంటున్నాయి. అన్నిరకాల సమస్యలను, సన్నివేశాలను తీసుకొని ఉత్తమ సాహిత్యాన్ని అందించవలసిన బాధ్యత ప్రతిభకల రచయిత్రులపై ఉన్నది. వ్యక్తిగతంగా తాము అనుభవిస్తున్న

సమస్యలను, తమ బంధువర్గం స్నేహబృందం ఎదుర్కొనే సమస్యలను, సమాజంలో తదితరులను బాధిస్తున్న సమస్యలను రచయిత్రులు ఉత్తమ సాహిత్య వస్తువులుగా స్వీకరించినమేరకు స్త్రీజాతికి విమోచన దగ్గర పడుతుంది. అలా హేతుదృష్టితో, మానవ విలువలయెడ గౌరవంతో, సామాజిక స్పృహతో రచనలు చేయగలిగిననాడు సమాజానికి అందులో ముఖ్యంగా స్త్రీ జాతికి రచయిత్రులు తమ ఋణం తీర్చుకున్నవారవుతారు.

о)(—)(о

జానకీరాణి సృజనాశక్తి

శ్రీమతి తురగా జానకీరాణి లాంటి ప్రతిభా వ్యుత్పత్తులు కల వ్యక్తి ఊరక వుండలేదు. ఆమెలో సృజనాశక్తి విజృంభిస్తుంది. అదే జానకీరాణి గారి పట్ల జరిగింది. ఆమె కథలు రాశారు; నవలలు రచించారు. కవితల్లారు అనువాదాలు చేశారు. ఇన్ని సాహితీ ప్రక్రియలలోనూ ఆమె వ్యక్తిత్వం బహిర్గతమవుతూనే వుంటుంది.

కథలు రాయటం చాలా కష్టతరమైన సాహితీ ప్రక్రియ. పోల్చిచూస్తే నవలారచన సులభతరం, క్లుప్తత, మాటల పొదుపు, చక్కనిశైలి, గుండెల్లోకి బాణంలా దూసుకొనిపోయే సన్నివేశం, కథచెప్పేతీరు, ముఖ్య పాత్ర ఆకర్షణ, అన్ని పాత్రలను సమ్యక్ దృష్టితో చూడగల కారుణిక భావం, చమత్కృతి, నీతిపట్ల అభిమానం ఇవన్నీ చోటుచేసుకుంటేనే అదిరాణిస్తుంది. లేకపోతే అది చిన్న చరిత్రో, పెద్దగాథో అయి కూర్చుంటుంది.

కథాశిల్పానికి అవసరమైన ఉపజ్ఞ జానకీరాణిగారికి ఉన్నందువల్లనే ఆమె కథకురాలిగా రాణించింది. ఆమె చేపట్టిన ఇతర ప్రక్రియలో ఆమె సామర్థ్యప్రకటన లేకపోలేదు. కాని మొత్తంమీద పరిశీలిస్తే ఆమె కథలు ఆమె నవలలను, కవితలను తలదన్నుతాయి.

ఆమె వ్రాసిన "జగన్మాత" కథ నన్ను ఆకట్టుకుంది. ఆ కథలో రుక్మిణికి "ముప్పైదాటినా పెళ్ళికాలేదు, చేసే దిక్కులేదు". రుక్మిణి తల్లి అయింది. ఆమెను ఓదారుద్దామని ధనలక్ష్మి, చీవాట్లు పెడదామని "నేను" ఆమె ఇంటికి వెళ్ళాము. ఆమె పిల్లవాడిని చూశాము. ఇళ్ళకు మళ్ళాము. ధనలక్ష్మి ఆమెను ఓదార్చలేదు. కథచెప్పిన "నేను" ఆమెను నిందించనూలేదు; పైగా అంటుంది "అది ఎందుకు ఏడుస్తుంది. హిమాలయ పర్వతాలమీద కూర్చుని మనబోటి వాళ్ళందర్నీ చిన్నచూపు చూస్తున్న జగన్మాత అది" ఈ వాక్యం మాతృత్వం యెడచూపాల్సిన గౌరవభావాన్ని వెలెత్తిచూపుతుంది. తల్లికావాలనే సహజ స్త్రీతత్వ ఆర్తిని హృద్యంగా చిత్రిస్తుంది. వర్తమాన సమాజంలో పెళ్ళికాని ఆడపిల్లల వ్యథను ఈ కథ

వెలికితీస్తుంది. సమాజం వారిపట్ల చూపే అసహ్యభావాన్ని కరుణాదృష్టితో త్రోసిరాజంటుంది. పతితయెడ దయార్ద్రదృష్టి, తోటి మనిషియెడ సానుభూతి సంవేదనను వ్యక్తం చేస్తుంది. పిల్లవాణ్ణి నిబ్బరంగా ధైర్యంగా పెంచుకోగల రుక్మిణి మనస్తత్వాన్ని, "వీడి నాన్నకు గుండె ధైర్యంలేక వచ్చి చూడలేదు. తప్పించుకు తిరుగుతున్నాడు. అంత భయపెట్టాడు నా బాబు, అంతటి మగవాడినీ" అని గలగలా నవ్వేసిన రుక్మిణిని బహు దర్పంగా మనకు పరిచయం చేసింది జానకీరాణి మగవారు సమాజం గర్హించే పనులు ఇష్టపడి చేస్తూ రహస్యగోపనంకోసం తంటాలుపడుతూ, దోషభావంతో పిరికితనంతో సతమతమౌతారనే నగ్నసత్యం ఈ వాక్యంలో గోచరమవుతుంది. పది వ్యాసాలు, ఇరవయి నవలలు, వంద ఉపన్యాసాలు అందించగలిగే పెళ్ళికాని తల్లులయెడ సానుభూతిని ముచ్చటగా మూడు పేజీల కథలో బలవత్తరంగా చెప్పింది. ఆమె సామాజిక చైతన్యానికి ఇది ఒక మచ్చుతునక. కథలో వర్ణనకు, నవలలో వర్ణనకు ఎంతో తేడావుంది. కథకుడు తక్కువ సామాగ్రి వాడాలి. కొద్ది పదజాలంతో మహోన్నతమయిన స్పందనను కలుగజేయాలి. ఈ వాక్యం గమనించండి. "దాని కళ్ళనిండా కాటుక, చంపలు పలుచగా, తాంబూలరంజితాలైన పెదవులకు అందమిస్తూ, మెరుస్తున్నాయి. కాళ్ళకు చెప్పులు. బాలింత తనం ఇంకా జివ జివ లాడుతూ పచ్చిగా వంటిని చుట్టుకున్నట్లు కనిపించింది." ఎంత చక్కని పదవిన్యాసం, ఎంత వర్ణనా ప్రతిభ!

మరో కథ 'తరలి వెళ్ళాము". కథాభారతి వారి తెలుగునాటి 27 కథలలో అది ఒకటి. ఇదీ"జగన్మాత"లాగానే ఉత్తమ పురుషలో రాయబడిన కథ. ఇలా ఉత్తమ పురుషలో కథ రాయటానికి ఎంతో నేర్పు వుండాలి. ఇందులో ఇతివృత్తం ఏమంటే ఒక స్త్రీ అభిమానించిన పురుషుడు రెండుసార్లు ఆమె స్నేహితులను వివాహమాడటం ఆమె ఆ పెళ్ళిళ్ళకు తరలి వెళ్ళడం, ఆమె "ఇక్కడే, ఈ గ్రుడ్డి వెన్నెలలో వంటరిగా" మిగిలి పోవడం చిత్రించ బడ్డాయి. పెళ్ళికాని ఆడపిల్లల మనస్తత్వం, అవాచ్యంకాని కోర్కెలు, హృదయాంతర్గత వాంఛలు, ఆశలూ, నిరాశలూ, బహుసున్నితంగా సుతారాంగా వ్యక్తీకరించబడ్డాయి. ఈ సంఘటన ఈ దేశంలోనే కాక మరే

దేశంలోనైనా జరగవచ్చు. ఇతివృత్తం సార్వజనీనం, సార్వకాలికం. నాగరికతలను అధిగమించి, సంస్కృతి రూపాల వైవిధ్యాన్ని దాటి, దేశాల యెల్లలను విస్మరించి, మానవ మనస్తత్వ పరిశీలనకు ప్రయత్నించిన జానకీరాణిగారు శ్లాఘనీయులు.

'లేచి పోయింది' అనే కథలో అమాయకురాలయిన స్త్రీ ఎలాంటి సన్నివేశాలలో ఇరుక్కుంటుందో, ఆమె సంతానం ఎలా చిక్కుల్లో పడతారో, సలహాచెప్పినవారు తరువాత ఎంత నేర్పుగా తమ బాధ్యతను తప్పించుకొని నీతివాక్యాలు వల్లె వేస్తారో వివరింప బడింది. ఇందులో భారత జాతి సామాజిక పరిస్థితి అభివర్ణింపబడింది.

'నాది పాత కలమే కదా అని, వ్రాత మొదలు పెడదామంటే, నా నుదిటి గీతలా వంకరపోయింది పాళీ'. ఇది గుండెలను పిండిచేసే విషాద గీతం. పాఠకులమనస్సులను దుఃఖంతో ముంచేస్తుంది. అంతటితో అగదు. నర్మ గర్భితంగా ప్రశ్నను లేవనెత్తుతుంది. మానవుడు కష్టాలపాలయి, నష్టపడి, వ్యధచెంది, నిరాశా నిస్పృహలతో కృంగిపోవాలా లేక గుండె నిబ్బరంతో ధైర్యాన్ని సంతరించుకొని జీవయాత్ర సాగించాలా? ఇదీ ఒక సవాలు మానవాళికి.

'బొమ్మలపెళ్ళి' కథలో సరదాగా ఆడుకొనే ఈడులో బరువుబాధ్యతలతో కూడుకునే గృహస్థాశ్రమ ప్రవేశం ఎంతబాధాకరమో వివరించింది. ఆమె కథలలో వస్తువైవిధ్యం, సహజత్వం కన్పడతాయి. 'చూపులు కలసిన శుభవేళ' "స్త్రీలకు ప్రత్యేకం" 'చరాచర ప్రపంచంలో భార్య అనే జీవి' కథల్లో స్త్రీల ఇక్కట్లపై సానుభూతి, మహిళోద్యమానికి ఉత్తేజం కలిగిస్తాయి.



'వెలిగినజ్యోతి' లోని స్త్రీ పాత్రలు

నర్మద వివాహపూర్వం భర్తతో తన సంపాదన విషయమై ఒప్పందం చేసుకుంది. దాని ప్రకారం తన జీవితంలో సగం పుట్టింటి వారికి అమె హక్కుగా అందజేయవచ్చు. కాని వివాహానంతరం అమె పరిస్థితి విషవలయంలో చిక్కుకున్నది. ఆమె సంపాదనలో ఒక్కపైసాకూడా పుట్టింటివారికివ్వరాదని ఆమెభర్త పట్టుపట్టాడు. వాగ్దానభంగం చేసిన మగనితో కాపురం కొనసాగించాలా అక్కరలేదా అని ఆమెకున్న సమస్య. వ్యక్తిత్వమున్న స్త్రీగా తను ఏంచెయ్యాలి? ఆమె నిర్ణయానికొచ్చింది. భర్తను ఒదిలేసి నర్సువృత్తిచేస్తూ తోటి ప్రజలమీద ప్రేమాభిమానాలు వెదజల్లుతూ జీవితాన్ని సార్ధకం చేసుకుంది.

మరోపాత్ర బీనాదేవి కులాంతర వివాహం చేసుకున్నాక అమె కష్టాలు ప్రారంభమయ్యాయి. మరో కులపు స్త్రీని ఉంపుడుగత్తెగా వుంచుకున్న ఆమెతండ్రి ఆమె భర్తను చంపించాడు. అయినా ఆమె మొక్కవోని ధైర్యంతో పరిస్థితుల్ని ఎదుర్కొని తండ్రిలేని తన బిడ్డను సాకింది. నర్మద, బీనాదేవి ఇద్దరూ నవలలోని ముఖ్యపాత్రధారి కాంచనకు మనోనిబ్బరాన్ని అందించారు.

వెలిగినజ్యోతి నవలలో ఎక్కువగా కాంచన కథ వస్తుంది. తల్లిని కోల్పోయిన కాంచన మాతామహుల పెంపకంలో యెదిగి, తండ్రి వ్యాధి పీడితుడై వుండగా సవతితల్లి కుతంత్రాలకు బలిఅయి, సవతితల్లి తమ్ముడికి భార్య అవుతుంది. అతడు వ్యభిచార గృహానికి బ్రోకరు. ఆమెను అమ్మి డబ్బు చేసుకుందామని మొదట్లో తలచినా ఆమెకు కలిగే ఆడపిల్లల్ని అమ్ముకుంటే మరింత డబ్బు వస్తుందనే ఆశతో ఆమెతో కాపురం సాగిస్తాడు. బంగారంలాంటి ఆమె బిడ్డలిద్దర్ని అరబ్బులకు అమ్ముతానని బెదరించి సంతానాన్ని ఆశించే ఒక జమిందారుకు ఉంపుడుగత్తెగా తన భార్యను

పంపి సొమ్ము చేసుకుంటాడు. జమిందారు ద్వారా బిడ్డనుకని వారికిచ్చి ఇంటికిచేరిన కాంచన తన ఇద్దరాడపిల్లల్ని కానక పరితపిస్తుంది. అప్పటికే వారిని భర్త అమ్మేశాడు. ఈ విషయం తెలిసి తోకతొక్కిన త్రాచైన కాంచనను భర్త 'కులటా' అని పిలిచి ఆమెను బలవంతంగా వ్యభిచార గృహానికి చేర్చబోతాడు. ఆమె అతనికి ఎదురు తిరిగి కత్తిపీటతో అతని నెత్తిపై కొడుతుంది అతను చనిపోతాడు. కాంచన ప్రవర్తన సమంజసమా? అసమంజసమా? అనేదే నవలలోని ముఖ్యప్రశ్న.

మహిళా ప్రపంచపు దయనీయస్థితిలో ఇరుక్కున ముగ్గురు వివాహిత స్త్రీల స్థితిని ఈ నవలలో చిత్రించారు రచయిత్రి మల్లాది సుబ్బమ్మగారు.

(o) ● (o)

" స్త్రీకి శరీరంవుంది, దానికి వ్యాయామం కావాలి. ఆమెకు మెదడు వుంది దానికి జ్ఞానం ఇవ్వాలి. ఆమెకు హృదయంవుంది దానికి అనుభవం ఇవ్వాలి"

—చలం.

మన వివాహ విధానాల్లో మార్పులు మనకు తెలుసా?

భారత దేశ వివాహాల్లో అనేక మార్పులొచ్చినై. మొదట్లో ఒక గుంపులోని పురుషులకు మరో గుంపులోని స్త్రీలతో సంపర్కముండేది. తండ్రికి పిల్లల బాధ్యతాలేదు కుటుంబవ్యవస్తాలేదు. వర్ణాశ్రమ ధర్మాలొచ్చాక బ్రాహ్మణుడు నాల్గువర్ణాల స్త్రీలను వివాహమాడవచ్చు. కానీ బ్రాహ్మణ స్త్రీని మిగితా మూడు వర్ణాలవారూ వివాహ మాడరాదు. "అగ్ర"వర్ణ స్త్రీని 'అల్ప' వర్ణ పురుషుడు వివాహమాడితే 'అనులోమ' అని 'తక్కువ' కుల పురుషుడు "పెద్ద" కులం స్త్రీని వివాహమాడితే "ప్రతిలోమ" అని పిలుస్తూ వారిని సంఘ బహిష్కారం చేసేవారు. వారి బిడ్డల్ని హీనకులజులుగా పరిగణించేవారు కొన్ని తెగలలో వివాహమైన మొదటిరాత్రి పిల్లని పురోహితుని పరంచేసే దురాచారం వుండేది. కొన్ని ప్రదేశాలలో పిల్ల తల్లినే వివాహమాడేవారు. తదుపరి బహుభార్యాత్వం, కొన్ని ప్రాంతాలలో బహుభర్తృత్వం ఆచారాలయినయి.

మొదట్లో మతాలు సామాజిక జీవితాన్ని బహుళంగా విస్తృతంగా నియంత్రించాయి చేశాయి. ఒక్కొక్క మతం అది పుట్టిన దేశంలోని రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక పరిస్థితులనుండి ప్రత్యేక నియమాలను ఏర్పరచుకుంది. ఆ దశలోనే మన దేశంలో రుషులు అనేక ధర్మశాస్త్రాలను రచించారు. వాటిలో ముఖ్యమైనది మనుధర్మశాస్త్రం. అందులో అష్టవిధ వివాహాలు రూపొందినై. బ్రహ్మ, దేవ, ప్రాజాపత్య, అసుర, గాంధర్వ, ఆర్ష, రాక్షస పైశాచములు అవి. మానవ జీవితంలో వివాహంఉత్కృష్టమైనది జీవితాంతం సహచర్యానికి, సన్నిహితత్వానికి; ఆత్మీయతకు ఏర్పడినదే వివాహం. సభ్యమానవ సమాజం ఏర్పడినప్పుడు సమాజంలో మార్పు అనివార్యం అయింది. అతి ముఖ్యమైన వివాహ వ్యవస్థలోకూడా అనేక మార్పులు రాకతప్పలేదు. పురోగమనం మెప్పుడూ మౌలికమైన మార్పును కోరుతుంది.

బాల్య వివాహ నిషేధ శాసనం 1929 లో వచ్చింది. ఈనాటి బాల్య వివాహ చట్టంక్రింద వధువుకు 18, వరునికి 21 ఏండ్లు నిండాలి. అంతకు తక్కువ వయస్సువారు పెళ్ళాడినా, మనంచేసినా శిక్షాపాత్రులం. అయితే ఆ వివాహం చెల్లదనే నిబంధనలేదు. అయితే ఆమె 18 ఏండ్లు నిండేలోగా తనకు ఈ పెండ్లి వద్దనేహక్కు మాత్రం ఇచ్చారు. అదేవిధమైన ముస్లిం కన్యకు మాత్రం ఆ హక్కులేదు. దాంపత్య జీవితంలోకి ప్రవేశించనప్పుడు మాత్రమే ముస్లిం వధువుకు ఆ హక్కువుంది. అయితే 14 ఏండ్ల పిల్ల 16 ఏళ్ళ బాలుడు వివాహ బంధంలో ఇరుక్కున్న పార్శీమతస్తులకు పార్శీ చట్టం ప్రకారం ఆ వివాహాన్ని కోర్టు అమలు పరచదు. ఇలాశిక్షలువేసేకన్నా బాల్య వివాహాల రద్దును శాసనం చేస్తేనే మంచిది. కోర్టుల భాష్యాలకు వదలివేయుటం భావ్యంకాదు.

హిందూ వివాహశాసనం 1978 వరకు మారుతూనే వుంది. 1939లో ముస్లిం వివాహ సవరణ చివరిసారి జరిగింది. 1872 నాటిదే క్రైస్తవ వివాహ శాసనం, 1858 లోని క్రైస్తవులకు వర్తించే విడాకుల చట్టం ఇంకా అమలులో ఉన్నాయి. పార్శీ వివాహశాసనం 1936 నాటిది. ఏమతానికి చెందని వారికీ, ఆ శాసనంక్రింద వివాహ చేసుకునేవారికీ వర్తించే ప్రత్యేక వివాహశాసనం 1954లో పుట్టింది.

పెండ్లి సందర్భంగా ఏయే మార్పులు ఎలా వచ్చాయో వ్రాస్తే పెద్ద గ్రంథమవుతుంది. ఒక విషయం మాత్రం సత్యం. ఎంతో పురోగతిని ఇతరత్రా విద్య, ఉద్యోగాలలో సాధించిన క్రైస్తవులు ఇంకా 19 వ శతాబ్దపు చట్టాలకు లోనయి ఉండటం శోచనీయం. ముస్లిం లా ఆ నాటి అరబ్బుల ఆచారాలను సవరించిన కొరాను సూత్రాల ప్రకారం ఉంది; అంటే 12 వందల సంవత్సరాలనాడు నిర్దేశించిన దన్నమాట. కాలంమారింది; సమాజం మారింది. అయినా మహమ్మదును చివరి ప్రవక్తగా పరిగణించి మార్పును వ్యతిరేకిస్తున్నారు సనాతన ముస్లింలు. ఇది వారికీ, భారత సమాజానికీ నష్ట దాయకం.

దేశం యావత్తుకు పౌరులందరికి వర్తించే ఒకే ఒక వ్యవహార సంహితను **(Common Civil Code)** రూపొందించటానికి ప్రభ్వుం కృషిచేయాలని భారత రాజ్యాంగ 44వ అధికరణములో స్పష్టీకరించబడింది.

రిపబ్లిక్ రాజ్యస్థాపన జరిగిన 32 ఏండ్ల తరువాత కూడా ఈ సందర్భంగా ఏ ప్రయత్నమూ జరగకపోవటం గమనార్హం. ఈ పరిస్థితికి దోహద కారణాలు అనేకం. అల్ప సంఖ్యాక వర్గాలలో తగినంత మంది పలుకుబడి గలిగిన సంఘ సంస్కర్తలు లేకపోవడం, అల్ప సంఖ్యాకుల మత భావాలకు విరుద్ధంగా సవణలు తెచ్చి వారిని రెచ్చగొట్ట రాదనే పాలకుల వైఖరి, పాలకపార్టీలు ప్రతిపక్ష పార్టీలు అందరు కూడ సంస్కరణలకు పూనుకుంటే అల్పసంఖ్యాకుల వోట్లు తమకురావనే భయాందోళనలు ఇవన్నీ ఈ శోచనీయ పరిస్థితికి కారణభూతాలు.

క్రైస్తవ ముస్లిం వివాహాలను రిజిష్టరులో నమోదుచేస్తారు. హిందూ వివాహాన్ని రిజిష్టరు చేయించుకోవచ్చు. కాని విధిగాచేయించుకోవాలనే శాసనంలేదు. వివాహాలు తప్పకుండా రిజిష్టరు చేయించడానికి శాసనం చేస్తే బాగుంటుంది.

ముస్లిం వివాహ విధానంలో 'నికా' రిజిష్టరులో వధువు చెయ్యదు, ఆమె తరపున దగ్గర బంధువైన పురుషుడు 'వకీలు'గా దస్కతుచేస్తాడు. అంతేగాదు; ఆమె వివాహానికిపూర్వం వరుని చూచే అవకాశం లేనేలేదు. ఇది శోచనీయం.

క్రైస్తవ పెండ్లి పద్ధతిలో మత గురువువద్ద నుండే రిజిష్టరులో వధూవరులు దస్కతుచేస్తారు. "భర్తకు విధేయురాలుగా ఉంటాను" అని వధువుచేత ప్రమాణం చేయిస్తారు.

ప్రత్యేక వివాహ శాసనం క్రింద సబ్ రిజిస్ట్రారు వద్ద 21 సం॥లు నిండిన వరుడు, 18 సం॥ నిండిన వధువు సతీపతులుగా ఉండటానికి పరస్పర అంగీకారాన్ని తెలుపుతూ రిజిష్టరులో దస్కతుచేస్తారు. ముగ్గురు వయోజనులు సాక్షి సంతకాలు చెయ్యాలి.

వివాహ విధానాల విషయం పరిశీలిస్తే హిందూ వివాహ శాసనం నిలోపం కొట్టవచ్చినట్లు కన్పడుతుంది. హిందూ మతస్థులు, బౌద్ధ, జైన మతావలంబకులు మాత్రమే కాక ఇస్లాం, క్రైస్తవం, పార్శీ, యూదుమతాలకు, చెందకుండా భారతదేశంలో స్థిరనివాసం కలిగియున్న ప్రతి భారతీయుడూ

హిందువు క్రిందే లెక్క. అంటే హేతువాదులు, నాస్తికులు, అజ్ఞేయవాదులు, స్వేచ్ఛా భావుకులు వీరంతా హిందువులే. వారికి హిందూ వివాహ చట్టం వర్తిస్తుంది. అయితే, వధూవరులలో ఏ ఒకరి ఆచారం ప్రకారమైనా వివాహం జరగాలని నియమం. సప్తపదిని ఆచారంగా ఆమోదించేవారికి ఏడవ అడుగువేస్తే పెండ్లి పూర్తి అయినట్లులెక్క. ఇది హిందూమతస్తులకు సంబంధించినది. తతిమ్మావారు వారి ఆచారాన్ని కోర్టులో ధృవపరుచు కోవాలి. అది వ్యయప్రయాసలతో కూడినపని. ఇది హేతువాదులు వగయిరాల పట్ల వివక్షా విధానం. తమిళనాడులో పూలదండల పెండిండ్లు, స్వయంవర వివాహాలు ఏ భాషలో జరిగినా 1967 నుండి చెల్లుతున్నాయి. అలా శాసనం తెచ్చింది అనాడున్న రాష్ట్ర ప్రభుత్వం. తతిమ్మారాష్ట్రాలలో ప్రభుత్వాలు కూడా అలా చేస్తాయని ఆశించడంలో పొరపాటులేదు.

పెండ్లి పద్ధతిలో మార్పుతెచ్చేశాసనం వెన్వెంటనేరావాలి. సర్వులకూ వర్తించే విధానాన్ని చట్టబద్ధం చేయటంన్యాయం; అవసరం. అపుడే స్త్రీలు మతాల విషకౌగిలి నుండి బయటపడి స్వేచ్ఛా వాయువులు పీల్చ గలుగుతారు.



బహిష్టు అంటే?–శాపం, మురికి, అశుభ్రం అనే మూఢభావంవుంది. కాని గర్భాశయంలోకి క్రొత్తగా చేరిన రక్త మాంసాలు, ఇతర పదార్థాలు బయటి కొచ్చేస్తాయి. బహిష్టుకాకపోతే ఇవి ఒక క్రొత్త ప్రాణికి పెరుగుదల నిస్తాయి. ప్రకృతి సహజంగా శరీరం నిర్వర్తించే ఒక ముఖ్యమైన భావం వల్ల ఈ దృక్పథం మారదా?

ఈ వ్యవస్థ ఉచ్చులో చిక్కుకున్న మహిళ

తరతరాలుగా మహిళలు తమ వ్యక్తిత్వాన్ని నిలుపుకోవడం కోసం, తమ ఉనికి గుర్తింపుకోసం పడ్డ అగచాట్లు ఇన్నీ అన్నీ కావు. అసలు హక్కులకోసం ఎలాంటి సంఘటనలను మహిళలు ఎదుర్కొన్నారో తెలిసుకొంటే ఆశ్చర్యం కలుగకమానదు. న్యూయార్కులో 1921 లో మార్గరేట్ సాంగర్ 'గర్భనిరోధం అవినీతా?' అన్నవిషయంపై ఒక సభ ఏర్పాటు చేసింది. తీరా ఆమె ఆ సభలో ఉపన్యసించబోయే సరికి టౌను హాలు తలుపులు మూసేసి, సభను ఆపుచేసి, సభికులను తిరిగిపొమ్మని ఆర్డరిచ్చారు. అయినా సాంగర్ మొక్కవోని ధైర్యంతో 'మీరువెళ్ళిపోకండి అనిఅరుస్తూ 'సభజరిగితీరుతుందని' హెచ్చరిస్తూ ఉపన్యాసం ప్రారంభించగానే పోలీసులు ఆమెను లాక్కెళ్ళారట. అలాగే ఫ్రెంచి రచయిత్రి మేరీబలం పీడిగేజ్ స్త్రీల హక్కుల ప్రతిపాదన కొరకై 1791 లో '**Declaration of The Rights of Women**' అనే పుస్తకం రాసి చరిత్రను సృష్టించింది. "1789లో జరిగిన ఫ్రెంచి విప్లవంలో స్త్రీలు ఉరికంబం ఎక్కగలిగినప్పుడు పరిపాలనలో మాత్రం స్త్రీలకు స్థానం ఎందుకివ్వరు?" అని గేజ్ ఆ పుస్తకంలో ప్రశ్నించి నప్పుడు, ఫ్రెంచి విప్లవానంతరం చెలరేగిన అరాజకత్వంలో ఆమెను దేశద్రోహిగా చిత్రీకరించి ఉరితీశారు. ఆసమయంలో ఆమె గర్భవతి. అయినా విచక్షణ చూపలేదు ఆమెపట్ల ఆనాటి కసాయి ప్రభుత్వం. అసమాన ధైర్యంతో "ఆడవాళ్ళకు సమానహక్కులు కావాలి"అని అరుస్తూ ఉరికంబమెక్కి ప్రాణాలను వదలిందా త్యాగమూర్తి.

1973లో-స్త్రీల హక్కుల్లో అతి సామాన్యమైన హక్కు-తమ శరీరంపై తమకు హక్కు అంటే తమకు ఇష్టంలేని గర్భధారణను విచ్ఛేదం చేసుకునే హక్కు ప్రసాదించింది ప్రభుత్వం. అంటే 1921 లో సాంగర్ కోరినహక్కు 52 సం॥ తర్వాత అమెకికను స్త్రీలకు అమెరికన్ సుప్రీమ్ కోర్టు ఇచ్చింది. ఖూనీలు జరుగుతున్నాయి. నేరస్తులను ఉరితీస్తున్నారు. యుద్ధాలలో సైనికులను హతమారస్తారు. తిండిపెట్టలేక, వైద్యం చెయ్యలేక చంపవచ్చు కాని ఇష్టంలేని గర్భవిచ్ఛేదం నేరమని స్త్రీలను శిక్షించుట స్త్రీలపై చిన్న

చిన్నచూపుకాదా? ఆమె శరీరంపై హక్కు ఆమె కోరటం నేరమా? ఈహక్కు స్త్రీల ప్రాథమిక హక్కుగా పరిగణించరా?

1917 రష్యన్ విప్లవానికి పూర్వం జారు ప్రభుత్వంలో రష్యన్ స్త్రీల అగచాట్లు వర్ణనాతీతం. వారు అడుగడుగునా ప్రాణాలకు సైతం ఎదురొడ్డి విప్లవంలో పాల్గొన్నారు. ఓటు హక్కుకోసం మూడుదశాబ్దాల బ్రిటిష్ స్త్రీల పోరాటం మనకు తెలియనిది కాదు. వారి ధర్మమా అని భారత స్త్రీలకు కూడా ఓటుహక్కు వచ్చిందిగదా!

సమాజంలో స్త్రీల సమస్యలకు వ్యవస్థలో మౌలికమైన మార్పు రానిదే పరిష్కారం అసంభవం అని తెలియనివారు వ్యక్తుల మంచి తనం వల్ల పరిస్థితులు చక్కబడతాయనే భ్రమకు లోనౌతున్నారు. అసలు వ్యవస్థ మారాలంటే వ్యవస్థలో అవమానం, కష్టనష్టాలు పొందుతున్నవాళ్ళే ఎదిరించాలి. వారిలో ముందుగా తమ సమస్యలను పరిష్కరించుకోగల ఆత్మ స్థయిర్యం రావాలి. ఈ అసమానతలకు, అవమానాలకు ఒక ముఖ్య కారణం భావదాస్యం, అజ్ఞానం. ఈ అజ్ఞానం నుండి విముక్తులు కావాలంటే స్త్రీలు విజ్ఞానవంతులు కావాలి.

మనిషికి తన జీవితాన్ని సుఖవంతం చేసుకోవాలనే ప్రాథమిక వాంఛ మిక్కుటంగా వుంటుంది. అయితే ఆ సుఖం అనేదానికి అర్థం మాత్రం ఆ వ్యక్తుల దృక్పథాలను బట్టివుంటుంది. అసలు వ్యక్తికి ఏ స్వేచ్ఛా లేకుండా సుఖపడటం అనేది అర్థరహితం. అలాగే జీవిత సమస్యలు, మానవ విలువలపట్ల ఏమాత్రం అవగాహనలేకుండా సుఖపడుతున్నాం అనుకోవటం అవివేకం. ఇలాంటి భ్రమల్లోనే జీవిస్తున్నారు నేటి మన స్త్రీలు. ఆ భ్రమల నుండి ఎవరూ ఎవర్నీ ఉద్ధరించలేరు; బైటికిలాగలేరు. అలా బలవంతంగా ఇతరుల ప్రమేయంవల్ల వచ్చేమార్పులచేత అసలు సమస్యలు మరింత గందరగోళంలో పడి విషమిస్తాయి. కనుక ఎవరికి వారే అంటే స్త్రీలు వ్యష్టిగాను, సమష్టిగాను తమ సమస్యలను పరిష్కరించుకోగలిగితే నిజమైన మార్పువస్తుంది.

(o) ● (o)

పడుపు వృత్తికి బాధ్యులెవరు?

"ప్రపంచంలో ఏ దేశంలోనూ వేశ్యావృత్తి ఒక కుల వృత్తి గా అమల్లో లేదు. ఇది భారతదేశ దౌర్భాగ్యాల్లో మొదటిది" అని కందుకూరి వారు వివరించారొకచోట. అది మన సమాజానికి పట్టిన గ్రహణం, కుటుంబాలను కూలుస్తున్న శనిగ్రహం. ముఖ్యంగా స్త్రీ జీవితాన్ని దుర్భరం చేస్తున్న పైశాచికం. దీన్ని కులవృత్తిగా స్వీకరించటం అవమానకరం. అయినా ఈ వృత్తి యుగయుగాలుగా, తరతరాలుగా పాతుకు పోవటం, వృద్ధిపొందటం శోచనీయమే కాదు, బాధాకరం కూడాను.

ఈనాడు వాడవాడలా వేశ్యాగృహాలు వెల్లివిరిశాయి. ఇంకా పెరుగుతున్నాయి. నేటి వ్యాపారాలలో వేశ్యల సరఫరా వృత్తి, పడుపు గృహ నిర్వహణ వృత్తి ముఖ్యమైనది. తేలిక అయినవి; లాభసాటివికూడాను. ఒకస్త్రీ వేశ్యావృత్తిచేస్తూ జీవించాల్సిన పరిస్థితి బాధాకరమేకాదు, అది మన సామాజిక పతనానికి మూలం అనక తప్పదు. ఇంతటి ఈఘోరానికి కారకులెవ్వరు? ఆ నీచవృత్తి చేస్తేతప్ప ఆమెకు జీవయాత్ర సాగని పరిస్థితిని కల్పించిన దెవ్వరు? దాన్ని పోషిస్తున్నదెవ్వరు? మరి ఆ పురుషుల్ని ఎంత మందిని జైళ్ళల్లొ పెడుతున్నారు? వేశ్యకూడా ఒక వ్యక్తే అనేభావం ఎంత మందిలో ప్రోదిచేసుకుంది? ఆ అభిప్రాయాల ఆధారంగా న్యాయమైన శాసనాలు ఉన్నాయా? ఎందుకులేవు? సభ్య సమాజంలో శాసనరీత్యా వేశ్యావృత్తిని నిరోధించ పూనడం సాధ్యమా? ఇప్పుడున్న శాసనాలు పక్షపాత యుతంగాలేవా? విటులను వదలి వేశ్యలను దండించడం న్యాయమా? ఇంగ్లండులో, ఫ్రాన్సులో వేశ్యల శరీరాలను డాక్టర్ల చేత పరీక్ష చేయించే వారట. ఇష్టపడని వారిని జైళ్ళలోపెట్టి హించించేవారు. దానివల్లవారు శారీరకంగా మానసికంగా, బాధపడేవారు. ఇది ధర్మమా? న్యాయమా?

ఇప్పటి వరకు మన సమాజాన్ని శాసించింది మతం. వేశ్యాగృహాలను పవిత్రస్థానాలుగా భావించడం వేశ్యలను ఉంచుకొనడం అనాడు పండితుల నుండి పామరుల వరకు ఆచారంగా వుండేది. మహారాజులే కాక

జమిందారులు, వ్యాపారస్తులు, పూజారులు, కవులు, గాయకులు మొదలగు సర్వులకు అదొక భేషజంగా వుండేది. "సాని లేని వాణ్ణి పనికి మాలినవాడు"గా చూచే రోజులుండేవి. ఎంతమంది పురుషులు వారివద్దకు వెళ్ళివస్తుంటే అంత ఘనత, హోదా వేశ్యలకు (చింతామణిలాంటి) దక్కేది. వారితో సంపర్కంకోసం విటులు పడిగాపులు కాచేవారు.

వేశ్యలను గూఢచారిణులుగా ఉపయోగించు కొనుట నాటిరాజకీయ తంత్రాలలో ముఖ్యమైనది. పట్టపురాణులు, అంతఃపురాంగనులు సైతం తమ భర్తలు వేశ్యాలోలురై చరిస్తుంటే తాము ఆనందించేవారు. వేశ్యలకు నృత్యము, నాట్యము, సంగీతం తప్పక నేర్పించేవారు. విటులు వారిగానకళా కౌశల్యాన్ని తిలకిస్తూ తన్మయులవటం ఆనాటి వారి సరదాలలో ముఖ్యమైనది. ఆనాడు కన్నెరికంపెట్టిన వాణ్ణి ఘనంగా శ్లాఘించడం రివాజు. నాటి విధానాలు పద్ధతులు మారినా వృత్తిలో మార్పులేకపోవటం దుర్భరం.

దేవదాసీల పేరుతో ఒక వర్గాన్ని సృష్టింపుచేసి భోగపు కులమని పేరు పెట్టి దానికి శాశ్వతత్వం కల్పించారు రాజగురువులు, మతగురువులుకూడా. హిందూమతం ఏనాడూ వేశ్యావృత్తిని నిందించిన ఘట్టాలు లేవు. వ్యభిచారాన్ని పైకి నిరసిస్తూ, అవినీతికరమని ప్రకటనలు చెస్తూ మధ్యయుగంలో క్రైస్తవ మఠాధిపతులు ఉంపుడుకత్తెల్ని కలిగివుండలేదా? తమ పరిచారికలను తమ భర్తకు ఉంపుడుగత్తెగా యాకూబ్ భార్యలు ఇచ్చారు. గ్రీసు దేశంలో ఏథెన్సులో 594 బి. సి. లోసలోర్ ప్రభుత్వ వ్యభిచార గృహాలను నడిపాడట. క్రీ. పూ. కొరింతేదేశంలో ఆఫ్రోడైట్ అనే దేవత గుడిలో వెయ్యిమంది వ్యభిచారిణులను పెట్టి పలుకుబడి గలవారు వీరివద్దకురాకపోకలు చేసేవారు. అబ్రహాం తనభార్య సారాను ఇతరులకు అద్దెకిచ్చేవాడు. ఆనాడు బిషప్పులకూ, మఠాధికారులకు (ఫాదర్) ఈ వృత్తిపై నిరసనగాని, ఏహ్యభావంకాని వున్నట్లు ఆధారాలులేవు. అసలు ఆ నాటి సంపన్నుల భోగలాలసే పడుపువృత్తికి మూలకారణం.

పడుపు వృత్తి శాశ్వతస్థానాన్ని పొందడానికి కారణాలు అనేకం. వేశ్యగా జీవించడానికి ప్రధానమైనది ఆర్థికలేమి; ఆమె నైతిక పతనానికి

ఆ నాటి సంపన్నుల భోగలాలసత ముఖ్య కారణం. క్రమేపి అది ఆచారమై పోయింది.'అష్టవర్షాత్‌భవేత్‌కన్యా' అనే ఆచారంతో బాల్య వివాహాలు విరివిగా జరిగేవి. కన్యలను వృద్ధులకు కట్టబెట్టేవారు. అన్నెంపున్నెం ఎరుగని బాల వితంతులకు గత్యంతరంలేక, ఆదరణలేక, రక్షణలేక కొందరు వృత్తిలోకి దిగజారిపోయ్యేవారు. నాటి రాజులు రాజరిక వ్యవస్థ పటిష్టత కోసంయుద్ధాలు జరపటంసర్వసామాన్యం. ఆ మారణ హోమానికి బలి అయి గతించిన భర్తలు కోకొల్లలు. అనాథలైన వారి భార్యలు కొందరు ఈ వృత్తి పాలయ్యేవారు. చాలా సందర్భాలలో కుటుంబంలోని దగ్గర బంధువుల పశు కామానికి ఆమె బలి అయిపోవచ్చు. తీపి తీపి మాటలు చెప్పి పెళ్ళాడుతామని ప్రమాణాలు చేసి ఆశల అందలాలు ఎక్కించి నట్టేట ముంచుతారు కొందరు మోసగాండ్రు. పొలంనుంచో లేక మార్కెట్‌నుంచో వస్తూవుంటే రౌడీమూకల కామదాహానికి బలి కావచ్చు. ఇక సినిమారంగంలో నలిగి పోయిన అబలలు ఇంటాబైటా బ్రతకలేక ఈ విషవృత్తిని చేపడుతున్నారు. వివాహ వ్యవస్థలోని లోపాలవల్ల, భర్తల దారుణాలకు బలి అయి మరికొందరు ఈ వృత్తిని గత్యంతరం లేక స్వీకరిస్తున్నారు. స్త్రీ పై విధింపబడ్డ విధి నిషేధాలను, విపరీతమైన ఆంక్షలను భరించలేక, ఈ వృత్తిని చేపట్టటం జరుగుతున్నది. మోయలేని కుటుంబ భారానికి గత్యంతరంలేక వృత్తిని చేపట్టేవారు కొందరు. ఇలాఎన్నో సందర్భాలలో దిగజారిపోవచ్చు. పొరపాటునకాని, మోసంవల్ల కాని, నమ్మకద్రోహంవల్లకాని, పురుషకామాగ్నికి ఆహుతి అయిన స్త్రీని 'పతిత', 'కులట' అని బిరుదులిస్తూ వికటాట్టహాసం చేసే క్రూర సమాజం మనది. పురుషదౌష్ట్యానికి బలి అయిన స్త్రీని 'చెడిపోయినది' అనే బిరుదు తగిలించి చివరకు ఇళ్ళల్లో పని మనిషిగానైనా చేర్చుకోరు మన సాధ్వీమ తల్లులు. ఆ దుష్టశక్తుల నిందలను భరించలేక నిజంగానే ఈ విషవృత్తి చేపడతారు ఆ అబలలు. ఇవన్నీ హృదయ విదారక గాథలు. ఇన్నీ తెలిసి ఆమెను నిరసిస్తారు శ్రోత్రియులు; తప్పంతా ఆమెదేనని అల్లరి చేస్తారు. ఇక్కడేవుంది విడ్డూరం.

ఇస్లాం మతానుయాయులు వేశ్యను రాళ్ళతో కొట్టి చంపుతారు. మన దేశంలో శాసనం మరోలావుంది. బహిరంగ ప్రదేశాల్లో సైగలుచేసి విటులను ఆకర్షించ ప్రయత్నించినా, వ్యభిచార గృహాలలో వుంటూ వృత్తి సాగించినా

ఆ స్త్రీకి జైలుశిక్షకూడా వేస్తారు. ఇప్పటికి వ్యభిచారిణిని మానభంగం చేస్తే, ఆమె కేసు పెడితే, ఆమె వ్యభిచార జీవితాన్ని గురించి ముద్దాయి ప్రశ్నలు వేయించవచ్చు. అంటే వ్యభిచారిణిని ఎవరైనా మానభంగం చెయ్యవచ్చు' అనే భావం గోచరిస్తోంది. వ్యభిచారిణి అందరి సొత్తు అన్నమాట. గతిలేక ఆమె ఆవృత్తికి దిగవలసి వచ్చిందని గ్రహించరు మన సంఘపెద్దలు. అసలు ఈ మనస్తత్వం క్రింద దాగివున్న భావం ఏమిటి? వ్యభిచారాన్ని ఒక స్థితిలో నేరంగా పరిగణించే భారత శిక్షాస్మృతి 1860 లో రూపొందించబడినా ప్రజాదృష్టిని ఎందుకు ఆకర్షించ లేదు? 294వ సెక్షను ప్రకారం ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో అసభ్యంగా ప్రవర్తిస్తే, లేక బహిరంగ ప్రదేశానికి దగ్గరగా అశ్లీలపు పాటలు వగైరాలు పాడినా వారు శిక్షార్హులు. వారికి 3 నెలలు జైలు శిక్ష. ఈ సెక్షను క్రింద ఎక్కువగా వేశ్యలు మాత్రమే శిక్షాపాత్రులవుతున్నారు ఇన్నాళ్ళూ.

హిందువులలో చదువుకున్న వారలు సైతం మూడు ముళ్ళూ వేయించుకుంటారు; మంగళసూత్రం కట్టించుకుంటారు. 'వివాహితను' అని బహిరంగంగా చాటుకోటానికి ఈ సూత్రం తోడ్పడుతుంది. అంటే అవివాహితకు సమాజంలో స్థానం లేదని భయమా? ఏదో ఒక పురుషుడి ఆస్థిగా పరిగణింపబడాలనే తాపత్రయమా?

వ్యభిచారశిక్షలో కూడా ద్వంద్వనీతి ఉంది. ఇది స్త్రీ ఆత్మాభిమానానికి గొడ్డలిపెట్టులాంటిది. వేశ్యావృత్తిలోని స్త్రీ, పురుషుడూ వ్యభిచరిస్తే స్త్రీ మాత్రం శిక్షార్హురాలు: పురుషుడుకాడు. అందుకే స్త్రీల హోదాకమిటీ వారు ఇటువంటి అవమానకరమైన చట్టాన్ని మార్చాలని, ద్వంద్వనీతికి స్వస్తి చెప్పాలని సిఫారసు చేశారు.

పీనల్‌కోడ్ 497వ సెక్షనుక్రింద ఎవరి భార్యతోనైనా భర్త ఎరుక సమ్మతులు లేకుండా వ్యభిచరిస్తే అతనిపై కేసు పెట్టవచ్చు. 5 సం॥ల వరకు శిక్ష విధించవచ్చు. దీనిని స్థూలంగా చదివినపుడు పురుషుడికి కూడా శిక్ష ఉందికదా; ద్వంద్వనీతి ఇంకెక్కడిది అనే సందేహం రావచ్చును. కాని జాగ్రత్తగా పరిశీలనచేస్తే అసలు రంగు బయట పడుతుంది. పీనల్‌కోడ్ రాక పూర్వం హిందూశాస్త్రం ప్రకారం స్త్రీ పురుషులిరువురూశిక్షార్హులు. కాని

హిందూస్త్రీ అనేక ఇక్కట్లకూ, వివక్షకూ లోనవుతున్నది కనుక ఆమెకు శిక్షలేదని ఆంగ్లేయులు ఆ సెక్షనులో రాశారు. కాగా ఇప్పుడున్న నిబంధనకు వెనుక దాగిఉన్న సూత్రం ఏమిటి? 'భార్య భర్త సొత్తు. భర్త ఎరుక సమ్మతులులేకుండా ఆమెపొందును మరొకరు అనుభవించరాదు'అనేకదా? ఇది ఆధునికభావాల ప్రకారం ఎంతవరకు సమర్థనీయం? భార్యల విషయంగానే ఈ నీచభావనను ప్రదర్శించిన శిక్షాస్మృతి ఇక వేశ్యల సంగతి ఎలా పరిగణిస్తుందో మరి చెప్పనక్కరలేదు.

స్త్రీ ఒక వస్తువు; అది ఎవరికో ఒకరికి చెందిఉండాలి. వ్యభిచారిణి ఎవరికీ చెందనివస్తువు. కనక ఆ వస్తువును అందరూ అందుకొని అనుభవించ వచ్చు. ఇది స్త్రీ యెడల ఈనాడున్న న్యూనతాభావం. ఆధునిక పెట్టుబడి దారీ విధానంలో అన్నిపనులూ పరస్పర అంగీకారంమీద, కంట్రాక్టు మీద సాగుతాయికదా! రోజుకు ఇన్నిగంటలు పనిచేస్తే ఇంతకూలి ఇస్తామని కార్మికుడికి ఫ్యాక్టరీ యజమానికీ ఒప్పందం జరుగుతుంది. అలాంటి ఒప్పందపు రోజుల్లో, వ్యభిచారం సాగిస్తున్న స్త్రీపై ఆమె సమ్మతిలేకుండా అత్యాచారంచేసి ఆమె పొందును అనుభవించడాన్ని చూచి చూడనట్లు ఊరుకుంటున్నది ఈ సమాజం. కనుక ఈ భావన మారితే తప్ప ఈసమస్యకు విముక్తిలేదు. వ్యభిచార వ్యాపార నిర్మూలన శాసనం (**Suppression of Immoral Traffic Act**) అనేది 1956లో తయారయింది; అమలులో ఉంది. ఏటా కొన్నివేలమంది స్త్రీలకు ఆ శాసనం పేరుతో జైలుశిక్షవేస్తూ తన పవిత్రతను కాపాడుకుంటున్నది సమాజం. ఈ మధ్య వ్యభిచార నిర్మూలన సమస్యపై ఢిల్లీలో పెద్ద సదస్సు జరిగింది. 300 కు పైగా వివిధ దేశాలనుండి ప్రతినిధులు వచ్చారు. సూచనలు చేశారు; ప్రణాళికలు తయారుచేసి వెళ్ళారు. 1875 లోనే 'అంతర్జాతీయ వ్యభిచార నిర్మూలనా సంస్థ' ఏర్పడినా ఈనాటికీ అడుగుముందుకు వేయలేదు. ఆ సంస్థ ఉన్నట్లు కూడా చాలామందికి తెలియదు.

ఆర్థిక స్థిరత్వం స్త్రీలలో పాదు చేసుకుంటే తప్ప ఈ వృత్తి నశించదు. స్త్రీలకు విద్యా ఉద్యోగావకాశాలు భారీ ఎత్తున విస్తరింపచేయాలి. వ్యభిచార వృత్తిని మనం ప్రోత్సహించం; కాని, మతస్తులచేత తరతరాలుగా

చెప్పబడిన నీతులకు బలి అయిపోయిన అభాగినులను శిక్షించేహక్కు సమాజానికి లేదని మనం వాదించాలి. స్త్రీని వేశ్యగా తయారు చేసి వాడుకున్నవాడు పురుషుడే. పురుషుని శృంగార తృష్ణకు మార్గంగా ఈ వృత్తిని వాడుకునే పురుష పుంగవులను సమాజం వెలివేయాలి; దూషించాలి ఆర్థికంగా భద్రత లేక, సామాజికంగా రక్షణ లేక, వ్యవస్థలోని లోపాలవల్ల ఆమె ఎదురు తిరగలేక లొంగిపోయింది. అలాంటి వారిని ఆ స్థితిలో ఉంచటం అన్యాయం; అక్రమం: అనాగరిక లక్షణంకూడాను. సంఘ సంస్కర్తలూ, సంఘసేవకులూ ఈ వృత్తి నిర్మూలనకై స్త్రీ జాతి లో జాగృతిని చైతన్యాన్ని కలిగించాలి. బృహత్తర పథకాలతో, సేవా దృక్పథంతో, బాధ్యతతో వేశ్యలకు పునరావాస సౌకర్యాలు కలుగజేసే పని చేపట్టే తప్ప ఈ వృత్తి నిర్మూలనం కాదు.



ఆడపుట్టుకతో తల్లినే నిందిస్తారు. దీనికి బాధ్యులెవరో తెలుసా? స్త్రీపురుషులిద్దరిలో క్రోమోజోమ్సువుంటాయి. పురుషుని స్పెర్మ్‌లో రెండు రకాల క్రోమోజోమ్సువుంటాయి. స్త్రీఅండంలో**XY**అనే ఒకే రకమైనక్రోమోజోమ్సు వుంటాయి. పుట్టబోయే శిశువుకు తల్లినుండి ఒకటి తండ్రి నుండి ఒకటి **కావాలి.** రెండూ లభిస్తే ఆడపిల్ల **XY** లభిస్తే మగబిడ్డపుడతాడు. తల్లి**X** మాత్రమే ఇస్తుంది. తండ్రి**X** లేక**Y** ఇస్తాడు. దీనినిబట్టి బిడ్డ **Sex** నిర్ధారణ అవుతుందిగదా! మరి స్త్రీని నిందించట మెందుకో!

స్త్రీల హోదా

స్త్రీ ఒక వ్యక్తిగా పుట్టిందికాని ఒకనికి భార్యగా పుట్టలేదు. 70% నిరక్షరాస్యులున్న ఈ వ్యవస్థలో ఆడదంటే అందరికీలోకువే. ఆమె కూడా మనిషే నని ఆమెకూ ఆలోచనలు, అభిప్రాయాలు వుంటాయని గ్రహించలేని ఈ పురుషజాతికి అసలు బుద్ధిమాంద్యం వున్నదనేది నగ్నసత్యం ముఖ్యమైన భావవికాసం, శాస్త్రీయ దృక్పథం మగవారిలో మృగ్యం కొబట్టే తాము అధికులమని, యజమానులమని, భరించే వారమనే దురభిప్రాయాలు పాదుచేసుకొన్నాయి ఆ తిరోగమనవాదుల్లో ప్రజాస్వామ్యం. స్వాతంత్ర్యం, సమానత్వం అంటూ గంటలకొద్దీ ఉపన్యాసాలు దంచేస్తారు. తీరా తమ పార్టీలో, ఉద్యమంలో త్యాగాలు చేసిన మహిళలను సైతం విస్మరిస్తారు; అక్కడి కొచ్చేసరికి కప్పదాటేసి ఏవో బిచ్చం పెట్టినట్లు ఒకటో అరో పారేస్తారు. హరిజనోద్ధరణ, కార్మిక జనోద్ధరణ, అస్పృశ్యతా నివారణ లాంటివాటిని సాగించే సంస్కరణవాదులు సైతం స్త్రీజనోద్ధరణ అంటే పెదవి విరుస్తారు; విరుచుకు పడతారు. "మీకిప్పుడే మయిం"దని ఆక్షేపిస్తారు.

అసలు ఆడవాళ్ళకంటూ కొన్నిపనులు నిర్దేశించటంలోనే తేడాలు చూపిస్తారు. వారిని అవమాన పరిచే పదజాలం వాడుకలో అసంఖ్యాకంగా వున్నాయి. 'మగరాయుడిలా 'ఏమిటాతిరగటం?' అబద్ధాలు ఆడితే ఆడపిల్ల పుడుతుంది, ఆడదానినోట్లో నువ్వుగింజదాగదు, 'ఆడదానిలా' గాజులు తొడుక్కుని కూర్చో, 'ఏమిటోయ్, ఆడవేషాలూ నువ్వూనూ,' ఉద్యోగం పురుషలక్షణం, ఆడది చదివి ఉద్యోగం చేస్తుందా? ఊళ్ళేలుతుందా? "ఆడదానిలా ఏడవకూ!" ఇలాంటి సూక్తులు ఏన్నో! ఇలా చులకన భావం ప్రదర్శించే మాఅన్నతమ్ములను మేముమాత్రం ఆరాధించాలి;గౌరవించాలి; పొగడాలి, బాగుందివరస. ఏ తల్లి ఒడిలోనుండి, ఎవరిచేతుల్లో పెరిగి పెద్దవాళ్ళవుతారో ఆ తల్లుల్ని అజ్ఞానంలోముంచి, అవమాన పరచటంవల్ల ఆ నష్టం కేవలం ఆడవాళ్ళకే కాదు; సమాజం అంతా నష్టపోతుంది. ఏ ఆడదయినా హక్కులకై పోరాడితే గుండెలు బాదుకుంటారు. ఇదంతా

మీరు కల్పించుకున్న అపోహ, పక్షపాతధోరణి తప్ప ఆడా-మగా తేడా ప్రకృతే సృష్టించింది. ఇద్దరూ సమానులు ఎలా అవుతారు? హాయిగా చక్కని నీడలో తలదాల్చుకొని వంటావార్పూచేస్తూ పిల్లల్నికని పెంచితే చాలదా? 'లతాంగి' అనేపేరు ఎందుకొచ్చింది? ఆడదాని కున్నపవిత్ర స్థానాన్ని, భార్యాభర్తలమధ్యవుండే పవిత్రబంధాన్ని త్రెంచి అల్లకల్లోలాన్ని సృష్టిస్తున్నారు. మీ కంఠశోషవల్ల అశాంతి, అలజడి చెలరేగి ప్రశాంతంగా వుండే కుటుంబం విచ్ఛిన్నమయిపోతోంది. సామాజిక ప్రగతి సర్వనాశన మవుతోంది. మీరు స్త్రీలను రెచ్చగొట్టి పోటీతత్వాన్ని వారిలో నూరి పోస్తున్నారు. వారి చేత మా మీద తిరుగుబాటు చేయిస్తున్నారు. ప్రశాంత వాతావరణంలో ఝంఝామారుతాన్ని రేపి అశాంతి కలిగిస్తున్నారు. మీ విష ప్రచారంవల్ల మీరేనష్టపోతారు. మీ మీద మాకున్న పవిత్రభావం నశిస్తుంది. మీరు స్వేచ్ఛా, సమానత్వం, హక్కులు గటా్ర అంటారా? ఎన్నిహక్కులు కావాలన్నా అన్నీ చట్టాల్లో వుండనే వున్నాయి. ఇక మాజోలికిరాకండి. అంటూ చివరికి ఎగతాళిగా నవ్వేసి వూరుకుంటారు. ఇదంతా స్త్రీలపై మగ వారికి, సమాజానికివున్న న్యూనతాభావం. ఇదీ ఈనాటి స్త్రీహోదా! కాదంటారా? రుజువు చెయ్యండి! మరి అవునంటారా! తిరుగుబాటు చెయ్యండి. మరి ఆలోచిస్తారా? ఇక సెలవు?



"పురుషుని క్రిందలొంగివుండటం ఇష్టంలేక పెళ్ళిమానుకున్న స్త్రీలు, తమ ఆదర్శానికి తగినంత ఔన్నత్యంగల పురుషులు దొరక్క పెళ్ళాడని స్త్రీలు, ఏవో ఆదర్శాలు అభిరుచులుఖండి భర్తకీ పిల్లలకీ ఇవ్వటానికి వ్యవధిలేక పెళ్ళిమరచిపోయిన స్త్రీలు వుంటారని సంఘం కలలోనైనా ఆలోచించదు" — చలం.

నేటి స్త్రీల సమస్యలు

నిర్బంధం మనిషికి సంకుచితత్వాన్ని ఇస్తుంది. స్వేచ్ఛ మనిషికి సంస్కారాన్ని ప్రసాదిస్తుంది. అలాంటి స్వేచ్ఛ మహిళాలోకానికివుందా? ఏ స్త్రీ అయినా స్వేచ్ఛకోరితే ఆమెను బరితెగించినదానిగా, రోడ్డున పడ్డదానిగా, మాయావిగా, భ్రష్టగా, ఒక తిరుగుబోతుగా, రాక్షసిగా వర్ణిస్తారు. ఆ స్వేచ్ఛకూ, ఆమె సెక్సు జీవితానికీ సంబంధం అంటగడతారు. పురుషుడి హక్కు లెప్పుడూ ఆచరణలో సులభసాధ్యం అవుతాయి. అవివారి జన్మహక్కుగా పరిగణిస్తారు. చట్టాలలో పొందుపరచినవి అయినా, అవి స్త్రీలు కోరితే పెద్ద సంచలనాన్ని సృష్టిస్తుంది; దానికి విపరీతార్థాలు కల్పిస్తూ వింతకథలు సృష్టిస్తారు. ఒకహక్కు అనేది మనకున్నప్పుడు, దాని అవసరం మనకు కలిగినప్పుడు (ఏవిడాకులో, ఏ వారసత్వమో) ఎవరో ఆక్షేపిస్తారని పడివుండటం అవివేకం; అజ్ఞానంకూడాను. అసలు హక్కులనేవి అవసరం కలిగినప్పుడు వాడకపోతే అవినశిస్తాయి; వాటికి విలువవుండదు: అవి తుప్పుపట్టి రాలిపోతాయి.

నేటి వనితలు ఎదుర్కొంటున్న సమస్యలు అనంతంగావున్నాయి; అపరిష్కృతంగా మిగిలి పోతున్నాయి. చెప్పాలంటే ఒక ఉద్గ్రంధమవుతుంది. ఆధునిక పరికరాలు, అధునాతన సౌకర్యాలు వేషభాషలుచూచి స్త్రీ లేదో పురోగమించారను కొనుట భ్రమ. అది సంస్కృతికీ, నాగరికతను భేధంతెలియని అజ్ఞానం, అవివేకం అనక తప్పదు.

యక్షప్రశ్నలకన్నా జటిలమైనవి, అతిక్లిష్టమైనవి స్త్రీల సమస్యలు. అవిచిక్కుపడిన దారపువుండలా కంటికికనపడవు; మేడిపండులా కప్పిపుచ్చుతాయి. ఆర్థిక, సాంఘిక, రాజకీయ సాంస్కృతిక రంగాలలో స్త్రీకి స్వేచ్ఛాలేదు, సమానత్వం అసలేలేదు. కుటుంబ పరంగా, దాంపత్య విధానంలో, శరీరరక్షణలో, సంతానంకనుటలో విద్యలో, ఉద్యోగంలో ఆఖరికి ఉనికి విషయంగా కూడా స్త్రీ పురుషులలో హెచ్చుతగ్గులు ఏపరిధిలో వున్నయో ఉదాహరణలతో పరిశీలిద్దాం.

వ్యక్తి స్వేచ్ఛగా మనుగడ సాగించాలంటే ముఖ్యమైనది డబ్బు. పురుషుడితో సమానమైన ఆస్తి హక్కు అంటే హిందూ లా ప్రకారంవున్న పిత్రార్జితపు ఆస్థిలో కుమారునకు పుట్టుకతో హక్కు స్త్రీకి చట్టరీత్యాకూడాలేదు. ఆమెపేర ఏదయినా ఆస్తివున్నాదానిపై అనుభవం, అధికారం, భర్తదే అవుతున్నది. ఆఖరికి అమ్ముకోవాలన్నా నిర్ణయించేది భర్తయే. ఇద్దరూ కలిసి సంపాదించిన ధనంతో ఇల్లు, పొలంలాంటి ఆస్తులు భర్త పేరనే కొంటారు. భార్య పొదుపరితనం అసలు లెక్కలోకేరాదు. ఆమె చాకిరీకి అసలువిలువే లేదు. ఇది ఆస్తిపరమైన దోపిడీకాదా? ఆర్థికంగా వనరులు లేని భార్యను భరించేవాడు "భర్త" అన్నారు.

ముఖ్యమైనది మన సామాజిక జీవనం. ఆడపిల్లను కన్నతల్లి దురదృష్టవంతురాలిగాను, మగవాణ్ణి కన్నతల్లి అదృష్టవంతురాలిగాను చూడటం అసమాత్వానికి మొదటి చిహ్నం తల్లిదండ్రుల పోషణాభారాన్ని, వారి బాధ్యతలను పుత్రుడే భరించాలనడం, కుమార్తె చేస్తానన్నా ఆమె తల్లి దండ్రులు కాదనడం, భర్త వ్యతిరేకించటంలోనే హెచ్చు తగ్గులు దృగ్గోచరించటం లేదా? అందులో స్త్రీ పురుషభేధంలేదా?

ఇక స్త్రీ వునికి గురించి చెప్పాలంటే భర్తకు ఏనాడు కోపమొస్తే ఆనాడు పోవాలి. భర్త విడాకులు పొందకున్నా వేరొక స్త్రీని భార్య అని చెప్పుకోవచ్చు. స్త్రీ ఉద్యోగం చెయ్యాలంటే భర్త అనుమతితోనే చెయ్యాలి వద్దంటే విధిగా మానాలి. తనకన్నా హోదా, ఆదాయంవున్న భార్యల్ని ఉద్యోగం మాన్పించిన కేసులెన్నో వున్నాయి. అది 'సుపీరియారిటీ కాంప్లెక్సు'గా భావిస్తాడు. ఒక వ్యభిచారం జరిగినప్పుడు "అది చెడింది"అని గర్హించిన సమాజం వాడికేంలే మగాడు అంటూ ద్వందనీతి ప్రకటిస్తుంది. భర్త ఇష్టప్రకారమే పిల్లల్ని కనాలి. తనసంతానానికి భర్తే గార్డియన్‌గా వుండాలి. వివాహానంతరం భర్త ఇంటిపేరే ఆమె విధిగా వాడాలి. భార్యను కొట్టినా, చంపినా సమాజం ఉలకదు, పలకదు. వివాహ ఎన్నికలో పురుషుడిదే పైచేయిగా వుంటుంది. వదువుమాత్రం రంగులు వెలిసిన పేడబొమ్మలా నుంచుంటుంది ఎవరు కొంటారా అని ఎదురు చూస్తూ. స్వయంవరంలో నెగ్గిన వాడే భర్త అన్నా, పోరాటంలో గెలిచిన వీరుడే

మగడన్నా తలవూపాల్సిందే; నీ ఆజ్ఞలకు లోబడివుంటానని పెళ్ళి నాడే ప్రమాణంచెయ్యాలి. ఉద్యోగినితెచ్చే జీతం అంతా భర్త దోసిట్లోపోసి బస్సుచార్జీలకు యాచించే భార్య లెందరున్నారో తెలుసా? భార్య తన 'కొలీగ్' తో కాఫీతాగినా సహించలేని అసహనం వున్న భర్త లెందరో! ఇలా చెప్తుంటే ఎన్నో! మరెన్నో!!

ఇక రాజకీయంగా చూస్తే 500 పైగా సభ్యులున్న పార్లమెంటులో 19 మంది స్త్రీలే ఉన్నారు. అలాగే రాష్ట్ర అసెంబ్లీ 294 లో 11 మంది స్త్రీలున్నారు. ఉపాధ్యక్షు లెక్కడా దేశం మొత్తంలోలేరు. ఏ క్యాబినెట్‌లో స్త్రీలుండటం అరుదు. ఈనాడు ధనం, కులం. పరపతి లేనిస్త్రీ ప్రజాప్రతినిధిగా నిలబడగలదా! నెగ్గగలదా! అదిలేని దేశశాసనాధికారం వుండదుగదా! అలాంటప్పుడు చట్టాలనెలా అమలుచేస్తారు? చట్ట నిర్మాణంలో స్త్రీల ప్రమేయమే దుర్లభమవుతోంది. హోదాగల పదవులన్నీ పురుషపరమే అవుతున్నాయి. శాసనాలన్నీ పురుషులే చేశారు. చట్టాలన్నీ తమకు అనుకూలంగా వుంచుకుంటారు. రానురాను రాజకీయాలకు ఇంకా దూరమవుతున్నారు స్త్రీలు.

ఇక సాహిత్యంలోనూ, సినిమాలలోనూ స్త్రీ భర్తకు ఎంతగా దాసోహం అంటే అంత పతివ్రత అంటారు. సినిమాల్లో స్త్రీని కేవలం వినోదవస్తువుగా చిత్రించటం పరిపాటి అయింది. ఇలా అన్ని రంగాలలో స్త్రీలు అనేక పరిమితులకులోనై ఏదోఒక మగదిక్కు రక్షణలో బ్రతుకు తున్నారు. ఈపరిస్థితికి భిన్నంగా కొన్ని మౌలికమైన మార్పులురావాలి.

మతానికిగాని, సంప్రదాయానికిగాని, రాజ్యానికీగాని ఆఖరికి కన్న తండ్రికైనా స్త్రీ స్వేచ్ఛను అరికట్టేందుకు, ప్రశ్నించేందుకు హక్కులేదని నమ్మాలి. ముందుగా స్త్రీ ఆర్థికంగా ఆధారపడి జీవించే దుస్థితి పోవాలి. పరిపాలనాది కీలకస్థానాలలో, చట్టాల నిర్మాణంలో స్త్రీల ప్రాతినిధ్యం వారి నిష్పత్తిలో పెరగాలి, విద్యాస్థాయి, ఉద్యోగాల సంఖ్య పెరగాలి. సాంఘిక దురాచారాలు, మూఢవిశ్వాసాల నుండి స్త్రీలు బైటపడాలి. స్త్రీలు తమ అస్తిత్వాన్ని తెలుసుకుంటే చాలదు. తమ హక్కుల కొరకై విప్లవాలద్వారా

సైనా పోరాడాలి. మానసిక ఐక్యత రావాలి. ముందుగా స్త్రీలు మానసిక దాస్య విముక్తికై తపనపడాలి. స్త్రీలను తమ సహచరులుగా, స్నేహితులుగా భాగస్వాములుగా గ్రహించగల మనఃప్రవృత్తి పురుషులలో కలిగిననాడు నిజమైన స్త్రీ విముక్తికి మార్గం సుగమ మవుతుంది.

చిత్తశుద్ధి, నిస్వార్ధసేవా దృక్పథం, సంస్కరణాభిలాషా గలవ్యక్తులు ముఖ్యంగా స్త్రీలు ముందుకొచ్చి స్త్రీ విమోచనోద్యమాలకు సారధ్యం వహించాలి. స్త్రీలలో సంస్కరణాభిలాష, స్వేచ్ఛా పిపాస, సత్యాన్వేషణా కలిగించే వ్యక్తులు ముందురావాలి.

(o) ● (o)

మానవత లేని హేతువాదం నిస్సారం; హేతుత్వ ప్రాతిపదిక లేని మానవత నిరర్ధకం.

వివిధశాఖల్లో విజ్ఞానంకల వ్యక్తులు రాజకీయాలకు దూరమవుతున్నారు; అలాంటివారు రాజకీయాలలో పాల్గొన్నపుడే సమాజం సుసంపన్నం అవుతుంది.

ప్రగతి పథంలో స్త్రీ

'నేటిస్త్రీ ప్రగతి పథంలో ఎంతవరకు ప్రయాణం సాగించింది?' అంటే నాగరికతాప్రభావంవల్ల బానిసత్వం నుండి 'షోకేసులో' బొమ్మలా తయారయిందని చెప్పకోవటం హాస్యాస్పదంకాదు. అసలు ప్రగతి అంటే పదిరంగుల చీరెలుకట్టి పంచరంగుల చిలకలా పంజరంలో తిరగటంకాదు. స్త్రీల ప్రగతి కేవలం వేష భాషల్లోకాదు 'వారి వ్యక్తిత్వంలో, సంస్కృతిలో మార్పుకోరుతున్నారా?' అనేది ముఖ్యమైనప్రశ్న 'బహురూపాల్లో దర్శన మిచ్చే శారీరక, మానసిక, ఆర్థిక, రాజకీయ సాంస్కృతిక స్వేచ్ఛలు స్త్రీల కున్నాయా' అనేది మరొక ప్రశ్న. సంరక్షకత్వంవల్ల మగువల ఆర్థిక స్వేచ్ఛ వమ్మగుట లేదా? 'అనేది చర్చనీయాంశంకాదా?' తరతరాల బానిసత్వానికి, సంకెళ్ళకూ అలవాటుపడ్డ మహిళలు విముక్తికై ఆరాట పడుతున్నారా? లేక తమ బంగారు సంకెళ్ళకు తామే మురిసిపోతున్నారా?' అనేది ఆలోచించకతప్పదు.

యుగయుగాలుగా అజ్ఞానంలో, అనేక ధర్మాల చట్టంలో బిగింపబడ్డ మహిళ రక్తంలో, స్వభావంలో, అనేక రుగ్మతలు ప్రోదిచేసుకున్నాయి. అందులో ముఖ్యమైనది తాను ఏదోఒక పురుష దక్షతలో, మగనీడలో జీవితాంతం పడివుండాలనే భావం. మహిళలు కోట్లసంఖ్యలో పురుషాధిక్యతను సూటిగా స్వీకరించి వారి అదుపు ఆజ్ఞల్లో మసులుతూ తమ ఆశల్ని, ఆశయాల్ని, కోర్కెలనూ అణగార్చుకుంటున్నారు. వారు తమ భర్తల అత్యాచారాలను, ఆనందంతో సహిస్తూ వారి దయాధర్మాలమీద తమ జీవితాలను గడుపుకుంటున్నారు. ఎందరో అబలలు అంగడిబొమ్మలుగా, సంతలో వస్తువులుగా దుర్గంధ భూయిష్టమైన జీవితాలను గడుపుతున్నారు. అదే మన సంస్కృతి అని, అది చాలా పవిత్రమైనదని మనలను మనము పొగుడుకుంటున్నాం. అది ఆంతరంగిక మాలిన్యం అని తెలియని అయోమయం అవస్థే మన దుర్గతి. ఆంతరంగిక మాలిన్యాన్ని క్షాళనం చేసుకోవాలి గాని దానిపై పన్నీరు చల్లితే అంతరంగంలోనికుళ్ళు విషమించి మనల్ని దిగ్భ్రమింగే ప్రమాదముందని గ్రహించాలి.

మనలోవున్న అర్ధరహిత సంప్రదాయాలు, వ్యవస్థీకృత మూఢ విశ్వాసాలు మార్చాలన్నా, ఆధునికమార్గాన మనం పయనించాలన్నా సమూలమైనమార్పును. కోరే ఒక ఉద్యమాన్ని మనం నిర్మించుకోవాలి. ఆ వుద్యమాన్ని ప్రతిఘటించేభావవాదులు మనపై విజృంభిస్తారు. అప్పుడు మనం స్థిరచిత్తంతో, ధైర్యస్థయిర్యాలలో, త్యాగాలతో ఎదుర్కొంటేనే ఆవుద్యమం ఫలించిమార్పు తెస్తుంది.

ఇంతవరకూ జరిగిందంతా స్త్రీల మారణహోమం. అంటే సతి గా చితిలో దూకింది. అమ్మితే అమ్ముడుపోయింది. పవిత్రతకోసం అగ్నిశిఖలలో దూకింది. వేదవిద్యకు అనర్హురాలవంటే తలవంచింది. ఆస్తిహక్కులేదంటే తలూపింది. నీమొగుడికి కట్నమిచ్చి నీకన్నెచెరదింపుకున్నామంటే దిష్టి బొమ్మలా నిలబడ్డది. నీ బిడ్డలకు గార్డియన్‌వి నీవు కావాలంటే సరేనన్నది. నీవు గొడ్రాలివు నిన్నువిడుస్తానంటే కిమ్మనలేదు. పాపలాబట్టకు, పదిపైసల పూలకు ఆధారపడి జీవించే దిక్కుమాలిన ప్రాణివంటే కాదనలేదు. నీతండ్రి నా దోసిలినింపలేదు; నిన్ను కాలుస్తా, నరుకుతానంటే కళ్ళు అద్దుకుంది చీర కొంగుతో. ఇలా ఎన్నో....మరెన్నో....ఇంకాఎన్నో.... ఏమని చెప్పాలి!

కాలం, పరిస్థితులు, నాగరికత, శాస్త్రజ్ఞానం పెరిగింది. నేటిస్త్రీ తప్పటడుగులు వేస్తూ ప్రగతి పథంలో పయనిస్తానంటోంది. స్వాతంత్ర్యానికి పూర్వం మహిళాభ్యుదయానికి జరిగిన కృషి అత్యల్పం. తర్వాత రాజ్యాగం స్త్రీకి సమానహోదా, రాజకీయ, ఆర్థిక సమానత్వం కలిగించింది. స్త్రీ విద్యా ఉద్యోగాలకు కొంత అవకాశమిచ్చింది. ప్రగతి పథంలో స్త్రీకి రాచబాటలకు ప్రాథమిక చర్యలు తీసుకోవడం జరిగింది.

"నేటిస్త్రీ ప్రగతిపథంలో పయనిస్తోందా? ఎంతవరకు? ఏఏరంగాలలో" అనేవి కొన్ని శేషప్రశ్నలున్నాయి. "చట్టాలవల్ల కష్టాలుపోవు" అన్నట్లు శాసనాలు మాత్రమే స్త్రీల ప్రగతి సౌధానికి మూల స్థంభాలుకావు. దానికి అనుగుణమైన వాతావరణం కావాలి, పరిస్థితులు అనుకూలించాలి. పురుషుల తోడ్పాటు కూడా అవసరం. ముఖ్యమైనది స్త్రీలలో భావసంచలనంవుండాలి. పట్టుదల; ధైర్యం, ముందుచూపు మానసికవికాసంవుండాలి. స్త్రీలలో ఐక్యతా

భావం వీటి అన్నింటికీ మూలంకావాలి. కేవలం పురుషద్వేషంతో మహిళా సమస్యలు సమసిపోవు. అదివారి ప్రగతికి మార్గంకాదు. భావవికాసం, శాస్త్రీయ దృక్పథం, ఆలోచనాశక్తి స్త్రీలలో చోరవచేసుకోవాలి.



స్వేచ్ఛ మన ఆదర్శం, మన లక్ష్యం; సత్యాన్వేషణ దానికి సాధనం.

ఏవరుచేసినా మంచి పనిని హర్షించగలగాలి; నేను చేస్తేనే అదిమంచి అనుకోవడం దురహంకారం.

నేనుచేసే ప్రతిపనీ పొరుగువాడికి ఉపయోగపడుతున్నదా అనేదే మానవ నడవడికి గీటురాయి కావాలి.

మీకేం! ప్రధానమంత్రి మహిళేకదా!

"నాదేశానికి అర్ధరాత్రి స్వరాజ్యం వచ్చింది కాని, ఇంకా తెల్లవారనే లేదు" అన్నట్లుంది ఈదేశ స్త్రీ జనాభ్యుదయం. తెల్లారేసరికి స్త్రీలపై అత్యాచారాలు, హత్యలు, ఆత్మహత్యలు, కాల్చిచంపటం, కాల్చుకొని చావటం లాంటి దుర్వార్తలు లెక్కకు మిక్కుటంగా వుంటున్నాయి. వరకట్న దురాచారానికి బలి అయ్యే అబలల సంఖ్య వర్ణనాతీతం. అదిచాలక స్త్రీలే అధినేతలయి దేశరథసారథ్యాన్ని వహిస్తున్నట్లు పరిపాలనాధక్షులై చక్రాన్నివారే త్రిప్పుతున్నట్లు "మీకేమండీ? ప్రధానమంత్రి మహిళ; రాజ్యం చేస్తున్నది. మీరేగదా" అని అంటున్నారు పురుషులు. ఎగతాళిగా తీసుకుంటే ఈమాటలు సొంపుగానే వుంటాయి. కాని వాటిని సరిగా అర్థంచేసుకుంటే మహిళలకు చాలా మనస్తాపం కల్గుతుంది.

ఒక స్త్రీ ప్రధానమంత్రి, మరొక స్త్రీ ముఖ్యమంత్రి, వేరొక మహిళ హైకోర్టు జడ్జి అయినంత మాత్రాన దేశంలో 50% మహిళా ప్రపంచానికి ఒరిగేదేమీ లేదు. స్త్రీల స్థితిగతుల మెరుగు పడ్డాయా లేదా అనేదే నేటిముఖ్య సమస్య. ఈ అంశాన్ని తరిచి చూడటం మహిళోద్యమ కార్యకర్తలకు, సామాజిక శాస్త్రజ్ఞులకు అవస్య కర్తవ్యం.

సమాజంలో పెద్దలుగా, నాయకులుగా చలామణి అవుతున్న చాలా మంది రోటరీ, లయన్స్ క్లబ్బుల్లో సభ్యులుగా వుంటున్నారు. మీటింగు చివర్లో సభకు స్త్రీలు మంచి అందాన్ని చేకూర్చారని, సభ మంచి కలర్‌ఫుల్‌గా వుండటానికి కారణం స్త్రీలు పాల్గొనడమేనంటూ స్త్రీలకు ధన్యవాదాలు చెప్తారు. ఈ మాటలవల్ల స్త్రీ కేవలం అలంకారవస్తువేఅనేభావం స్పష్ట మవుతుంది.

తమ భార్యలను గృహలక్ష్ములుగా పేర్కొంటారు అనేక మంది. దాని భావమేమిటి? నాల్గుగోడలమధ్య ఇంటి ఆవిడ పెత్తనం చెయ్యవచ్చును. కాని గడపదాటి బైటికి పోరాదు. సామాజిక కార్యక్రమాలలో; రాజకీయ భాగస్వామ్యంలో వారికి స్థానం ఇవ్వరు. ఇది స్త్రీల యెడ పురుషులు ప్రదర్శించే మరియొక వింత వైఖరి.

ఒక వేళ కొంతమంది స్త్రీలు ధైర్యంగా విద్యార్హత సంపాదించుకొని ఉద్యోగాన్ని ఆశిస్తే, తమకు పోటీగా ఉద్యోగపు మార్కెట్‌లోకి స్త్రీలు చొచ్చుకొస్తున్నారని ఫిర్యాదుచేస్తూ వారిని ఈసడిస్తున్నారు పురుషులు.

ఒకానొక సందర్భంలో ఏ స్త్రీ అయినా చొరవచూపించి సామాజిక, రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనడానికి సాహసిస్తే ఆమెకు తగిన స్థానం ఇవ్వకపోవటమేకాక స్త్రీలను చిన్నచూపు చూస్తారు. ఒక వేళ శాసనాన్ని పాటించవలసివచ్చి, విధిలేక పంచాయతీరాజ్ లాంటి వ్యవస్థలో చోటు ఇవ్వవలసివచ్చినా అదేదో దయతలిచి స్త్రీలకు ఆ స్థానాలిచ్చినట్లు పురుషులు భావిస్తున్నారు.

స్త్రీలు అజ్ఞానంతో కొట్టుమిట్టాడుతున్నారనీ, అందువల్ల వారు సామాజిక కార్యక్రమాల్ని నిర్వహించలేరనీ చాలామంది పురుషులు పనిగట్టుకొని ప్రచారం చేస్తున్నారు. మొత్తంమీద స్త్రీలలో అవిద్య మెండనేది నగ్న సత్యం; కాని దానికి కారకులెవరు? ముమ్మాటికీ పురుషులే. మహిళలకు విద్యా, విజ్ఞానాలు లేకుండా ఇళ్ళల్లో గొడ్డుచాకిరీ చేయించుకునేది పురుషులు కాక మరెవ్వరు? ఇదంతా కపటం, పచ్చిమోసం కాదా?

ఇలా పురుషులు స్త్రీలను అలంకార వస్తువులుగాను, రెండోరకం పౌరులుగాను, శక్తి యుక్తులులేని వ్యక్తులుగాను పరిగణిస్తూ వారియెడల జాలి, కోపం, ఈసడింపు, నిరసనలాంటి వివిధ వైఖరులను ప్రదర్శిస్తున్నారు. ఇలా చెప్పినంత మాత్రాన పురుషద్వేషాన్ని పెంపొందిస్తున్నామని మాత్రం అనుకోవటం అవివేకం అవుతుంది. వాస్తవాలను కప్పిపుచ్చటం ఘోరమైన తప్పిదం అవుతుంది. కనుక ఇలా చెప్పాల్సి వస్తుంది.

ఒకరకంగా ఆలోచిస్తే అధిక సంఖ్యాకులైన పురుషులు ప్రస్తుతం అమల్లోవున్న దోపిడీ వ్యవస్థకు బానిసలుకాగా స్త్రీలు రెండురకాలుగా బానిసత్వంలో వున్నారు. అన్యాయంతోను, అసమానత్వంతోను తొణికిసలాడే సమాజానికి ఒకవైపు, పురుష ప్రపంచానికి మరోవైపున కట్టు బానిసలుగా స్త్రీలు జీవయాత్ర సాగిస్తున్నారు.

ఇంతకూ స్త్రీలకు స్వరాజ్యానంతరం ఏమి లాభించింది? కాస్తో కూస్తో అభ్యుదయం లేక పోలేదు. కాని ఇటీవల మనదేశంతోపాటు స్వ రా జ్య ం సంపాదించుకొన్న చైనాలాంటి దేశాలతో పోల్చుకుంటే మనది నత్తనడక అని చెప్పక తప్పదు. విద్యారంగం, ఉద్యోగ అవకాశాలు, వైద్యసౌకర్యాలు లాంటి వసతులు మహిళలకు అత్యంత దుర్లభంగా వుంటున్నాయి. ఇక అత్యంతప్రముఖమైన సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో, కుటుంబంలో స్థానం ఇలా ఒక్కొక్క అంశంగా విడమరిచి పరిశీలిస్తే మన అభ్యుదయం స్త్రీలకు సంబంధించి అత్యల్పం. ఈ పరిస్థితులకు కారకులెవరు? పాలకులా? రాజకీయ పార్టీల నాయకులా, పురుష ప్రపంచమా? లేక స్వయంకృషితో తమ అభ్యుదయానికి తాము పాటుపడని మహిళాలోకమా? ఈ ప్రశ్నలకు సమాధానం సరిగా ఇవ్వగలిగితే సమస్య సగం అర్థం అయినట్లే.

—

సమాజంలో సగం మందియైన స్త్రీలు దుఃఖ భాజనులయితే ఆ సమాజానికి ప్రగతి లేదు.

◆ ◆ ◆

మానవ సంస్కృతికి ఎల్లలులేవు; అది దేశ, మత, జాతి, కాలావధులు దాటి ప్రవహిస్తుంది.

సంఘసేవ ఈనాడు సాధ్యమా?

సంఘసేవ ఎందుకు చెయ్యాలి? ఎవరికి చెయ్యాలి? ఎలా చెయ్యాలి? అనేవి కొన్ని ప్రశ్నలయితే అసలు సంఘసేవ ఈనాడు సాధ్యమా? అనేది మరో ప్రశ్న అయింది. సమాజ ఆవిర్భావం నుండి సమస్యలు ఉంటూనే వున్నాయి. సంఘసేవకులు వ్యక్తులుగాను, సంఘాలద్వారాను సహాయం చేస్తూనేవున్నారు. అయితే ఆనాటి సమస్యలు వేరు. ఈ నాటి సమస్యలు వేరు. ఈనాటి సమస్యలు చాలా క్లిష్టతరం కావటంవల్ల వాటి పరిష్కారమార్గాలు కూడా అంత కష్టంగానూ వుంటున్నాయి. ఈనాడు సమాజ సేవకు వున్న ఇబ్బందులేమిటో తెలిసికొంటే తర్వాత వాటిని ఎలా అధిగమించగలమో చర్చించుకుందాం.

ఈ సమాజం ఎలాపోతేనాకేం నేనూ నాకుటుంబం బాగుంటేచాలు ననే నిర్లిప్తతా భావం కలవారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. ఈ పని చేస్తేనాకేమి లాభిస్తుంది అనే చూపుతప్ప ఈ పనివల్ల సమాజానికేమి ఉప యోగముంటుంది అని ఆలోచించే వారున్నారా? అనిపిస్తోంది. సేవా దృక్పథం కలవారు బహుఅరుదుగా కనపడుతున్నారు. సామాజిక స్పృహతో ఆలోచించే వ్యక్తులు కరువవుతున్నారు. సమస్యలు మాత్రం విపరీతంగా పెరుగుతున్నాయి. తెల్లారే సరికి మానభంగాలు, అత్యాచారాలు, కొట్టటం, చంపటం, కాల్చటం లాంటివి కోకొల్లలుగా దర్శనమిస్తున్నాయి. ఈ సమస్య లను చూచి ఏది ముందు, ఏది వెనుకా అని కంగారు పడిపోతున్నాం. తగిన ఆర్థిక వనరులు, మనుష్యబలం లేక సేవా కార్యక్రమాలు కుంటుపడు తున్నాయి. మనలను తికమక పెట్టే మరో అంశముంది. ఇబ్బందుల్లోవుండి బాధపడేవారికి ఎలా సహాయపడాలి? అనేదే ఆ చిక్కు ప్రశ్న. బాధితులలో చైతన్యం కలిగించే విధానం ఒకటయితే వారికి సహాయం చెయ్యటం మరొకవిధానం. అంటే; మనం అజ్ఞానంలో వున్నాం; దరిద్రంలో వున్నాం; మన ఖర్మఫల మింతేనని నిర్వీర్యులము కాకుండా నిద్రమేల్కొని మనం ఎవరికివారు సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని పురోగమించాలి. ఆ పద్ధతిలో వారికి చైతన్యం, జాగృతి కలిగించటం ఒక విధమైనసేవగా చెప్ప

వచ్చు. ఆకలి, దారిద్ర్యం, వ్యాధి, నిరక్షరాస్యత, అత్యధిక సంతానం, నిరుద్యోగం, వరకట్న పిశాచం, స్త్రీలపై దౌర్జన్యాలు, మానభంగాలు, అత్యాచారాలలాంటివి సామాజిక జీవితాన్ని కలుషితం చేస్తున్నాయి. వీటికి లోనయిన వారిని ఆదుకోవటం, వీటివల్ల బాధపడేవారికి చేయూత నివ్వటం రెండవ పద్ధతి. ఈ విధానాలు వైవిధ్యం కలవి అయినా రెండూ సంఘ సేవలో అంతర్భాగాలే.

అయితే ఈ సహాయాలు ఒక వ్యక్తిగా చేయటం దుస్సాధ్యం. సేవా దృక్పథంకల నలుగుర్ని కూడకట్టుకొని ఒక సంఘంగా ఏర్పడాలి. దానినే స్వచ్ఛంద సేవాసంఘం అని చెప్పుకుంటున్నాము. ఆ సంఘంలోని కార్యకర్తలను సంఘసేవకులని అంటున్నాం. స్వచ్ఛందసేవ ఆ సంఘానికి ఊపిరి. ఆ సంఘసభ్యులు మంచి సమర్థులుగాను, నిజాయితీపరులు గాను వుండాలి. సమస్యలను వారు స్వార్థరహితంగానే కాకుండా పరహితార్థరీతిలో చర్చించగలగాలి. ఒక హాష్టలు నిర్వహించాలన్నా, ఒక హాస్పటల్ నెలకొల్పాలన్నా, ఒక వివాహ సలహా కేంద్రం స్థాపించాలన్నా సంస్థా నిర్వహణే దక్షతగల కార్యకర్తలదళం కావాలి. ఒక పథకమూ, ప్లానూ వేసుకోవాలి. దానిని అమలుపర్చటానికి డబ్బు సంతరించుకోవాలి. ఇది అంతా చాలా నేర్పుతో, ఓర్పుతో, సమర్థతతో జరగాల్సిన పని.

మనం చేసే సహాయంవల్ల ప్రయోజనం పొందేవారి సహకారంకూడా వుండాలి. అంటే ఒక వర్కింగు వుమెన్ హాష్టలు కట్టించామనుకోండి అందులో వుండే నిర్వాశితులు ఇది నాది అని భావించాలి. అలాగే ఒక సెప్టిక్‌టాంక్ లెట్రిన్ కట్టిస్తే బాగుచేసే మనిషివున్నా 'మనంకూడా దాన్ని శుభ్రంగా వుంచాలి. అనే భావం దానిని వాడేవారిలో లోపించరాదు. కనుక సంఘ సభ్యులకూ, సేవా ఫలితాన్ని అనుభవించే వ్యక్తులకు మధ్య అవగాహన సంఘీభావం, స్నేహసౌహార్దాలు, సహకారం వుండాలి.

ఈనాడు సంఘసేవపట్ల ప్రజానీకానికి గౌరవం సన్నగిల్లుతుంది. కారణం ఏమిటి అని ఆలోచిస్తే అచ్చంగా ప్రభుత్వ గ్రాంట్లకొరకు, పేరు ప్రఖ్యాతుల కొరకు, పరపతి కొరకే సేవాకార్యక్రమాల బ్యానర్లతో తిరిగే వారివల్లేనని చెప్పుకోవచ్చు.

నిజమైన సంఘసేవ అగ్నిపరీక్ష లాంటిది. స్వార్ధరహితమైన, సేవా దృక్పధంతో ఆర్తులను, తాడిత పీడిత ప్రజలను వెన్నుతట్టి వారిని సమాజంలో పౌరులుగా నిలబెట్టగలగాలి. సమస్యలతో, బాధలతో, కష్టాలతో, కృంగి కృసిస్తున్న వారికి చేయూత నివ్వాలి. పుట్టుకతో కొందరు దుర్బరులుగా పుడితే ప్రకృతి ఈతి బాధలవల్ల కొందరు అశక్తులవుతారు. కరువుకాటకాల వల్ల,వరదలు,అంటువ్యాధులలాంటి వాటివల్ల వ్యక్తులునిరాశ్రయులవుతారు దీనావస్తకులోనవుతారు. అనాధలు, భర్తృ తిరస్కృతులు,వ్యభిచారిణులు,పిచ్చి వాళ్ళు, వ్యాధిగ్రస్తులు అశేషంగా వుంటున్నారు. సమాజ సంప్రదాయాలు, మూఢాచారాలు కొందర్ని పీల్చిపిప్పిచేస్తున్నాయి. వరకట్నం తేలేదనికాల్చి చంపటంలాంటి వాటికి కొందరు బలి అవుతున్నారు. మరి కొందరు దౌర్జన్యాలకు గురి అవుతున్నారు. నిరుద్యోగులు, అన్నార్తులు, భర్తృ పీడితులు మితిమీరిన బాధలు సహించలేః మానసిక ధైర్యాని కోల్పోతున్నారు. ఈ నానారకాల విషదంష్ట్రల నుండి తప్పించుకోలేని దుర్భరులుగా హతాశులై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ పీడితులకు మానసిక ధైర్యాన్ని కలిగించటం సంఘసేవకు మొదటి మెట్టు. వారికి శారీరకంగా, ఆర్ధికంగా, వస్తురూపేణా సహాయ పడటం కూడా సేవక్రిందే లెక్కకు వస్తుంది. వారి బాధతొలగి పోవటానికి తగిన సహయ సంపత్తులు అందించటమేకాక వారికి వ్యక్తిగతంగాను, స్వచ్ఛంద సంస్థలద్వారాను, ప్రభుత్వ వనరులద్వారా సహాయం కల్పించటం కూడా సేవలోని అంతర్భాగాలే.

ఈనాడు సంఘసేవ సాధ్యమా? అంటే మానవుడికి అసాధ్యమనేది ఏదీ లేదు. అయితే ఈనాటి సమాజం మరీ దుర్గంధభూయిష్ట మయింది. ఎక్కడ చూచినా అవినీతి, లంచగొండితనం, బ్లాకు మార్కెట్ పెరిగిపోయింది. ప్రతి వస్తువూ కల్తీ చేస్తున్నారు. ఆఖరికి ప్రాణాలను నిలిపే మందుల్లో కూడా కల్తీ జరుగుతుంది. మతకలహాలు పెరిగిపోతున్నాయి. కుల వివక్షత విలయ తాండవం చేస్తున్నది. స్త్రీలు చిన్నచూపు చూడబడుతున్నారు. జనాభా విపరీతంగా పెరిగిపోతోంది. నిరుద్యోగ సమస్య ప్రళయ తాండవంచేస్తోంది. దోపిడీలు, దౌర్జన్యాలు మితిమీరుతున్నాయి. మానభంగాలు అత్యాచారాలు అసహనంతో చెలరేగుతున్నాయి.

ఈ పరిస్థితుల్లో సమాజసేవ చెయ్యాలంటే ఏదని చేసేటట్లు! ఎలా చేసేటట్లు? అని నిరుత్సాహం కలుగుతుంది; కష్టతరమనే భావన ఉదయిస్తున్నది. ఈ అవినీతి వలల్లో ఎవర్ని విమర్శిస్తే వారు ధ్వజమెత్తుతారు. ఎన్నిరకాల అడ్డంకులు! మరెన్ని విధాలైన అవరోధాలో! ఆలోచిస్తుంటే ఆశ్చర్యంగా వుంటుంది. అయినా ఈ సమస్యలలోకి తలదూర్చే కార్యకర్తలున్నారు. కారణం మానవుడు విజ్ఞాన జీవి, ఆశాజీవికూడాను. అది అతని ప్రత్యేకమైన విశిష్టత.

ఆహార, నిద్రా, మైథునాలు జంతుధర్మాలు. మానవత్వంగలవ్యక్తులకు జ్ఞాన తృష్ణవుంటుంది. వారిలో ఆర్తి, స్ఫూర్తి వుంటాయి. సామాజిక రుగ్మతలకు బాధపడతారు, ద్రవిస్తారు; ఆర్తులవుతారు. ప్రక్కవాడు ఆకలితో చస్తుంటే తాను కడుపార భుజించలేరు. తనకున్న దానిలో గరిటెడులో మిల్లెడు అన్నట్లు పంచిపెడతారు. ఇలాంటి స్పందన, ఆర్తి, మానవనైజం లేనివారు పశుతుల్యులు. అణగారిన వ్యక్తులకు మానసిక, శారీరక, ఆర్థిక, విద్యా వైద్య విధానాలలో తోడ్పాటు ఇవ్వడం తన కనీస మానవ ధర్మంగా భావిస్తారు సంఘసేవకులు.

ఈ సహాయమంతా సేవా దృక్పథంతో చెయ్యాలేకాని వారిని ఉద్ధరిస్తున్నామనే అతిశయం పనికిరాదు. కృతజ్ఞతా రూపంలోనైనా ప్రతిఫలాన్ని పొందాలనుకోవటం నిజాయితీలేని లక్షణమని చెప్పవచ్చు. సహాయం పొందినవారు దూషించినా, తిరస్కరించినా, వ్యతిరేకించినా నిష్కామిగా వుండగల ధీశక్తిగల వ్యక్తే సంఘసేవకు అర్హురాలవుతుంది.

అసలు నిజమైన సంఘసేవ చెయ్యాలంటే ఆ వ్యక్తికి స్వాభావికంగా కొన్ని లక్షణాలుండాలి. ఓర్పు, నేర్పు, సహనం, సౌశీల్యం, సమయస్ఫూర్తి, సేవాదృక్పథం, గుండెనిబ్బరం కూడా వుండాలి. దూషణ భూషణలకు కృంగుట, పొంగుట పనికిరాదు. ఆటుపోట్లను సహనంతో భరించాలి. ధనంఖర్చుపెట్టాలి, చాకిరీ చెయ్యాలి, కాలం వినియోగించాలి. నోటితో మాట్లాడుతూ, నొసటితో వెక్కిరించేవారి నిందలను సహనంతో భరించాలి. తల్లి తనబిడ్డను లాలించి, పాలించి, ప్రేమతో వాత్సల్యంతో ఎలా చూస్తుందో బాధితులను అలా చూడాలిగాని ఆర్తులలోని లోపాలను మాత్రమే చూడరాదు.

స్వచ్ఛంద సేవకురాలికి చిత్తశుద్ధి, పట్టుదల ఉన్నంత మాత్రానా సరిపోదు. వాస్తవికదృష్టి అవసరం అంటే తన శక్తి యుక్తులను అంచనా వేసుకొని కార్యక్రమాన్ని ఎన్నుకోవాలి. అంతేకాదు సంస్కరణకు, విప్లవానికిగల సంబంధాన్ని గుర్తించాలి. ఆమె తలపెట్టిన ప్రతిపనీ, ప్రతిచర్యా సమాజంలో సమూలమైన మార్పును తేవడానికి దోహదం చేయగల్గాలి. లేకపోతే ఏడుగురు గ్రుడ్డివాళ్ళు ఏనుగును వర్ణించినట్లు సమాజాన్ని పాక్షికంగానే దర్శనం చేసుకోవడం జరుగుతుంది. దానివల్ల సేవ ఫలితం ఆశించిన గమ్యాన్ని చేరలేదు. అంటే రుగ్మతలేని సమాజాన్ని సృష్టించలేదు. కనుక దానికి పరిణతి చెందిన మనస్సు వుండాలి.

సంఘ సేవకు తగినన్ని ఆర్థిక వనరులు సంపాదించటం చాలాచిక్కు సమస్య. సంపద ఉన్నవారికి సేవా కార్యక్రమాలపై వైముఖ్యం దరహం మీదచూస్తే ఉంటుంది. లేనివారికి అభిలాష ఉండి ప్రయోజనం లేదు. ప్రభుత్వ ధనసహాయం అనేక నిబంధనలకు, షరతులకు లోబడివుంటుంది. కార్యదీక్ష కలవారికి అది సకాలంలో తగినంతగా అందక పోయే ప్రమాదం ఎప్పుడూ ఉంది.

సేవాసక్తత, ఆర్థికశక్తి, రెండూవున్నా నిర్మాణ దక్షత లేకపోతే సేవాకార్యక్రమాలు రాణించవు. స్వచ్ఛందసేవా సంఘ సభ్యులలో అవగాహన, సహకారం, సంఘీభావం, ఐక్యత, కలిసి కట్టుగా వ్యవహరించగల సత్తా వుండాలి.

నిజాయితీ, పట్టుదల, దక్షత నిజమైన సంఘసేవకు పునాదిరాళ్ళు. ఫ్లారెన్సు నైటింగేలు తెల్లవార్లూ రోగులు, ఆర్తులు అయిన బాధితుల మంచాల చుట్టూ చిన్న దివ్వెతో తిరుగుతూ వారికి సేవ చేసేది. నిజమైన సేవికకు మిషనరీ జీల్ వుంటుంది. రామకృష్ణా మిషన్‌వారు, సాల్వేషన్ ఆర్మీవారు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వారు ఆ దృక్పథంతో మానవసేవ చేస్తున్నారు, పేరు ప్రఖ్యాతులను ఆశించకుండా పట్టుదలతో, ధైర్యంతో తాను తలపెట్టిన సేవా కార్యక్రమంలో కడదాకా నిలబడాలి. అందుకే మనకు భర్తృహరి సుభాషితం శిరోధార్యం కావాలి. భయంతో ఏ కార్యాన్ని

ప్రారంభించరు అల్పులు. బాధలకు తట్టుకోలేక మధ్యలో మానుకుంటారు మధ్యములు. తుదిదాకానిలుస్తారు ధీరులు అని సుభాషితం మనకు సందేశ మిస్తుంది. అలాంటి ధీరులకే చరిత్రలో స్థానముంటుంది. వారి జన్మ చరితార్థమవుతుంది. సంఘసేవలో పొందే తృప్తి, ఆనందం, అనుభూతుల కన్నా మించిన బహుకృతి ఏముంటుంది? మనం ఎలాబ్రతికాం; ఎంత ఆస్తిని సంపాదించాం, ఏ పదవులను సాధించాం అనేది శాశ్వతమూకాదు;పరమార్థం అంతకన్నాకాదు. మన జీవితంలో ఏ ఘనకార్యాలుచేశాం; ఎవరికి సాయ పడ్డాం; మనము, మనకుటుంబాన్ని అధిగమించి ఆలోచించామా? లేదా? అనే విషయం గురించి అనుక్షణం మధన పడాలి. అలాంటి ద్విగుణీకృతోత్సాహం కల సంఘసేవకులు పుంఖాను పుంఖాలుగావచ్చి సమాజ సేవాకార్యక్రమాల్లో పాల్గొన్ననాడే సంఘసేవకు అద్వితీయ స్థానముంది. అసలు మనలో సేవా ప్రవృత్తి ఏ కొద్దిగానైనా వుంటుంధి. మానసికంగా మనం జాగృతి పొందితే చాలదు. నిర్లిప్తంగా ఆలోచించి నిదానించుమైన పరిజానీకాన్ని మేల్కొల్పి సంఘటితం చెయ్యాల్సిన గురుతరమైనబాధ్యత సంఘసేవలో ముఖ్యమైనది. ఆ అర్హతను మనం పొందగలగాలి. వివేకం జిజ్ఞాస ఉన్న ప్రతి వ్యక్తీ సమాజసేవ చేయటానికి పరితపిస్తాడు. అది ఒకరుకోరితే చేసేదికాదు. ఒద్దంటే మానేది అంతకన్నాకాదు. అందులోవచ్చే కష్టసుఖాలను ఆనందంతో స్వీకరిస్తారు. అదే వ్యక్తికి శాశ్వతానందం. ఈ సమాజం నాకేమి ఇచ్చిందని చూడదు ఆవ్యక్తి; ఈ సమాజానికి నేనేంచేశానని అనుక్షణం పరితపిస్తుంది. అలాంటివారికి సంఘసేవ అసాధ్యముకాదు; అడ్డంకులు అంతకన్నావుండవు.

సమాజంలోని వ్యక్తుల అభ్యుదయాన్ని ఒనగూర్చని జాత్యభ్యుదయం, సమాజాభ్యుదయంమిధ్యలు.



మహిళోద్యమం :
మహిళా సంఘాలు

ఈనాడు మారాల్సింది చట్టాలు మాత్రమేకాదు. మహిళలమనస్తత్వాలు కూడా మారాలి. జనభాలో సగంమంది స్త్రీలు. వారు వెనుకబడివుంటే,వారిలో జాగృతి, వికాసం నశిస్తే ఏ సమాజం పురోగమించలేదు. సాంఘిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో 50% స్త్రీలు వెనుకబడి వున్నారనేది నగ్నసత్యం. వీరు ఇరుకు సందుల్లో, మురికి కూపాల్లో మగ్గుతున్నంతకాలం మన పథకాలు, అభివృద్ధికార్యక్రమాలు దెబ్బతినకతప్పవు. కనుక స్త్రీ జనాభివృద్ధి అనివార్యమని విస్మరించరాదు. విద్యావిజ్ఞానాలు, బొత్తిగా లేక వ్యక్తిత్వపు విలువే తెలియని నారీలోకానికి సర్వతోముఖ వికాసం కలిగించటమే నేటి మన ముఖ్యకర్తవ్యం. తరతరాలుగా భావదాస్యంతో మగ్గిపోతున్న మన మహిళలకు జ్ఞాన జ్యోతిని వెలిగింటానికి ఒంటరిగా ఏమీచేయలేము. కనుక ఒక ఉద్యమం కావాలి. దాన్నే మహిళోద్యమం అనవచ్చు. అంటే దోపిడి చేయబడే వర్గాలవారే సంఘాలద్వారా తిరుగుబాటుచేసి,ఆ ఉద్యమంద్వారా స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను పొందగలగడం. అప్పుడే స్త్రీల పురోభివృద్ధి వుంటుంది.ఆ కృషి విజయవంతం కావాలంటే దానికినిర్దేశిత లక్ష్యాలువుండాలి. ఆ లక్ష్యాలకు స్పష్టత వుండాలి. ఇలాంటి ఉద్యమాలు ఈ దేశంలో ఎలా నడిచినై ? ఏమి సాధించగల్గినై ? అనేదానికిగత చరిత్రను సమీక్షించి, వర్తమానాన్ని నెమరేసుకొని, భవిష్యత్తుకు అంచనా వేయుట విజ్ఞత.

మహిళాసంఘాల పాత్రను, విశిష్టతను గురించి చర్చించేముందు ఈనాటి మహిళోద్యమ స్వభావాన్ని పరిశీలించటం అవసరం. ఈ నాడు మూడురకాల దృక్పథాలు మహిళోద్యమంలో చోటు చేసుకున్నాయి. మొదటిదాన్ని అచ్చంగా పురుష వ్యతిరేకమైనదిగా పేర్కొనవచ్చు. ఈ సమాజం పురుష నిర్మితమని, దీనిశాసనాలను, నియమాలను పురుషులు స్త్రీలను అణిచిపెట్టటానికి మాత్రమే తయారుచేశారని వీరిభావన. పురుషులను "పురుష దురహంకార సూకరాలు" (Male chauvinistic Pigs) అని

తిట్టేదాకా వెళ్ళారు రెండవ వర్గంవారు పురుష ప్రపంచాన్ని విమర్శించకుండానే తమ లక్ష్యసాధనకు కృషిచేస్తారు. మూడవవర్గం సమాజాన్ని పట్టిపీడిస్తున్న, ఫ్యూడలిజం, పెట్టుబడిదారీవిధానం, సామ్రాజ్యవాదం, ఫేసిజం లాంటి సిద్ధాంతాలను, అట్టివ్యవస్థలను ఎదుర్కొంటారు. అంతేకాక పురుష దురహంకారాన్నికూడా వ్యతిరేకించి పోరాడతారు. జాగృతి, చైతన్యముకల అభ్యుదయ వాదులైన పురుషుల సహకారాన్ని తీసుకోవటానికి వెనుకాడరు. ఇది సమతుల్యవైఖరి, వాస్తవిక దృష్టికలది.

"ఇండియన్ విమెన్స్ అసోసియేషన్" అను పేరుతో 1920 లో అఖిల భారత మహిళా సంఘాన్ని ఇంగ్లీషు నేర్చిన మహిళలు నెలకొల్పారు. ఆనాడు ఐ. సి. యస్. ఉద్యోగస్తుల భార్యలు, మితవాద రాజకీయ నాయకుల భార్యలు, సంపన్న గృహిణులు, జమిందార్ల భార్యలు మాత్రమే ఆ సంఘాన్ని నడిపేవారు. సహగమనం, ఆస్థిహక్కు, బాల్యవివాహం, విధవా వివాహం, అంటరానితనం, సమానత్వాలపై కృషిచేసి కొంతవరకు కృతకృత్యులైనారు. గాంధీ సత్యాగ్రహపు పిలుపు నందుకొన్న స్త్రీలు గాంధీ యుగము అవతరించిన పిదప "అఖిల భారత మహిళా సభ"ను స్థాపించారు ఆ సంఘానికి జాతియోద్యమంతో సంబంధముండేది. దానికి సరోజినీ నాయుడు లాంటివాళ్ళు అధ్యక్షులైనారు.

కమలాదేవి చటోపాధ్యాయ, హంసమెహతా, విజయలక్ష్మీపండిట్, మణిబెన్‌కారా, రామసుబ్బమ్మ,దుర్గాబాయిలాంటి జాతీయోద్యమ నాయకులు ఆనాడు ప్రముఖపాత్ర వహించారు. తర్వాత అరుణా అసాఫాలి, హజరా బేగమ్, రేణు చక్రవర్తి, అచ్చమాంబ ఆ సంఘంలోచేరి యెనలేని సేవ చేశారు. తర్వాత కాంగ్రెస్‌నుండి సోషలిష్టులు, కమ్యూనిష్టులు, కిసాన్‌పార్టీ, రాడికల్స్‌లూ రాజకీయ విభేధాలతో విడిపోయినప్పుడు మహిళాసభపూర్తిగా కాంగ్రెస్ మహిళల సంఘంగా మారిపోయి, ఆనాడది ఇందిరాగాంధీ,సుశీలా నయ్యర్‌లాంటి వారి ఆధ్వర్యంలో పనిచేసింది.

"అఖిల భారత మహిళా సంఘం" నుండి బైటపడ్డ కమ్యూనిష్టు మహిళలు మహిళా సంఘాలు స్థాపించి నిర్మాణ కార్యక్రమాలు,

కొన్ని ప్రాంతాలలో కుటుంబనియంత్రణ ప్రచారం అధికధరలపై నిరసన లాంటికార్యక్రమాలు విరివిగా జరిపారు. 1946 నుండి కమ్యూనిష్టులు నడిపే ప్రజోద్యమాలవలెనే వారి మహిళారంగం కూడా కుంటుపడింది.

ఈనాడు మహిళా సంఘాలు మధ్యతరగతి వారిచే నడపబడుతున్నాయి. మధ్యతరగతి గృహిణుల కోర్కెలు వరకట్నం, ఆస్తిహక్కు, దత్తత, వివాహ ఎన్నిక, విడాకులు, విద్య, ఉద్యోగం, ప్రజాప్రాతినిధ్యాలకే పరిమితంగా వుంటున్నాయి. శ్రామిక స్త్రీల సమస్యలు మంచినీళ్ళు, మరుగుదొడ్లు, ఓలి, వేతనాల వివక్షతలపై ఆరాటంలేదు. అత్యాచారాల లాంటి సామాన్య స్త్రీల సమస్యలు పట్టించుకోవటంలేదు. ఇక ముస్లిం మహిళల పరదా, బహు భార్యాత్వం, తలాక్ లాంటివి వేరుగా భావించటం జరుగుతోంది. అలా శ్రామికవర్గ స్త్రీలను, ముస్లిం మహిళలను మధ్య తరగతి మహిళోద్యమం లోనికి తేలేకపోయ్యారు కార్యకర్తలు. సామాజికంగాను, ఆర్థికంగాను అట్టడుగునవున్న మహిళాలోకాన్ని విస్మరించటం వల్లనేమధ్యతరగతి మహిళా సంఘాలు మరుగునపడి పోతున్నాయి.

కొన్నిచోట్ల శ్రామిక మహిళా సమాజాలు నామమాత్రంగా వున్నాయి వాటికి లక్ష్యాలూలేవు. కార్యక్రమాలు అసలేలేవు, ఇంక డిపార్టుమెంటువారు స్థాపించి లెక్కలు చెప్పే మహిళా సమాజాలు సరేసరి. బాల్వాడీ స్కూళ్ళు, భజనమందిరాలు మాత్రం నిర్వహిస్తాయి ప్రభుత్వ గ్రాంట్లతో. అంతేకాని తమహక్కుల, కోర్కెల సాధనకై ఉద్యమాలుగాని పోరాటాలుగాని నిర్వహించరనేది నగ్నసత్యం. ఎందుకలా జరుగుతుంది? కారణాలేమిటి? అంటే పట్టణ, గ్రామీణ శ్రామిక స్త్రీలలో విద్యలేకపోవటం; వారిలో సామాజిక స్పృహలోపించటం. తమను తాము ఉద్ధరించుకుందామనే ఆలోచనాలోపం. పురుషులు వారికి అవకాశమివ్వక పోవటం, మతాలు, కులాల దురభిమానం, మూఢాచారాలు, మూఢ విశ్వాసాలు, సమాజం చిన్నచూపు చూడటం ఏ స్త్రీ అయినా బైటికొచ్చి హక్కులడిగినా, ఉద్యమం పెట్టినా ఆది ''బరితెగించిన ఆడదిరా,'' శిఖండిరా, 'ఆడది తిరిగి చెడింది మగాడు తిరక్క చెడ్డాడు' అంటారని స్త్రీలు సంఘాలలో చేరరు. ప్రభుత్వ వ్యవస్థలోను, రాజకీయ పార్టీల నిర్మాణంలోను స్త్రీలకు చోటులేకపోవటం, చైతన్యవంతమైన కార్య

కర్తలు లేకపోవటం ఇలా అనేక ఇబ్బందులవల్ల గ్రామీణ స్త్రీలు, శ్రామిక స్త్రీలు, మహిళా సంఘాలలో చేరటంలేదు.

ధనికవర్గపు స్త్రీల సంఘాలు కొన్ని విందులూ, వినోదాలు, ఆటలు పాటలు, ఫేషన్ పెరేడ్లూ, దేశపర్యటనలకే పరిమితంగా పనిచేస్తున్నాయి. ఇలాఅనేక కారణాలవల్ల,పరిమితులవల్ల స్వచ్ఛంద సంస్థలు నిర్వీర్యమైపోతు న్నాయి. అన్నిటికన్నా ముఖ్యమైనది బాధితులైన వ్యక్తుల్లో ఐకృత లోపించటం, సమస్యను తనదిగా భావించక పోవటం.

మహిళా సంఘాలు చేపట్టాల్సిన కార్యక్రమాలకు ఒక్కగొంతు చాలదు. కనుక వేలకంఠాలు ఐకృతతో అరిస్తే కొండలనే పిండిచేయవచ్చు. జాగృతి గల మహిళలు ఇందుకు పూనుకోవాలి. ముమ్మందుగా సామాజికస్పృహ కలిగి అట్టడుగునవున్న మహిళా లోకంలో కృషిసాగించగల సత్తా, పట్టుదలా దీక్షాగల కార్యకర్తలు తయారు కావాలి. వారు విధిగా మొదట్లో మధ్యతరగతి నుండే వస్తారు. తర్వాత వారు కార్యరంగంలోకి దిగగానే వారు నడిపే పోరాటాల పర్యవసానంగా అనేకమంది శ్రామిక మహిళలు నాయకత్వ స్థాయికి వస్తారు. కొంతకాలానికి వారే తమ సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు నడపగల స్థాయి కొస్తారు. అప్పుడు మధ్య తరగతి కార్యకర్తల అవసరం వుండదు. ఇది నాయకత్వ విషయంగా మహిళా సంఘాలు చేపట్టాల్సిన విధానం. దీనికై సంఘసేవికల శిక్షణా తరగతులను మొదట్లో చేపట్టాల్సి వుంటుంది. ఆవశ్యకతను బట్టి ముఖ్యాంశాలపై దృష్టి కేంద్రీకరించి కార్యక్రమాన్ని నిర్ణయించాలి. ముందు వెనుకలు నిర్ణయించుట ప్రణాళికాలక్ష్యం. నేటి స్త్రీల ముఖ్య సమస్యలు, పరిష్కార మార్గాలు మహిళా సంఘాలద్వారా ఎలా సాధించాలి?

తమ ప్రగతికి, తమ పోరాటాలకు ఇతరత్రాను అవసరం కనుక విద్యకావాలి. తమ ఆరోగ్యానికి, విశ్రాంతికి పిల్లల సంఖ్య తగ్గాలి. కనుక కుటుంబనియంత్రణ కావాలి. ఓటు హక్కుకు, రాజకీయ హోదాకు వయోజన విద్య చాలా ముఖ్యమైనది! అవసరం కనుక దానిని చేపట్టాలి.

స్త్రీ పురుష అసమానత్వ నిర్మూలనకై విధిగా పోరాడాలి. కుటుం బంలో అణచివేత నుండి విముక్తిని స్త్రీలు సాధించాలి.

స్త్రీకి సాంఘిక హోదా పెరగాలి, అది లేనిదే రాజకీయ అభినివేశం, ప్రవేశం వుండదు. అందుకొరకై ప్రజాప్రాతినిధ్యంలో జనాభా దామాషా ప్రకారం సీట్లకై ఆందోళనచేయాలి. విద్యా, ఉద్యోగం, ఆరోగ్యం లాంటి ముఖ్యవిషయాల్లో స్త్రీల పరిస్థితి బాగుపడాలి.

స్త్రీలలో సంఘీభావం రావాలి. ఒకళ్ళకొకళ్ళు స్త్రీలు ఆదుకునే స్థితి వుంటేనే ఐక్యత లభిస్తుంది. మహిళాభ్యుదయానికి తోడ్పడే సామాజిక జీవ నంలోను రాజకీయ ఆర్థిక స్వాతంత్ర్య సాధనలోను, ప్రజా తంత్ర కార్యక్ర మాలలోను సాంఘికప్రగతిలో స్త్రీలు పురోగమించేందుకు మహిళాసంఘాలు ప్రముఖపాత్ర వహించాలి. వ్యక్తి స్వేచ్ఛకోసం, సాంఘిక సంక్షేమం కొరకు, మూఢవిశ్వాస నిర్మూలనకు, అవిద్య అజ్ఞాన నిర్మూలనకు, ముఖ్యంగా స్త్రీల హక్కులకు, స్త్రీ పురుష సమానత్వానికై సంఘాల ద్వారా ఆందోళన చేస్తేనే సమస్యలు పరిష్కరింపబడతాయి. అలాంటి పటిష్టమైన మహిళాసంఘాల నిర్మాణంలో సర్వులూ తోడ్పడగలరని ఆశిద్దాం.

రాజకీయ పార్టీల తోకలుగా మహిళా ఉద్యమాలు ఉన్నాయి. కాని విశాల ప్రాతిపదికపై అఖిల భారత వ్యాప్తంగా ఉద్యమంకాని, సంస్థ కాని లేకపోవటం శోచనీయం. కనుక విద్యా, విజ్ఞానం, వికాసం కలిగిన మహిళలు సంఘాలద్వారా సాటి మహిళలలో జాగృతి కలిగించటం తమ కనీసవిద్యుక్త ధర్మంగా భావించాలి. ఆనాడే మహిళాజాతికి విముక్తి తథ్యం అనకతప్పదు

స్త్రీ పరాజయగాధ

అవి దురాచారాలైనా, కాలగతినిబట్టి అర్ధరహితాలైనా, ఆచరించ టానికి అనర్హాలైనా, పనికి మాలినవైనా మన ప్రాణాల్ని తోడేవి అయినా మనం వాటిని ఒక వక్షాన విడిచిపెట్టం. అది మన ప్రత్యేక లక్షణం, మన లక్ష్యం కూడాను. మనం మన విలువలను గుర్తించక పోగా సామాజిక స్పృహను కోల్పోతున్న అయోమయావస్థలోవున్నాం. మన అజ్ఞానంవల్ల మనం నష్టపోతున్న స్త్రీ శక్తిని గుర్తించలేక పోతున్నాం. అదే మన తర తరాల బానిస మనస్థత్వం.

మానవుడు పాశవికదశనుండి పురోగమించినా,ఒకనాటి అసాధ్యాలుఈనాటి సాధ్యాలుగామారినా స్త్రీ జాతి నిద్రాణ దశనుండి మేల్కొనలేదనడానికిఅనేక రుజువులున్నాయి. పుత్రుడికోసం ఎదురు చూచే తల్లి దండ్రులకు "ఆడదే" పుట్టిందే అనే అవమానంతో, బాధతో మొదలవుతుంది ఆమె పరాజయగాధ. ఏ వేడుకలూలేక,ఎవరికీ సంతోషంలేని ఆమె బ్రతుకు అంతాగాఢాంధకారమే. ఆడపిల్ల పెంపకంలో, పోషణలో, ఆదరాభిమానాలలో తేడాతో పెంచబడు తుంది. ఆహారలోపంవల్ల, అశ్రద్ధవల్ల బాలికల మరణాలు హెచ్చని మనం దరికీ తెలుసు. వివాహయోగ్యత వరకు విద్య నేర్పిస్తారు. అంతటితో 'ఫుల్‌స్టాప్.' కట్నమనే దక్షిణతో "సొంత ఆస్తి" క్రింద ఆమెను జమ కడ తాడు భర్తఅనే యజమాని. తల్లి నేర్పిన నీతులతో, ఒద్దికతో, భయభక్తులతో, నీడలా అనుసరిస్తూందా జవరాలు. ఆమె 'పవిత్రతను' రక్షిస్తూ ఆమె సేవలందుకుంటూ ఇంత ఆశ్రయమిస్తాడు భర్త! ఆమె వ్యక్తి వికాసాన్ని అణచివేసి తెలివితక్కువ దద్దమ్మలా వుండనిస్తారు అత్త మామలు, భర్త. పిల్లలను కనాలి, పెంచాలి అది ఆమె విధి. కాని పిల్లలు మాత్రం భర్త సొత్తు. అతడే వారికి 'గార్డియన్.' అలా దిష్టిబొమ్మలా, దిగ దుడిచిన ఉప్పులా, విసిరేసిన విస్తరిలా, జీవచ్ఛవంలా జీవితాన్ని గడుపు తుంది ఆబొమ్మ. అదిచాలక వ్రతాలు, నోములు, పూజలు చేస్తూ, పతిభక్తి పారాయణంచేస్తూ,ఇచ్ఛాపూర్వకమైన పురుషాధిపత్యాన్ని సగౌరవంతోస్వీక రిస్తుందా మహాసాధ్వి. పరమ పతివ్రత, శాంతమూర్తి, పుణ్యకాంత అనే బిరుదులు పొందుతుంది. భర్తతో 'సతి' అనే చితి పోయింది కనుక కఠిన

నియమాలతో,'ప్రమోషన్'లో అత్తగా రూపొందుతుంది. తనపూర్వస్మృతిని విస్మరించలేక తనకన్నా అబల అయిన కోడలిమీద దౌర్జన్యాన్ని సాగిస్తుంది. కట్నంచాలలేదు కాలుస్తానంటుంది. బిడ్డలు పుట్టని గొడ్రాలు వంటుంది. ఆమెను హింసించటమే తనకు 'హోదా'గా, గౌరవ ప్రతిష్టలుగా భావిస్తుంది. ఇదంతా తన కర్మఅనీ, నోసటి వ్రాతఅనీ కృశిస్తుందా చిన్నారి కోడలు. అయినా ఆ కోడలుపిల్ల ఆడదానికి అదే మహాభాగ్యంగా భావిస్తుంది. అదే మన సంస్కృతి, సంప్రదాయం అని తెలుసుకుంటుంది -ముందు తరాల వారి గాధలువిని. ఇది తరత రాల స్త్రీ పరాజయగాధ.

ఆ తరతరాల బానిసమనస్థత్వం మన రక్తంలో ఇంకా ప్రవహిస్తూనే వుండబట్టే ఈనాడు చట్టం, సమాజం కొన్ని అవకాశాలు మన కిచ్చినా మనలో స్పందన లేదు. నైరాశ్యంతో, స్తబ్దతతో మనం పురోగతిని,మార్పును కోరలేని అసమర్థులమైనాము దీనికి ముఖ్యకారణం స్త్రీ పురుష అసమానత. ఈ తేడా సహజమని, ప్రకృతిధర్మమని మనం నమ్ముతున్నాము. ఇలా మన రక్తంలో జీర్ణించిన కర్మసిద్ధాంతం, పిరికితనం, జడత్వం, మూఢ విశ్వాసం, సనాతన సంప్రదాయం మనలను వెలుగును చూడనివ్వవు, ముందుకు సాగనివ్వవు. మనం చాలా మేధావులమని, పవిత్రులమని పొగిడేసుకోవటం మన జాతి లక్షణం; అదిమన పశుత్వ వారసత్వ లక్షణం. అందువల్లే మనలో స్త్రీ పురోగ మనమన్నా, స్వేచ్ఛా సమానత్వాలన్నా మనకు 'ఎలర్జీ' వస్తుంది. నేటి మన రాజ్యాంగంలో సమాన ప్రతిపత్తి ఇచ్చినా మనము లాభించలేదు సరికదా పాతకాలపు పతివ్రతా శిరోమణుల కథలు, పురాణాలలో, సినిమాలలో, రేడియోలలో, నాటకాలలో అనుక్షణం మనకు దృగ్గోచరమై మనల్ని వెంటాడుతుంటే స్త్రీలు నిరసించకపోగా ప్రశంసించటం జరుగుతుంది. స్త్రీ యొక్క స్వర్గం భర్తపాదాలచెంత అని అన్నిమతాల స్త్రీలు నమ్ముతున్నారు. మీది హీనజన్మ, మీది హీనబుద్ధి, మీరు వేదాలువింటే మీచెవుల్లో సీసంపోస్తాం; చదివితే నాల్కకోస్తాం. వేదాలు మీరు జ్ఞాపకం పెట్టుకొంటే మీకుకఠినదండన తప్పదు. మీకు పురాణ శ్రవణం చాలు, అంటూ స్త్రీలకోసం, ద్విజేతరులకోసం కొన్ని పురాణాలు, పతివ్రతల కథలు రాశారు. రోమన్ సంఘంలో 'స్లేవ్సు' స్పార్టన్ సంఘంలో 'హీలెట్సు' బ్రిటిష్ సంఘంలో జర్మను, రష్యన్ పోలిష్

సంఘాలలో "యూదులను" అమెరికాలో "నీగ్రో"లను అస్పృశ్యులుగా పరిగణించేవారు. ఇప్పటికీ వారిని అలాగే చూస్తున్నారు. స్త్రీలను కూడా అస్పృశ్యతావర్గంలో చేర్చారనుటలో అతిశయోక్తిలేదు;అదిహాస్యాస్పదంకాదు.

విజ్ఞానం అనేది పురుషులకు ఎంతఅవసరమో స్త్రీలకూఅంతే అవసరం. అసలు అజ్ఞానం వల్లనే స్త్రీలు సుసంఘటితం కాలేకపోతున్నారు. తమకేమి కావాలో తామేమి చెయ్యాలో తెలియని అయోమయావస్థలోపడి వున్నారు. ఈ పని పురుషులు చేసిపెడతారు, ఈ సమస్య చట్టం తీరుస్తుంది, అనేభ్రమ పొరపాటని తెలియని పరిస్థితే నేటి స్త్రీల స్థితి, ఈ స్థితికి కారణం సమాజం, మతం, పురుష దురహంకారం అని చెప్పాలి. మన సంస్కృతి స్త్రీలను దేవతలుగానో, బానిసలుగానో తప్ప వ్యక్తులుగా చూడలేదు. అది మన దౌర్భాగ్యం! అదే మన స్త్రీల పరాజయగాధకు మూల కారణమయింది.

అసలు మతదృష్టిలో సమాజం అంటే కేవలం పురుషుడేనని, అతని సేవకు, సుఖసంతోషాల కొరకే స్త్రీ సృష్టింపబడిందనే విశ్వాసంవుంది. ఆ తత్వమే పెద్దవాళ్ళందరి మస్తిష్కాలలో చోటుచేసుకుంది. అందు కే ఆడది ఆధారపడి జీవించే ప్రాణి(పేరాసైట్)గా చూడబడుతుంది. వివాహం, మాతృత్వాలవల్ల ఆమె స్థితి దయనీయమయింది. ఆర్థికాధిపత్యం తగ్గి అణగారిపోయింది. నేటి స్త్రీకి రాజకీయ భాగస్వామ్యాన్ని రాజ్యాంగం ప్రసాదించినా ఆర్థిక అసమానత్వంవల్ల, సాంఘిక అసమానత్వంవల్ల ఆమె రాజకీయాలకు దూరంగా నెట్టబడింది. ఇలా మన రక్తంలో జీర్ణించిన అసమానత్వం,పురుషాధిపత్యం, వివక్షతా మనల్ని ఆధునిక వాతావరణంలోకి పోనివ్వటంలేదు;మనలోని అశాస్త్రీయ దృక్పధం మనల్ని ముందుకు సాగనివ్వటం లేదు.

సంపాదించే ఉద్యోగినులుగాని, సొంత ఆస్తికలిగున్న గృహిణులు గాని స్వేచ్ఛ కలిగిలేరు. వారి ముఖాలలో సంతోషం కనిపించదు. కారణం ఆమె సంపాదనపై, ఆమె ఆస్తిపై భర్తకో, తండ్రికో, ఏ అన్నదమ్ములకో హక్కువుంటుంది. ఇక సాంఘిక నిమ్నోన్నతాలు మనకు తెలియనివి కావు, ఇలా స్త్రీల సాంస్కృతికజీవితాలు విషాదాంకితాలవుతున్నాయి. ఆడది మొగుణ్ణి డబ్బుపెట్టి కొనుక్కోవలసిన స్థితిలో వుందంటే-వివాహం కన్యల

మనసుకూ మమతకూ కాదు; కట్నాలకు, కులాలకు, వంశానికి, అంతస్తుకూ మాత్రమేనని రూఢిగా చెప్పవచ్చు. వేదకాలంనుండి పురాణయుగం వరకూ ప్రబంధయుగంనుండి మనువువరకు, బ్రిటిష్‌వారినుండి నేటివరకు ఏ నాడూ ఏ మతమూ ఏ చట్టాలూ, ఏ ధర్మశాస్త్రాలు స్త్రీని వ్యక్తిగా పరిగణించలేదు. ప్రాచీన భారతీయ సంస్కృతిలో మానవత్వానికి విలువ ఇవ్వబడినా చాలా భాగం మతం, దైవం, భయం, భక్తి, సేవ అనే విషయాలకే ప్రాముఖ్యత నిచ్చారు. పారకాకం అంటే పతిభక్తి అని స్పష్టీకరించింది మన సంప్రదాయం. అందుకే భర్తను 'ప్రత్యక్షదైవం'గా ఆరాధిస్తారు, పూజిస్తారు, తాముమాత్రం తన్నులు తింటారు.

అసలు ఆడదంటే ఇలా బట్టకట్టుకోవాలి. అలా బొట్టు పెట్టుకోవాలి. తలుపుచాటునుండి తలవంచి సమాధానం చెప్పాలి. ఆమె అబల, అజ్ఞాని అణగి మణగి వుండాలి అనే సిద్ధాంతాలు బోలెడన్ని వున్నాయి. అలాగే వారి పనులు కూడా అనేక హద్దులకు, పరిమితులకులోనై వేరుగావుంటాయి. ఒకవేళ ఏ ఆడదయినా అద్భుతమైన పనులుచేస్తే వారికి 'అతీతశక్తులు' న్నాయని హడలి పోతారు. మరి స్త్రీలలో కూడా పురుషులను మించిన ధైర్య సాహసాలున్నవారు లేరా?

వాలంటీనాతెరిస్కోవా రోదసీ విహారం చేసి గ్రహాంతర యానానికి స్త్రీలు వెనుకంజ వేయరని నిరూపించలేదా? జపాన్ మహిళల బృందం ఎవరెష్టు శిఖరాన్ని అధిరోహించి ప్రపంచంలోకల్లా ఎత్తైన శిఖరంపై స్త్రీ శక్తి పతాకాన్ని ఎగురవేసి మహాద్భుతాన్ని సృష్టించలేదా! రసాయనిక శాస్త్రంలో పరిశోధనలు చేసి రేడియంను కనుగొన్న మేడంక్యూరి రెండు సార్లు నోబులు ప్రయిజులు సంపాదించలేదా? కృపస్కయా సారధ్యంవల్లనే కదా లెనిన్ సోషలిష్టు విప్లవజ్యోతిఅయి వెలుగొందింది. ఎలియనార్ రూజువెల్టు, హెలెన్‌కెల్లర్, థెరిసా, దుర్గాబాయిలాంటి మరెందరో ఉన్నతోన్నతులు స్త్రీలలో పుట్టలేదా! తగిన అవకాశం, శిక్షణావుంటే స్త్రీలు ఏ రంగంలో పురుషులకు తీసిపోరని రుజువయింది.

స్త్రీని పుట్టుబానిసను చేసిందిమతం. ఆమె వ్యక్తిత్వాన్ని కుంచించింది సమాజం. ఆమె శక్తుల్ని అణచి పెట్టాడు పురుషుడు. దానివల్ల నష్టపోయేది

స్త్రీలేననే భ్రమలో వున్నారే కాని మొత్తం మానావాళికే అనర్థకం అని మనం గ్రహించకపోవటం మన అవివేకమేకాదు; మత ప్రభావం కూడా.

ఏది ఏమయినా మనం ఆశాజీవులం. జడత్వంనుండే చైతన్యంకలజీవి ఉద్భవించిది; జడత్వానికి ప్రతీకలయిన కొండల్లోనే చైతన్యవంతమైన స్రవంతలుద్భవించాయి ఈ ప్రకృతి నైజాన్నే స్త్రీ జీవితానికి అన్వయిద్దాం; పురోగమిద్దాం.

వెనుకటికి నీగ్రోలు తమ బానిసత్వాన్ని పెయింటింగ్స్‌లో చూపారట. అలాగే నేటి స్త్రీలు తమ కష్టాలను, సమస్యలను సౌజ్ఞలద్వారా, కంటి చూపుద్వారా, రచనల ద్వారా చెప్పాలని ఆక్రోశిస్తున్నారు. వారిలో తప్పటడుగులతో ముందుకొస్తున్నారు. బహుకొద్ది మంది అయినా ఈ మత ఊబిలో దిగబడ్డ మహిళలను ఎలా రక్షించాలి,

చట్టాలద్వారా, ఆర్డినెన్సులద్వారా స్త్రీలలో మార్పుతెచ్చుట దురూహ్యం. చట్టాలకు కట్నాలు పోతయ్యా అన్నట్లు చట్టం అనేది కేవలం పనిముట్టు; అదికొంత రక్షణనిస్తుంది; మరికొంత భయాన్ని కలిగిస్తుంది. కాని మనలో మానసిక దాస్యవిముక్తి రానంతకాలం, మనలో ఆత్మవిశ్వాసం లేనంతకాలం, మనలో శాస్త్రీయ దృక్పథం పుంజుకోనంతకాలం, మనం మూఢవిశ్వాసాలు; దైవభీతి విస్మరించనంతకాలం మనల్నివుద్ధరించేవారుండరు. అజ్ఞానాన్నుండి విజ్ఞానవంతులం కావాలి అంటే మనలో హేతుదృక్పథంరావాలి. దానికై నిరంతరపోరాటం సలపాలి.

వస్తువు, శైలి, కథాకథనం, నుడికారం, భావగమనం, వీటిలో ఏదో ఒకదానిలో నయినా సవ్యత లేనిదే రాయడం అనవసరం.

—

మన దృక్పథంలో మార్పు రావాలి.

"సగంమంది బానిసలుగా, సగంమందిస్వతంత్రులుగా ఉండే ఏజాతి అయినా అభివృద్ధి చెందలేదు" అని నీగ్రోల బానిస పరిస్థితిపై వ్యాఖ్యా నిస్తూ ఆక్రోశించాడు అబ్రహాంలింకన్. అలాగే జనాభాలో సగభాగమైన స్త్రీలు బానిసత్వంలోపడి సామాజిక స్పృహలేకుండా పూర్తిగా వంటఇంటికీ పడకటింటికీ పరిమితమై వున్నన్నాళ్ళూ ఈ దేశానికేకాదు యావత్ ప్రపం చానికి విముక్తి లేదు.

ఇంతవరకూ విద్యలో, సాహిత్యంలో, సాంకేతికరంగంలో, శాస్త్రీయ పరిశోధనలలో నిర్మాణ కార్యక్రమాలలో, శాసననిర్మాణంలో వివేకము, విజ్ఞానం ప్రదర్శించాల్సిన రంగాలలో స్త్రీల ప్రాముఖ్యత విస్మరించబడ్డది. అందువల్ల స్త్రీలు పురుషాధిక్య సమాజపు నిరంకుశత్వానికి తలవొగ్గి ముసు గులోనూ, ఘోషాలోనూ తమ జీవితాలను వెళ్ళబుచ్చేవారు. కేవలం లోకం కొసం, పిల్లలకోసం, తిండీ, గుడ్డా, నీడలకోసం వ్యక్తిత్వాన్ని చంపుకొని దిష్టిబొమ్మల్లా బ్రతకటానికి అలవాటుపడ్డారు. గృహిణి ఇంట్లోవారి అవసరా లకు, అహంకారానికి, పరవాలకు ప్రాధాన్యతనిచ్చి తన ఇష్టా ఇష్టాలను, కోర్కెలను చంపుకోవటం త్యాగంగా భావించేది. ఆమె ఎంతగా దాస్యం చేస్తే అంత పతివ్రత అని గౌరవించ బడుతుంది. ఎన్ని కష్టాలసైనా, బాధ లసైనా మూగగా భరిస్తుంటే అంత సాధ్వి, శాంతమూర్తి అని 'టైటిల్సు' ఇస్తారు. మహిళల బానిసత్వ పంజరాన్ని మతం, దైవం, ఆచారం, సంప్ర దాయాలనే బలమైన బంగారు కడ్డీలతో బిగించారు. భర్త అంటే అతని ప్రాముఖ్యత పూర్తిగా భార్యమీద అజమాయిషి చెయ్యటమేననే భావంతో ఆమెను కొట్టటం, చంపటం, దుర్భాషలాడటం, నీచపదప్రయోగాలు ఉప యోగించటంలాంటివి చేస్తుంటారు.

అసలు మనవాళ్ళు గ్రహించనిదొక ముఖ్యవిషయంవుంది. తండ్రి తల్లిపట్ల ఎలా ప్రవర్తిస్తున్నాడో గమనించి తాము అమ్మపై అలాగే

పెత్తనం వహించాలనే భావం ఆ పసివాళ్ళ మెదడులో నాటుకుంటుంది, తదాది ఆ పిల్లలు తాము ఆడవాళ్ళమీద పెత్తనం వహించాలనే భావం స్థిర పడి పోతుంది. క్రమేపీ ఈ ప్రపంచంలో స్వేచ్ఛా వాయువుల్ని పీల్చటానికి పురుషుడే అర్హుడని, ఆడది తనకోసమే జన్మించిందనే భావం ప్రబలి పోతుంది.

పిల్లలలో ఈ మనస్తత్వానికి తండ్రులొక్కరే బాధ్యులుకారు. వర్తమానకాలంలో విద్యావంతులై ఉద్యోగాలు చేస్తున్న స్త్రీలు సైతం దీనికి కారకులు. పిల్లలు ఏదయినా తప్పులుచేసినప్పుడు మీ 'డాడీ' (తండ్రి) తో చెప్తానని వారిని బెదరించడం సర్వసాధారణంగా జరుగుతున్నది. అలాంటప్పుడు తల్లికన్నా తండ్రిగొప్పయని ఆ బాలుడో, బాలికో తలచడం అనివార్యంకదా! ఎందుకిలా ప్రయోజకులైన మహిళలు సహితం ప్రవర్తిస్తున్నారు? అనాలోచిత చర్యలా అవి? లేక నరనరాల జీర్ణించిపోయిన భావాల ప్రభావమా? పైకి ఎంత స్త్రీ స్వాతంత్ర్యంపై వేదికలనెక్కి ఉపన్యాసాలిచ్చినా, తమ అంతరంతరాలలో అణగిమణగిదాగియుండిన స్త్రీ న్యూనతా భావాన్ని వారు వెలికితీసి తమ ఆలోచనాశక్తితో నిర్మూలనం చేయక పోవడంవల్లనే ఇలా సంభవిస్తున్నది. విద్యమాత్రమే చాలదని, ఆర్థిక స్వాతంత్ర్యం మాత్రమే ఉపకరించదని, ఇతర రంగాలలో వ్యక్తిత్వ ప్రదర్శన ఇచ్చట లాభించదని తేలుతున్నది. ఎవరినీ నిదించే ఉద్దేశ్యంతో ఇలా వ్రాయటంలేదు. విమర్శ, ఆత్మ విమర్శ ప్రగతికి సోపానాలు.

పిల్లల పెంపకం విషయంలో, తమనడత విషయంలో, తామువాడే మాటల వరంగా, చేతలసందర్భంగా ఎంతో జాగ్రత్తగా తల్లిదండ్రులు వ్యవహరించలేకపోతే పిల్లల మనస్తత్వం పూర్వంలాగానే పురుషాధిక్యత వైపు మొగ్గుతుంది. దీనివల్ల ఈ తరమేకాక ముందుతరాలు కూడా దెబ్బతింటాయి. నారీలోకం విపరీతంగా నష్టపోతుంది. ఈ ప్రమాదాన్ని అరికట్టాలంటే మనందరిలో స్త్రీ పురుషులలో-దృక్పథంలో మార్పురావాలి! మార్పు కనుగుణమైన ఆచరణకావాలి.

హిందూ వారసత్వ సవరణ బిల్లు: ఒక పరిశీలన

హిందూ స్త్రీలకు పురుషులతో సమానంగా ఆస్తి హక్కును ప్రతి పాదిస్తూ 18-3-1983 న ఒక బిల్లును ప్రవేశ పెట్టింది ఆంధ్ర ప్రభుత్వం. 1956లో హిందూవారసత్వ విధానంలో ఆమోదించబడిన చట్టాన్ని ఈ బిల్లు సవరణ చేస్తుంది. ఈ బిల్లు ఉపక్రమణిక (Preamble) లో చెప్పిన సూచనలు పిత్రార్జితపు ఆస్తిలో ఆడపిల్లకు భాగంలేనందువల్ల వరకట్న పిశాచం పుట్టి అది సాంఘిక దురాచారంగా మారింది. హిందూసమాజంలో స్త్రీల పరిస్థితిని మెరుగుపర్చటానికి రాజ్యాంగంలో పొందుపరచిన సమానత్వ సిద్ధాంతానికి పురుషులతోపాటు స్త్రీలకు హక్కు ఇవ్వబడుతుంది. సమానత్వం అనేది మౌలిక హక్కుగా రాజ్యాంగంలో రాయబడింది కనుకనూ, కూతురికి పిత్రార్జితంలో తండ్రి, కొడుకులతోపాటు ఆస్తి హక్కులేకపోవడం తద్విరుద్ధం కనుకనూ, అది వరకట్న దురాచారానికి దారి తీసింది కాబట్టి ఈ దుర్నీతిని రూపుమాపటానికి ఈ బిల్లు ప్రవేశపెట్టబడిందని ఈ బిల్లు లక్ష్యాలు సూచించాయి. ఆంధ్రగెజెట్‌లో ప్రకటింపబడిన తేదీనుండి ఈ బిల్లు అమల్లోకివస్తుందని, దానికి ముందుగా ప్రెసిడెంటు సమ్మతి కావాలని బిల్లులోవుంది.

బిల్లులోని ముఖ్యాంశాలు:-

1) కుమారునకు ఎలాంటి ఆస్తి హక్కులున్నాయో కుమార్తెకు కూడా అలాంటి హక్కు ఈ బిల్లుద్వారా సంక్రమిస్తుంది.

2) అంతకు ముందు చనిపోయిన కొడుకు సంతానానికి పిత్రార్జితపు ఆస్తిలో వాటావుండేది. ఇప్పుడు అలాంటి కూతురు సంతానానికికూడా వాటా వస్తుంది. దాని మీద సర్వహక్కులూ వారికి వుంటాయని పేర్కొన్నది ఈ బిల్లు.

3) పిత్రార్జితపు ఆస్తి నివాసానికి పూర్తిగా వాడుకునే ఇల్లయితే ఆ ఇంటిని పురుషులు పంచుకుంటేగాని కూతురు అడగటానికి హక్కులేదు. కాని ఒక ప్రక్క ఆమె మాత్రం నివసించవచ్చు. అదైనా ఆమెకు పెండ్లి కానప్పుడు, విధవరాలయితే, భర్త విడచిపెడితే, భర్తనుండి వేరుగావున్నప్పుడు ఆ ఇంట్లో ఆమె వుండవచ్చు.

4) ఈ ఆస్తిని గురించి ఆమె వీలునామా రాయవచ్చు.

5) పిత్రార్జితం పంచుకోకుండా ఆమె చనిపోతే ఆ ఆస్తి భర్తకురాదు. ఇది ఈ బిల్లుయొక్క సారాంశము. ఈ బిల్లు 1956 నాటి వారసత్వ చట్టాన్ని సవరణచేస్తుంది కనుక అప్పటినుండి అమల్లో వున్న స్త్రీల ఆస్తి హక్కును వివరించక తప్పదు.

హిందువుల్లో తండ్రి, కొడుకులూవుంటే, ఆ సమిష్టికుటుంబం వారికి పిత్రార్జితపు ఆస్తివుంటే, తండ్రి చనిపోతే ఆ తేదీన పంపిణీ జరిగినట్లుగా ఊహించుకొని తండ్రివాటా నిర్ణయిస్తారు. అతడు వీలునామా రాయకపోతే ఆస్తి కుమారులకు, కుమార్తెలకు, అతని తల్లికి, భార్యకు సమాన వాటాలుగా సంక్రమిస్తాయి. ఇది 1956 నుండి అమల్లోకి వచ్చిన శాసనం. 1937 తరువాత 1956 లోపల చనిపోయిన అతని వంతు ఆస్తి అతని భార్యకు వచ్చేది. స్వార్జితపు ఆస్తిలో అతని కొడుకులతో అతని భార్యకు సమానవాటా వచ్చింది. అయితే అనాడు ఆమెకు జీవితకాలపు హక్కుమాత్రమే వుండేది. 1956 తరువాత చనిపోయిన అయన భార్యకు ఆమె వాటా సర్వహక్కులతో వచ్చింది. అయితే అంతకుముందు కూతుళ్ళకు జన్మతఃవచ్చేదికాదు. ఇప్పుడు ఈబిల్లువల్ల కూతుళ్ళకు కూడా వస్తుంది.

బిల్లులో చేర్చవలసిన విషయాలు:-

1) 1956 నుండి అమల్లోవున్న చట్టంవల్ల జీవితకాలపు హక్కుకు బదులు భార్యకు సర్వహక్కులూ వచ్చాయి. కాని ఆమె వాటా మాత్రం నీరు కారి పోయింది. ఈనాటి శాసనం ప్రకారం ఒక కుటుంబంలో **A, A** కు

ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు, భార్య తల్లీ, ఉన్నారను కుందాం. A పిత్రార్జితపు ఆస్తిని తన కుమారులతో పంచుకోకుండా చని పోతే అతని ఆస్తి $\frac{1}{4}$ వంతు (అతడుము+గ్గురు కుమారులు = 4) వాటాను పై చెప్పిన అందరూ పంచుకుంటారు. అంటే A భార్యకు $\frac{1}{8}$, A తల్లికి $\frac{1}{8}$, కుమారుడికి ఒక్కొక్కడికి $\frac{1}{4}$, కుమార్తె ఒక్కొంటికి $\frac{1}{8}$ అతని వాటాలో వస్తాయి. అంటే మొత్తంలో $\frac{1}{4} \times \frac{1}{8} = \frac{1}{32}$ వస్తుంది. అంటే A భార్యకు $\frac{1}{32}$ సర్వహక్కులతో వస్తుంది. A కుమారులకు జన్మతః $\frac{1}{4}$ వేరే వస్తుంది. కనుక, 56 సవరణవల్ల స్త్రీకి లాభించేవాటా అత్యల్ప మయింది.

ఈనాటి బిల్లు ప్రకారం A, అతని ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు 'కోపార్సనరీ'లో భాగస్తులు. అంటే ఒక్కొక్కరికి మొత్తంలో జన్మతః $\frac{1}{7}$ వస్తుంది. A వాటాలో A భార్యకు మొత్తంలో $\frac{1}{7} \times \frac{1}{8} = \frac{1}{56}$ వస్తుంది. A పిత్రార్జితపుఆస్తిని కష్టపడి వృద్ధిచేసిన A భార్యకు ఈబిల్లు చేసిన 'మహోపకారం' ఇది.

ముస్లిం లా ప్రకారం సంతానం లేని స్త్రీకి $\frac{1}{4}$ వంతు, బిడ్డ లుంటే $\frac{1}{8}$ వంతు భర్త ఆస్తిలో సర్వహక్కులతో సంక్రమిస్తుంది. మిగతా ఆస్తిలో కూతురుకు రెట్టింపువాటా కొడుకుకు చెందుతుంది. కనుక ఇస్లాంలో భార్యకు తక్కువ వాటా ఒకటి కొడుకు వాటాలో సగం కూతురికి రెండువిధాలా స్త్రీకి న్యాయం జరగటంలేదు. క్రైస్తవులకు వర్తించే 1925 భారత వారసత్వపు శాసనం ప్రకారం భార్యకు $\frac{1}{3}$ వంతు వస్తుంది. సంతానం లేని స్త్రీకి సగం వాటాకు హక్కువుంది. మొత్తంమీద అన్నిమతాల వారసత్వ సూత్రాలు భార్యలకు అంతగా లాభం చేకూర్చటంలేదు.

భార్యవాటా పెంచటం విషయమై ఈ బిల్లులో ఉదహరించలేదు. కూతుళ్ళ విషయం ప్రస్తావనవుంది. కాని భార్యవాటా విషయం గమనించక పోవటం శోచనీయం. A వీలునామా రాయకుండా చనిపోతే పిత్రార్జితపు ఆస్తిలోని అతని వాటాలోగాని, స్వార్జితపు ఆస్తిలోగాని సగం A భార్యకు-పిల్లలున్నా సరే కేటాయించాలి. దానికి అనుగుణంగా 1956 వ చట్టపు 8వ సెక్షన్‌ను తగువిధంగా సవరించాలి. ఇది అవశ్య కర్తవ్యం.

ఈనాటి బిల్లులోని పొరపాట్లు ఏమిటి? వాటిని ఎలా సవరించాలి అనేది నేటి ప్రశ్న.

1) 1వ సెక్షన్ 3వ క్లాజులో, ఈ బిల్లు చట్ట రూపందాల్చినా, గెజెట్‌లో ప్రకటించబడిన తేదీనుండి మాత్రమే అమల్లోకి వస్తుందనటం అన్యాయం; అవివేకం. 18-12-1932 నుండి అమల్లోకి వస్తుందని మార్చాలి. లేనిచో చాలామంది పంపిణీలు చేసుకొంటారు.పంపిణీకి హద్దులువేసుకొని చేసుకో నక్కరలేదు. నోటిమాటరీత్యా తండ్రి, కుమారులు విభక్తులు కావచ్చు. అప్పుడు "కోపార్సనరీ" ఉండదు కనుక, కూతుళ్ళకు ఏ మాత్రం ఆస్తిరాదు. అందువల్ల బిల్లు ప్రకటించిన తేది 18-3-83 నుండి ఒక సంవత్సరం వెనుకనుండి 18-3-82 నాటికే ఈ బిల్లు అమల్లోకివచ్చినట్లు ఎంచుకోమనే సవరణ చాలా అవసరం.

2) సెక్షన్ 29 **A** చివరిలో సమిష్టి హిందూ కుటుంబంవారు కాపురానికి పూర్తిగా వాడుకునే ఇంటి విషయంలో ఆడపిల్లకు కొన్ని ఆంక్షలువున్నాయని చెప్పుకున్నాం. ఆమె భర్తతో ఆ ఇంట్లో నివాసానికి అనర్హురాలు. ఇది అన్యాయం; ఇది కూతురికి కొడుకుకు మధ్య వివక్ష, కోడలుకూ అల్లుడికి మధ్య వివక్ష. అంటే కొడుకు తన భార్యతో ఉండవచ్చు;కూతురు తన భర్తతో కాపురముండే అర్హతలేదు. అల్లుడూ కోడలూ,'కోపార్సనరీ' కి పరాయి వాళ్ళయినప్పుడు ఈ తేడా న్యాయమా?

3) సెక్షన్ 29 **B** లో కూతురు అవిభక్తురాలిగా చనిపోతే, ఆమెకు పిల్లలు లేకుండా భర్త మాత్రమే ఉంటే "కోపార్సనరీ"లో ఆమె వాటా ఆమె భర్తకు చెందకుండా తండ్రికి లేక సోదరీ సోదరులకు చెందుతుంది. 1956 చట్టం సెక్షన్ 6 ప్రకారం కుమారుడు 'కోపార్సనరీ' లో భాగస్తుడుగావుండి చనిపోతే అతనివాటా కొంత అతని విధవకు చెందుతుంది. ఈ బిల్లు ప్రకారం కూతురు ఆస్తి ఆమె భర్తకురాదు. ఇలా తేడాలు చూపడం ఉపక్రమణికలో చెప్పిన సమానత్వం అనే లక్ష్యానికి విరుద్ధం. ఇలావుంటేనే కూతురుకు భద్రత అనివాదిస్తున్నారు కొందరు. కాని వివాహం కాగానే గాని వివాహానికి పూర్వంగాని అల్లుడు ఆమె చేత

నోటీసు ఇప్పించి ఆమెను విభక్తురాలినిచేసే ప్రమాదం ఎలాగూవుంది. కనుక ఇది సహేతుకమైన అభ్యంతరం కాదు.

ఈ బిల్లు 1956 చట్టం ఆస్తుల (Blending) కలుగలుపు సూత్రాన్ని మార్చలేదు. అంటే ఎవరైనా ఆస్తిసంపాదించి కుటుంబాస్తిలో కలిపితే మొత్తం "కోపార్సనరీ" ఆస్తి అవుతుంది. నేటి బిల్లు వల్ల ఆడపిల్ల "కోపార్సనరీ" అవుతుంది. ఆమె ఆస్తి పుట్టింటి ఆస్తితో కలిపితే ఆమె నష్ట పోతుంది. కనుక ఎట్టి పరిస్థితిలోనూ కూతురి ఆస్తికి కలగలుపు సూత్రం వర్తించదని స్పష్టంగా ఒక నిబంధన ఏర్పరచాలి. ఇవి నిర్మాణాత్మకమైన సూచనలు.

ఈ బిల్లు కేవలం హిందూ స్త్రీలకే వర్తిస్తుంది. ఇది చాలా ఘోరం. కనుక ఇస్లాం, క్రైస్తవ శాసనాలుమార్చి కామన్ సివిల్‌కోడ్ (Common-civil code) ప్రవేశపెట్టి ఈ ఆస్తి హక్కును వారికికూడా చెందేలా చెయ్యాలి. 1950 నాటి రాజ్యాంగంలో 44 అధికరణంలో ఒకే వ్యవహార సంహిత సృష్టికరింపబడి 33 సంవత్సరాలైనా ఇంకా ప్రయత్నించకపోవటం శోచనీయం.

ఈ బిల్లు చట్టమైతే వ్యవసాయభూములు ముక్కలు చెక్కలవుతాయని ఇళ్ళు గదులుగా మారతాయని; పరిశ్రమలు చిన్నాభిన్న మవుతాయని; కుమారుడు తిలోదకాలకు కర్తకాడని; వంశాలు, కుటుంబాలు చెల్లాచెదరై పోతాయని ముఖ్యంగా తల్లిదండ్రుల బాధ్యత కుమారుడు స్వీకరించడని తర్జన, భర్జనలు చెలరేగుతున్నాయి. ఈ వింతడవాదాలు సర్వసామాన్యాలే కదా! 1956 లో హిందూకోడ్ బిల్లు పార్లమెంటులో చర్చకొచ్చినప్పుడు స్త్రీలు సైతం ఆస్తి హక్కు తమ కొద్దని వ్యతిరేకిస్తూ కరపత్రిస్వామీజీ ఆధ్వర్యంలో అలజడిచేసి మాన్పించలేదా! ఆ బిల్లు ముక్కచెక్కలై పోలేదా! అలాంటి తిరోగమన వాదులు సర్వకాలాల్లోనూ వున్నారు.

ఇక ఈ బిల్లు వల్ల వరకట్నం పోతుందా అనే అపహాస్యం వినపడుతుంది. అంతేకాదు ఇటు కట్నం ఇవ్వాలి అటు ఆస్తివాటా ఇవ్వాలి; ఇక మగబిడ్డకు మిగిలేది నెత్తిన ముసుగే అంటున్నారు అనేకమంది. అసలు

కట్నం తీసుకోవడం అనేది మన మనస్థత్వంమీద ఆధారపడి వుంటుంది. ఆస్తి పరులైన ఆడ పిల్లలయినా, విద్యావంతులైన యువతులైనా, ఉద్యోగినులైన మహిళలకైనా కట్నం ఇవ్వక తప్పడంలేదు. మగాడికి కట్నం గౌరవచిహ్నంగా మారింది. ఆడపిల్లలను కన్నవారికి అదొక జరిమానాగా మారింది. దానికి కారణం స్త్రీ పురుషుల మధ్య వ్యత్యాసం; ఆడదంటే అనాదరణ, అలుసు, ఆమెకే భర్తకావాలేమో! మరి పురుషులకు భార్య లొద్దేమో! ఆలోచించాలి. అప్పుడే కట్నకానుకలు కాక "క్రొత్త బిల్లు తెలుసా? ఆస్తి పిల్లపేర పెట్టాలిసుమా!" అనే హెచ్చరికలు వింటున్నాం. కనుక చట్టాలకు కట్నాలుపోవు. మునుపున్న చట్టాలవల్ల స్త్రీలు ఏ మాత్రం లాభించారు? చట్టాల విలువ తెలుసుకోగలస్తోమత స్త్రీలకు లేనందువల్లనే ఈ పరిస్థితి ఏర్పడింది.

అసలు ఏ హక్కులు అయినా అనుభవించకపోతే అవి నశిస్తాయి. **(Deadrights)** అవుతాయి. చట్టం అంటే అదొక అగ్నిలాంటిది. అది ఆహారాన్ని పక్వం చేస్తుంది; ఇళ్ళను తగులపెడుతుంది. కనుక చట్టాలను గౌరవించటం, అనుభవించడం అదొక విజ్ఞత.

ఈ ఆస్తిహక్కువల్ల స్త్రీకి కొంతరక్షణ, ఆత్మస్థయిర్యం, వ్యక్తి వికాసం వస్తాయి. ఈ బిల్లులో కొన్ని లోపాలున్నా ఇది చాలా ఉత్కృష్టమైనది. అయితే ఇలా సవరణలు చేయడంకన్నా పూర్తిగా స్త్రీల ఆస్తిహక్కుకు ప్రత్యేక చట్టంచేస్తే బాగుండేదేమో! ఏది ఏమయినా, ఈ బిల్లు పెట్టిన ఘనత ముందుగా ఆంధ్రప్రభుత్వానిదేకనుక వారిని శ్లాఘించాలి.

ఒకే వ్యవహార సంహిత ఏర్పడేవాకావేచి వుండేకన్నా ఇలాంటి విప్లవలక్షణాలున్న బిల్లులు ఇతర రాష్ట్రాలలో రావాలి. కేంద్రంచేపట్టాలి. తదితర మతాల స్త్రీలకు లాభించే శాసనాలు కావాలి.

నలిగిన న్యాయం

అదిచక్కని పల్లె,
బారులయిన వీథుల్
తీర్చిదిద్దిన ఇళ్ళు,
అందంచక్కని పడుచు.

నిన్నగాక మొన్న
తరలివచ్చింది తను
అత్తవారింటికి
అతి సంరంభంతో.

మేళాలు తాళాలు
మిన్ను ముట్టాయి
ముత్తయిదువులంతా
మురిపాన ఇచ్చారు హారతి.

నునుసిగ్గు, గొంకు భయము
మనమున ముప్పిరిగొనగా
అడుగిడినది ఆ యమ
అత్తింట అతి సంభ్రమంగా

ఒడిలో బియ్యం
మెడలో సూత్రం
ఎదలో భయం
ఆ యమ రూపం

చూచింది ప్రీతితో పతిని
చూచింది వణుకుతో అత్తనూ
మరుదులన్ వదినలన్
ఆడబిడ్డలన్ ఆదరాన.

వీడి వచ్చినది ఉన్న ఊరిని
వీడి వచ్చినది తనవారిని
వీడి వచ్చినది సంగాతగాళ్ళను
వీడి వచ్చినది ఆటపాటలన్.

తెలియని సంతోషం
ఊహించని భయం
అదేమో అనుమానం
అసలే క్రొత్తదనం.

ఎవరున్నారు తనవారూ
ఏరీ నా యనువారూ
రానే వచ్చాడూ
తన తోడూనీడా.

ఎగిరి పోయినది వ్రీడా తనం
తొలగి పోయినది సంకోచం
సేద దీరినది హృదయం
కరిగి పోయినది స్వాంతం.

గడిచాయి రోజులు
సాగాయి మాసాలు
ముద్దు మురిపాలతో
మోహ భావనతో.

వీచింది ఊదరగాలి
ఎగిరింది ఆకాశంలో
తన హృదయ పటలం
చీకాకయింది జీవితం.

భర్తగాడతడు ఘోరవ్యాఘ్రం
అత్తగాదామె క్రూరసర్పం
ఆడబిడ్డగాదామె సృగాలం
తానేమో మూగజీవం.

గాండ్రించాడు భర్త
చాలీచాలని కట్నం
బుసకొట్టింది అత్త
పేలవమైన లాంఛనాలు.

ఈసడించింది ఆడుబిడ్డ
గుసగుసపోయింది తోటికోడలు
నోరునొక్కుకుంది మరదలు
వికవికలు పోయాడు మరిది.

భరింప లేని వేదన
తరింప లేని జీవనం
కన లేని కాంతుడు
విన లేని శ్వశురుడు.

పంజరం లోని పక్షి
కారాగారం లోని బందీ
జ్యూ లోని మృగం
తన రక్షణ మృగ్యం.

కలయ చూచింది ఇంటా
వెదకి చూచింది బయటా
ఎందు చూచినా శూన్యం
సహాయ సాధనం.

అది కాళ రాత్రి
అది భయానక రాత్రి
వాటేసుకున్నది వ్యాఘ్రం
కాటేసినది కాలసర్పం.

అతిలోక భయానకం
ఆమె రూపం,
స్రవించెను కన్నుల రక్తం
కంపించెను శరీరం.

పట, పట, పట
ఫెళార్భటులతో
విదిలించెను విభుని
అదలించెను అత్తను.

కంట పడెను కత్తిపీట
వెంట పడెను వేగంగా
వేసిన వేటుకు విభుని
సాగనంపెను సత్వరంగా.

మరదలు పిల్లా
అత్తా మామా
పారి పోయిరి
బ్రతుకు తీపితో.

సగం కాలిన దేహంతో
సగం మండిన చీరెతో
సగం మాడిన జుట్టుతో
సగం నిండిన జీవితంతో.

పరుగిడింది
పోలీసు స్టేషనుకు,
చెప్పిన నిజానికి
చేటు వచ్చింది తనకూ,

మనిషైతే బ్రతికింది
కేసయితే మిగిలింది
న్యాయం బుగ్గి అయింది
తను చెరసాల పాలయింది.

మహిళా దశాబ్ధము

మతదృష్టిలో ఆడది అందాలబొమ్మ

మతాలన్నీ స్త్రీని విధేయత చూపమని నిర్దేశించాయి. వ్యక్తిత్వం లేని ఆటబొమ్మగా చిత్రించాయి. మత దృష్టిలో ఆలోచించేవాడికన్నా ఆరాధించేవాడే అధికుడు;ప్రశ్నించేవాడికన్నా ప్రణమిల్లేవాడేమహనీయుడు. మతం అంధ విశ్వాసాలను పోషిదిచేస్తుంది, అసహనాన్ని పెంపొందిస్తుంది. ఆవేశకావేషాలకు దారితీస్తుంది. విశ్వాసం, విజ్ఞానం బద్ధశత్రువులు, రెంటికీ యెడతెగని పోరాటం జరుగుతూనేవుంది. భావవాదం భౌతిక వాదాన్ని కాలరాస్తున్నా దాని ప్రభావం పెరుగుతూనేవుంది. అజ్ఞానం, అవిద్య పెరిగేకొద్ది మత ప్రాబల్యం విజృంభిస్తుంది. నెలకు పన్నెండు కోట్లరూపా యలు తిరుపతి ఆదాయమంటే మనలో భావదాస్యం ఎంత ప్రబలంగా వుందో చెప్పగలం.

అభ్యుదయం, అభివృద్ధి, ఆధునికతలలో ప్రపంచ వ్యాప్తంగా ఈనాడు గణనీయమైన మార్పులొచ్చినాయి.విశ్వజనీనత కావాలంటున్నాం. విశ్వమానవతకై ఆరాటపడుతున్నాం. విజ్ఞానశాస్త్రం విశ్వవీథుల్లో విహ రిస్తోంది. సాంకేతికరంగం సహస్రరీతుల్లో పరిఢవిల్లింది. ఖగోళ పరిజ్ఞానం అనంతంగా పెరిగి ఈనాడు చంద్రుడి నెత్తిన కాలుపెట్టాం కాని, సామాజిక మైన కబంధ హస్తాలలో మానవుడు బందీగానే మిగిలిపోయినాడు. సంప్ర దాయమైన సాంఘిక కట్టుబాట్లలో మౌలికమైన మార్పురాలేదు. పురుషుడు సమాజానికి, మతానికి బందీ అయితే-స్త్రీ సమాజానికి, పురుషుడికి కూడా బానిసయింది. అంతేకాదు-ఆర్థిక, రాజకీయ,సాంస్కృతిక రంగాలు ఆమెను దోపిడీ చేస్తున్నాయి. నేటిమహిళ పురుష దురహంకారానికి బలి అయిపో తోంది. స్త్రీ అంటే కేవలం పురుషుని భోగ్యవస్తువుగాను, బిడ్డల్ని కనే యం త్రంలా నిలిచిపోయింది. కుటుంబం, గృహం మాత్రమే ఆమె పరిధిలో వుంటై. అదయినా భర్త ఆజ్ఞలకులోబడి సేవకే పరిమితమైనాయి. ఆఖరికి ఆమె ఎందరు బిడ్డల్ని కనాలో భర్తే నిర్దేశిస్తాడు. అంటే ఆమె శరీరంపై ఆధిపత్యం వహించేది కూడా పురుషుడే.

ఆ జన్మాంతం ఆమెకు రక్షణ కావాలని, బైటికిపోతే చెడిపోతుందని ఒక దురభిప్రాయం స్త్రీ పురుషులలో తరతరాలుగా నరనరాన జీర్ణించిపోయింది. గర్భస్థశిశువు మగబిడ్డ కావాలని మొక్కుకోవటం, ఆశించటం జరుగుతోంది. ఆడపిల్ల తక్కువ అనే భావం ప్రబలంగావుంది. పుట్టుకకుముందే స్త్రీ పురుష వివక్షత ప్రారంభమౌతుంది. తదాది ఆమె జీవితాంతం అణగిమణగి, విధేయత చూపాలనే 'బ్రెయిన్ వాషింగు' బ్రహ్మాండంగా జరిగింది. మత గ్రంధాలన్నీ స్త్రీని హీనంగా చిత్రించాయి. చట్టాలు, సాంఘిక కట్టుబాట్లు ఆనాడు మనువు చేశాడు. నేడు శాసనసభ్యులైన పురుషులు తమకు అధిపత్యాన్నిచ్చేట్లుగా శాసనాన్ని చిత్రించుకొంటున్నారు. అలా నిరంకుశ అధికారయుతమైన హక్కుగల పురుషులు స్త్రీని బానిసను చేశారు. నిస్సహాయులైన అబలలు అదే మోక్షమని నమ్మి ఆచరిస్తున్నారు. అందువల్లే స్త్రీని బలాత్కరించటం తేలికయింది. కన్యాదానం ఆచారమయింది. వరకట్నం సంప్రదాయమయింది. కట్నమిచ్చికొనుక్కొన్న స్త్రీ బానిసవుతోంది. అమ్ముడబడిన పురుషుడు యజమాని అయి ఆజ్ఞాపిస్తున్నాడు. ప్రపంచం మొత్తం మీద భర్తలు భార్యలను కొట్టటం, హింసించటం, చంపటం లాంటివి రోజూ వందల సంఖ్యలో జరుగుతున్నాయి. స్త్రీ వీటిని మూగ జీవిలా సహించటం జరుగుతోంది. ఈ దారుణాలనే పవిత్రంగాను, పతివ్రతాలక్షణంగాను సినిమాలుతీసి సంచులు నింపుకుంటున్నారు నిర్మాతలు. సాహిత్యపరంగా రచనలు చేసి దోసిళ్ళతో ఆర్జిస్తున్నారు రచయితలు. ఆ సినిమాలు చూచి, ఆ నవలలు చదివి సొమ్ముచెల్లించి స్త్రీ జాతికి ఇదేగమ్యం, మోక్షం, ఆచరణ యోగ్యమని శ్లాఘిస్తోంది నారీలోకం. ఇలా సాంస్కృతిక పరమైన దోపిడీకి గురయింది నాటిస్త్రీ, నేటిస్త్రీకూడా.

అసలు అంధవిశ్వాసాలవల్లే అణగారి పోతోంది మహిళాలోకం. పురాణాలు, సాహిత్యం, సాంఘిక కట్టుబాట్లు స్త్రీల పరిస్థితిని మెరుగుపరిచేవికావు. స్వతంత్రాలో చనాశక్తిని ప్ర[illegible]దించేవి అంతకన్నాకావు.

నిద్రాణమైన స్త్రీ జాతిని మేల్కొలుపుటే స్త్రీ విమోచన. ఆమె తన బానిస సంకెళ్ళనుండి బైటపడటమే సామాజిక ప్రగతి. సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక రాజకీయ కార్యక్రమాల్లో స్త్రీ భాగస్వామ్యం వహించుటే దేశానికి

భవిష్యత్తు. లేనిచో దేశం, సమాజం పక్షవాతకృశీభూతమౌతుందనక తప్పదు. కనుక స్త్రీ విముక్తికోసం కార్యక్రమాలను, మార్గాన్వేషణను చేయాలి.

స్త్రీ విముక్తి అన్నా, స్త్రీ ఉద్యమం అన్నా పురుషద్వేషంకాదు. ఆమెకు ఏర్పడ్డ బంధాల నుండి ఆమెకు విముక్తికావాలి; మత పరమైన అసమానత్వం నుండి స్త్రీ బయట పడాలి. సాంఘిక దురాచారాలనుండి స్వేచ్ఛకావాలి అని ఆశించడమే. ఆమె కుటుంబానికే అంకితంకాకుండా సామాజిక సేవలో పాల్గొనే అవకాశం ఇవ్వాలి. గర్భస్రావానికి ఆమెకు హక్కుకావాలి. అన్నిమతాల వారికి ఏకపత్నీత్వం విధిగా చట్టరూపంలో రావాలి. స్త్రీకి విద్యా, ఉద్యోగాలలో సమాన అవకాశాలు వుండాలి. ప్రజా ప్రాతినిధ్యంలో నిష్పత్తిగా స్త్రీలకు భాగస్వామ్యం కావాలి. అవివాహిత మాతల పిల్లలకు చట్టపరమైనహక్కు, సాంఘికహోదా వుండాలి. ఇష్టంలేని వివాహ విచ్ఛేదానికై స్త్రీకి ఆరునెలలలోపలే విడాకులు ఇవ్వాలి. విడాకుల సమయంలోఉన్న ఆస్థిలో ఆమెకు వాటా ఇవ్వాలి. శారీరక దాడికి లోనయ్యే అత్యాచారాలు మానభంగాలు, కొట్టటం, తిట్టడం కాల్చటం, చంపటం లాటివి పోవాలి. కుటుంబ పనులలో పురుషుల తోడ్పాటువుండాలి. ముఖ్యంగా స్త్రీకి పురుషుతోసమానంగా ఆస్థిహక్కువుండాలి.స్త్రీ విమోచనచాలా క్లిష్టమైనది; అతికష్టమైనదికూడా. కనుక స్త్రీలే చొరవతీసుకోవాలి. విజ్ఞానం, మేధస్సు కల పురుషుల తోడ్పాటుచాలాముఖ్యం. అసలు స్త్రీ విముక్తి అంటే పురుష విమోచనేనని పురుషులు గ్రహించాలి. ఆనాడే దేశానికి, సమాజానికి, ప్రగతి వుంటుంది.



మ హి ళా ద శా బ్దం

మానవాళి అంతా ఒక జాతి. స్త్రీలు అందులో సగభాగం. ఐనా చాలా దేశాలలో, పారిశ్రామికంగా అభివృద్ధిచెందిన దేశాలలో కూడా స్త్రీలకు సముచిత స్థానంలేదు. స్త్రీ పురుషుల నరనరాల్లో, అంతరాంతరాల్లోనిండిని బిడీకృత మైన భావం ఒకటే; పురుషుని కన్నా స్త్రీ తక్కువ అనేదే అది. కొన్ని దేశాలలో సాంఘికంగా, సాంస్కృతికంగా సమానత్వాన్ని పాటిస్తారు కాని, రాజకీయాలలో, పరిపాలనా వ్యవస్థలో చోటు పెట్టరు. సమానత్వం ఏదేశంలో కూడా సంపూర్ణంగాలేదు. స్త్రీ కూడా పురుషునిలాగా ఒక వ్యక్తి అని గుర్తించని దేశాలు కో కోల్లలు. అవి సాంస్కృతికంగా మధ్య యుగంలోవున్నట్లే. మనదేశం ఈ కోవకు చెందింది.

ప్రపంచంలో 160 పైగా దేశాలు ఉన్నాయి. ఐక్యరాజ్యసమితిలో 143 దేశాలకు సభ్యత్వం లభించింది. ఐ. రా. స. రాజకీయ కార్యక్రమాలపై బహుళ ప్రచారం సాగుతున్నది. కాని సాంఘిక, సాంస్కృతిక విషయాలపై విశేష ప్రచార వ్యాప్తి జరుగలేదు. మానవహక్కుల పత్రం (Human Rights Charter) లోని స్త్రీల హక్కుల విషయికంగా 1975ను అంతర్జాతీయ మహిళా సంవత్సరంగా ప్రకటించటం గమనార్హము. స్వేచ్ఛ, సమానత్వం, అభివృద్ధి, శాంతి అనేవి మహిళా సం॥ ప్రాతిపదిక సూత్రాలు. వాటిపై ప్రపంచ మహిళల స్థాయిని పెంచి కుటుంబంలో, స ం ఘ ం లో స్త్రీలకు సమాన ప్రతిపత్తి, స్వేచ్ఛ నివ్వాలని, సాంఘిక ఆర్థిక రాజకీయ సాంస్కృతికరంగాలలో స్త్రీలను సమాన భాగస్తులగా పరిగణించాలని, తద్వారా ప్రపంచ శాంతి పరిరక్షణ జరగాలని అంతర్జాతీయ మ హి ళా సంవత్సర లక్ష్యాలు. ముఖ్యంగా మహిళా ప్రతిపత్తిపై ప్రపంచ రాజ్యాల దృష్టిని నిల్పడంకోసం, ఐ. రా. స. వారు మహిళా సంవత్సరాన్ని ప్రతిపాదించారు. మహిళలకు తమ హక్కులు, బాధ్యతలు తెలియజేయడం ఆ సంవత్సర కార్యక్రమాల ముఖ్యబాధ్యత. దానికి మూడు ముఖ్య భూమికలున్నాయి, మొదటిది, స్త్రీ పురుష సమానత్వం ప్రతిపాదించి త ద్వా రా సాంఘిక, ఆర్థిక, రాజకీయ సాంస్కృతిక పరంగా స్త్రీలు తమ స్థాయిని, స్థానాన్ని, హోదాను అనుభవించడం. రెండవది, ప్రపంచ శాంతి స్థాపనకై

మహిళలు శ్రద్ధవహించటం, అందులో భాగస్వామ్యం వహించడం. దేశ దేశాలమధ్య శాంతి స్థాపనకై తమ శక్తి యుక్తులను వినియోగించుటం మూడవది. ఈ సందర్భంగా స్త్రీల సామాజిక, ఆర్థిక స్థాయిని పెంచే కొన్ని ప్రయత్నాలు జరిగినయి. కొందరు ఇది చాల ఉపయోగమని శ్లాఘిస్తే, మరి కొందరు శుద్ధదండగ, అనవసరమని అధిక్షేపిస్తూ 'ప్రపంచ మహిళ లందరికీ బాధలున్నాయా!' అని ఎత్తిపొడవడం జరిగింది. అలావాదించె వారికి అసలు ప్రపంచ స్త్రీ అందరిపరిస్థితి తెలిస్తేనేగదా!

పాశ్చాత్యదేశాల్లో సైతం స్త్రీని ఎలా చూస్తున్నారో ముందు విచారిద్దాం. ఆయాదేశాల్లో స్త్రీలను రెండో తరగతి పౌరులుగాఎంచి, చివరి 'బెంచీ' మీద కూర్చోమంటున్నారు. వారూ మహిళా విమోచనోద్యమాల ద్వారా పోరాటాలు సాగిస్తూనేవున్నారు. బ్రిటన్‌లో ఆక్స్‌ఫర్డు యూనివర్శిటీలో స్త్రీలకు ప్రొఫెసర్ల పదవులే ఇవ్వరు సరికదా, ఆఖరికి కాలేజీల్లో కూడా నిన్న మొన్నటిదాకా ఇచ్చేవారుకారు. చట్టరీత్యా బ్రిటిష్ శాసనాలలో స్త్రీలకు ప్రధానమైన హక్కులు 1854 వరకు ఏమీలేవు. ఇంగ్లాండులో స్త్రీలకు 1918 దాకా వోటుహక్కు ఇవ్వలేదు. ఆ స్త్రీలు ఓటు హక్కుకోసంపడ్డ ఇక్కట్లు, చేసినత్యాగాలు అశేషం. ఆనాటి చట్టరీత్యా భార్య సంపాదనంతా భర్తకే చెందుతుంది. అన్ని విధాలా ఆమె లోపడి వుండాల్సిందేకాని ఆమెకుప్రత్యేక ఆస్థిత్వంలేదు. ఉద్యోగంచేసే చోటుకెళ్ళి భార్య జీతంతాను తెచ్చుకొనేహక్కు భర్తకు వుండేది. కాని భార్య యొక్క పోషణ భారం భర్తకు వుందని చెప్పే అధికారం ఆఖరికి కోర్టులకు కూడా లేదని స్త్రీకి సమాన హక్కులు కావాలని పోరాడిన బార్బరాలేస్మిన్ తన పుస్తకంలో రాసింది. అలాగే 19వ శతాబ్దంలో కూడా స్త్రీకి చిన్నచిన్న ఉద్యోగాలు నర్సులు, టైపిస్టులు లాంటివితప్ప డాక్టర్లుగా, లాయర్లుగా, ఇంజనీర్లుగా స్త్రీలు అనర్హులని ప్రకటించారు. భార్య జీతంతో భర్త తప్పతాగినా అడిగే హక్కులేదు. 1870లో విడాకుల చట్టాన్ని, వివాహిత స్త్రీల ఆస్తిహక్కు చట్టాన్ని పార్లమెంటు ఆమోదించింది. అలాగే విద్య, ఉద్యోగం స్త్రీకి ఓటుహక్కు అనేక కష్టాలుపడి త్యాగాలుచేసి సంపాదించుకొన్నారు. వారి త్యాగఫలితమే భారతస్త్రీ ఓటుహక్కు.

1917 రష్యన్ విప్లవానికి పూర్వం రష్యన్ స్త్రీలను పశువులకంటే హీనంగా చూసేవారు. వారు ప్రాణాలొడ్డి విప్లవంలో పాల్గొన్నారు. అశేష త్యాగాలు చేసి తమ హక్కులను సంపాదించుకున్నారు. అభ్యుదయ కరదేశమని చెప్పుకొనే అమెరికాలో స్త్రీలను నర్సులుగా, సెక్రెటరీలుగా, స్టెనోలుగా,' సేల్సుగరల్స్‌గా తీసుకుంటారేతప్ప 'మేనేజర్లు', 'సైంటిస్టులు' 'టెక్నిషియన్లు 'పైలట్లు' లాంటి పదవులలోనికి తీసుకోరు. 'సెనేట్' లోను ప్రభుత్వ పద వుల్లోనూ కీలకస్థానాలన్నీ పురుషులకే చెందుతాయి. ఈనాటికీ కొన్ని శాసన సభలలో స్త్రీలేలేరు. డిప్లమేటిక్ సర్వీసులకు స్త్రీలు అనర్హులని అన్ని దేశాలూ నిన్న మొన్నటివరకూ అంగీకరించాయి. అసలే స్త్రీ విద్యలేని దేశాలు ఇంకా చాలా వున్నాయి. స్విట్జర్లెండులో 1976లో స్త్రీకి ఓటువస్తే ఫ్రాన్సులో 1944 వచ్చింది. సిరియా పాకిస్తాన్, ఇరాక్, ఇథియోపియా, ఈజిప్టు కంబోడియాలాంటి దేశాలలో స్త్రీలు అసలు ఎన్నికవడమే అసాధ్యమని చెప్పవచ్చు. ఇలా ఇంకెన్నోరకాల అసమానతలున్న దేశాలు అనేకం. స్త్రీలను బ్యాంకు అకౌంట్లే పెట్టుకోనివ్వని దేశాలింకావున్నాయి. ఈ అసమానతల్ని తొలగించి సమాన ప్రతిపత్తి నివ్వాలనే ఆకాంక్షతోనే 1975ను మహిళా సంవత్సరంగా ప్రకటించారు ఐక్యరాజ్య సమితివారు.

మహిళా సంవత్సర సందర్భంలో ప్రపంచం మొత్తంమీద సభలు, సర్వేలు, చర్చలు, సెమినార్లు భారీఎత్తున జరిగాయి. ప్రపంచ స్త్రీలలో కుతూహలం, ఆసక్తి, వికాసం కలుగకపోలేదు. ఇలా స్త్రీలలో గొప్పసంచలనం కలిగించి నందులకు యు. ఎన్. ఓ. వారికి స్త్రీలు ఆజన్మాంతం కృతజ్ఞులు. ఈ సంవత్సరంలో మైలురాళ్ళుగా చెప్పుకో తగ్గవి, పురుషుల్ని ఒక్కకుదుపు కుదిపినవి, ప్రపంచ ప్రజల్ని చకితులను చేసినవి మూడు ప్రపంచ మహా సభలు. మొదటిరెండూ 1975 జులైలో మెక్సికోలోను మూడవది బెర్లిన్‌లో అక్టోబరులోనూ జరిగినాయి.

మెక్సికోలో ఐ. రా. స. వారు ఏర్పాటు చేసిన సభకు 150 దేశాల నుండి 1300 మంది ప్రతినిధులు 1300 మంది పత్రికా విలేఖరులు హాజరయి నారు. రెండవ సభకు 5 వేల మంది ప్రతినిధులు హాజరైనారు. ఇది ప్రభు త్వాలతో సంబంధం లేకుండా జరిగిన సభ. దీనిని 'ట్రిబ్యూన్'అని పిలిచారు.

ఈ సభలో ఒక వర్గం పురుషులను పూర్తిగా దుయ్యపడితే మరోవర్గం వారు-అధిక సంఖ్యాకులుగా వున్నవారు-ఈ పురుష ప్రపంచానికి ఒక కుదుపు ఇవ్వతలిచారు. ఆస్ట్రేలియా ప్రతినిధి రీడ్ మాట్లాడుతూ స్త్రీలు సాధించే విప్లవం వల్లనే స్త్రీలు కోరే సమానత్వం సాధ్యమవుతుందని, పురుష ప్రపంచంలో మనల్ని నిర్లక్ష్యం చేస్తున్నారని, మనకుప్రాముఖ్యతే లేదు అని అన్నది. సోషలిస్టుదేశాల ప్రతి నిధులు స్త్రీల సమస్యల కన్నా రాజకీయాలయెడ ఎక్కువ ఆసక్తి చూపారు. తమ దేశాలలో తాము ఏనాడో సమానత్వాన్ని సాధించామని చెప్పుకుంటుంటే రీడ్ వారితో వాదన పడింది. నూతన ఆర్థిక వ్యవస్థవస్తే స్త్రీల హోదా దానంతట అదే మారుతుందనడం సమస్యల నుండి దృష్టి మరలించడమేనని పేచీ పెట్టింది.

నార్వే ప్రతినిధి అన్నాతాస్ బోమర్ మాట్లాడుతూ మహిళా సంఘాలు పటిష్టంకావాలని, మన సమస్యలను పరిష్కరించటానికి ప్రపంచస్థాయిలో శాశ్వతంగా ఒక సంస్థ ఏర్పడాలని అన్నది. చికాగో ప్రతినిధిక్వెల్సెన్‌సెక్సును "ఈ సభవారు దూరంగా వుంచారు; సెక్సు సమస్యలు చర్చించక పోవటం అసమంజసం" అన్నది. అనేక మంచి చర్చల్లో పాల్గొన్నారు; వాదించు కున్నారు. కొంతమంది స్త్రీకి విపరీతమైన అన్యాయం జరిగిందనే కోపంతో ద్వేషిస్తూ పురుషులను 'పందులు' (**Male chauvinistic Pigs**) అంటూ తిట్టారు. కొందరు "తన పిల్లలకు తిండి, విద్య, ఆరోగ్యము కరువైన స్త్రీ కన్నా విచక్షకులోనైన వ్యక్తి ఎవరు?" అని ప్రశ్నించారు. ఇంతకన్నా దారుణమైన దోపిడీ మరెచ్చటా లేదన్నారు. "విజ్ఞానశాస్త్రం అభివృద్ధి పొందితేనే మానవ జాతికి అభ్యుదయం సాధ్యమవుతుందనేది బూటకం **(Humbug)** అని అరిచారు.

బెర్లిన్ సభకు కమ్యూనిష్టు ఉద్యమాలువున్న అన్నిదేశాల నుండి వందల మంది ప్రతినిధులు హాజరయినారు. చర్చనీయాంశం: 'సమాజంలో స్త్రీలు చట్టరీత్యా, వాస్తవంగా సమానత్వాన్ని ఎలాసాధించాలి?' అనేది. కుటుంబం-సమాజం, వివాహం, మాతా శిశువుల సంరక్షణ, పిల్లలకు విద్య, కుటుంబం యొక్క, సమాజం యొక్క బాధ్యత, నిరక్షరాస్యతా నిర్మూలన, విజ్ఞాన శాస్త్ర బోధ, సంస్కృతి లాంటి అనేక విషయాలు

చర్చించి తీర్మానాలు రాశారు. ఈ మహాసభలు స్త్రీలోకానికేకాక మానవాళి యావత్తుకు ఎంతో వుపకరించాయి. ఈ విధంగా తమ అభ్యుదయం కోసం స్త్రీలు ఉద్యమించడం శుభసూచకమే. మహిళలకు నూతనోత్సాహాన్ని ఇచ్చాయి. కార్యకర్తలకు వెలుగు చూపాయి.

కాని తరతరాల స్త్రీ అణచివేత, లొంగుబాటు ఒక సంవత్సరంలో నిర్మూలించడం అసాధ్యం అనక తప్పదు. కొంత చైతన్యం, ఆలోచన, అవగాహన కలిగింది. వివిధ రకాల సాహిత్యం వచ్చింది. ఉద్యోగం, విద్య, వేతనాల విషయాలలో ఆసక్తి పెరిగింది; సామాజికదోపిడి ప్రభుత్వ నిరాదరణలపై, భర్తల దౌర్జన్యాలపై తిరుగుబాటు భావన వచ్చింది. అయినా స్త్రీలలో తగినంత స్థాయి పెరగలేదు అనే భావనతో పునరాలోచించి పది సంవత్సరాల కాలాన్ని వినియోగించుకో మన్నారు.

1976 నుండి 85 వరకు తిరిగి మహిళా దశాబ్దంగా ప్రకటించి స్త్రీజాతికి మరొక సారి సదవకాశం ఇచ్చారు ఐ. రా. స. వారు. ఈ దశాబ్దంలో జరిగిన పెద్దసభల్లో ముఖ్యమైనది కొపెన్ హేగెను సభ.

కొపెన్‌హేగెన్ సభ.

మహిళా దశాబ్దంసందర్భంగా 1980 లో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యాన కోపెన్‌హేగెన్‌లో ప్రపంచమహిళా సభ జరిగింది. దీనికి ఐ. రా. స. లో చేరిన దేశాల యొక్క ప్రభుత్వాల ప్రతినిధులు, ప్రత్యేకాహ్వానితులుగా పిలువబడిన స్వచ్ఛందసేవకులు హాజరైనారు. మెక్సికో సభతో ప్రారంభమైన మహిళా దశాబ్దపు మధ్యలో ఈ సభ జరిగింది. మహిళాభ్యుదయానికి అవసరమైన చర్యలను ఏఏ దేశ ప్రభుత్వాలు ఎంతవరకు ఎలా తీసుకున్నాయో సమీక్షించటానికి ఈ సభ ఉద్దేశింపబడింది. వివిధదేశాల ప్రతినిధులు తమ ప్రభుత్వాలు చేపట్టిన కార్యక్రమాలను వివరించారు.

ఈ మహాసభ జరిగిన సమయంలోనే అదే నగరంలో వామపక్ష భావాలు కలవారు కొందరు ప్రత్యామ్నాయ సభను ఏర్పాటు చేశారు. ధానికి అనధికార ప్రతినిధులు విరివిగా హాజరయినట్లు తెలుస్తున్నది. ఏడు వేలమంది ప్రతినిధులు వచ్చినట్లువారి లెక్కలు చెబుతున్నాయి. ఈ సభ

వారు మహిళల సమస్యలను తీవ్రంగా పరిశీలించారు. భారతదేశం లాంటి దేశాలలో కొద్దిపాటి మార్పు కోసం ప్రయత్నాలు జరిగినా, ఇరాన్, సౌదీ అరేబియా లాంటి మధ్యప్రాచ్య దేశాలలో తిరోగమనం కన్పడింది. కాగా మహిళోద్యమాల పరంగా ఒక్కొక్కదేశం ఒక్కొక్క రంగంలో పురోగతి సాధించింది.

స్వతంత్రం సంపాదించుకున్న దేశాలలో విప్లవానంతరం స్త్రీలను విప్లవపూర్వస్థితికి నెట్టివేసే ప్రయత్నాలు సాగుతున్నాయి. ఉ॥ జింబావేలో స్త్రీలు గెరిల్లాలుగా చేరి పోరాడినా వారిని ఇళ్ళకు వెళ్ళమన్నారు. వారి శక్తి యుక్తులను విప్లవానంతర ప్రభుత్వం వాడుకోలేదు. ఒక విషయం స్పష్టమయింది. నిర్ణాయకరంగంలో స్త్రీలకు స్థానం లేదు.

విముక్తి కలిగిన దేశాలలో పురుషులతోపాటు స్త్రీలను పనిచేయుమంటున్నారు. తద్వారావారు ఇంటా బైటా పని చెయ్యాల్సివస్తోంది. పురుషులు ఇంటిపనిలో భాగస్వాములు కావటంలేదు చాలాదేశాలలో. విద్య విషయంలో ఇండియాలాంటి దేశాలు కొంత పురోగమించినా విద్యకు పరమార్థం ఉద్యోగం అయినంతకాలం స్త్రీలను విద్యారంగంలో వెనక్కి నెట్టేస్తున్నారు. జాగ్రదవస్థలో వున్న ప్రతిక్షణంలోనూ తృతీయ ప్రపంచపు మహిళ పనిచేస్తూనేవుంది. కాని ఆమె పనికితగిన ప్రతిఫలం ఆమెకుదక్కటం లేదు. రాబోయే తరాలకు కార్మిక జీవులను తయారు చేయడానికి మాత్రం స్త్రీలను పిల్లలనుకనే యంత్రాలుగా వాడుతున్నారు.

ఆరోగ్యానికి ప్రభుత్వాలు కేటాయించే మొత్తాలు చాలా తక్కువ. అవయినా నగరాలకే అందుతున్నాయి. స్త్రీల ఆరోగ్యాన్ని పరిరక్షించే జాగ్రత్త చర్యలు చాలా దేశాల్లో లేనే లేవని చెప్పవచ్చు. కొన్ని దేశాలలో కుటుంబ నియంత్రణ పట్ల శ్రద్ధ వహించడం జ తున్నది కాని తన దేహాన్ని గురించి తాను జాగ్రత్త పడటానికి తగిన జ్ఞానాన్ని ఆమెకు ఇవ్వడంలేదు.

జాతీయ విముక్తి పొందినదేశాలలో కూడా భూమి పంపిణీ పురుషులకే పరిమితమవుతున్నది. స్త్రీలను పరిగణనలోకి తీసుకోవటంలేదు.

కొన్ని ఆఫ్రికా దేశాలలో స్త్రీల లైంగిక ప్రేరణ తగ్గించే నిమిత్తం వారి మర్మాయవవిచ్ఛేదనం జరుగుతోంది. దీనిపై పాశ్చాత్య ప్రపంచపు మహిళల ఆందోళన చేయగా ఆయాదేశాల ప్రభుత్వాలు కొన్ని నిరసన తెలిపాయి. ఈ ఆచారం దుష్టమై స్త్రీలకు నష్టదాయకమైనను దీనిని అరికట్టే పద్ధతిపై వివాదాలు చెలరేగుతున్నాయి. ఈ ఆచారం ఇలా ప్రపంచ ప్రజల దృష్టికి రావడం ఈ మహాసభ విశేషం.

ఇలా విద్యా, వైద్య, ఉద్యోగ రంగాలలో స్త్రీ పురోగతిని గురించి స్పష్టంగా, నిర్దుష్టంగా నివేదికలు సమర్పింపబడి చర్చలకు ప్రాతిపదికలయినాయి. స్త్రీలు సాధించింది బహుస్వల్పం, సాధించవలసింది మరి ఇంకెంతో వున్నదని కోపెన్‌హేగెన్‌సభ రుజువుచేసింది.

ఈ మహిళాదశాబ్దంలో స్త్రీ పురుషులమధ్య సమానత్వాన్ని సాధించటానికి విస్తృత చర్యలు తీసుకొంటారని, అన్ని స్థాయిలలో మహిళలకు పూర్తి సహకారం లభిస్తుందని, మహిళలు సఫలీకృతులు కాగలరని ఆశిద్దాం.

)o( )o(

భార్యల పై హింస

భర్తలు భార్యలను హింసించటమనేది ప్రపంచమంతటా సాగుతున్నది. చాలా దేశాల్లో ఇలాంటి హింస తప్పనే భావం కూడా ప్రజలలోవ్యాప్తి చెంద లేదు. ముఖ్యంగా భారతదేశంలో భర్త భార్యను దండించ వచ్చనే అభి ప్రాయం ప్రబలంగా ఉంది. ఒక కష్టజీవి తన భార్యను నడివీధిలో కొట్టున్న సంఘటన తీసుకోండి. దారినపోయేవారు అందరూ మనకేమని ఊరుకోలేరు కదా ! కొంత మంది అతనిని మందలించ పూనుకుంటారు. భర్తకు ఎక్కడలేని కోపం వస్తుంది. "నా భార్యను నేను కొట్టుకుంటాను, చంపుకుంటాను. నీవు ఎవడివి కలుగజేసుకోవటానికి" అని కేకలు పెడ్తాడు. పోనీ ఆ స్త్రీ అయినా తన రక్షణకు వచ్చిన అతనిని సమర్థిస్తుందా? అలా జరగకపోగా ఆమె కూడా అతనిని నిరసిస్తుంది. "ఏమయ్యా! మొగుడనే వాడు అంత మాత్రం పెళ్ళాన్ని కొడితే తప్పా?" అని ప్రశ్నించి అతనిని అవమానిస్తుంది. ఇది సర్వసాధారణంగా జరిగే సంఘటన. కాకపోతే మన దేశానికి ఇతర దేశాలకు ఉన్న తేడాఅల్లా ఒకటే. అభివృద్ధి చెందిన దేశా లలో ప్రతి మంచి పనికీ, చెడ్డపనికీ లెక్కలుంటాయి. వాటిని సేకరిస్తారు. వాటిని పరిశీలిస్తే సమస్యయొక్క అనుపానులు, గంభీరత మనకు అవగతం అవుతాయి.

పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశంగా పరిగణింపబడే అమెరికా సంయుక్త రాష్ట్రాలలోని న్యూయార్కు రాష్ట్రంలో భర్తలు భార్యలను కొట్టి హింసించే కేసులు 14 వేలదాకా కుటుంబతగాదాలు తీర్చేకోర్టుల ముందుకు వస్తున్నాయని స్త్రీవిమోచన ఉద్యమ కార్యకర్త డెల్‌మార్టినా ప్రకటిం చింది. భర్త భార్యను కొట్టటం తప్పని అచ్చటి ప్రజలు అందరూ ఇంకా భావించడం లేదట. అప్పుడప్పుడు భర్త భార్యను దండించ వచ్చని చాల మంది అంటూ ఉంటారని, అది సహజమనే భావన ప్రజలలో దట్టంగా వ్యాపించి ఉందని మెసాచ్యూట్స్ రాష్ట్రశాసన సంస్కరణ సంస్థ అధిపతి శ్రీ అలన్ రోలర్సు చెప్పాడు.

అమెరికాలో నివాసముంటున్న ఇండోచైనా శరణార్థులలో భార్యలపై భర్తలు చేయిచేసుకోవడం చాల హెచ్చుగా ఉంటుందట. పాశ్చాత్య

సంస్కృతిని అలవరచుకున్న తెల్లజాతి పురుషులలోనే ఆ భావం - భార్యలను శారీరక హింస ద్వారా దండించే అధికారం భర్తలకున్నదనే భావం-బలంగా చోటుచేసుకుంటే ప్రాచ్యదేశాలనుండి వలన వచ్చిన వారిస్థితిని గురించి ఆశ్చర్య పడనవసరం లేదు.

"అమెరికా సంయుక్త రాష్ట్రాలలో ఎప్పుడో ఒకప్పుడు భర్తచేతిలో దెబ్బలు తిన్న స్త్రీలు 100 కి 50 మందికిపైగా ఉంటారు. అందులో 100 కి 80 మంది తాము గర్భిణిగా ఉన్నప్పుడు హింసకు లోనయినారు" అని "ఈనాటి నడత" అనే పత్రిక పరిశోధనా వ్యాసంలో ప్రచురించింది. భారత దేశానికి లెక్కలులేవు. లెక్కలు తీయగలిగితే అలాంటి స్త్రీలు 100కి 80 మంది ఉంటారు.

భార్యలను హింసించటం బీదవారిలో మాత్రమే జరుగుతుందని కొంతమంది భావిస్తుంటారు. అది పొరపాటు. హింసలకు లోనయిన స్త్రీలు అన్ని జీవితరంగాలకు చెంది ఉంటారు. అన్ని వర్గాలలోనూ ఉంటున్నారు. ప్రజలందరికీ వారు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఒక వయస్సుకు, ఒక సామాజిక వర్గానికి, ఒక తెగకు, ఒకజాతికి మాత్రమేవారు పరిమితంగా లేరు. ఈ అంశం అన్ని దేశాలకూ వర్తిస్తుంది. భారతదేశంలో మరీ ఎక్కువగా కొట్టవచ్చినట్లు కన్పడుతుంది.

స్త్రీలకు తమ హక్కులేవో తెలియవు. తెలియని దశలో ఉంచారు పురుషులు. 99.8 శాతం అక్షరాస్యులయిన అమెరికాలో పరిస్థితి ఇలా గుంటే 20 శాతం స్త్రీలు మాత్రమే అక్షరాస్యులుగా ఉన్న భారతదేశ స్థితిని గురించి వేరే చెప్పనవసరం లేదు. డిగ్రీచదువు ఉన్నంతమాత్రాన చాలదు. వివేకం కావాలి. ప్రపంచ జ్ఞానం కావాలి. ఇవన్నీ ఉన్నా సమాచారసేకరణ జరగాలి. అప్పుడే నారీలోకం చైతన్యవంతమవుతుంది. ఆనాడే తమను హింసించ పూనే భర్తలను ఎదిరించగలుగుతారు భార్యలు. దీనికి సమష్టి ప్రయత్నం కూడా అవసరం. ఇది గ్రహించిన పాశ్చాత్యవనితలు బ్రిటనులో, అమెరికాలో భర్తల హింసలకు వ్యతిరేకంగా ఉద్యమాలు నడుపుతున్నారు. మనదేశంలో అలాంటి ఉద్యమం ఇంచు మించుగా మృగ్యమని చెప్పవచ్చును. భర్త హింసకు తటుకోలేక భార్య కిరసనాయిలు పోసుకొని తన

దేహానికి నిప్పంటించుకొని చస్తే, ఆ వార్త పత్రికలకు ఎక్కితే, ఆ నాలుగు రోజులు "అయ్యో పాపం" అంటుంది తోటి నారీలోకం. తరువాత కొన్నాళ్ళకు మరిచి పోతుంది. ఇదీ మనదేశపు వరస. కుటుంబంలో హింసకు వ్యతిరేకంగా అమెరికాలో ౪వ జాతీయమహాసభ 1982 ఆగస్టు నెలలో జరిగింది. ఈసమస్యపై ప్రజల దృష్టిని ఆకర్షించింది ఆ మహాసభ. శరణాలయాలు, రక్షితగృహాలు, పిల్లలకు సహాయ పథకాలు, శరణాలయంలో ఆవాసం తదుపరి కార్యక్రమాలు, హింసకు పాల్గొనే పురుషుల మనస్తత్వాన్ని మార్చే ప్రయత్నాలు, వాటికి పథకాలు, స్త్రీల సంఘటన, నాయకత్వ శిక్షణ, సంఘాల సిబ్బంది సమస్య, స్త్రీలపై హింసయెడల సామాజిక దృష్టిని మార్చడం, శాసనాలు ఇచ్చే పరిహారం, సహాయం, కార్యకర్తల కలసి కట్టుగా పనిచేయగల నేర్పు-ఓర్పు. ఇలా ఎన్నో సమస్యలను గురించి చర్చించింది ఆ మహాసభ. ఇటీవల 1980లో బొంబాయిలో జరిగిన జాతీయ మహాసభ తప్ప మరే స్త్రీల మహాసభ భారతదేశంలో ఈ సమస్యను పట్టించుకో లేదు. వారూ అమెరికను మహాసభ స్థాయిలో సమస్యను లోతుగా అర్థం చేసుకోలేదు. కాకపోతే అసలు లేని దానికన్నా కొంతనయం. సమస్యను కొంతమంది కార్యకర్తల దృష్టికైనా తేవడం జరిగింది. ఇది ముదావహం.

హింసకు లోనయిన స్త్రీలకు మార్గాంతరాలు తెలియవు. హింసకు ఎదురుతిరిగినా, హింసను తప్పించుకోదలచినా ఏం చేయాలనేది వారికి పెద్ద సమస్యగా తయారయింది. ఒకసారి ఇల్లుకదిలితే మరల ఇంటికి రానీడు భర్త. బయటికి వెళ్ళినా ఎవరు ఆదరిస్తారు? కన్నవారు ఆదరించరు భారతదేశంలో. 'భర్తతోడిదే నీ జీవితం. బ్రతికినా చచ్చినా అత్తింటనే ఉండాలి నీవు" అంటారు తల్లిదండ్రులు. అన్నతమ్ముల విషయం మరి చెప్పనక్కరలేదు. ఇక బ్రిటను అమెరికాలో సమష్టి కుటుంబ జీవనంలేదు. ఎవరి కుటుంబం వారిదే. కూతురును ఆదుకునే తల్లిదండ్రులు ఇంచుమించుగా లేనట్లే. కనుకనే శరణాలయాల ఆవశ్యకత ఎంతో ఉంది. అర్ధరాత్రి భార్యను కొట్టి మెడపెట్టి భర్త గెంటివేశాడనుకోండి; లేక అత్త, మామ, ఆడబిడ్డ ఆమెను చావగొట్టారనుకోండి: కాకపోయినా ఆ హింసకు తట్టుకోలేక ఆమె ఇల్లు వదలిపెట్టి పారిపోదామని నిశ్చయించిందనుకోండి, ఆమె ఎక్కడకి పోవాలి? ఎవరిస్తారు ఆశ్రియం? ఆశ్రియం దొరికినా ఎలా బ్రతకాలి?

తనకు ఏ వృత్తి చేతకాదే సతీత్వం తప్ప! అసలు ఆ మాటకువస్తే ఎన్ని నగరాలలో అలాంటి శరణాలయాలు ఉన్నాయి? వాటిని చేరేలోగా మా మధ్యంలో ఆమెకు రౌడీలు, పడుపు గృహాలు నిర్వహించే దుర్నీతిపరుల ఎదురవుతారు. వీరి నుండి రక్షణ ఎలా? ఇవన్నీ సమస్యలు. అసలు ఆ మాటకు వస్తే భారతదేశంలో ఎన్ని శరణాలయాలు ఉన్నాయి? ప్రభుత్వం నడిపేవి తప్ప దేశం మొత్తంలో ఢిల్లీలో సహయోగ్ కేంద్రం ఒకటి ఉంది వారు గత 15 నెలలలో 8 మందికి సహాయం చేశారట. పాశ్చాత్య ప్రపం చంతో పోలిస్తే మన కృషి అత్యాతి అల్పం. బ్రిటనులో జాతీయ స్త్రీ సహాయ ఫెడరేషను 200 శరణాలయ కేంద్రాలు నడుపుతున్నది. అమెరికాలో 225 శరణాలయాలు ఉన్నాయి. బ్రిటిషు పార్లమెంటు సెలెక్టు కమిటీ ప్రతి 10 వేల జనాభాకు ఒక స్త్రీల శరణాలయం ఉండాలని సిఫారసు చేసింది. ఆ సిఫారసు అయినా 5 ఏండ్లకు బ్రిటనులో ప్రతి 60 వేలమంది జనాభాకు ఒక కేంద్రం మాత్రం ఏర్పడింది. వాటిలో శరణార్థుల సంఖ్య ఎక్కువ. వనరులు తక్కువ. అవి ఆర్థికంగా పటిష్టంగా లేవు. ఇక భారతదేశ పరిస్థితిని గురించి మరి వేరే చెప్పనవసరం లేదు. శరణాయాలు ఉంటే కుటుంబ విచ్ఛిత్తి జరుగుతుందని, భారత సంస్కృతికి విలక్షణమైన కుటుంబ జీవనం దెబ్బతింటుందని చాల మంది భయపడుతున్నారు; సంకోచిస్తారు ఇలాంటి ప్రయత్నాలను బలపరచటానికి. కాని ఒక్క విషయం గమనించాలి. ఇంట్లో నుంచి బయటికి వెళ్ళిపోతానని భార్య బెదిరించగలిగిననాడు-ఆ బెదరింపు ఆచరణలోకి రాగల అవకాశం ఉండాలి—హింసకు పూనుకునే భర్తలు భయపడతారు. ఆమె కాటేయ వలసిన అవసరం లేదు. బుసకొట్టే చాలు. దుర్మార్గ ప్రవృత్తిలో ఉండే భర్తలు భయపడతారు. వారూ మార్చుకుంటారు తమ నడతను. అది వారికీ, దేశానికీ, సమాజానికీ, అందరికీ మంచిది. కనుక శరణాలయాలు కావాలి.

హింసింపబడే స్త్రీలు ఉన్నారంటే హింసించే పురుషులు ఉన్నారన్న మాట. తమ పరిస్థితి ఏమిటో, తమ హక్కులేమిటో సరిగా తెలియని స్త్రీలు, హింసలకు లోనయికూడా, ఎదిరించటానికి భయపడు తున్నారు. స్త్రీలకు సలహాలిచ్చే ప్లీడర్లు, డాక్టర్లు, తగాదాపడమని వారికి సలహాల నివ్వరు. హింసను ఎదుర్కోరు. రెండు శక్తులు సరిసమానంగా లేనప్పుడు

తటస్థంగా ఉండటమంటే బలంగల శక్తిని బలపరచడమేనని రస్సెల్ దోబాష్ అన్నమాట నిజం. బ్రిటన్‌లోని లాయర్లను ఉద్దేశించి, 'గార్డియను పత్రిక చేసిన వ్యాఖ్యానం ఇది. హింసించే భర్తలపై బ్రిటనులో కోర్టులు భార్య నివసించే ఇంటికి రావద్దని నిషేధపు ఉత్తరువులు ఇస్తున్నాయి. కాని వాటిని ఆ భర్తలు పాటించటం లేదు. వాటిని స్థానిక కౌన్సిళ్ళు అమలు పరచటం లేదు. అలాంటి భర్తలను పోలీసులు అరెస్టు చెయ్యాలి. అంతే గాక వేరుగా ఉంటున్న భార్యల ఇండ్లలో అలారం ఏర్పాటు చేయాలి. దౌర్జన్య పరుడయిన భర్త ఆమెపై అత్యాచారం చేయడానికి ఆమె ఇంటికి రాగానే ఆమె మీట నొక్కితే పోలీసు స్టేషనులో అలారం మోగాలి; అప్పుడు పోలీసులు రావాలి. అలాగయితేనే ఆమెకు సహాయం సకాలంలో అందుతుందని 'గార్డియను' పత్రిక సూచనచేసింది. అంతేగాక ఆమెకు ఇతరత్రా సదుపాయాలు కల్పించాలి. ఉదాహరణకు భర్త హింసను భరించలేక అతని ఇంటిలో కాపురం చేయలేని భార్య వేరే కాపురం ఉండేనిమిత్తం మరో ఇంటి కోసం స్థానిక మ్యునిసిపలు కౌన్సిలుకు దరఖాస్తు చేస్తే ఆమెకు ఇల్లును కేటాయించడానికి — అద్దెకే అనుకోండి — కౌన్సిలు సంసిద్ధతను చూపాలి. ఇది బ్రిటనులోని మహిళోద్యమ డిమాండు. మనదేశంలో ఈ సమస్యలు ఉత్పన్నం కావు. ఎందుకంటే హింసకు లోనయిన భార్యలను ఆదుకునే సంఘాలు, సమాజం, ప్రభుత్వాలు లేవు కనుక. మనకు అలాంటి మహిళోద్యమమూ లేదు. కాస్తో కూస్తో శ్రద్ధ చూపే ప్రభుత్వాలూ లేవు.

పీడిత భార్యలకు సహాయం చేయటానికి బ్రిటనులో, అమెరికాలో అనేక శాసనాలు ఉన్నాయి. కుటుంబ కోర్టులకు విస్తృతాధికారాలు ఇచ్చారు. అమెరికాలోని న్యూయార్కు రాష్ట్ర శాసనసభ ఇటీవల కుటుంబ కోర్టుల శాసనాన్ని సవరించింది. అది గమనార్హం. అంతకు క్రితం భార్య భర్తల మధ్య తగాదా వచ్చినపుడు రాజీచేయటం, అంతగా కాకపోతే విడాకులివ్వటం, పిల్లల రక్షణ పోషణ విషయాలపై నిర్ణయాలు చేయడం ఆ కోర్టుల పని. ఇపుడు శాసనంయొక్క ఉద్దేశాలలో 'హింసను ఆపుట, హింసకు లోనయిన వారికిసహాయం చేయుట' అనే రెండు అంశాలను చేర్చింది సవరణ. ఈనాటి శాసనం ప్రకారం భార్యకు రక్షణ వచ్చింది. అంతే కాదు వివాహం అనే తంతు లేకుండా ఒక పురుషునితో దాంపత్య జీవితం గడిపే స్త్రీకి కూడా రక్షణ

కలిగింది. ఇది విశేషం. ఎందుకంటే ఇటీవల అమెరికాలో వివాహం అనే తంతు లేకుండా కాపురాలు చేయడం జాస్తి అయింది. ఈ తంతు ప్రాముఖ్యతను ప్రశ్నిస్తున్నారు చాలమంది. ఇది ఒక ఆలోచనా ధోరణి; ఒక జీవిత విధానం. ఏదైనా హింసకు లోనయిన స్త్రీ — లా ప్రకారం భార్య అయినా, కాకపోయినా భార్యగా సంచరించినన్నాళ్ళు — ఆమెకు రక్షణ ఇవ్వడం అవసరం; వాస్తవాన్ని గుర్తించే పద్ధతి అది. ఆ శాసనం ప్రకారం కేసులో ఇలాక్రమం వుంటుంది. అలాంటి స్త్రీకి ఉచిత న్యాయసలహా, సహాయమూ ఉంటాయి. ఆమె కోర్టుకువస్తే, న్యాయమూర్తి విధిగా ఆ రోజుననే ఆమెను చూడాలి. తన కేసుయొక్క నిజాన్ని, న్యాయాన్ని గూర్చి ఆమె న్యాయమూర్తికి నచ్చచెప్పగలిగితే ఆమె రక్షణకు వెన్వెంటనే న్యాయమూర్తి ఉత్తరువు ఇస్తాడు. తరువాత భర్తకు లేక ఆమె భర్తలాగా ప్రవర్తించే పురుషునికి నోటీసు పోతుంది. తరువాత విచారణ మొదలవుతుంది. తాగవద్దని, ఆమెను కొట్టవద్దని, ఇంటికి దూరంగా ఉండమని అలాంటి ఉత్తరువులను జారీచేస్తుంది కోర్టు. వాటిని ధిక్కరిస్తే అరెస్టు చేయిస్తుంది. ఇలాంటి శాసనం భారతదేశంలో లేదు. మనకు అసలు కుటుంబ కోర్టులు లేవు. మామూలు సివిలు కోర్టులే వివాహ సంబంధమైన కేసులను విచారిస్తాయి. వాటికి భార్యభర్తల తగవులను పరిష్కరించి రాజీచేయగల ఓర్పూ, నేర్పూ లేవు అంతగా రాజీ కుదరకపోతే, వీలయితే — చట్టం సమ్మతిస్తే, విడాకులివ్వటం తప్ప ఆ కోర్టులకు మరే అధికారాలు లేవు. ఈ విషయంలో మనదేశం ఎంతో వెనుకబడింది. స్త్రీల హోదా కమిటీవారు కుటుంబ కోర్టులను నెలకొల్పమని సిఫారసు చేశారు 1975లో. అది ఈనాటికి శాసనరూపం తాల్చలేదు. మన ప్రభుత్వాలకు శ్రద్ధలేదు; పాపం! తీరుబడి లేదు ఇలాంటి మంచి పనులు చేయడానికి.

'భార్యలపై హింస'పై ఇతరదేశాలలో విపరీతంగా సాహిత్యం వస్తున్నది; ప్రచారం సాగుతున్నది. అమెరికాలో వాషింగ్టను నగరంలోని స్త్రీల కేంద్రం వారు 'కుటుంబంలో హింస ప్రతిస్పందన' అనే వార్తా సమాచార పత్రికను ప్రచురిస్తున్నారు. అందులో కుటుంబంలో స్త్రీలపై హింస, హింసకు లోనయిన స్త్రీల కథలు వగైరాలు ఉంటాయుట. అమెరికాలో కేంబ్రిడ్జి నగరం నుండి 'హింసలకు లోనయిన స్త్రీలడైరెక్టరీ' ప్రచురితమయింది. అమెరికా

ఫ్రాన్సూ, తదితర ప్రపంచంలోనూ ఉన్న శరణాలయాలు, రక్షణకు ఎవరి సహాయాన్ని కోరాలి, సహాయం ఎక్కడ త్వరగా లభిస్తుంది, న్యాయ-వైద్య సలహాలు ఎక్కడ దొరుకుతాయి అనే అంశాలు ఆ డైరెక్టరీలో పొందు పరిచారు. బోస్టను నగరంలో స్త్రీలచే నిర్వహింపబడుతున్న శరణాలయం వారు "మమ్మల్ని కొట్టనీయం" అనే ఫిల్మును తీశారట. అందులో హింసకు లోనయిన స్త్రీలు ఈ విషయం చర్చిస్తారట. ఆ చర్చ చాల ఆసక్తిదాయకంగా ఉంటుందని "విన్" (Win Women's International Net Work News) అనే స్త్రీసంక్షేమాన్ని కాంక్షించే అమెరికను పత్రిక రాసింది. మన దేశంలో ఇలాంటి ప్రచారాలూ, ప్రసార సాధనాలూ లేవు. వాటిని ఒనగూర్చు కోవడానికి వనరులు లేవు. యావ అంతంత మాత్రమే. కాగా ఇటీవల హైదరాబాద్‌లో ఒక మహిళా సమాజంవారు వీ ధి నా ట కా ల ద్వారా, ఫిల్ములద్వారా కొంత ప్రచారాన్ని చేపట్టారు. ఇది కొంతలో కొంత నయం. కాగా దరహం మీద చూచుకుంటే భారతదేశంలో ఈ రకమయిన కృషి చాల స్వల్పంగా జరుగుతున్నది. దీనికి కారణం స్త్రీలను శారీరకంగా దండించడం తప్పులేదనే ఆలోచనా ధోరణే. ఇది హింసకు లోనయిన స్త్రీల వ్యక్తిగత సమస్య మాత్రమే కాదు. ఇది సమాజాన్ని పీడించే రుగ్మత. దీనికి సకాలంలో సరియైన రీతిలో వైద్యం జరగాలి. భారత మహిళోద్యమం ఈ విషయంగా కృషి చేస్తుందని ఆశిద్దాం.

—

• • • • • •

స్త్రీకి ఆస్తిలో సమాన హక్కును కల్పించడం మూలంగా వరకట్నాన్ని పూర్తిగా నిషేధించలేము. దీనికి కారణం. అసలు స్త్రీ అంటే తక్కువ అనే భావం పురుషుల నరనరాన జీర్ణించి పోయింది. ఆమెను తాను పెళ్ళాడటమే ఆమెకేదో మహోపకారం చేసినట్లు భావిస్తోంది పురుషజాతి. అందుకే తనకన్నా తక్కువ జీతం, తక్కువ చదువుకల భార్యను కోరుకుంటారు, లేకపోతే అణగి మణగి వుండరనే భయం వుంది.

లైంగిక వేధింపు

విద్యార్థినులను, యువతులను బస్సుస్టాపులవద్ద, సినిమాహాళ్ళవద్ద లైంగికంగా వేధించినందుకు కొంతమంది తుంటరి యువకులను పోలీసులు పట్టుకొని క్రిమినలు కోర్టులలో హాజరు పరుస్తున్నట్లు, మేజిస్ట్రేట్లువారికి జరిమానాలు, జైలుశిక్షలు వేస్తున్నట్లు మనదేశ పత్రికలలో వార్తలు ఇటీవల చదువుతున్నాం. ఇలా ఈ సమస్య ప్రజల దృష్టికి వచ్చింది.

ఈ లైంగిక వేధింపు క్రొంగొత్త పరిణామం కాదు. పురుషజాతిలో రౌడీమూకలు, కాముకులు ఉన్నంతకాలం ఇది ఉంటూనే ఉన్నది. కాగా ఇంతకు క్రితం దీనిని గురించి స్త్రీలు ఫిర్యాదు చేసేవారు కాదు. మౌనంగా సహించి ఊరుకునేవారు. ఇటీవల వారు ధైర్యంచేసి దాని విషయమై పత్రికలలో వ్రాస్తున్నారు; ఆందోళన చేస్తున్నారు. అంతే తేడా నాటికీ_ నేటికీ.

లైంగిక వేధింపు పలురకాలుగా ఉంటుంది. జన సమ్మర్దాన్ని ఆసరాగా తీసుకొని స్త్రీని ఒరుసుకొని పోవడం, కొంగులాగటం, కౌగలించుకోవటం ముద్దుపెట్టుకోవటం, ఆమె శరీరాన్ని గట్టిగా అదమటం ఇలాంటివి ఒకరకం. రద్దీలేకపోయినా వెంటబడి ఈలలు వేయటం, ఎగతాళిగా స్త్రీని అంగాంగ వర్ణన చేయటం బూతు కూతలు కూయటం. లైంగిక సంపర్కాన్ని ఆశిస్తూ అన్యాపదేశంగా అర్థించటం, ఒక్కొక్కపుడు సాహసంతో సమీపించి కొంగు పట్టుకోవటం, సూటిగా కళ్ళల్లోకి చూస్తూ మన్మథ యుద్ధానికి ఆహ్వానించటం, "నీవు పతివ్రతవేం కావు. నీవూ అబావతే" అన్నట్లు ఈసడిస్తూ మాట్లాటటం మరో రకం. తనకున్న హోదాను అధికారాన్ని దుర్వినియోగ పరచి తన వద్ద చదువుకునే విద్యార్థినులను, తన వద్ద కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగినులను, ఫ్యాక్టరీ కార్మిక స్త్రీలను తనతో పొత్తు పెట్టుకోమని తొందర జేయటం మూడవరకం. ఇలా ఎన్నెన్నో అవతారాలు తాలుస్తున్నది లైంగిక వేధింపు; ఎన్నెన్నో ప్రదేశాలలో సాక్షాత్కరిస్తున్నది. అన్ని ప్రదేశాలలోను ఈదుర్నీతి నడుస్తున్నది.

మౌనంగా సహించి, ఆత్మశీల సంరక్షణార్థం గుట్టు చప్పుడు కాకుండా ప్రాణాలను వీడిన అబలలు ఎందరో ఉన్నారు. కాగా ఇటీవల స్త్రీ జాతిలో కొంత ధైర్యం వచ్చింది. "ఇతరుల దుర్మార్గానికి తాము ఎందుకు సిగ్గుపడాలి? "అనే భావన బయలుదేరింది. దానిని గురించి మాట్లాడటం ప్రారంభించారు. కాకపోతే అమెరికా, బ్రిటను లాంటి దేశాలలో దీని విషయమై ఆందోళన హెచ్చు. భారతదేశపు పరిస్థితివేరు.

విద్యాలయాల్లో :- విద్యాలయాలు పవిత్రప్రదేశాలుగా పరిగణించడం పరిపాటి. కాని అక్కడ కూడా ఈ దుర్మార్గ ప్రవర్తన కనిపిస్తున్నది. హోళీపండుగ సందర్భాలలో పురుషవిద్యార్థులు విద్యార్థినుల వసతిగృహం పై దాడిచేసి, వారిదుస్తులను చింపి, వారిని శారీరకంగా హింసించి, మానసికంగా వెతల పాల్జేసి అవమానాలకు గురిచేసినట్లు సంఘటనలు పత్రికల్లో వస్తున్నాయి-ఆ దుండగీండ్రు ధనవంతుల కుటుంబీకులో, లేక రాజకీయ వాదుల అనుంగు సన్నిహితులో కావటంవల్ల వారిపై ఏశిక్షణాచర్యలు తీసుకోబడటంలేదు. విద్యాలయాల్లో ఉండే ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లు చేసే అత్యాచారాలు అంత తేలికగా బయటికి రావటం లేదు; అందులో ముఖ్యంగా వృత్తి కళాశాలలోని అధ్యాపకుల ఆగడాలను విద్యార్థినులు బహిర్గతం చేయటానికి వణికిపోతారు. ఇదిమన దేశపరిస్థితి. లజ్జ, బిడియం పేర్లతో స్త్రీలను మాట్లాడనీయదు సంఘం; 'నీవు అశక్తురాలివి' అని మాటిమాటికి స్త్రీని హెచ్చరిస్తుంటుంది ఆమె అంతరంగం. దాంతో ఆమెలో పిరికితనం ఆవహిస్తుంది; గ్రుడ్లనీరు, గుడ్లకు కుక్కుకొని అలమటిస్తుంది; కృశిస్తుంది. పాశ్చాత్యదేశాల స్త్రీలలో నిర్భీకత చోటు చేసుకోవటంతో వారు బయటపడి మాట్లాడుతున్నారు. ఇలాంటి దుర్మార్గచర్యలను వెలికితీసి నిరసిస్తున్నారువారు. వారికి లెక్కలున్నాయి. మనదేశంలో గణాంకశాస్త్రం అంతగా అభివృద్ధి చెందలేదు. లెక్కలు తీయం; ఏదైనా, సమస్యను అవగాహన చేసుకోవటానికి పాశ్చాత్యదేశాల సంఘటనలను ఉదాహరణలుగా తీసుకోవచ్చు. వారి దర్యాప్తులను పరిగణనలోకి తీసుకోవచ్చు.

అమెరికాలో ఒక రాష్ట్రంలో లక్షా పదివేల మంది విద్యార్థినులు ఉంటే 20 శాతం మంది లైంగికంగా సంచరించనందుకు లంచాలకుగాని

బెదిరింపులకుగాని లోనగుతున్నారట. పదకొండు సంవత్సరాల నుంచి ఆచార్యత్వం నిర్వహించిన ఒక అధ్యాపకుడు ఇద్దరు విద్యార్థినులను లైంగికంగా వేధించినందుకు, మరి ఇద్దరని లైంగిక సంపర్కానికి రమ్మనమని ఆహ్వానించినందున శిక్షకు పాత్రుడయినాడు. ఒక వ్యాయామ శిక్షకుని ఉద్యోగం నుండి తొలగించారు ఇలాంటి నేరానికి, "వాషింగ్టను పోష్టు" ప్రముఖ దినపత్రిక 81 సెప్టెంబరులో వ్రాసిన వ్యాసంలో విశ్వవిద్యాలయాల్లో విద్యార్థినుల వేధింపు గురించి రాసింది.

తూర్పు కారోలీనా విశ్వవిద్యాలయంలో సామాజిక శాస్త్ర విభాగం దర్యాప్తు చేసింది. వారు 77 మంది విద్యార్థినులను భేటీ చేశారు. నూటికి ఎనిమిది మంది తమ లెక్చరర్లు తమకు అసౌకర్యం కలిగేటట్లు తాకేవారనీ, గిల్లేవారనీ, శరీరంపై తట్టేవారనీ చెప్పారు. అలాగే 226 మంది విద్యార్థినులకు ఉత్తరాలు వ్రాసి జవాబులు పొందటంద్వారా మరియొక పరిశోధన జరిగింది. ఆ సర్వేలో 0.9% మంది తమ టీచర్లు లైంగికంగా బాధపెట్టారని చెప్పారు. 2.2% లైంగిక సంపర్కాన్ని బహిరంగంగా టీచర్లు కోరారని చెప్పారు. **4.9%** మంది పరోక్షంగా ఒత్తిడికి లోనయినామని, 8.9% మంది పురుషఉపాధ్యాయుల చేత నేరవిధంగా తాకబడ్డామని వివరాలతో పరిశోధకులకు సమాధానా లిచ్చారు.

కార్యాలయాల్లో. :- ఆఫీసులల్లో, కార్యాలయాల్లో సెక్సు కొరకు అధికారులు ఒత్తిడితెచ్చిన బాధలను కథలుగా అంతరంగిక కార్యదర్శులు, ఇతర ఉద్యోగినులు చెప్పటం జరిగింది. ఒక్కొక్కప్పుడు సరాసరి కోరడం, కొన్ని కేసులలో పరోక్షంగా సూచించడం జరుగుతోందట. జీన్అనే 20 సం॥రాల యువతి బీదకుటుంబంనుండి వచ్చింది. ఆమె తల్లిదండ్రులను పోషించాలి. ఇంటిఅద్దె చెల్లించాలి. తిండితినాలి. తానుబ్రతకాలి. ధనవంతులైన చుట్టాలు, మేనమామలు, పినతండ్రులు ఆమెకు లేరు. ఆమె, సూపరువైజరు పురుషుడు. అందరిలాగానే ఉంటే మంచిదని అతడు సూచించాడు. కాని ఆమె అందుకు అంగీకరించలేదు. ఉద్యోగం ఊడింది. అన్నా అనే ఆమె అవివాహిత ఆమెపై అధికారి ఆమెను గురించి అతిగా పట్టించుకోవడం మొదలుపెట్టాడు. మర్యాదగా కాదని అనేకసార్లు చెప్పింది ఆమె.

ఆఫీసరు ఆమె విముఖత్వాన్ని సహించలేకపోయాడు. ఆమెచేసే చిన్న చిన్న తప్పిదాలను రిపోర్టు చేయసాగాడు. అంతటితో ఆగక బెదరింపులకు దిగాడు. అప్పటికీ సహించింది. ఒకరోజు సూపర్‌వైజరు ఆమెపై డైరెక్టరుకు రిపోర్టు చేశాడు అన్నా అతనిని అనుసరించింది డైరెక్టరు అఫీసులోకి. అసలు విషయం చెప్పింది డైరెక్టరుకు. అతను సానుభూతి చూపాడు. అప్పటినుండి సూపర్‌వైజరు ఆమె జోలికి రాలేదు. వారిరువురు నాటినుండి మౌనంగా శతృవులయ్యారు ఇలాంటి బాధలు, ఇబ్బందులూ ఉద్యోగినులు పట్ల అన్ని దేశాలలోనూ జరుతూనే వున్నాయి. కాదన గలమా ? భర్తలుగా, తండ్రులుగా స్త్రీలు నీతిగా వుండాలని పురుషులు కోరుకుంటారు. కాని కార్యాలయాల్లోఆ పురుషఅధికారులే నీతిగా వున్న స్త్రీలను వేధిస్తారు. ఇది ద్వంద్వ నీతికి ప్రబల నిదర్శనమని చాటి చెప్పాలి.

ఫ్యాక్టరీలలో :- ఫ్యాక్టరీలలో లైంగిక వేధింపును దర్యాప్తు చేయటానికి బ్రిటన్‌లోకల్లా పెద్దదైన ఉద్యోగస్తుల సంఘం కమిటీని వేసింది. ఆ జాతీయ సమానత్వ పరిరక్షణ కమిటీ దర్యాప్తుకు పూనుకున్నది. దాంట్లో 13 మంది స్త్రీలు, ఇద్దరు పురుషులు సభ్యులుగా వున్నారు ఈ కమిటీ లైంగిక వేధింపుపై సమగ్రంగా దర్యాప్తు జరిపి రిపోర్టులు ఇచ్చి కొంత ఉపయోగపడుతోంది. కెనడా ఉద్యోగస్తుల సంఘపు కృషివల్ల బ్రిటిషు స్త్రీలు ఉత్తేజితులు అయినారు కెనడాలో 70 నుండి 88 శాతం వరకు ఏదోరకంగా ఉద్యోగినులు లైంగిక వేధింపుకు గురి అయినారట. సగం మంది ఉద్యోగాలు వదలి వెళ్ళి పోయారట.

నాల్గో (Nalgo) అనే బ్రిటిషు ఉద్యోగుల సంఘంలో ఏడున్నర లక్షల మంది సభ్యులున్నారు అందులో సగం మంది స్త్రీలు. ఈ సంఘ స్త్రీల విషయమై అభ్యుదయకరమైన వైఖరిని అవలంబిస్తున్నదని ప్రతీతి. ఏ ఉద్యోగిని అయినా ఫిర్యాదుచేస్తే ఆమెతో వ్యక్తిగతంగా మాట్లాడ టానికి ఒక సంఘ కార్యకర్తను కేటాయించారు సంఘ అధికారులు. ఆమె ఫిర్యాదు నిజమని నమ్మితే ఆమె కేసును సంఘం చేపట్టుంది.

ఐరోపాలోని కామన్ మార్కెటు సంఘం దర్యాప్తు చేసింది. ఒక దర్యాప్తు ప్రకారం ఫ్రాన్సులో 8 శాతం ఉద్యోగినులు, ఇంగ్లాండులో 7

శాతం ఉద్యోగినులు లైంగిక వేధింపుకు గురి అయినారని తేల్చింది. మరియొక దర్యాప్తు ప్రకారం 100కి 10 మంది స్త్రీలు అలా వేధింపుకు గురి అయినారని వెల్లడి అయింది. విడాకులు పొందిన స్త్రీలు, భర్తల నుండి వేరుపడి విడిగా జీవిస్తున్న స్త్రీలు ఈ రకమయిన ఇబ్బందులకు ఎక్కువగా పాత్రులవుతున్నారని తెలుస్తున్నది. అలాంటి స్త్రీలలో 100కి 25 మంది ఇలా అసౌకర్యాల పాలయినట్లు లెక్కలు వచ్చాయి. మార్ప్లాను దర్యాప్తు ప్రకారం 100కి 5 గురు స్త్రీలు తమతోటి పురుష ఉద్యోగుల కోర్కెలు తీర్చనందుకు శిక్షాపాత్రులయ్యారట. ఈ వేధింపు స్త్రీల వయస్సును బట్టి ఉంటుంది. 25 నుండి 34 సం॥ వరకు వయస్సు ఉన్న స్త్రీలలో ఇది 10 శాతం. విడాకులు పొందిన స్త్రీలలో ఇది 13 శాతం.

మామూలుగా చాల మంది స్త్రీలు తమ అధికారులపై ఫిర్యాదు చేయరు. దర్యాప్తుల నివేదికలు అవగింజలో అరవవంతు విషయాన్ని మాత్రమే బయట పెడ్తున్నాయి. రిపోర్టుకాని కేసులు చాల వుంటాయి. ఎక్కువగా ఈ వేధింపుకు బలి అయిన స్త్రీలు పోలీసుల దగ్గరకు పోరు. పోలీసుల ప్రశ్నలవల్ల కలిగే చికాకు, మామూలుగా పురుష వైద్యులచేత శారీరక పరీక్ష, పైగా నిందితుని బెదరింపు ఇవి అన్నీ ఆ స్త్రీలను ఫిర్యాదు చేయనీయవు. సకృత్తుగా ఒకటీ అర కేసు నమోదు అవుతాయి. వాషింగ్టను విశ్వవిద్యాలయంలో ఒక కాలేజి అధ్యక్షునిపై సెక్రటరీ వేధింపు ఆరోపణ చేసింది. అలాగే జీవశాస్త్ర విభాగపు ప్రొఫెసరు ఒకామె ఒక కాలేజీ పరిపాలకునిపై ఫిర్యాదుచేసింది. ఇలాంటివి బహు అరుదుగా జరుగుతాయి.

నష్టం :- లైంగిక వేధింపుకు గురి అయిన వారికి కలిగే వ్యక్తిగత నష్టం కాక దేశానికే నష్టం సంభవిస్తుంది. అమెరికాలో అలా 9 కోట్ల డాలర్ల విలువగల నష్టం వాటిల్లుతున్నదట. ఉత్పాదకశక్తి తగ్గుదల, నైతిక ధృతి నశించటం, ఈ వేధింపుకు తట్టుకోలేక స్త్రీలు ఉద్యోగాలు వదలి వెళ్ళిపోతే క్రొత్తగా చేరేవారికి శిక్షణ ఇవ్వటానికి వ్యయప్రయాసలు ఇవన్నీ లెక్కకట్టే ఆ మొత్తం తేలింది.

కేసులు :- బ్రిటనులో నిందితులలో 17 శాతానికి 2 సం॥ వరకు 50 శాతానికి 2 నుండి 4 సం॥, 26 శాతానికి 4 నుండి 7 సం॥ శిక్షలు వేశారు.

1700 కేసులు వస్తే 465 కేసులలో 1978 లో జైలుశిక్ష వేశారు. బ్రిటనులో 25 సం॥ వరకు శిక్షవేయువచ్చును.

అమెరికాలో 25 సం॥ వరకు శిక్షవేయువచ్చును. 1981 లో 1200 కేసులు నమోదు అయినాయి. 200 కేసులలో శిక్షపడింది.

నేర పరిస్థితి విశ్వవిద్యాలయాల్లో మరీ ఘోరంగా ఉంది. కేంద్ర ప్రభుత్వ నేర పరిశోధనా సంస్థలెక్కల ప్రకారం 107 కాలేజీలలో, విశ్వ విద్యాలయాల్లో స్త్రీలపై అత్యాచారాలు జరిగాయి. 1971 లో 101 నేరాలు వెలికివస్తే 1980 లో అవి 157 కి పెరిగాయి. దేశం మొత్తం మీద మాన భంగాల సంఖ్య 46 శాతం పెరిగితే విద్యార్థిలోకం కాపురముండే విశ్వ విద్యాలయాల్లో 55 శాతంగా పెరిగింది. విద్యార్థులు కానివారు విద్యాల యాల ఆవరణలలో నేరాలు చేస్తున్నారని అధికారులు సంజాయిషీ చెప్పు కొని తృప్తిపడుతున్నారు. వాషింగ్టను విశ్వ విద్యాలయంలో రాత్రిపూట లైబ్రరీకి పోవడానికి విద్యార్థినులు విముఖత చూపిస్తున్నారు ఈ వేధింపు భయం వల్ల. మేరీలాండ్ కాలేజీలో ప్రతి 500 మంది విద్యార్థులకు ఒక పోలీసు ఉండవలసిన పరిస్థితి ఏర్పడింది.

సాహిత్యం :- అమెరికా (USA) లోని 'ఉద్యోగాల సమానావకాశాల కమీషను' 'కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో లైంగిక వేధింపు' అనే కర పత్రాన్ని ప్రకటించింది. ప్రభుత్వ కళాశాలలు, విశ్వవిద్యాలయాల సంఘం లైంగిక వేధింపుపై కరపత్రం ప్రచురించింది. లైంగిక వేధింపును అవినీతికర చర్యగా నిర్ణయించారు. ఇలాంటి ఫిర్యాదుల విచారణకు సంబం ధించిన సూచనలను ఇచ్చింది ఈ కరపత్రం. విస్కాన్సిన్ విశ్వవిద్యాలయం వారు 'లైంగిక వేధింపు విషయమై తీసుకోవలసిన వైఖరి, విధానం; వాటి అమలుకు మార్గదర్శక సూత్రాలు' అనేక గ్రంథం వెలువరించారు. అందులో లా ప్రకారం లైంగిక వేధింపు అంటే ఏమిటి, విచారణ పద్ధతి, పరస్పర సమ్మతితో పరిష్కార మార్గాలు అనే అంశాలు వివరించడం జరిగింది.

అమెరికాలోని 'ఉన్నత వృత్తుల నవలంభించే ఉద్యోగినులు సంఘాల ఫెడరేషను' లైంగిక వేధింపుపై కరపత్రాల సంపుటి విడుదల

చేసింది. లా పత్రికారం నిర్వచన, కోర్టుకేసుల సారం, ఉద్యోగినులు వేధింపు విషయమై ఏంచేయాలి, విచారణ ఎలా జరగాలి అనే అంశాలు వాటిలో రాశారు. అంతేగాక 1964 లోని పౌరహక్కుల శాసనం క్రింద లైంగిక వేధింపు శిక్షార్హమని గుర్తు చేయడం జరిగింది.

స్త్రీలలో విజ్ఞానం పెంపొందించే నిమిత్తం అమెరికాలో ఒక సంఘం 'స్త్రీల మనుగడ కోసం' అనే వార్తా సమాచార పత్రికను నడుపుతోంది. అందులో "మానభంగాన్ని తప్పించుకోవడానికి ఏంచేయాలి, నిన్నుకాని. నీ పిల్లలనుగాని వేధిస్తుంటే ఏం చేయాలి, నీ ఇంట్లోకి దురుద్దేశంతో వచ్చే ఆంగతకుని ఎలా నిరోధించాలి" అనేవి ఉన్నాయి. అంతేగాక లైంగిక వేధింపుకు గురి అయినట్లు వివరించేది ఎలా, అలాంటప్పుడు ఏ చర్యకు ఉపక్రమించాలి, నీపై ఎవరైనా దాడిచేస్తే తప్పించుకోటానికి ఏం చేయాలి అనే విషయాలను విశదీకరించారు. ఇలాంటి సాహిత్యం భారతదేశంలో ఏనాడూ అధికారికంగా వెలువడుతుందో!

కర్తవ్యం :- ఇదంతా చదివినవారు రెండు వైఖరులను ప్రదర్శించవచ్చు. "స్త్రీలు ఉద్యోగాలు చెయ్యనక్కరలేదు. ఇళ్ళల్లో ముసుగు వేసుకొని కూర్చుంటే సరిపోతుంది, అనేది ఒకటి. "స్త్రీలకు అవసరమైన రక్షణ ఇవ్వాలి' అనేది రెండవది. మొదటి వైఖరి ఆలోచనలో తప్పు; ఆచరణలో అసాధ్యం. సగం మంది జనాభా ఉన్న స్త్రీలను ఉద్యోగాలు చెయ్యవద్దని శాసించడానికి ఎవరికి అధికారం ఉంది. ఉద్యోగం, వృత్తి అచ్చంగా తిండి సంపాదించుకునే మార్గాలే కావు, ఆమె వ్యక్తిత్వ వికాసానికి, ఆమె ప్రయోజకత్వానికి అవి ప్రతీకలు. జాతి సంస్కృతిని రక్షించాలనే తాపత్రయంతో కొందరు, పైకి గట్టిగా చెప్పకపోయినా, స్త్రీలు వంట ఇంటి కుందేళ్ళయితే బాగుండునని భావిస్తున్నారు. ఈ వైఖరి గర్హ్యనీయం; నింద్యం. రెండవ ఆలోచన సక్రమమైనది. కాగా ఎన్ని శాసనాలయినా వ్యక్తులను అందులో స్త్రీలను రక్షించలేవు. ప్రజాభిప్రాయం ద్వారా సమాజపు ఆలోచనా ధోరణిలో మార్పురావాలి. దానికి మహిళోద్యమం పూనుకోవాలి. స్త్రీలు ముమ్మందుగా చొరవ తీసుకుంటే తర్వాత సహృదయులైన పురుషులు వారిని బలపరుస్తారు. ఈ విషయమై సమస్య అవగాహనా శక్తిని, చొరవను చైతన్యాన్ని, చొరవను మహిళలు ప్రదర్శించటం అవసరం.

మానభంగాలు

ఏ రోజు పత్రిక తీసినా తాటికాయలంత అక్షరాలతో 'ఆ ఊళ్ళో మాన భంగం", "ఈనగరంలో మానభంగం" అని శీర్షికలతో వార్తలు వస్తున్నాయి. "మానభంగాల కేసుల సంఖ్య పెరిగిందా? లేక పత్రికలలో" వార్తలెక్కడం ఎక్కువయిందా? అనే సందేహం రావడం సహజం. ఈ అత్యాచారాలు పూర్వంకూడా జరిగాయి; ఇపుడూ జరుగుతున్నాయి. ఇవి తీవ్రమైన నేరాలని ప్రజాభిప్రాయం బలపడుతున్నందున ఈ వార్తలు వస్తున్నాయి. మన దేశంలో లెక్కలు లేవు. కాని అమెరికా సంయుక్త రాష్ట్రంలో మంచికీ చెడ్డకూ లెక్కల ఆరా ఉంటుంది. దర్యాప్తు సంఘం వారి నివేదిక ప్రకారం 1979 లో 82000 కేసులు నమోదు అయ్యాయట. ఈ సంవత్సరం కన్న తరువాత సంవత్సరంలో 100 కి 9 వంతున కేసులు పెరిగాయి. అంటే 6 నిమిషాలకు ఒక మానభంగం జరుగుతున్నదన్నమాట. అన్ని కేసులూ పోలీసులదాకా రావటం లేదు. 100కి 60 కేసులు మాత్రమే పోలీసులవద్ద ఫిర్యాదుకు వస్తున్నాయి. అంటే నాలుగున్నర నిమిషాలకు ఒక మానభంగం సంఘటన సంభవిస్తున్నదన్నమాట. ఇలా చెప్పారు అమెరికావారు; అలా చెప్తేనే దాని తీవ్రత మనకు అర్థం అవుతుంది.

ఇంగ్లండులో ఒక కేసులో న్యాయమూర్తి ఇచ్చిన తీర్పు నాదీ లోకాన్ని ఉద్రేక పరిచింది. ఆందోళనకు దారితీసింది. ఒక స్త్రీ పాద చారియై దేశాటనం చేస్తున్నది. ఆమెను ఒక దుర్మార్గుడు మానభంగం చేశాడు; కేసు నమోదు అయింది. ఆమె ఒంటరిగా తిరుగుతున్నందున ముద్దాయికి నేరం చెయ్యటానికి ప్రేరణ కలిగిందని న్యాయమూర్తి అభి ప్రాయ ప్రకటన చేశాడు; నేరానికి గురిఅయిన ఆమెను తప్పుపట్టాడు. ఆమె పాదచారియై ఒంటరిగా దేశాటనం చేయుటం తప్పట. ముద్దాయికి 2 వేల పౌనులు జరిమానా వేశాడు జడ్జి. కేసు ఉన్నతోన్నత న్యాయ స్థానానికి వెళ్ళింది. ఆమె దోషం ఏమీలేదని, ఆమె పరోక్షంగా నేరానికి కారకురాలని – Cantributory Negligence – ముద్దాయి వాదించ వీలులేదని ప్రధాన న్యాయమూర్తి లార్డుహెయిల్ షాం తీర్పు చెప్పాడు.

2 వేల పౌనుల జరిమానాతో తప్పించుకున్న ముద్దాయి నేరం చేసిన ప్రదేశంలోనే 17 సం॥ అమ్మాయిని ఒక మోటారుకారు డ్రైవరు మానభంగం

చేశాడు. ఆమెకు తన కారులో 'లిఫ్టు' ఇచ్చి, ముప్పావుగంట త్రిప్పి, నరికి వేస్తానని బెదరించి ఆమె మానాన్ని దోచుకున్నాడు ఆ ముష్కరుడు. జరిమానాలతో సరిపెట్టే ఇలాంటి కేసులు పెరగక ఏమవుతుందని జరిమానా కేసులోని స్త్రీ తండ్రి వ్యాఖ్యానించాడు.

1982 లో స్కాట్లండులో గ్లాస్గో నగరంలో ఒక నేరం జరిగింది. ఒక వీధిలో వెళ్ళుతున్న 29 సంవత్సరముల వయస్సుకల స్త్రీని ముగ్గురు యువకులు లాక్కెళ్ళి ఆమెను చెరిచారు. అంతేగాక ఆమెను రేజరు బ్లేడుతో గాయపరిచారు. ఆమెకు 168 కుట్లు వేయవలసి వచ్చింది. జీవితముపై రోతకలిగి ఆమె ఆత్మహత్య చేసుకో ప్రయత్నించింది. ఆమె సాక్ష్యం ఇవ్వగల స్థితిలోలేదని బ్రిటిషు ప్రభుత్వంవారు కేసు వదులుకున్నారు. అందుకు కావలసిన అనుమతిని న్యాయమూర్తి మంజూరుచేశాడు ఇది పార్లమెంటు సభ్యుల విమర్శకు గురి అయింది. మహిళా సంఘాలవారు కోపోద్రిక్తులైనారు. ఒక మంత్రి గ్లాస్గోకేసును వదులుకోవడాన్ని సమర్థించాడు. పార్లమెంటు సభ్యులు అతని సమర్థనను నిరసించారు. అతడు రాజీనామా చేయవలసి వచ్చింది.

"సండే టయిమ్సు," అనే దిన పత్రిక అభిప్రాయసేకరణ చేసింది. దాని, ఫలితంగా ఈ అంశాలు తేలాయి. మానభంగాల కేసులలో ఫిర్యాదు చేసే స్త్రీలపై పోలీసులకు సానుభూతి లేదు. ఇపుడున్న శాసనాన్నిబట్టి, కోర్టుల స్థితిగతులను పరిగణించి నిందితుడు శిక్ష లేకుండా తప్పించుకొని పోవటానికి అవకాశం ఉందని 70 శాతం వయోజనులు భావించారు. అలాంటి కేసులలో నిందితునికి మరణశిక్షగాని, కనీసం 7 సం॥ జైలు శిక్షగాని వెయ్యాలని 100కి 85 మంది భావించారు. ఈ సర్వేలో 1065 మందిని-స్త్రీ పురుషులను సమసంఖ్యలో-అభిప్రాయాలు అడిగారు. లైంగిక వివక్ష వ్యతిరేక శాసనం స్త్రీ పోలీసులను ఇలాంటి కేసులలో దర్యాప్తుకు నియమించడానికి అడ్డురాదని 'సమానావకాశాల కమీషను' అధ్యక్షురాలు ప్రిభ్విలాక్ వుడ్ అన్నారు. కేసు రుజువయినప్పుడు నిందితునికి జైలుశిక్ష విధిగా వేయాలని బ్రిటిషు ప్రధానమంత్రి మార్గరెట్ థాచర్ 1982 జనవరిలో పార్లమెంటులో ప్రకటన చేశారు.

తే 19–1–'82 న బ్రిటీషు రేడియోలో 3 'రేప్' కేసుల వార్తలు చదివారు. పత్రికలు కోర్టులను పోలీసులను విమర్శించాయి. వ్యభిచారులైన స్త్రీలు వారే మానభంగాన్ని ఆశిస్తారని, పొట్టిలాగులు వేసుకుంటున్నందువల్ల, రాత్రిళ్ళు బయటికి వెళ్ళినందువల్ల స్త్రీలు ఆ నేరాలకు తావు ఇస్తున్నారని పోలీసులు, న్యాయమూర్తులు చేసే వ్యాఖ్యలపై పత్రికలు సంపాదకీయాలు వ్రాశాయి. ఈ వార్తలు స్త్రీలను ఆందోళన పరిచాయి. ఇప్స్‌విచ్‌లో మహిళలు 4 వేల సంతకాలు సేకరించారు. జరిమానా వేసి నిందితుడిపై జాలిచూపిన న్యాయమూర్తికి కోర్టుకు మహిళలు వెళ్ళి అసమ్మతి పత్రం ఇచ్చారు. ధేమ్స్‌వాలీ పోలీసుస్టేషను మహిళలు ఆందోళన యాత్ర జరిపారు లీడ్సులో కోర్టులవద్ద పికెటింగు చేశారు. నేలాండు స్త్రీలు పిటీషను పంపారు. షెఫీల్డు, లండను, గ్లాస్గో నగరాలలో స్త్రీలు రాత్రిపూట ఊరేగింపులు జరిపారు. జాతీయ అసమ్మతి ప్రదర్శన జరిగింది దేశం అంతటా.

పురుషులలో దుష్టులు చెప్పేది ఏమంటే మానభంగం "సామాన్య విషయం" అని. అది వారి దృష్టిలో అసాధారణ విషయం కాదట. పట్టుబడే వరకూ నిందితుడు అందరిలాగానే ఉంటాడు. అన్ని వర్గాలలోనూ, వివాహితులలోనూ ఉంటారు. నిందితులు సాధారణ మానసిక పరీక్షల్లో మామూలుగా ఉన్నట్లు కన్పడతారు.

స్త్రీలు ఈ విషయం తీవ్రమయినదిగా భావిస్తున్నారు. "మానభంగం" తమాషా అని భావించే పురుషులు ఇంకా చాలమంది ఉన్నారు. ఆందోళన జరిగినప్పుడు పెద్దమనుష్యులుగా నటించే పురుషులు రంగం మీదికి వస్తారు. ఆలోచిస్తామంటారు; కాలహరణకు పూనుకుంటారు. ఇలా పురుషులు రెండు విధాలుగా కృషిచేస్తున్నారు నిందితులకు సరిఅయిన శిక్షపడకుండా.

వివిధ దేశాలలో శిక్షల పద్ధతులు :-

నార్వే, స్వీడను, ఫిన్‌లెండు లలో ఈ నేరానికి శిక్ష ఎక్కువగా ఉంటున్నది. హాలెండులో శిక్ష చాల తక్కువగా ఉంటుంది. అచ్చట వీలయినంతవరకు జైలుశిక్ష ఉండదు. ఫ్రాన్సులో శిక్ష 5 నుండి 10

సంవత్సరాలు. నేరానికి గురిఅయిన వారు బాలికలయినా, ముద్దాయిలు ఆయుధాలు ధరించి ఉన్నా శిక్ష పెరుగుతుంది. స్త్రీలపరంగా ఆలోచిస్తే అమెరికా సంయుక్త రాష్ట్రాలూ, పశ్చిమ జర్మనీ, స్వీడనుకన్న బ్రిటను వెనుకబడి ఉన్నది. శిక్ష విషయంలో బ్రిటీషు ప్రధాన మంత్రి థాచర్ గట్టిగా మాట్లాడినా త్వరపడి శాసనం మార్చబోమని బ్రిటీషు ప్రభుత్వం ప్రకటించింది. ఆందోళనను మాత్రం గమనించిందట!

కోర్టులో విచారణ విధానం :-

న్యాయమూర్తి కోరితే తప్ప ఫిర్యాది తన లైంగిక జీవితానికి సంబంధించిన వివరాలు తెలుపనక్కరలేదని బ్రిటీషు దేశాంగశాఖ పోలీసులకు ఉత్తరువులు పంపుతుందని ఒక వార్త ప్రకటన జరిగింది. భారతదేశంలో ఫిర్యాది లైంగిక జీవితాన్ని గురించి ముద్దాయి ప్రశ్నలు వేయవచ్చు. ఆమె వ్యభిచారిణి అదే అంశాన్ని వెలికి తీయవచ్చు. వ్యభిచారిణి అయితే ఆమెపై ఎవరైనా అత్యాచారం చెయ్యవచ్చనే అభిప్రాయం దాని వెనుక దాగిఉంది. అంటే వ్యభిచారిణి అందరి ఆస్థి అన్న మాట. ఇది స్త్రీలను అవమానించే ఆలోచనా ధోరణి. మన దేశంలో శాసనం ఈ విషయంగా సవరణ కావలసిఉంది.

"అచ్చంగా ఫిర్యాది సాక్ష్యంపై ఆధారపడి ముద్దాయికి శిక్ష వేయవచ్చా" అనే ప్రశ్న మామూలుగా ఉదయిస్తుంది. వేయవచ్చని మన దేశంలో కోర్టు తీర్పులు వచ్చాయి. కాగా 1982 జూలై వరకు ఇజ్రాయిల్ శాసనం ప్రకారం ఫిర్యాది సాక్ష్యాన్ని బలపరిచే ఇతరుల సాక్ష్యం ఉండాలి. ఇపుడు శాసనాన్ని సవరించారు. తత్ఫలితంగా ఒక్క ఫిర్యాది సాక్ష్యాన్ని బట్టి-నమ్మితే- ముద్దాయిని నేరస్థుడుగా పరిగణించి శిక్ష వేయవచ్చు.

మధుర అనే అమ్మాయికేసులో బొంబాయి హైకోర్టు ఒక తీర్పు ఇచ్చింది; దానిని ఖాయపర్చింది సుప్రీంకోర్టు. ఆ అమ్మాయి సమ్మతిస్తే ఆమె పొందును పోలీసులు అనుభవించారని కోర్టులు రాశాయి, "ఆమె సమ్మతించలేదు. ఆమెను భయపెట్టిన సందర్భంలో, బెదరింపులవల్ల ఆమె మనస్సు చీకాకు అయిన పరిస్థితుల్లో ఆమె వ్యతిరేకించి, పెనుగులాడ

లేకపోయింది. అందువల్ల ఆమె వంటిపై గాని, అత్యాచారం చేసిన పోలీసు శరీరంపై గాని గాయాలు లేవు. అంత మాత్రాన ఆమె సమ్మతి పైననే ఆ అకార్యం జరిగిందనడం హాస్యాస్పదం" అని మహిళోద్యమ కార్యకర్తలు వాదించారు. సభలు జరిపారు; ఊరేగింపులు లేవదీశారు. అసమ్మతి ప్రదర్శనలు చేశారు; ఆందోళన ఉధృతంగా సాగింది. సుప్రీంకోర్టు తీర్పును పునరాలోచన చేయమని పిటీషను దాఖలు చేశారు. శాసనాన్ని సవరిస్తామని కేంద్ర ప్రభుత్వ న్యాయశాఖ ముందుకు వచ్చింది. బిల్లు తయారుచేసింది. ఆందోళన సద్దుమణిగింది. అంతే, ప్రభుత్వం నిశ్చితంగా మళ్ళీ మామూలు పద్ధతిలో నిద్రపోయింది. ఇది మన దేశంలో జరిగిన వ్యవహారం,

వివాహ బంధంలో మానభంగం :-

అమెరికా సంయుక్త రాష్ట్రాలలో 36 రాష్ట్రాలలో "లా" చాల విడ్డూరంగా ఉంది. భర్త భార్యను మానభంగం చేస్తే కేసు లేదు. ఈ శాసనాల వెనుక ఆధారంగా ఉన్న న్యాయసూత్రాన్ని 17వ శతాబ్దంలో ప్రధాన న్యాయమూర్తి మాథ్యూ హెల్ 'ప్రవచనం' చేశాడు. "తను లా ప్రకారం వివాహమాడిన భార్యను మానభంగం చేశాడని భర్తపై నేరం మోపడానికి వీలులేదు. ఈ విషయంగా, ఒప్పందం వల్లనూ, పరస్పర సమ్మతితోను భార్య తనను భర్తకు సమర్పించుకున్నది. ఆ ఒప్పందాన్ని ఆమె రద్దుపరుచుకోటానికి వీలులేదు" ఇది ఆ న్యాయం సూత్రం. దీనిని కోర్టులు మరల 18 వ శతాబ్దంలో ధృవపరిచాయి.

బ్రిటనులో శాసనాన్ని సవరించమని 1980 లో "క్రిమినలు లా రివిజను కమిటీ" వారు ప్రతిపాదించారు. భర్త భార్యను బలవంతంగా అనుభవిస్తే అది నేరంగా పరిగణించబడాలని ఆ సిఫారసు సారాంశం. దానిని మహిళా సంఘాలు బలపరిచాయి. కాని శారీరక హింస లేకపోయినా నేరంగా పరిగణించాలని బ్రిస్టలు నగరంలోని ఒక మహిళా సంఘం విజ్ఞప్తి పత్రం సమర్పించింది. "వివాహం కాకుండా పురుషునితో దాంపత్య జీవితం గడుపుతున్న స్త్రీకి ఈ నాటి శాసనం ప్రకారం రక్షణ ఉంది. ఆమె సమ్మతి లేకుండా బలవంతంగా ఆమెను ఎవరూ పొందరాదు. కాని ఆ రక్షణ భార్యకు లేదు; కోర్టు ఉత్తరువు లేకుండా భర్తకు దూరంగా

విడిగా ఉంటున్న భార్యకు రక్షణ లేదు. ఇది శోచనీయం". అని వారు వాదించారు.

'రేప్' కేసులలో న్యాయం :-

ఈ విషయమై బ్రిటనులోని "గార్డియను" దినపత్రిక తే 28-1-1982 న చేసిన వ్యాఖ్యానం గమనార్హం. 'అనేక మానభంగపు కేసుల్లో గాయాలు ఉంటాయి; ఘాతలు ఉంటాయి. వాటికి శిక్షగా జీవిత కాలపు ఖైదు కూడా పేర్కొన్నారు. అయినా మానభంగం కేసులో దృష్టి మళ్ళించి చాల ఉద్వేగపూరిత వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. ప్రాసిక్యూషన్ వారు తదితర విషయాలపై ఎందుకు నొక్కిపెట్టరు? స్త్రీ అంగీకరించా లేదా అని కోర్టువారు తేల్చాలట. కాని మామూలు ఘాత కేసులో "నీవు ఇష్టపడి దెబ్బలు తిన్నావా?" అని అడగరేం? వీధిలో క్రిందికి తోయబడిన మనిషికి 'లా' సహాయం చేస్తున్నది. కాని మానభంగానికి గురిఅయిన స్త్రీకి న్యాయం జరగడం ఎంతో కష్టం? ఎందువల్ల? ఈ పత్రిక లేవ నెత్తిన ప్రశ్నలు మౌలికమయినవి; సందర్భోచితమయినవి. అంతే కాదు అవి ఆలోచనా ప్రేరకాలు.

ఆత్మరక్షణోపాయాలు :-

స్త్రీలోకం వాదనలతో సరిపెట్టుకో దలచుకోలేదు. ఆత్మరక్షణోపా యాలను అన్వేషించింది. బ్రిటనులో జాకీ హడ్సను అనే ఆమె 'బ్రిటీషు స్త్రీల ఆత్మరక్షణ సంఘం'ను స్థాపించింది. పోలీసులదాకా పోకుండా దుర్మార్గ పురుషుల దాడి నుండి ఎలా రక్షించుకోవాలో ఆమె నేర్పుతుంది. బర్మింగ్‌హాం, బ్రిస్టల్ మొదలైన 25 నగరాలలో అనుబంధ క్లబ్బు లున్నాయి ఆ సంఘానికి. "మామూలుగా ఆ పరిస్థితిలో స్త్రీ నిశ్చేష్ట రాలవుతుంది. అలా కాకుండా దాడి చేసే పురుషునిపై ఆమే మొదటి దెబ్బతీయాలి. అతడు తేరుకునేలోగా ఆమె పారిపోవాలి. ఇదంతా కత్తి, తుపాకి చేతనున్న దుర్మార్గుని పక్షంలో వర్తించదు. కాని ఎక్కువ మంది ఆయుధాలతోరారు. దాడికి గురి అయ్యే స్త్రీలను తెలిసినవారే ఆ దుర్మార్గానికి పూనుకుంటారు సాధారణంగా." ఇదీ ఆమె సలహా. ఆమె

శిక్షణ కాలపరిమితి 12 గంటలు మాత్రమే. ఇలాంటి శిక్షణ ఆ సందర్భంలో ఉపకరించినా, ఉపకరించకపోయినా స్త్రీకి నైతిక ధృతిని ఇస్తుంది. ధైర్యసాహసాలున్న స్త్రీ ఆ పరిస్థితికి అనుగుణంగా సంచరించి ముప్పు తప్పించుకోగలదు. ఈ పరిస్థితుల్లో ఏం చేయాలో మహాత్మాగాంధి సలహా ఇచ్చారు నారీలోకానికి, వారు ఎల్లప్పుడూ విషగుళికలను కొంగున ముడి వేసుకోవాలట. మాన సంరక్షణానికి మరో ఉపాయం లేకపోతే వాటిని మింగి తమ పరువు కాపాడుకోవాలట స్త్రీలు. మహాత్మాగాంధి సలహా కన్నా జాకీ హడ్సను సూచన మెరుగైనది; ఆచరణ యోగ్యమయింది.

మానభంగాల కేసులు : మహిళోద్యమ కార్యకర్తలు :

'రేప్' కేసులు మహిళోద్యమ కార్యకర్తల దృష్టిని ఆకర్షించటానికి కారణాలనేకం. స్త్రీలపై శారీరకహింస, మానసిక దౌర్జన్యం, న్యూనతగా చూడటం, వ్యక్తులుగా జీవించడానికి రక్షణ భద్రత లేమి, తత్ఫలితంగా పురుష దురహంకార సమాజం వారిని వంటఇంటిలోనికి నేట్టివేసే ప్రయత్నాలు ఇవన్నీ స్త్రీ ప్రపంచాన్ని కలవర పరుస్తున్నాయి. వారి ఆగ్రహావేశాలను ప్రముఖ రచయిత్రి సూసాన్ బ్రౌన్ మిల్లరు "Against our will : Men, Women & Rape" అనే గ్రంథంలో చిత్రించారు. "లైంగిక తృప్తి కోసం మానభంగాలు చేయటం లేదు పురుషులు. స్త్రీలను బెదిరించి లొంగదీసుకోవటానికి పథకం ప్రకారం చేసే అమానుషమయిన స్త్రీ వ్యతిరేక దృక్పథంతో సాగించే దుర్మార్గం అది." సూసాన్ యొక్క సూత్రీకరణం ఇది. భూస్వామ్య వ్యతిరేక పెట్టుబడిదారీ వ్యతిరేక పోరాటాల్లో అగ్రగాములుగా ఉండే స్త్రీలపై అత్యాచారాలు ఇందుకే జరుగుతున్నాయి. వ్యవసాయ కార్మికోద్యమంలోని స్త్రీ కార్యకర్తలు ముఖ్యంగా ఈ దాడులకు గురి అవుతున్నారు.

మరో వ్యాఖ్య ఇలా సాగింది. "మానభంగానికి గురిఅయిన స్త్రీ కాలినడకన దేశాటనం చేసున్నందున ఆమె నేరాన్ని పరోక్షంగా ప్రోత్సహించిందని అభిప్రాయపడి ఒక బ్రిటిషు న్యాయమూర్తి నేరం అంగీకరించిన నిందితునికి జరిమానా మాత్రం వేసి వదలి పెట్టాడు. అంటే సౌది అరేబియాలోవలె స్త్రీలు ముసుగుతో తిరగాలా? లేక ఇంట్లో

మూలపడి ఉండాలా? లేక ఇతరులతో ఏ విధంగాను కలవకుండా వేరుగా ఉండాలా? ఈ ప్రశ్నలు ఉద్భవిస్తున్నాయి. బ్రిటీషుకోర్టులు నిందితుల పట్ల చాల ఉదారంగా ప్రవర్తిస్తున్నాయి. దాంతో మానభంగాల సంఖ్య విపరీతంగా అంటుజాడ్యంలా పెరిగి పోతున్నది. ఎప్పటికప్పుడు శాసనాలను మార్చడానికి కమిటీలు వేయడం, నివేదికలను సమర్పించడం మామూలు అయింది. కమిటీల నిండా పురుషులు; జాగుచేస్తారువారు. పురుష న్యాయమూర్తులు నిందితులను వదలి వేస్తారు. నిందితులకూ తెలుసు, పురుష పుంగవులు అన్నిచోట్ల తమరిని ఆదుకు టారని అందువల్లనే వారు యధేచ్ఛగా ప్రవర్తిస్తున్నారు నదురూ బెదురూ లేకుండా.

దీనిని ఆపటానికి ఒకటే మార్గం. అది అందరికీ తెలుసు. నిందితునికి మర్మావయవ విచ్ఛేదం శిక్ష వేస్తే ఈ నేరాలు ఆగిపోతాయి."

శిక్ష విషయంలో భేదాభిప్రాయాలుండవచ్చును. పైగా నిందితుడు వివాహితుడా అవివాహితుడా అనే దానినిబట్టి కూడా ఇలాంటి శిక్షయొక్క ఔచిత్యం ఆధారపడుతుంది. వివాహితుడికి ఇలాంటి శిక్ష వేస్తే ఆశిక్ష అతని భార్యకు వేసినట్లు కాదా? ఈ ప్రశ్నలను ప్రస్తుతానికి వదిలివేస్తే వ్యాఖ్యలోని తతిమ్మా ఆలోచనా ధోరణి చాలా సబబుగా ఉంది. అప్రతిహతమైన భావాలు అవి; ఆమోదయోగ్యాలు సర్వత్రా.

మహిళా ప్రపంచమూ, సహృదయులూ స్వేచ్ఛా కాముకులూ, అయిన పురుషులూ ఈ మానభంగాల వెనుక దాగిఉన్న దురహంకార మనస్తత్వాన్ని, దౌర్జన్య విధానాన్ని, హింసా పద్ధతినీ సర్వవిధాలా ఎదుర్కోడానికి కృషిచేయటం అవశ్య కర్తవ్యం.



అశ్లీల సాహిత్యం

ఇటీవల మనదేశంలో కూడ అశ్లీల సాహిత్యం విపరీతంగా ప్రచురితమవుతున్నది. సెక్సుకు సంబంధించిన విద్యను పాఠశాలల్లో, కళాశాలల్లో బోధించనపుడు, ఆ సమాచారం విద్యార్థులకు దొరకనపుడు, యువతకు అందుబాటులో లేనపుడు వక్రీకరించబడిన సెక్సు సమాచారాన్ని అందించే అశ్లీల సాహిత్యం ఉద్భవిస్తుంది. డిమాండు ఉన్న చోట సరుకు తయారు అవుతుంది. అది వ్యాపార సూత్రం. అదే ఈ రంగంలో జరుగుతున్నది. రైళ్ళలో, బస్సు స్టేషనులలో, ప్లాటుఫారాలమీద, చిన్న చిన్న బంకులలో ఈ రకం సాహిత్యం బాగా అమ్ముతున్నారు: ఎంత ధరఅయినా పెట్టి యువతీయువకులు కొంటున్నారు. ఇది చిన్న వ్యాపారంగా ఉంది భారత దేశంలో. కాగా భారీ పరిశ్రమకు కావలసిన హంగులులేవు. అమెరికా, బ్రిటను ఫ్రాన్సులలో లాగ 'సెక్సుషాపు'లు లేవు భారత దేశంలో. బ్లూ ఫిలింల ప్రదర్శనలు లేవు బహిరంగంగా. పై చెప్పిన దేశాలలో డాలరో లేక అరపౌనో చెల్లించిన వారికి 3 నిమిషాలు స్త్రీ పురుష సంభోగ దృశ్యాన్ని ఆ దుకాణంలో విడిగా ఒక అరలో కూర్చొని చూచే అవకాశం ఉన్నది. ఆ అరలో ఇద్దరు కూర్చోటానికి ఆసనాలు ఉంటాయి. అలా చూచేవారిని పోలీసులు అరెస్టు చేయరు; చేయటానికి 'లా' అంగీకరించదు.

అమెరికాలో అశ్లీల సాహిత్యం ఈనాడు విపరీతంగా పెరిగిపోయింది. వారి రాజ్యాంగంలో పత్రికాస్వేచ్ఛను స్పష్టంగా ప్రత్యేక వివరణలతో పేర్కొన్నారు. దానిని ఆసరాగా తీసుకొని అశ్లీల సాహిత్యాన్ని వెదజల్లుతున్నారు వ్యాపారస్తులు. వారు తమ లాభాలకోసం యువతరానికి తప్పుడు విలువలను అందిస్తున్నారు. తాము మాత్రం కోట్ల డాలర్ల లాభాలను గడిస్తున్నారు. పొరపాటు సెక్సు ప్రమాణాలను నిర్దేశించి యువతలో అలజడిని పెంచుతున్నారు. అశ్లీల సాహిత్య పరిశ్రమ అనుపానులను గురించి మార్గాలాంగిలిను 'అశ్లీల సాహిత్యం యొక్క అర్థికాంశాలు' అనే గ్రంథం వ్రాసింది. ఆ గ్రంథంలో ఉటంకించబడిన కొన్ని భావాలను ఇక్కడ పొందుపరచటం జరుగుతున్నది.

"నాలుగు డాలర్ల టిక్కెట్టుతో అనేక మానభంగాలను తెరపై చూడగల అవకాశం ఈనాడు అమెరికా ప్రేక్షకుడికి లభిస్తోంది. స్త్రీలపై ద్వేషం

కక్కే ఫిలింలకు తోడుగా అశ్లీల చిత్రాలకు, మామూలు చిత్రాలకు ఉన్న తేడా నశించి పోతుంది.

చిత్రాలు మూడు రకాలుగా వుంటాయి. మామూలివి కొన్ని కొద్దిగా అశ్లీలత వున్నవి మరికొన్ని. పూర్తిగా అశ్లీల చిత్రాలు తతిమ్మావి. మామూలు చిత్రాలలో స్త్రీని లొంగిపోయే వ్యక్తిగా, అణగి మణగి ఉండే వ్యక్తిగా చిత్రిస్తారు. కొద్దిపాటి అశ్లీల చిత్రాలు లైంగిక సంబంధంగా తప్పుడు ప్రబోధాన్ని చేస్తాయి. పురుషుడు ఆదిపత్యం వహించేవాడని, స్త్రీ విధేయతగా లైంగిక విషయాలలో అతనికి అనుకూలంగా నడుచు కోవాలని సూచిస్తాయి. కాని పూర్తిగా అశ్లీల చిత్రాలు, పుస్తకాలు భవిష్యత్తులో మహిళా మానచోరులకు, స్త్రీలపై అత్యాచారాలకు గడంగ దలచిన వారికి బోధనా గ్రంథాలుగా ఉపకరిస్తున్నాయి. చాలావరకు అశ్లీల చిత్రాలు వర్ణ వివక్షతో నిండి వుంటాయి. నల్లవారిని, వారి స్త్రీలను దూషిస్తూ, నిందిస్తూ వారిని అత్యాచారాలకు పాత్రులుగా చేయడం సబబన్నట్లు సందేశమిస్తాయి ఆ అశ్లీల చిత్రాలు. సెక్సు మలినమని, దుష్టమని, నిషిద్ధమని ప్రచారం చేస్తారు మన సంఘంలో నీతిని నిర్దేశించే పెద్దలు. వారు సంఘంలో మెజారిటీ అని చెప్పుకుంటారు. అది నిజం కాదు. ఏదైనా వారి బోధలు అశ్లీల సాహిత్యానికి పునాదులు వేస్తున్నాయి. సెక్సు మలినమయింది కనుక స్త్రీలతో పొత్తు అక్కర లేదని ఒక తప్పుడు అవగాహనను పెంపొందించటం జరుగుతున్నది. తద్వారా స్త్రీ ద్వేషం పుట్టుంది. 'సెక్సు మలినం కనుక స్త్రీ పై ఎలాంటి దౌర్జన్యమయినా చెయ్యవచ్చును" అనేది అశ్లీల సాహిత్య వర్తకుల భాష్యం. ఈ రెండు వైఖరులూ స్త్రీ విమోచనకు ప్రతిబంధకాలే.

అశ్లీల సాహిత్యం కొంతవరకు తన డిమాండును తను పెంచుకుంటున్నది. యువజనానికి లైంగిక ప్రబోధంచేసే బాధ్యత అది తను పుచ్చుకొని - నిజానికి అది అందించేది లైంగిక అవిద్య-ఏది సెక్సును ప్రకోపింపచేస్తుందో, దేనిని సెక్సుపరంగా శ్రేష్టమనాలో నిర్ణయించ పూనుకుంటున్నది. అశ్లీల సాహిత్య ఉత్పత్తి విక్రయాలు అమెరికా సంయుక్త రాష్ట్రాలలో భారీ పరిశ్రమగా తయారయింది.

స్త్రీ విమోచనవల్ల తమకేదో ముప్పు కలుగుతుందని చాల మంది పురుషులు భయపడు తున్నారు, తమ పురుషత్వానికి ప్రమాదం వాటిల్ల గలదని తల్లడిల్లి పోతున్నారు. వీరందరినీ అశ్లీల సాహిత్యపు మార్కెట్టులో వినియోగదారులుగా తయారు చేస్తున్నది అశ్లీల సాహిత్య పరిశ్రమ. ఇటీవల స్త్రీలపై అత్యాచారాలు వచ్చిగా సాగుతున్నాయి. దీనికి కారణం పైన చెప్పిన పురుషుల మనస్తత్వమే. అందుకనే అవి ఎక్కువగా విమోచన పొందిన స్త్రీలపై జరుగుతున్నాయి. స్త్రీలపై పెత్తనం చెయ్యాలని, వారిని లొంగదీయాలనే కాంక్ష వారిని అవమానింప చేస్తున్నది. స్త్రీ శక్తిని చూస్తే భయం, స్త్రీలను అదుపు చేయాలనే ఆకాంక్ష, వారిపై కక్ష సాధించాలనే కోరిక ఈ మూడూ అత్యాచారాలకు ప్రేరకాలు.

ఈ పరిశ్రమలో పనిచేసే స్త్రీలు, ఇది పోషించే దౌర్జన్యానికి బలి అయ్యే స్త్రీలు, ఇది బలపర్చే పురుషాధిపత్య సమాజంలో బ్రతకవలసిన స్త్రీలూ వీరందరిని ఈ పరిశ్రమ దుష్టంగా అణచి వేస్తున్నది. ఈ పరిశ్రమ విక్రయించే భావాలను గురించి స్త్రీ విమోచనకారులు దూరదృష్టితో, సునిశిత దృక్కులతో గమనిస్తున్నారు. స్త్రీలకు వ్యతిరేకంగా ఆ పరిశ్రమ పనిచేస్తున్నదనేది నగ్న సత్యం. మానభంగాలకు గురి అయినవారిని ఆదుకునే కేంద్రాలకు, హింసకు గురిఅయిన స్త్రీలకు ఆశ్రయమిచ్చే కేంద్రాలకు, వైద్యసలహా కేంద్రాలకు, సామాజిక సేవా సంస్థలకు రీగన్ ప్రభుత్వం ధన సహాయాన్ని చాల ఎక్కువ మోతాదులో తగ్గించి వేసింది. అదే సమయంలో స్త్రీలపై హింస, దౌర్జన్యం పెరుగుతున్నాయి. ఇంట్లో, వీధిలో, ఉద్యోగ ప్రదేశాలలో స్త్రీలు అలాంటి ప్రమాదాలకు గురి అవుతున్నారు. స్త్రీ జీవితంలో మానభంగం చేయబడటానికి అవకాశం మూడింట ఒకటికాగా, భర్తచేతనో ప్రియునిచేతనో చెప్పుదెబ్బలు తినే పరిస్థితి నాల్గింట ఒకటిగా తయారయింది. ఉద్యోగ ప్రదేశంలో 100 కి 80 మంది స్త్రీలు ఏదోరకమయిన లైంగిక వేధింపుకు, చీకాకు లోనగుతున్నారు. అమెరికా సంయుక్త రాష్ట్రాలలో సంవత్సరానికి కనీసం ఒక లక్షమంది బాలికలు ఇళ్ళల్లో తమ దగ్గర బంధువులచేత బలాత్కరింపబడుతున్నారు; ఏదో రకమయిన లైంగిక ఇబ్బందులకు లోనవుతున్నారు. ఇలా స్త్రీలను లైంగిక హింస చుట్టు ముట్టింది సర్వే సర్వత్రా. ఈ సందర్భంలో

అశ్లీల సాహిత్య వ్యాపారస్తులు పురుషులలో యుద్ధ మనస్తత్వాన్ని పెంపొందిస్తున్నారు. స్త్రీలపై మానభంగాలు, దౌర్జన్యాల సంస్కృతి నుండి లాభించటం, స్త్రీల శరీరాలపై, బాలికలపై అత్యాచారాలను సమర్థించటం, ఇవి ఆ పరిశ్రమచేసే నీచకార్యాలు. స్త్రీలు ఈ పరిశ్రమతో ఢీకొనవలసిన తరుణం ఆసన్నమయింది.[7]

ఇదంతా అమెరికాను గురించి రాసిన విషయం. అశ్లీల సాహిత్యం అమెరికాలో తయారు అయినంత భారీఎత్తున లేదు మనదేశంలో. పచ్చిగా ఉన్న సాహిత్యం రహస్యంగా పంపిణీ అవుతున్నది. పూత మెరుగులతో నిండి ఉండేది మన సినిమాలలో ప్రత్యక్షమవుతున్నది. స్త్రీ ద్వేషాన్ని పెంచుతున్నది, స్త్రీని వస్తువుగా చిత్రించి, ఇష్టంవచ్చినట్లు వాడుకోమన్నట్లు ప్రోత్సహిస్తున్నది యువకులను. ఏదయినా, మౌలికమయిన భావాల విషయంలో అమెరికాలోని పరిస్థితికీ, భారతదేశ స్థితిగతులకూ తేడా లేదు.

స్త్రీ విమోచనోద్యమానికి అశ్లీల సాహిత్య పరిశ్రమ బలమయిన శత్రువు. కాగా, దీనిని ఎలా ఎదుర్కోవాలనే విషయంలో, ఏది అశ్లీలం, ఏది అసభ్యత అనే అంశంపై అభిప్రాయ భేదాలు ఉన్నాయి; ఉంటాయి కూడాను. ప్రజాస్వామ్య సమాజం ఈ సమస్యను ఒక రకంగా పరిష్కరించ పూనుకుంటే, నియంతృత్వాన్ని కాంక్షించేవారు మరోరకంగా ఆలోచిస్తారు. తేడా ఆ విషయంలోనే. ఒకటి మాత్రం సత్యం. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం లాంటి విలువలపై ఏమాత్రం గౌరవంకల వ్యక్తి అయినా స్త్రీ విమోచనోద్యంపై ఈ అశ్లీల సాహిత్యం-ప్రత్యక్షంగాను పరోక్షంగాను-చేసే దాడిని త్రిప్పికొట్టడానికి ఉద్యమించాలి. దీనిని కనీస కర్తవ్యంగా భావించక తప్పదు.



వ్యభిచారం చట్ట సమ్మతం చేయాలా?

వ్యభిచారాన్ని చట్టసమ్మతం చేయాలని కొందరు ప్రముఖులు దిన పత్రికలలో సంపాదకునికి లేఖలు రాస్తున్నారు. అలాంటి లేఖలు బొంబాయి, ఢిల్లీ నగరాలలో ప్రకటితమయాయి. వారివాదనను బలపర్చ కోటానికి వారు అనేక కారణాలను ఉటంకించారు. వ్యభిచార వ్యాపార నిర్మూలన శాసనం చాల లోపభూయిష్టమని, ఎంతకట్టు దిట్టమైన శాసన మయినా సామాజిక రంగంలో అమలు పర్చటం చాల కష్టసాధ్యమేగాక, ఇంచుమించుగా అసాధ్యమని, ఈ శాసనం అమలుతీరులో లోపాలువల్ల పోలీసుశాఖ అవినీతికరమయి తద్వారాదేశసామాజిక జీవితమే కలుషిత మవుతున్నదని, వాస్తవంగా నేరాలు చేసేవారు విశృంఖలంగా తిరుగు తున్నారని, సుఖవ్యాధులు సోకడం ఎక్కువయిందని, సంసారులుకూడా సానులుగా తయారు అవుతున్నారని పేర్కొనటం జరుగుతున్నది. ఈ కారణాలన్నింటిని అందరూ చెప్పటం లేదు. ఒకవర్గం ఒక కారణాన్ని సూచిస్తే మరొకవర్గం వేరొక కారణాన్ని ఉద్ఘాటిసున్నారు. ఇంతకూ వారు కోరేదేమంటే వ్యభిచార వృత్తిని చట్ట సమ్మతంచేసి దానిపై అదుపు మాత్రం ప్రభుత్వం కలిగి ఉండాలట. అంటే పడుపు గృహాల నిర్వహణకు లైసెన్సులివ్వటం, నిర్ణీతమయిన గడువులలో వేశ్యల ఆరోగ్య పరీక్షలు, ఆ గృహాలు విద్యాలయాలకు ఎంత దూరంలో ఉండాలో నిర్ణయించడం లాంటి పనులు ప్రభుత్వం చేపట్టాలట. వేశ్యలకు సుఖరోగాల విషయమై వైద్యం చేయించాలట. ఇంచుమించుగా చెప్పిన అభిప్రాయాలతోనే ఫిలిప్పైను దేశపు పార్లమెంటులో ఎన్‌రిక్ మెడీనా అనే పార్లమెంటు సభ్యుడు ప్రయివేటు బిల్లును ప్రతిపాదించాడు. దాని మీద ఆ దేశపు స్త్రీలు ఆందోళనకు దిగారు: ఈ బిల్లును ఆ మహిళలు వ్యతిరేకించారు. బిల్లును ఎదుర్కొనటానికి వారు ఈ క్రింది కారణాలను చూపించారు. బిల్లు వ్యభిచారాన్ని పెంపొందిస్తుంది. దేశ సామాజిక ఆర్థిక సమస్యలను మరీక్లిష్టం చేస్తుంది. జీవితపు పవిత్రతను, వ్యక్తి హోదాను పెంచే వృత్తులనే ప్రజలు, అందులో ముఖ్యంగా స్త్రీలు, చేపట్టాలి. సామాజిక ఆర్థికాభివృద్ధిని పెంపొందించడం స్త్రీల కర్తవ్యం. విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జించటం, లాభం సంపాదించడం మంచిదికావచ్చునేమో కాని ఆ పనులను

మనుష్య శరీరాలతో వ్యాపారం ద్వారా సాధించరాదు. వ్యభిచారం ఆర్థిక కారణాలవల్ల వచ్చింది కనుక స్త్రీలు గౌరవప్రదమైన, లాభసాటియైన వృత్తులు చేపట్టటానికి అవకాశాన్ని పార్లమెంటు ఇవ్వాలి. వారు ఇంకా కొన్ని సూచనలు చేశారు. ఫిలిప్పైను స్త్రీలను వివాహమాడటానికిగాని, ఇతర వృత్తులకుగాని ఆహ్వానించే ప్రకటనలు — స్థానికమూ విదేశాలవి- ఉండరాదని కోరారు. ఆ దేశ స్త్రీలను అవినీతికరమయిన, చట్ట వ్యతిరేక మయిన, అభ్యంతరకరమయిన వ్యాపార పద్ధతులకు లోనయ్యేవారినిగా ప్రలోభపరుస్తూ ప్రచారంచేసేవారిని బాగా శిక్షించాలి.

ఫిలిప్పైను దేశపు ప్రయివేటు బిల్లుకు మంచి ప్రచారం లభించింది. పత్రికలు బాగా ప్రచురించాయివార్తను. దానితో అమెరికా, ఇండోనీషియా, జపాను, ఫిలిప్పైను దేశాల స్త్రీలు "వ్యభిచారం"పై ఆసియా స్త్రీల ప్రథమ సంప్రదింపుల సమావేశం జరిపారు 1981 మార్చిలో. ఆ సభలో అనేక అంశాలు వెలికి వచ్చాయి. థయిలాండు, ఫిలిప్పైను దేశాలనుండి, కంబోడియాశరణార్థుల మకాంలనుండి స్త్రీలను వ్యభిచారానికితరలిస్తున్నారు. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో జపాను సైనికులకు "వినోదం" కలిగించే నిమిత్తం 17000 మంది జపాను స్త్రీలు, 10,000 మంది కొరియా స్త్రీలు నియమితులయ్యారు. 1981 లో 8 వేల మంది ఫిలిప్పైను స్త్రీలు జపాను దేశంలో వ్యభిచార వృత్తిలో ఉన్నారు. ఫిలిప్పైను, బ్రెజిలు, థయిలాండు, కొరియా, తైవాన్ల నుండి స్త్రీలను విహారయాత్రలకు జపానుకుతెచ్చి తదుపరి వారిని వ్యభిచార మార్కెట్టులోనికి దింపుతున్నారు. విహార యాత్రలపేరుతో 'సర్వసౌకర్యాల నివాసానికి" జపాను పురుషులు ఫిలిప్పైను దేశానికి వస్తున్నారు. ఈ పద్ధతులను అన్నింటిని మ హా స భ వా రు నిరసించారు.

వ్యభిచారాన్ని పురాతన వృత్తిగా పేర్కొంటారు సర్వసాధారణంగా. దేశంలో బీదరికం, అజ్ఞానం, అమాయకత్వం, మోసం ఉన్నవాళ్ళు స్త్రీలైనా, పురుషులయినా రుజు మార్గాన్నుండి పతనమవటం చూస్తున్నాం. కాలుజారి పొరపాటు చేయటం వేరు. ఆ పొరపాటుకుఫలితంగానో, లేక శిక్షగానో ఆ పతితగాని, పతితుడు కాని అవినీతికరమయిన నడవడిని వృత్తిగా

చేపట్టటం వేరు. ఈ రెంటికి తేడాను గమనించటం అవసరం. వ్యభిచారాన్ని నిర్మూలించ లేకపోవచ్చు సంఘం. కాని వ్యభిచార వృత్తిని విధిగా చేపట్టవలసిన అగత్యంగాని, కొనసాగించవలసిన అవసరంగాని లేకుండా చేయగలదు సమాజం. ఈ సందర్భంగా రాజకీయవాదుల కర్తవ్యం మెండుగా ఉంటుంది. ఆ వృత్తిలో ఉన్నవారికి ప్రత్యామ్నాయ జీవితావకాశాలను కల్గించాలి ప్రభుత్వం. వారిని సమాజంలో పునర్ వ్యవస్థితం చేయాలి. ఇచ్చట స్వచ్ఛంద సేవకులు, సామాజిక శాస్త్రజ్ఞులు రంగప్రవేశం చేయాలి. సామాజిక నీతిని శాసించే విలువలు మారాలి. సహనం, క్షమ, ఔదార్యం లాంటి గుణాలు సమాజంలో చోటుచేసుకోవాలి. ఇది ఎంతో శ్రమతోకూడిన పని; ఓపికగా నిర్వహించ వలసిన కార్యక్రమం ఇది. అయినా ఏనాడో ఒకనాడు, ఎచ్చటో అచ్చట ఈ కార్యక్రమాన్ని ప్రారంభించక తప్పదు. సమస్యను అవగాహన చేసుకొని దాని పరిష్కారాన్ని అరికట్టే శక్తులపై వైఖరులపై మూక ఉమ్మడిన బహుముఖంగా దాడి చెయ్యాలి విజ్ఞులు. ఆనాడే ఈ సమస్య పరిష్కారమవుతుంది. అంతేకాని మాట్లువేసిన పద్ధతిలో ఇక్కడోభాగం, అక్కడోభాగం శాసనాన్ని సవరించినంత మాత్రాన ఒనగూడే ప్రయోజనం లేదు. ఇది ఏ ఒక్క దేశ సమస్యకాదు. ప్రపంచ సమస్య; మానవాళి సమస్య. దీని స్వభావాన్ని దీని వ్యాప్తిని, దీని ఉధృతాన్ని ఎంత త్వరగా, నిశితంగా గమనించ గలిగితే అంత త్వరగా దానిని పరిష్కరించగలం.



* స్వకీయ స్వాతంత్ర్యానికి మానసికమైన, ఆంతరంగికమైన ఏ ఆటంక మున్నా దాన్ని తొలగించుటయే ప్రతివ్యక్తికి కర్తవ్యం.

ఇరాన్ మహిళల ఇక్కట్లు

మతం పేరుతో మహిళకు ఎంత దోపిడి ! ఎంత కుట్ర! మరెంత దారుణమైన మోసం! మతం మహాక్రూరమైనది కనుకనే బానిసత్వాన్ని స్త్రీకి నీతి పేరుతో బోధించి, నమ్మిస్తోంది. దుర్మార్గపు దోపిడీని పవిత్రం గాను, ఘోరమైన అత్యాచారాల్ని ఆదర్శంగాను ప్రతిపాదించింది. మతం, మత ధర్మాల పేరుతో మహిళను వంట ఇంటికీ, పడకటింటికీ, పతిసేవకు పరిమితం చేసింది. ఒకవైపు మతం, మరోవైపు సమాజం, వేరొకవైపు పురుష దురహంకారం, ఇంకా పాతివ్రత్యమనే ఇనుప చట్రాలతో ఆమెను నఖ శిఖ పర్యంతం కట్టిపడేశింది ఇస్లాం మతం. మత ప్రవక్తల ఆదేశానుసారం వ్యక్తిత్వంలేని ఆటబొమ్మగా, నాశిరకంజాతిగా నికృష్ట జీవితాన్ని గడుపుతోంది ముస్లిం స్త్రీ. ఇస్లాంలో స్త్రీ పురుషుని ఆస్తి క్రింద జమ. అంతే కాదు ఆమె దున్నే భూమిట, ఆ భూమిపై దున్నేవాడికి సర్వాధికారాలు వున్నాయని ముస్లిం స్త్రీలకు బ్రహ్మాండమైన బ్రెయిన్ వాష్ చెయ్యబడింది.

కొరాన్ ఇస్లాంకు పరమదైవం. సాంఘిక కట్టుబాట్లకు, దైవవిశ్వాసానికి ఇస్లాం మతస్తులు ఆ గ్రంథం గీచిన గీటు దాటరు. ఇస్లాం ఒక వ్యవస్థిత మతం. ఆ మత గ్రంథం ఖురాన్ భగవంతునిచే మహమ్మదుకు పంపబడిందని ముస్లింల నమ్మిక. ఆ గ్రంథం ఆధారంతో వ్రాయబడిందే షరియాచట్టం. దానిలో ఏమాత్రం మార్పుచేసినా అదినేరమని ముస్లింల విశ్వాసం.

ఖురాన్‌లో స్త్రీ జన్మించినదాది ఆమె జీవిత పర్యంతం ఎలానడుచుకోవాలో నీచాతి నీచంగా స్పష్టీకరించింది. వివాహంలో, విడాకులలో, వారసత్వంలో, ఆస్థిహక్కు, దత్తతలలో స్త్రీని నల్లిలా నలిపి పారేశింది. ఇక సాంఘిక, ఆర్థిక, రాజకీయపరంగా స్త్రీకినిర్దేశించిన విధులను, బాధ్యలను ఖురాన్‌నుండే తెలిసికొందామా !

"ముస్లింలు తమ బానిస స్త్రీలను చెరచుట నేరంకాదు. బానిస స్త్రీలను అమ్మినా తప్పులేదు." (ఖురా 33.25) "స్త్రీలకోసం తమ, సంపద ఖర్చు

చేస్తున్నారు కనుక వారు పురుషులకు విధేయత చూపాలి. అవిధేయుల్ని కొట్టు; దూరంగా పెట్టు; పడకమీద ఎడంగావుంచు." ఇది ఖురాన్ ఆజ్ఞ.

"పరదాతో ఒళ్ళు, ముఖం కప్పుకోవాలి; నికా ప్రకారం పురుషుడు నలుగురు భార్యలనేకాక, ఉంపుడు గత్తె లెందరినైనా కల్గివుండవచ్చు." భర్త వ్యభిచరిస్తే రాళ్ళతో కొట్టి చంపాలి భార్య అయితే నడుంవరకు పాతి పెట్టి రాళ్ళతో కొట్టి చంపాలి. "ఇక కూతురు పుడితే అది దుర్వార్త. ఆ అవమానాన్ని భరిస్తూ కూతుర్ని ఉంచుకోవాలా, లేక మట్టిలో పాతి పెట్టాలా" (57-60) (ఆయత్) "ఆదిలో అల్లా ఏడంను పుట్టించి అతని నుండి ఏవాను స్త్రీని పుట్టించాడంటుంది''. ఖురాన్, మానవ శ్రేయస్సుకు ఏ మతం పుట్టిందో ఆ మతమే స్త్రీకి ఘోరాపచారం చేసింది.

ఇస్లాం మతంలో ఆది నుండి మతమూ రాజకీయాలూ ముడిపడి వున్నాయి. "నాకు విధేయులుగా వుండేవారు దేవునికి నమ్మినబంట్లు" అనేవాడు మహమ్మద్. అలాంటి రాజ్యాధికారాన్ని మించిన దైవత్వాన్ని ఆపాదించుకొన్న చండశాసనుడు ఖొమేని. దేశ ప్రగతికి మూలమైన స్త్రీనాభ్యుదయానికి వారధి ఖొమేని. అపరమనువులాంటి ఖోమేని స్త్రీ ద్వేషి; మతదురహంకారంతో మారణహోమంచేస్తున్న మహాఘనుడు.

ఇరాన్‌లో ఇటీవల స్త్రీలపై జరుగుతున్న ఘాతుకాలు మానవత్వాన్నే వమ్ముచేస్తున్నాయి. ఇరాన్ స్త్రీలకు మత గురువు ఖోమేనీ శాశించిన నిబంధనలు చాలా హృదయ విదారకంగా వున్నాయి. స్త్రీలు మతం విధించిన దుస్తులనే ధరించాలని; ఆజ్ఞాపించారు. గోళ్ళకు రంగులు, బిగుపైన జీనులు, పొట్టి స్కర్టు ధరించినవారిని నీతి బాహ్యులని వెక్కిరిస్తున్నారు. అలాంటివారిని ఖొమేని అనుచరులు విమానాలనుండి దింపే ప్రయత్నాలు జరిగినై. ముస్లిం మహిళలకు షా పరిపాలనకు పూర్వపు స్థితిలోకి పోవాలని ఫర్మానా జారీ అయింది. వారు వంట ఇళ్ళకే పరిమితం కావాలని, పిల్లల పెంపకం, గృహకృత్యాలకే అంకితం కావాలని శాశించారు. శరీరమంతా నల్లని ముసుగేకాక ముక్కు పై భాగాన తోలు కచ్చడాలు ధరించాలని ఆదేశించారు. కొందరు స్త్రీలు ఇది అన్యాయమంటూ ఊరేగింపు జరిపితే మతదురహంకారులైన ఖొమేని అనుచరులు

వారిని ఆయుధాలచే కొట్టించారు; కత్తులతో, చాకులతో వారి జాకెట్లు చింపించారు. అది చాలక మత నాయకులు నల్లని గుడ్డలు నోటికి కట్టుకొని "మీ జీవితాలే కాక మీ మనస్సులు, మీ హృదయాలూ కూడా జిడ్డు పట్టినై". అనే సంకేతాలతో ఎక్కిరిస్తూ, అధిక్షేపిస్తూ ఊరేగారు.

తిరుగుబాటు దార్లను వేలసంఖ్యలో హతమారుస్తున్నాడు ఖొమేని వారిలో స్త్రీల సంఖ్య మిక్కుటంగానేవుంది. ఎదురుతిరిగిన కుటుంబాలే కూలిపోతున్నాయి. ఇరాన్‌దేశం నేడు కురుక్షేత్రమయిందని చెప్పవచ్చు. మత పవిత్రత; మతరక్షణ పేరుతో ఖొమేని అనుచరులు స్వైరవిహారం చేస్తున్నారు. విమానం దిగగానే సెక్సీ పత్రికలుంటే లాక్కుని పంపుతున్నట్లు వార్తలొచ్చినై. ఆడా, మగా కలిసి తిరిగే ప్రసక్తే లేదు. T. V. (టెలివిజన్‌లో) ఏమాత్రం ఒంపు సొంపులున్నా స్త్రీల మొహంమీద బొమ్మ నల్లగా చూపటం జరుగుతోందట, హాయిగా స్త్రీ నవ్వినా, పాటపాడినా మహా నేరమే. భార్యా భర్తలు కారులో పోతున్నా గుర్తింపు కార్డు చూపాలట. పెండ్లి కాగానే అనీమూన్ కొచ్చి దంపతుల కింకా కార్డు పుట్టలేదట వార్ని జైల్లో పెట్టి కొరడాలతో కొట్టారట. స్త్రీ అన్న తమ్ములతో కానీ, ఆఖరికి తండ్రితో కూడా బైటికి రాకూడదట. భర్తతోకూడా ముసుగుతో మాత్రమే రావాలి. స్త్రీలు నర్సులు, టీచర్లు, డాక్టర్లు, తప్ప ఏ వుద్యోగానికి అర్హులు కానట్లు ఉద్యోగాలివ్వరు.

వ్యభిచార నిరోధం పేరుతో ఘోర శిక్షలు విధిస్తున్నారు. అనాగరికమైన రాళ్ళతో కొట్టి చంపుతున్నారు.

ఇరాన్‌లో ఖొమేని ముందు పూర్తిగా బురఖా వేసుకోమని జారీ చేశాడు. తర్వాత స్త్రీలు పదివేలమంది వూరేగినప్పుడు సైనికులచేత వారిని కొట్టించాడు. తిరిగి అభ్యుదయ వాదుల అండదండలతో బ్రహ్మాండమైన నిరసన ఊరేగింపు జరిపారు. అప్పుడు మాత్రం శరీరమంతా దుప్పటితో కప్పుకుంటే చాలు బురఖా అక్కరలేదని మార్పు చేయించాడు. అంతకు ముందున్న రాజు షా ఇతరత్రా దుర్మార్గుడయినా స్త్రీలకు కొన్ని అవకాశాలు కల్పించాడు. ఉద్యోగాలిచ్చాడు. ఉపకార వేతనాలిచ్చాడు. ఖొమేనీ కాలచక్రాన్ని వెనక్కు తిప్పాలని చూస్తున్నాడు.

ముస్లిం మహిళలు ఏనాడు సభలుపెట్టి కోర్కెలు హక్కులు అడిగిన పాపాన పోలేదు. పైగా తమ పుట్టుక, స్థాయి, స్థానం దైవదత్తమని వాదించేవారు లేకపోలేదు. తమ మతం మహోన్నతమయినదని, తాము అచ్చంగా ఖురాన్‌లో చెప్పినట్లు నియమాల్ని పాటిస్తున్నామని గర్వంగా చెప్పు కుంటారు ముస్లిం దేశాధినేతలు. అసలు ఏ దేశమైనా అభ్యుదయ కరంగా వుందా లేదా అనే దానికి గీటురాయి ఆ దేశాలలోని స్త్రీల స్థితి. దీనిని బట్టి ఆ దేశపు నాగరికతను, సంస్కృతిని మనం అంచనా వేయ గలం. ముస్లిం దేశాలలో సౌదీ అరేబియా, ఇరాన్‌లు పెద్దవి. కనుక ఆ దేశాలలో ఆచారాలను ముఖ్యంగా లెక్కలోకి తీసుకోవాలి. అలాంటి కొన్ని మచ్చుతునకలు చూద్దాం. ఈ మధ్య ఇరాన్‌లో ఇద్దరు స్త్రీలను ఇద్దరు పురుషులను లైంగిక నేరాలు చేశారని ఇస్లాం మతాదేశ ప్రకారం రాళ్ళతో కొట్టి చంపారు.

పాకిస్తాన్‌లో స్త్రీలు టెలివిజన్‌లో పాటలు పాడరాదని ఆర్డరు జారీ అయింది. ఇస్లాం మతానికి హాకీ ఆటకు సంబంధమేమోగానీ పాక్‌లో జాతీయ మహిళా హాకీ క్రీడోత్సవాలను నిషేధించారు. ఇది మతాధికారుల ఆదేశ మన్నారు. పూర్వం పొడవాటి గౌనులు, మోకాళ్ళ క్రింది వరకు బ్లౌజులు ధరించి పురుష ప్రేక్షకులు లేకుండా ఆడేవారు. హాకీ దుస్తులు శరీరపు ఒంపు సొంపులు ప్రదర్శిస్తాయని, అందువల్ల నిషేధించామన్నారు.

భర్తతో తప్ప, సౌదీ, ఇరాన్‌లలో స్త్రీ వంటరిగా వీధిలో తిరగాడటం నేరం. బురఖా లేని స్త్రీ టాక్సీ ఎక్కకూడదు. వ్యభిచార నిరోధం పేరుతో ఘోర శిక్షలు వేస్తున్నారు. సౌదీ అరేభియాలో రాజవంశపు స్త్రీ సామాన్యుణ్ణి పెళ్ళాడింది. అతనొక పెద్ద సైన్యాధికారి. ఇద్దరినీ రాళ్ళతోకొట్టి చంపమని కోర్టు తీర్పు ఇచ్చింది. ఆ పిల్ల తాత ప్రాధేయపడితే ఆమెను రాళ్ళతో కాకుండా కాల్చి చంపారు; అతన్ని రాళ్ళతో కొట్టి చంపారు.

ఇటీవల ఇస్లాం దేశాలలో ముస్లిం స్త్రీలు సినిమాలు చూడరాదని నిషేధిస్తూ ఉత్తరువులు జారీ చేశారు. ఆగస్టు రెండు 81 న పాక్ స్త్రీలు సినిమాలు చూడరాదని ఫర్మానా అమల్లోకి వచ్చింది. అలాగే మహా రాష్ట్రలోని జల్‌గాన్‌లో ఫర్మానాను త్రోసిపుచ్చి సలీమ్, రెహనాషేక్ అనే

బీద దంపతులు సినిమా చూచివచ్చారని ముస్లిం గూండాలు వాళ్ళ ఇంటిపై దాడిచేసి ఇద్దర్నీ చావచితక కొట్టారు. ఇలాంటివి లెక్కకు రానివి ఇంకా కోకొల్లలుగా ఉన్నాయి.

ఇరాన్‌లో గత మూడేళ్ళుగా మత పరమైన విప్లవంవల్ల స్త్రీలకు ఉనికి నశిస్తుంది. ఉద్యోగినుల సంఖ్య చాల తగ్గిపోయింది. తప్పనిసరిగా బురఖాతోనే స్త్రీలు ఆఫీసులకు రావాలి. విశ్వవిద్యాలయాలు, స్కూళ్ళు తెరుస్తున్నారు. కాని స్త్రీలకు విద్యావకాశాలు పూర్తిగా దెబ్బతినగలవని ఊహిస్తున్నారు. విద్యా, ఉద్యోగావకాశాలు స్త్రీలకు కావాలని అడిగే ధైర్యం ఎవరికీ లేని పరిస్థితి వచ్చింది. తమకు దేశంలో, సమాజంలో ప్రాముఖ్యత లేదని వాపోతొంది స్త్రీలోకం. తాము తిరుగుబాటులో పాల్గొన్నా, ఫలితం శూన్యమయిందని నిరాశా, నిస్పృహలతో విలపిల్లాడిపోతున్నారు. "మీ భర్త కోసం, బిడ్డలకోసం త్యాగాలు చెయ్యాలని ప్రబోధిస్తున్నారు ముల్లాలు, షాను పడగొట్టిన దాది స్త్రీల వస్త్రధారణపై ఆంక్షలు విధిస్తూ, ఇప్పుడు గడువును నిర్ణయించడంపై ప్రపంచమంతా నిరసన తెలియజేయాలి.

పదమూడు వందల ఏళ్ళనాటి ఆచారాలను, ఈనాడు అమలు పర్చటం సమంజసం కాదు. కాలం దొర్లిపోతోంది. ప్రపంచంలో ఎన్నో మార్పు లొచ్చాయి. ఎన్నో మూఢ విశ్వాసాలు పటాపంచలయినాయి. అటువంట ప్పుడు తనను తాను రక్షించుకోలేని జీవిగా స్త్రీని భావించి ఆమెను అదుపులో పెట్టఋూనటం అవివేకం అవుతుందేమో! ఈ ఇబ్బందుల్ని ముస్లిం స్త్రీలు అధిగమించగలరని భావిద్దాం. దానికి సోదర దేశాల స్త్రీ పురుషులు తమ సహాయ, సహకారాల నందివ్వగలరని ఆశిద్దాం.



* తన జీవనం కోసం, రక్షణకోసం, సుఖంకోసం, సంఘంలో మర్యాద కోసం భర్తమీద ఆధారపడవలసి రావడంవల్ల స్త్రీ తన స్వేచ్ఛనూ, శరీరారోగ్యాన్నీ, తన కండరాల్ని పోగొట్టుకుంటోంది.

రష్యాలో మహిళోద్యమం

ఒకనాడు బానిసత్వంలో, అంధకారంలో మగ్గిపోయిన సోవియట్ ప్రాచ్య ప్రాంత మహిళల సమస్యలు దరహం మీద పరిష్కృత మయినాయి. జాతీయార్ధిక వ్యవస్థలో క్రియాశీలక పాత్ర వహిస్తున్నారు స్త్రీలు. సామాజికంగా ఉపయుక్తమైన పనిలో మహిళల భాగస్వామ్యం పెరిగింది, పారిశ్రామిక, విద్యా సంస్థలను నిర్వహిస్తున్నారు. సుప్రీం సోవియట సభ్యుల్లో, పరిశోధకుల్లో మూడోవంతు మహిళలున్నారు. అనేక మంది మహిళలు ఉన్నత ప్రభుత్వ పదవులేకాక బాధ్యతాయుత కర్తవ్యాలను నిర్వహిస్తున్న మాటనిజమే. కాని సోవియట్ మధ్యాసియా ప్రాంత మహిళల అభివృద్ధికి వారి చారిత్రిక, మానసిక, కుటుంబ సమస్యలు ఆటంకంగా ఉన్నాయి. వారి బురఖా అంచు కొంచె మాత్రమే తొలగింది. వారున్న సమాజం మార్పును తీవ్రంగా నిరోధిస్తున్నది. మొత్తంమీద, మహిళల అసమానతకు మూలమైన సామాజిక పరిస్థితులను సంస్కరించుకున్న మాటవాస్తవమే. అయినా, రష్యన్ మహిళలను వేధిస్తున్నదీ, బాధిస్తున్నదీ ఒక్కగా ఒక్క విషయం ఉందనే అంశాన్ని విస్మరించరాదు.

నేడు రష్యన్ మహిళలు ఇంటా, బైటా పని చెయ్యక తప్పటం లేదు. వారి పని కాలం పెరిగింది. వారిలో అలసట, ఆవేదన పెరిగాయి. ఇంటి పనిలో పురుషులు పాల్గొనరు. స్త్రీలు మాత్రం ఉద్యోగం చెయ్యాలి; పిల్లల్ని కనాలి, వారిని పెంచాలి; పైగా రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనాలి. ఇంటి పని పూర్తిగా వారే చెయ్యాలి. నిర్ణాయక స్థానాల్లో స్త్రీలు కొద్దిమందే వున్నారు. కేంద్ర కమిటీలో 5 గురు మాత్రమే స్త్రీలున్నారు. విప్లవం తేవటానికి స్త్రీలు ఎంతో తోడ్పడ్డారు. నేటి మహిళలు ఆర్థిక విప్లవంతో పాటు సాంస్కృతిక విప్లవం కూడా వాంఛిస్తున్నారు.

పితృస్వామ్య వ్యవస్థ మౌలికంగా మారాలని వారు కోరుకుంటున్నారు. ఇప్పటికీ స్త్రీల సమస్య అంత ప్రాముఖ్యత కలది కాదని పురుషులు వాదిస్తుంటే వారి జీవితంలోని ముఖ్య సమస్యలు పరిష్కరింపబడలేదని స్త్రీలు వాపోతున్నారు. ఇంటిని అంటి పెట్టుకొని వుండకపోయినా, ఇంటి పనికి స్త్రీలే బాధ్యులు. పురుషులు సుఖంగా కూర్చుని స్త్రీల చేత

గట్టిగా పనిచేయిస్తున్నారు. పై గా స్త్రీలను అధికార పదవుల్లోకి రానివ్వరు; వారిని ద్వితీయ శ్రేణిలోనే వుంచటం జరుగుతోంది ఈ నాటికీ. స్త్రీలు అనేక ఇబ్బందులకు లోనైనా పురుషులతో పోటీ పడుతున్నారు. హెచ్చు మంది స్త్రీలు తక్కువ నైపుణ్యం, ఎక్కువ శారీరక కష్టం, కొద్ది వేతనాలు గల వుద్యోగాల్లో ఆసక్తి లేకుండా పనిచేస్తున్నారని ఫీగా బ్లేఖర్ (FEIGA BLEKHER) ఒక కరపత్రం 1982 లో రాసి రహస్యంగా లెనిన్ గ్రాడ్ నుండి ఫ్రాన్స్‌కు పంపింది.

ఫ్యాక్టరీల్లో, పొలాల్లో పనిచెయ్యటమే కాక ఈనాడు రష్యన్ మహిళ వారానికి 30 గంటలు కుటుంబం కోసం, పిల్లల కోసం పనిచేస్తున్నది. ఇది ఒక రకపు సామాజిక అసమానత్వం; దోపిడీ కూడా అని ఫీగా బ్లేఖర్ రాసింది. ఇంటా బైటా పనివల్ల వాళ్ళు తమ పిల్లల్ని సరిగా చూడలేక పోతున్నారు. అందువల్ల జననాల రేటు తగ్గుతున్నది; విడాకుల సంఖ్య పెరుగుతున్నది; స్త్రీలు రాజకీయాలపై విముఖత చూపుతున్నారు. వారికి సామాజిక సమానత్వం రావాలంటే ఇంట్లో చాకిరీకి పిల్లల్ని పెంచటానికి పట్టేకాలాన్ని కూడా లెక్కలోనికి తీసుకొని సమానమైన పని గంటలు నిర్ణయించాలి. అంతేకాక, విశ్రాంతి, స్వేచ్ఛగా వినియోగించుకొనే సమయం మొదలగు విషయాలలో, కుటుంబ బాధ్యతలను నిర్వర్తించటంలో సతీపతుల మధ్య న్యాయమైన పంపిణీ జరిగితేనే స్త్రీ యొక్క స్థానం మెరుగు పడుతుంది. దీనికి ముందుగా పురుషుని పరిస్థితిని కూడా మార్చాలి. "ఇది కేవలం స్త్రీల సమస్య కాదు; మానవాళి సమస్య అని భావించాలి" అని ఆమె విపులీకరించింది.

స్వేచ్ఛగా వాడుకునే సమయం అంటే విద్యుక్త ధర్మాలను నిర్వహించే కాలం కాదన్న మాట. తను తనకే చెందివుండాలి. వ్యక్తికున్న స్వేచ్ఛకు ప్రకటన రూపంగా వుండేది స్వేచ్ఛా సమయం. తన వ్యక్తిత్వం యొక్క అభివృద్ధికి, ఆమె విశ్రాంతికి, తను స్వేచ్ఛగా వుండటానికి కొంత సమయం కావాలి. అది లభించక వారు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. అది లేనందున సామాజిక అసమానత్వంగా వారు బాధపడుతున్నారు. 15.7% స్త్రీలకు అసలు స్వేచ్ఛా సమయమే లేదని, స్త్రీ కన్నా రెండు రెట్లు 'ఫ్రీటైం' పురుషుడు పొందుతున్నాడని, స్త్రీ వయస్సు పెరిగే కొద్ది స్వేచ్ఛా కాలం

తగ్గుతోందని, ఆమెకు 30-39 సం॥ వచ్చేనాటికి అది మృగ్యమవుతోందని వారు వాపోతున్నారు. కుటుంబం ఏర్పడగానే స్త్రీ పురుషుల నడతలో తేడాలుంటున్నాయి. ఇంటి పని అంతా తల్లి మీద పడుతోంది. నిద్రకాలం తప్పితే పనిలేని మిగతా కాలమంతా తండ్రి వినోదాలకూ, సాంస్కృతిక కార్యక్రమాలకూ, పది మందితో తిరగటానికి వాడుకుంటాడు. స్త్రీకి మాత్రం విశ్రాంతి లేమివల్ల సామాజిక, సాంస్కృతిక జీవితం కరువై పోతోంది.

ఇంటా బైటా వారానికి రష్యన్ మహిళ 80-85 గం॥ పనిచేస్తున్నది. అంటే ఆమె పని భారం 15% హెచ్చు. గత 45 ఏళ్ళలో ఆమె పనికాలం ఇంకా పెరిగింది. పిల్లల్ని బస్సు లెక్కించడం, చిన్న పిల్లల్ని కిండర్ గార్టెన్ స్కూళ్ళకు తీసుకెళ్ళటం, రావటం, కూరగాయలు, రేషన్ వస్తువులు తేవడం ఇతర బండచాకిరి వీటిలో ఆమె సతమత మవుతోంది. తన్ను గురించి ఆలోచించు కోవడానికిగాని, తను చేసే పనికి అర్థం వుంటుందా లేదా అని తలపోయడానికిగాని తనకు అవకాశం లేదని బాధపడుతోంది. కనుక అలాంటి స్త్రీ సహచర్యాన్ని పురుషుడు అభిలషించడం జరగదు. దీనివల్ల పురుషులు తమ కాలాన్ని సద్వినియోగం చేసుకోలేక పోతున్నారు. స్త్రీ పురుషుల అసమానత్వం మీద ఆధారపడివున్న పరిస్థితినే కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా కార్మిక కుటుంబాల్లో 30-40 ఏళ్ళ మధ్య వయస్కులైన పురుషుల తాగుడెక్కువయింది. పిల్లల ఖర్చుకుకూడా ఇవ్వకుండా వారు డబ్బును దుర్వినియోగం చేస్తున్నారు. వారి కుటుంబ జీవితం రంగు, రుచి, వాసన లేక విసుగుతో నిండి వుంటున్నది. వారిలో కొంత మంది ఓడ్కా అనే నాటు సారా త్రాగటంమరీ విపరీతమయింది. వారితో కాపురాలు చెయ్యలేక అనేక మంది కుటుంబ విచ్ఛిత్తి కోరుతున్నారు. భరణానికి వేసే ప్రతి 5 దావాల్లో 4 త్రాగుడు కేసులేనని లెక్కలు తేలాయి.


"ఇంటి పని లేక బైటి పనా? కొంత ఇంటి పని, కొంత బైట పనా? మేము ఏంచెయ్యాలి?" అని ఘోషిస్తున్నారు వారు. ఇంటా బైటా చేసే మొత్తం పనిగంటలు లెక్కలోకి తీసుకోవాలని అలజడి చేస్తున్నారు. రష్యన్ మహిళ అత్యద్భుత శక్తి కలదిగా సంచరించడమే ఆమెకు ప్రాణ సంకట మయింది నేడు. వాస్తవానికి ఆమె కూడా మామూలు మానవవ్యక్తి. మనిషి మోయగల బరువు మాత్రమే ఆమె సహించగలదు.

పూర్తికాలం వినియోగించే కార్మిక స్త్రీగానూ, తల్లిగానూ, గృహిణిగానూ, పని చెయ్యలేమని వారు పోరాడుతున్నారు.

"నా భర్త తాగుతాడు, నా భర్త చెడిపొయ్యాడు,నా భర్త ఇంటి పనిలో సాయం చెయ్యడు" లాంటి ఆరోపణలలో స్త్రీలే విడాకులు కోరుతున్నారు రష్యాలో. ఈ సమస్యలు రష్యాకు మాత్రమే ప్రత్యేకం కావు. కాని ఇవి అక్కడ పరిష్కరించటానికి కష్టసాధ్యంగా వున్నట్లు క్రిష్టియన్ సైన్సు మానిటర్ ప్రచురించింది 1982 లో.

బాలికలు ఇంటి పనిలో బాగా సాయపడుతున్నారని, బాలురు ఏమీ పట్టని మనుష్యులుగా తయారయి అందువల్ల తరువాత జీవితంలో కుటుంబం మీదనో మరొకరిపైనో ఆధారపడి జీవించే స్థితికొస్తున్నారని సోవియట్ రష్యా అనే పత్రికలో ఒక స్త్రీ వ్రాశింది. ఆఫీసు పని కాగానే స్త్రీలు సరుకులు తేవటం, రాత్రి వంటచేయుటం ఇంటిపని అంత వారే చేయాలి. అంటే ఆమె ఇంటిపని చేసేకాలం 6 గం॥లు పడుతోందని లెక్క తేలింది.

మాకు ఇంటి పనికాలం తగ్గాలి. గృహ కృత్యాలకు పురుషులు సాయం చెయ్యాలివి, లేదా ప్రభుత్వం ఇంటా బైటా చేస్తున్న మా పని కాలాన్ని లెక్కకట్టాలి అని ఆందోళన చేస్తున్నారు. నిజమైన సోషలిస్టు దేశమైనప్పుడు ప్రభుత్వం ఈ విషయంలో ఎందుకు పట్టించుకోవడం లేదు? "ఇది ప్రభుత్వానికి ఇష్టం లేకనా, అర్థంకాకనా?" అనే అంశం మిత్రరాజ్యాలకూ, స్వేచ్ఛా ప్రియులకు అర్థం కావడం లేదు.



* "స్త్రీలను కనిపెట్టివుండాలి. వాళ్ళు తండ్రులను, కొడుకులకును, సోదరులను కూడా చెడగొట్టగలరు. ఏ మగాడైనా ఆమె కిష్టమే. స్త్రీలు సోమరిపోతులు; వినయంలేని వారు; అబద్ధీకులు". - మనువు.

ఫ్రాన్సులో స్త్రీ విమోచనోద్యమం

రెండు ప్రపంచ యుద్ధాలలో పోరాడి, అశేష త్యాగాలుచేసి, గొప్ప రాజకీయ చైతన్యం గల ఫ్రెంచి స్త్రీలకు 1944 లో ఓటు హక్కు వచ్చింది. వారి జీవిత గాథలు, బాధలు వర్ణనాతీతం. ఎన్నో రంగాలతో అభివృద్ధి చెందిన ఫ్రాన్సులో వివాహిత స్త్రీ హక్కులు మహా దారుణంగా వుండేవి. వారి చీకటి జీవితం దుర్భరబాధలతో మిళితమై వుండేది. వారి పోరాటాలు, త్యాగాలూ అశేషం. నెపోలియన్ ధర్మ శాస్త్రం ప్రకారం కాని, ఇంగ్లీషు శాసనాలవల్లకాని 1800 వరకు వివాహిత స్త్రీ ఆస్థిమీద, ఆమె సంపాదనమీద, ఆమెకు వారసత్వంగా వచ్చిన ఆస్థి మీద ఆమెకు ఏ మాత్రం హక్కులేదు. హక్కులన్నీ భర్తకుండేవి.

ఆమె కోర్టులో సాక్ష్యం చెప్పటానికి వీలులేదు. ఆమె దావా వెయ్యటానికి హక్కు లేదు; ఆమె మీద ఎవ్వరూ దావా వెయ్యరాదు. పిల్లలు ఎక్కడ వుండాలి, ఎలా విద్య పొందాలి అనేవి తండ్రి ఇష్టప్రకారం జరగాలి. వివాహంతో పాటు ఆమె ఆస్థిపై సర్వాధికారాలు భర్తకు చెందుతాయి. భర్త అనుమతి లేనిదే భార్య వస్తువులు కొనరాదు; అమ్మరాదు. ఇతరులతో ఎలాంటి కంట్రాక్టు చేసుకొనరాదు. తనుకన్న పిల్లలపై పూర్తి యాజమాన్యం భర్తదే. విధవరాలు పెళ్ళాడ తలిస్తే చనిపోయిన భర్తయొక్క బంధువుల యొక్క నిర్ణయం లేక ఆదేశం ప్రకారం పిల్లల సంరక్షకత్వం వుంటుంది, 1800 కి పూర్వం ఫ్రెంచి మహిళకు విడాకులకు అవకాశం లేదు.

భార్య వ్యభిచరిస్తే రెండు సంవత్సరాలు కఠిన జైలు శిక్ష వేసేవారు; భర్త ఉంపుడు గత్తెను ఇంట్లో వుంచితే జరిమానా మాత్రం వుంటుంది. తల్లి హక్కుల గురించి ఫ్రాన్సులో, ఇటలీలో స్త్రీలు పోరాటాలు నడిపారు. నెపోలియన్ ధర్మశాస్త్రంలోని 340 ఆర్టికల్ మీద – అక్రమ సంతానం గురించి – ఫ్రాన్సులో పోరాటం సాగింది. ఫ్రెంచి విప్లవ కాలంలో తండ్రి యెవడో తేల్చి తల్లికి భరణం ఇప్పించటానికి శాసనం పుట్టింది. కాని నెపోలియన్ ధర్మంశాస్త్రం ప్రకారం అక్రమ సంతానపు తండ్రి యెవడో తేల్చనక్కరలేదు. కాని 341 ఆర్టికల్ ప్రకారం ఆ సంతానపు తల్లిని నిర్ణయించాలి. ఇది ద్వంద్వ నీతి కాదనగలమా ? దీనికి వ్యతిరేకంగా ఉద్యమకారులు పోరాడారు. ఫ్రాన్సులో వేశ్యల శరీరాలను ప్రత్యేక

వైద్యుల చేత పరీక్షలు చేయించటం, వారిని అధికారులు వేధించటం పరిపాటయింది.

ఫ్రాన్సులో లైంగిక వివక్షను వ్యతిరేకించటానికి స్త్రీలు వ్యక్తిగతం గాను, ఉద్యమాల ద్వారాను పోరాడారు. 1881 లో తమ హక్కుల పిటీషన్ పార్లమెంటుకు పంపారు. 1882 లో స్త్రీలను బ్యాంకు ఎకౌంట్లు పెట్టుకోనిచ్చారు. 1886 లో ఆమె జీవితంపై హక్కు భర్తదేనంటూ ఫించను సౌకర్యం మాత్రం ఆమె కిచ్చారు. స్త్రీలు తమ జీతాల మీద వారికే హక్కు వుండాలని, దానికి భర్తల అంగీకారం అక్కరలేదని వాదించారు. 1891లో కొత్త శాసనాలు వచ్చాయి. దానిలో భర్త ఆస్థికి భార్య వారసు రాలయింది. 18 3 లో తమ ఆస్తిని తామే నిర్వహించు కోవచ్చనే చట్టం వచ్చింది. 1907 లో వేతనాల మీద స్త్రీకి ఆధిపత్యం ఇచ్చారు.

ఫ్రెంచి విప్లవ ప్రభావంవల్ల స్త్రీలను అణచివేసే, సిద్ధాంతాలను నిరసిస్తూ మేరీవాల్ స్టోనుక్రాఫ్టు "స్త్రీల హక్కుల సమర్ధన" అనే పుస్తకం రాసింది. ఉదారవాద సోషలిష్టులవల్ల స్త్రీ విమోచనోద్యమం బలపడింది. వారు పురుషులతో పాటు స్త్రీ సమాన హోదాను పొందితేనే సామాజికాభ్యు దయం సంభవిస్తుందన్నారు. కాని మానవుడంటే పురుషుడేనని చెప్పారు. 1791 లో 'ఒలింపిదా జార్జస్" స్త్రీల హక్కుల ప్రకటన పత్రం రాసింది.

మొదటి ప్రపంచ యుద్ధానికి పూర్వం ఫ్రెంచి స్త్రీలు ఓటుకోసం మహజర్లు పెట్టుకున్నారు. జార్జి ఇలియట్, ఫ్లారెన్సు నైటింగేల్, రోజా లగ్జంబర్ లాంటి సుప్రసిద్ధులు గృహిణుల పరిస్థితి మెరుగు పర్చటానికి ప్రయత్నించారు. అనేక ప్రతిఘటన లొచ్చాయి. కారణం - ఫ్రాన్సులో నగరాలు తక్కువ. కేథలిక్కు మతవ్యాప్తి బాగా వుంది. ఉద్యమకారులు కార్మికోద్యమానికి ప్రాధాన్యత నిచ్చుటచే విమోచనోద్యమం చల్లబడింది.

1860 లో స్త్రీ ఉద్యమకారులు స్త్రీకి ఉన్నత విద్య కావాలని అలజడి చేశారు. తర్వాత బాలికలకు పాఠశాలలు తెరిచారు. కాని సిలబస్ వేరుగా వుండేది. 1880 లో స్త్రీలకు యూనివర్శిటీలలో ప్రవేశార్హత ఇచ్చారు. కాని స్త్రీలకు డిగ్రీలు ఇవ్వకుండా సర్టిఫికేట్లు మాత్రమే ఇచ్చేవారు. 1892 లో

స్త్రీలను రాత్రిళ్ళు పనిచేయవద్దని శాసనం పెట్టారు. దానిని సమానత్వ దృష్టితో వ్యతిరేకిస్తూ స్త్రీ విమోచనోద్యమం పోరాటం సలిపింది. తిరిగి విద్య, కుటుంబ శాసనాలు, పిల్లల సంరక్షణ, ఉద్యోగం, ఉన్నత వృత్తులలో ప్రవేశార్హత లాంటివి కొంతవరకు సాధించింది.

1975 లో గర్భస్రావం స్త్రీ ప్రాణాపాయ స్థితిలో మాత్రమే చేయవచ్చని చట్టం చేశారు. జన్మ నిగ్రహ సాధనాలు వాడడాన్ని కొంత మంది స్త్రీవిమోచనోద్యమకారుల వ్యతిరేకించారు. పురుషులు స్త్రీలను వాడుకోవటానికి ఇదొక మార్గమని నిరసించారు. ఫ్రానులో జన్మనిగ్రహ సాధనాల వ్యతిరేక శాసనం 1974 లో రద్దయింది.


1782 లో పరస్పర సమ్మతిమీద విడాకుల చట్టం వచ్చింది. నెపోలియన్ ధర్మశాస్త్రం ప్రకారం 1816 లో వ్యభిచారం, హింస, ఘాత వుంటేనే విడాకులు కోరవచ్చు. స్త్రీల యొక్క లైంగిక నడత విషయంలో మహిళోద్యమం అంతగా పట్టించుకోలేదు. ఆస్తి హక్కుల విషయంలో, కుటుంబంలో ఆమె స్థానం విషయంలో పోరాటం జరిపారు. సమాజంలో మార్పు, సంస్కరణాభిలాష కలిసి మహిళోద్యమానికి పనిచేసినాయి.

విద్యవిషయమై స్త్రీలు తక్కువ మేధస్సు కలవారని వాదనలొచ్చినాయి. స్త్రీలకు గృహ సంబంధమైన విద్య చాలునన్నాడు రూసో. స్త్రీలకు తక్కువరకపు విద్యవుండాలని సోషలిస్టుల సైతం వాదించారు. ప్రౌధన్ (Provdhan) అంతవాడు స్త్రీ యొక్క మేధాశక్తి, నైతిక విలువ పురుషుని శక్తియుక్తుల్లో మూడోవంతు అన్నాడు. 1880 లో ఫ్రెంచి విద్యామంత్రి నిర్బంధ విద్యను స్త్రీలకు ప్రవేశ పెట్టాడు. స్త్రీ విద్యవల్ల పిల్లలకు, భర్తకూ ఉపయోగమని మంత్రి అయిన జూలెన్ ఫెర్రీ చెప్పాడు.

ఫ్రెంచి మహిళ పోరాటంలో ముఖ్యమైనది ఓటుకోసం పోరాటం. ఫ్రెంచి విప్లవం పురుషులకు మాత్రమే ఓటు తెచ్చింది. మేడమ్ రోలెండ్, మేడమ్ డీష్టేల్ ఆడవాళ్ళకు ఓటు కావాలని రాజ్య సభకు విజ్ఞప్తి చేశారు. తత్ఫలితంగా రోలెండ్ మరణశిక్షకు పాలయింది. 1792 లో నెపోలియన్ కాలంలో డీష్టేల్ దేశం నుండి పారిపోయింది.

1830 లో మేడమ్ హెర్బినో పత్రికపెట్టి స్త్రీలకు ఓటు కావాలని ప్రచారం చేసింది. 1848 విప్లవంలో ఉద్యమం పుంజుకుంది. మహిళా

సంఘాలను, క్లబ్బు లను 1848 లో నిషేధించారు; స్త్రీలు విప్లవంలో విరివిగా పాల్గొన్నారు. 1851 లో పియరీలెరోక్సు కనీసం మున్సిపాలిటీ లలోనైనా స్త్రీలకు ఓటు ఇవ్వమని బిల్లు పెట్టాడు. రాజ్యాంగం ప్రకారం ఉభయులకూ హక్కుందని బార్బరారూస్ వాదించింది. 1860 లో కోర్టు తీర్పులో పురుషుడికి ఓటు ఇచ్చి స్త్రీకి లేదన్నారు. హ్యూబర్టైన్ ఆక్లెర్ట స్త్రీలకు ఓట్ల సంఘం పెట్టింది. 1901 లో దిగువ సభ పాస్ చేస్తే ఎగువ సభ అటకాయించింది. పన్నులు చెల్లించవద్దని గోలచేశారు. స్త్రీలు. 1929 నాటికి ఓట్ల సంఘంలో లక్షమంది చేరారు. చివరికి 1944 నాటికి ఇవ్వక తప్పలేదు. ఇన్ని సంవత్సరాలు ఇంత అలజడి జరిగితే అప్పటికి ఆ పని జరిగింది. అసహనంగల పురుష ప్రపంచం స్త్రీలపై చూపే నిరాదరణకు ఇది నిదర్శనం. ఈ కష్టాలు భారత స్త్రీలు పడలేదు. కనుకనే ఓటు హక్కు, దాని విలువ మనకింకా తెలియక పోవటంలో ఆశ్చర్యం లేదు.



- "స్త్రీలను బలవంతంగా చెప్పుచేతల్లో వుంచాలను కుంటే కష్ట సాధ్యం. వాళ్ళు వ్యభిచరించగలరు. వాళ్ళను బాధకలుగని పద్ధతిలో కంట్రోలు చెయ్యాలి ". - మనువు

- " ఇల్లు శుభ్రంగా వుంచటం, వంట, అంట్లు తోమటం, గుడ్డలుతకటం, పిల్లల్ని పెంచడం, ఇంటి ఖర్చు వాడటం, పుత్ర జననంకోసం, మంచి భర్త కోసం, ఈ భర్తే ఏడు జన్మల్లో భర్తగా కావాలని కోరుకోవడం, తన అయిదో తనం కోసం ప్రార్థించడం, భర్తకు పూర్ణాయుర్దాయం కావాలని దేవతలకు వ్రతాలు చేయడం స్త్రీ ధర్మాలు". - మనువు

బ్రిటీషు స్త్రీల పోరాటం

తమకు ఓటు హక్కు కావాలని, తమకు ఆర్థిక హక్కులు ఇవ్వాలని, రాజకీయాలలో ప్రవేశార్హత కలిగించాలని బ్రిటిష్ స్త్రీల పోరాటం, త్యాగాలు, కష్టాలు అన్నీ ఇన్నీ కావు. సంవత్సరాల తరబడి, వేల సంఖ్యలో విద్యకోసం, ఉద్యోగాల కోసం, తమ ఉనికి కోసం, విడాకుల హక్కుకోసం వారు పడ్డ పాట్లు వింటుంటే సభ్యమానవ లోకం కలవరపడుతుంది, స్పందిస్తుంది.

ఇంగ్లండులో వయోజన ఓటుకోసం 1825 లో విలియం థాంసన్ కరపత్రం వేశాడు. 1832 లో కొన్ని సంస్కరణలు వచ్చాయి కాని, స్త్రీకి ఓటు హక్కు రాలేదు. పురుషుడికి మాత్రమే ఇచ్చారు. 1832 లో హెన్రీ హంట్ అవివాహిత స్త్రీకి ఓటు హక్కు ఇవ్వాలని పార్లమెంటుకు పిటీషన్ పెట్టాడు. దాని తర్వాత ఆందోళన ప్రారంభమైంది. అది విక్టోరియా రాజ్యం చేస్తున్న రోజులు. 1838 ఛార్టిష్టు ఉద్యమంలో (కార్మికోద్యమం) స్త్రీలకు ఓటు హక్కు కావాలని 'డిమాండ్' చేశారు. 1847, 1851, 1865 లలో పిటీషన్లు పెట్టారు. జాన్ స్టూవార్టుమిల్ స్త్రీకి ఓటు ఇవ్వాలని తన పార్లమెంటు ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్నాడు. 1869 లో పన్నుకట్టే స్త్రీలకు మున్సిపల్ ఎన్నికలలో ఓటు వచ్చింది. 1869-70 ఓటు కోసం పెట్టిన బిల్లు వీగి పోయింది. స్త్రీలు లిబరల్, కన్సర్వేటివ్ పార్టీలలో చేరి పని చేశారు. 1897 లో మళ్ళా బిల్లు పెడితే అది ఆమోదించ బడలేదు. ఇక లాభంలేదని ప్రత్యక్ష చర్యలకు దిగారు.

190 లో ఎమిలిన్ పేంక్ హర్స్ట్ (Emmeline Pank Hurst) స్త్రీల సామాజిక రాజకీయ సంఘం (Women's Social & Political Union) అనే సంస్థ పెట్టింది. స్త్రీలకు ఓటు కావాలనే ఉద్యమం ఎడల ప్రజల దృష్టిన పడేది ఏదయినా ఇందులో చేరి చేపట్టవచ్చని ఆమె తీర్మానించింది. స్త్రీల ఓట్ల సంఘాల జాతీయ ఫెడరేషన్ (నేషనల్ యూనియన్ ఆఫ్ ఉమెన్సు సఫరేజి సొసైటీ) నిమిత వాదులు స్థాపించారు. ఎమిలిన్ పార్లమెంటు వాకిట్లో పెద్ద పెద్ద మీటింగులు పెట్టింది. పురుషుల రాజకీయ సభలను విచ్ఛిన్నం చేసింది. సంఖ్యాబలాన్ని వాడింది. ఉదాసీనతకన్నా ద్వేషమైనా సరేనంది. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చింది. హింస పెరిగింది. ఆందోళన కారుల్ని ప్రభుత్వం అరెస్టు చేసింది. మొదటి కేసులో క్రిష్టబెల్,

యానికెని, ఎమిలిన్ ముద్దాయిలు. వారు పన్నులు చెల్లించలేను. జైల్లో పెట్టారు. ఉద్యమం పత్రికల్ని ఆకర్షించింది. పెథిక్ లారెన్సు ఉద్యమాన్ని బలపరిచాడు, పోస్టు బాక్సుల్ని స్త్రీలు తగుల బెట్టారు. ఆఫీసుల్లో బాంబుల్ని పెట్టారు. ట్రాములకు అడ్డం పడుకున్నారు. మంత్రుల కార్లకు అడ్డం పడుకున్నారు.

ఈ సంఘం ఎత్తుగడల విషయంగా మళ్ళీ చీలింది. తీవ్రవాదులు ఉద్యమాన్ని ఉధృతం చేశారు. భవనాలకు తమను సంకెళ్ళతో కట్టి వేసుకున్నారు. చర్చిల్‌తో సహా రాజకీయ నాయకులపై దాడి చేశారు వ్యక్తిగతంగా. 1914 లో 7 నెలలలో 107 భవనాలను తగుల బెట్టారు. రైల్వే స్టేషన్లకు నిప్పు అంటించారు. మ్యూజియంలలో విలువైన వస్తువుల్ని ధ్వంసం చేశారు. రోడ్లమీద ద్రావకం పోశారు. ప్రభుత్వం స్త్రీ విప్లవ కారుల్ని దారుణంగా హింసించింది. ఉద్యమాన్ని క్రూరంగా అణచి వేసింది. జైలు శిక్షల కాలపరిమితిని పెంచింది. జైళ్ళల్లో నిరాహార దీక్ష చేపట్టారు ఉద్యమకారులు. వారికి ముక్కులో నుండి ఆహారాన్ని ఎక్కిం చారు. ప్రజలు దిగ్భ్రాంతి చెందారు. Cat & Mouse Act తో ప్రాణా పాయ స్థితిలో వారిని విడిచిపెట్టి మళ్ళా అరెస్టు చేసేవారు.

స్త్రీలకు ఓటు వద్దనే సంఘాలు వెలిశాయి. హంఫ్రీవార్డు అనే ఆమె నాయకత్వం వహించింది. 1905–12 మధ్య ఇది చర్చనీయాంశం అయింది. మొదట ప్రపంచ యుద్ధం శాంతియుతమై 1919 లో స్త్రీకి ఓటు హక్కు వచ్చింది. అప్పుడే ఇండియాలో కూడా స్త్రీకి వచ్చింది. వారి త్యాగ ఫలితంగా, అయాచితంగా మనకు లభించిన ఓటుహక్కు అనన్య సామాన్యం అనక తప్పదు. 1832 లో ఓటుకోసం పురుషులు కూడా బ్రిటనులో ఇంత ఉద్యమం సాగించారనేది నిజం.

ఇలాంటివే ఇంగ్లీషు స్త్రీలు మరికొన్ని హక్కులు కష్టపడి తెచ్చు కున్నారు. ఇంగ్లండులో మిస్. బస్ నార్తు లండన్ స్త్రీల పాఠశాల కాలేజి యటలో పెట్టింది. మిస్. బీల్ చెల్టెన్ హోముల్ 1850 లో ఉన్నత పాఠశాల పెట్టింది. 1⁻30 లో యూనివర్శిటీ కాలేజీలో ప్రవేశార్హత, ఎమిలీ డేవిస్ కృషి ఫలితంగా జరిగింది. అలాగే అన్ని చదువులకు అవకాశం పెరిగింది.

1890 నాటికి సహవిద్య విషయమై స్త్రీలు ఆందోళన సలిపారు. అలాగే సెక్సువిద్య, వ్యాయామ విద్య విషయంలో కృషి జరిగింది.

ఇంగ్లండులో మొదట్లో విడాకులు పై వర్గాలకు చెంది వుండేవి. తర్వాత 1815 లో తేలిగ్గా విడాకులు కావాలనే ఉద్యమం పుట్టింది. తర్వాత విడాకులను అనుమతిస్తూ చట్టంవచ్చింది. దీనిప్రకారం భార్య వ్యభిచరిస్తే భర్త విడాకులు కోరవచ్చు. కాని భర్త వ్యభిచరిస్తే అదనంగా దుర్నీతి వరుడు అయితే తప్ప భార్య విడాకులు కోరరాదు. తర్వాత చాలాసార్లు శాసనం మారింది. 1884 లో భరణం, పోషణ వీటిని గురించి ఏర్పాట్లు జరిగాయి. దీనివల్ల స్త్రీలకు విడాకులు తేలిక అయింది. 1923 లో సమానమైన కారణాల మీద ఇద్దరికీ విడాకులు పుట్టాయి.

వివాహిత స్త్రీల ఆర్థిక హక్కులపై 1855 లో బార్‌బరా బోడికన్ ఒక కరపత్రం రాసి పంచి పెట్టింది. తద్వారా సంస్కరణను కోరే సంఘం పుట్టింది. స్త్రీలకు ఆస్తి హక్కు, వీలునామా రాసే హక్కు కావాలని ఆందోళన చేసింది ఆ సంఘం. 26 వేల దస్కతులతో బోడికన్ ఒక పిటీషన్ దాఖలు చేసింది. 1857 లో బిల్లు పెట్టారు. కాని అది వీగి పోయింది. 1882 లో, 1893 లో శాసనాలవల్ల స్త్రీకి ఇంగ్లండులో ఆస్తి హక్కు వచ్చింది. 1886 లో ఇంగ్లండులో శాసనం ద్వారా విధవరాలికి సంతానంపై సంరక్షకత్వపు హక్కు వచ్చింది. సంతానంయొక్క సంక్షేమమే ప్రధానమని చెప్పిందీ శాసనం. దీంతో తల్లి యొక్క హక్కు ఇంచుమించుగా స్థిరపడింది. పోషించేవాడు కనుక తండ్రి సంరక్షకుడు కావాలనే భావం పోయి ప్రేమకు ప్రాధాన్యత నిచ్చి తల్లికి ఆ హక్కులు ఇవ్వడం జరిగింది. సంస్కృతి మారినందువల్ల శాసనంలో ఈ మార్పు వచ్చింది. 1960 శాసనాల్లో గర్భస్రావం విషయంలో చాలా వెసులు బాట్లు కలిగాయి. ఇంగ్లండులో మేరీ స్టోప్సు గర్భస్రావ క్లినిక్కు స్థాపించి స్త్రీలకు మంచి అవకాశాన్ని కలిగించింది. 1750-89 మధ్య 30% స్త్రీలకు కట్నం ఇవ్వలేని కారణంగా పెళ్ళి అయ్యేది కాదు. ఆమె తెచ్చే కట్నం కోసమే వరుడామెను వివాహ మాడేవాడు. కట్నం ఇచ్చుకోలేనివారు ఏమీ తెలియని వరుణ్ణి పెళ్ళాడే దుస్థితి వుండేది.

జన్మ నిగ్రహ సాధనాల విషయంలో మతస్తులు వ్యతిరేకత చూపారు. మోనాకేర్ కెర్డె ఇంగ్లీషు పత్రికా విలేఖరి. ఇద్దర్నీ వేరు వేరు మంచాల

మీద పడుకోమని సలహా ఇచ్చాడు. ఎడిత్ ఎలీస్ భార్య భర్తల్ని వేరే ఇళ్ళల్లో వుండమని చెప్పింది. కుటుంబ నియంత్రణ సాధనాల ప్రచారం కాని, అమ్మకంగాని జరుగరాదని శాసనం ఉండేది. కాల ప్రవాహంలో అనేక మార్పులు రాక తప్పలేదు.

మహిళా విప్లవం (White Blouse Revolution) ద్వారా 1886 లో ఇంగ్లండులో వారానికి 75 గంటల పని మించగూడదని పెట్టారు. ఎక్కువ జీతం, తక్కువ పని గంటలు సమ్మెలు చేయకపోయినా సంఘాలలో చేరి సాధించారు. తర్వాత గుమస్తాలు, టెలిఫోను ఆపరేటర్లు లాంటి ఉద్యోగాలు పొందగలిగారు. 1920 నాటికి ఉన్నత వృత్తులైన వారు గా॥ డాక్టర్లు, ప్లీడర్లు, ఇంజనీర్లు, అకౌంటెంట్లు- తయారు అయ్యారు. ఫ్లారెన్సు నైటింగేలు నర్సింగు వృత్తికి గౌరవం తెచ్చింది. నర్సులకు ఒక ప్రత్యేక పాఠశాల ఏర్పాటు చేసింది. 1902 నాటికి 20 మంది న్యాయ వాదులైనారు. దరిద్రం, సంప్రదాయం లాంటి అవరోధాలను తొలగిస్తూ ఉన్నత విద్య అభ్యసించటానికి అవకాశం సాధించటానికి ధనవంతులైన స్త్రీలు తోడ్పడ్డారు. 20 శతాబ్దంలో సేవా వృత్తులకు అవకాశం ఏర్పడింది.

ఏది ఏమయినా, స్త్రీలు ఎన్ని బాధలుపడి ఈనాడు ఈ స్థాయి, స్థానం సంపాదించుకోగలిగిన ఇంకా రాజరిక పాలనావ్యవస్థ మారని ఆ దేశంలో స్త్రీ పురోగమించటం ముదావహం.



* "స్త్రీ బలహీనతకు మారుపేరు; అసూయకు ప్రతిబింబము. శూద్రునితో సమతుల్యురాలు వేదాధ్యయనానికి అనర్హురాలు". - మనువు.

* "భార్య వ్యభిచరిస్తే ఎదురు బొంగుతో కాని, తాడుతో కాని భర్త ఆమెను శిక్షించవచ్చు. ఆమెను కుక్కలచేత కరిపించే శిక్షను రాజు విధించవచ్చు". - మనువు

ఆధునిక సమాజంలో అమెరికన్ స్త్రీ

అమెరికన్ స్త్రీలకు 20 వ శతాబ్దంలో పాతసమస్యలు పోయి క్రొత్త సమస్యలు పుట్టుకొచ్చాయి. వారు క్రొత్త క్రొత్త ఫ్యాషన్ల పై మోజుచూపు తున్నారు. తమ కైనందిన కార్యక్రమాలకు అనువైన దుస్తులు ధరిస్తున్నారు. ఇది నిందార్హంకాదు ఇప్పుడు గృహిణులలో విసుగుజనిస్తోంది. వారికి దొరుకుతున్న విశ్రాంతి నిరుపయోగమవుతోంది. వివాహాల రేటు పెరుగు తున్నది. పూర్వం 71% కే వివాహం అయ్యేది. ఈ మధ్య బడి వదలగానే పెళ్ళికై ఆరాట పడుతున్నారు. వెంటనే తల్లులు అవుతున్నారు. కుటుంబ నియంత్రణ సాధనాలు వర్గ బేధం లేకుండా విరివిగా వాడుతున్నారు. మాతృత్వం జీవితంలో ఒక దశగా మాత్రమే భావిస్తున్నారు. వారికి 39 ఏళ్ళు నిండే నాటికి పిల్లల బాధ్యత తగ్గుతుంది. పూర్వం పిల్లల పై 16 సంవత్సరాల వరకే శ్రద్ధ చూపేవారు. ఇప్పుడు 18 ఏండ్ల వరకు చూస్తున్నారు. తల్లి మీద ఆధారపడకుండా బ్రతకటానికి పిల్లలు గట్టి ప్రయత్నం చెయ్యాల్సి వస్తుంది.

అమెరికాలో, తమకు మాతృత్వ వాంఛ సన్నగిల్లు తుందని కొందరు యవ్వనంలో వున్న స్త్రీలు ప్రకటిస్తున్నారు. మొదటి నుండి మాతృత్వం కావాలనే భావం స్త్రీలలో ఎక్కువగా వున్నట్లు భావించే వాళ్ళం. కాని నిజానికి అది 19 వ శతాబ్దంలోనే వచ్చింది. భార్యా భర్త మధ్య సంబంధం మార్పు చెంది ఇద్దరూ హెచ్చుకాలం కలిసి వుంటున్నారు. దానివల్ల 50 ఏళ్ళు కలిసి కాపురం చేసే అవకాశం కలిగింది. పారిశ్రామికీ కరణకు ముందు 25 సంవత్సరాలే కలిసి వుండేవారు.

విడాకులు ఈనాటి సమాజచిహ్నం. భారత సమాజంలో కన్నా సంఖ్య ఎక్కువగానే ఉన్నది ఆ దేశంలో. వ్యక్తిత్వ వికాసం కోసం వారు పని చెయ్యటం లేదు. కుటుంబ ఆదాయం కోసం చేస్తున్నారు. కనుక రోజూ కొన్ని గంటలు పనిచెయ్యటం తక్కువ తరగతి ఉద్యోగాలు చెయ్యటం, ఉద్యోగాలు మార్చటం, 55 ఏళ్ళకే రిటైరు కావటం పని విషయంలో స్త్రీల వైఖరి తెలియ జేస్తుంది. ఇప్పటికీ అమెరికన్ స్త్రీకి కుటుంబమే లక్ష్యంగా వుంది. వారు ఏమి చెయ్యాలో, ఏమి చేస్తున్నా

మని అను కుంటున్నారో, ఏం చేస్తున్నారో వారికి స్పష్టమైన అవగాహన లేదు. ఇప్పటికీ భార్యగాను, తల్లిగాను వేరువేరుగా సంచరించాలనే భావం స్త్రీలలో ధృడంగా పాతుకు పోయింది.

అమెరికాలో సమాన హక్కుల రాజ్యాంగ సవరణ గాలిదుమారం లేపింది. అంటే స్త్రీ స్థానం ఏమిటి? అనే విషయంలో ఇంకా అనుమానం వుంది. ఆధునిక సమాజంలో అత్తింటికి వెళ్ళిన కూతురు తల్లి మీద ఆధారపడటం మొదలయింది. దాంతో అల్లుడి ప్రాణం చిటపటలాడు తోంది. అసలు స్వాతంత్ర్యపోరాటం రెండుస్థాయిల్లో జరగాల్సి వచ్చింది అవి భార్యా భర్తల సంబంధం, తల్లీకూతుళ్ళ సంబంధం, అంటే ఆధునిక స్త్రీ తల్లి మాట జవదాటని పరిస్థితి ఏర్పడింది, స్వతంత్ర్యాలోచన నశిస్తోంది. మొదటిసారిగా మధ్య తరగతి స్త్రీ ఉద్యోగం చెయ్యటానికి అవకాశం వచ్చింది. పెళ్ళి అర్ధిక స్వాతంత్ర్యానికి అవరోధం కాక పోయింది.

అమెరికాలో స్త్రీ విమోచనోద్యమం పునరుద్ధరణ ఎక్కువ ప్రచారం లోకి వచ్చింది. ఇప్పుడు స్త్రీ పురుషుల మధ్య మానసికంగా సమస్య తయారయింది. స్త్రీలను లైంగికంగా పురుషులు దోచుకో కుండా వుండ టానికి ప్రాముఖ్యత వస్తోంది. ఇప్పటికీ స్త్రీ విమోచన ఉద్యమం అల్ప సంఖ్యాక వర్గపు ఉద్యమంగానే ఉంది. అధిక సంఖ్యాక స్త్రీలకు అధి కోపకారణ మవుతోంది. అంటే అధిక సంఖ్యాకులు కుటుంబంలోనే వుంటున్నారు. ఈ నాటి స్త్రీ విమోచ నోద్యమం అంటే స్త్రీ వ్యక్తిత్వం కోసం పోరాటం, స్త్రీ శక్తి విజృంభణకు ప్రాధాన్యత నిస్తున్నారు.

గృహ నిర్వహణలో కన్నా, ఎక్కువ మానసిక శారీరక శ్రమను వారు ఓర్చుకోవలసి వస్తోంది. ఆధునిక స్త్రీ ఇటు కుటుంబంతోను అటు సమాజంతోను సన్నిహిత సంబంధం కలిగి సమ్యక్ స్థితిని పొంది వుంది. ఆమె విజయం స్త్రీ పురుషులకు ముఖ్యమైన విజయంగా భావించాలి.

ఇంత వరకూ స్త్రీలు సమాజనికి స్పందించిన ఈ పద్ధతి సరియైన దేనా ? పారిశ్రామికీ కరణ సమాజానికి తెచ్చిన మార్పులకు ఆమె తట్టుకోగలిగిందా ? స్త్రీల చరిత్ర, పురుషుల చరిత్ర విడివిడిగా వుండాల్సిం దేనా? అనేవి నేటి ఆధునిక స్త్రీని వేధిస్తున్న ప్రశ్నలు.

చైనాలో మహిళల స్థితి

యుద్ధప్రియ జాతులైన రాజపుత్రులు తమ సమాజంలో స్త్రీల సంఖ్య తగ్గాలని కన్యలను చంపేవారు. అరబ్ ప్రాంతంలో షేక్‌జాతిలో ఆడపిల్ల పుట్టగానే గొయ్యితీసి పాతేసేవారట. కేంద్రప్రాంత అరబ్బులు 5సం॥రాగానే ఈరోజు పిల్లపుట్టింటికెడుతుందని అంటూసుగంధద్రవ్యాలతో నూతిలో పడేసే వారట. చైనాలో ఆడపిల్లను నీళ్ళల్లో ముంచి చంపటం అనాదిగా జరుగుతున్నట్లు వింటున్నాం.

ఇటీవల చైనాలో పిల్లయినా, పిల్లవాడయినా ఒక్కరితోనే సరిపెట్టు కోవాలనే నిషేధం పెట్టారు. దాంతో మగబిడ్డపైగల మోజుతో ఆడపిల్లల్ని 1981 లో40మందిని ఒక్క గ్రామంలో, 1982 లోమూడుమాసాల్లోపల మరో గ్రామంలో పుట్టిన 8 మందిని చంపారట. వేరొకచోట పుట్టిన 5 గురి ఆడవారిలో ముగ్గురిని నీటిలోముంచి చంపారని, ఇద్దరిని ఎక్కడో పారేసివచ్చారని చైనా పత్రిక 'పీప్పులు డైలీ' వెల్లడించింది. ఇలా చాలా గ్రామాల్లో చేస్తున్నారట. 1981 లోనే పుట్టిబ్రతికిన పిల్లలు 10 వేలయితే అందులో బాలురు 6266. చైనా ప్రజలకు బాలురమీద వున్న మోజువల్ల అలా ఆడపిల్లలను చంపుతున్నారని ఆపత్రిక రాసింది. ఇలా జరుగుతుంటే మరో 20సం॥లలో భార్యలు దొరకటం కష్టం అవుతుందని ఆ పత్రిక వెల్లడించింది. ఆడపిల్లంటే తల్లిదండ్రులకు అయిష్టత, వివక్షతవున్నకారణాన ఈ దుర్నీతి సాగుతుందనేది నగ్నసత్యం. ఆ దృష్టితోనే ఆపత్రిక ఆ వార్తకు కూడా ప్రచారం ఇచ్చిందట.

పురుషుడుచేసే ప్రతిపనినీ స్త్రీ నిర్వహించగలదని మావోసూక్తి. అయితే అన్నిరంగాలలో స్త్రీకి సమానత్వం సిద్ధించిందా? అంటే " లేదు " అని సమాధానం చెప్పుకోక తప్పదు. సమాజంలో కీలక స్థానాలు అయిన గ్రామీణ కమ్యూన్ డైరెక్టరుగా, ఫ్యాక్టరీ మేనేజరుగా, ఆస్పత్రి అధికారిగా, పత్రికా సంపాదకులుగా, పార్టీ కార్యదర్శిగా వున్న ఒక్క స్త్రీనికూడా మేము చూడలేదని ఆమెరికాలోని పత్రికా సంపాదకులు కొందరురాశారు. చైనాలో


24 రోజులు పర్యటించి అచ్చటి సమాజం యొక్క స్థితిగతులను సునిశితంగా పరిశీలించి రాసిన విమర్శకవ్యాసం యొక్క సారాంశం అది. ముఖ్యంగా రాజకీయరంగంలో స్త్రీలు వెనుకబడి వున్నారని, పరిపాలన సాగించే కమ్యూనిష్టు పార్టీయొక్క కేంద్ర కమిటీసభ్యులు 22 మందిలో ఒక్క స్త్రీ మాత్రమేవుందని, విస్తృత కేంద్రకమిటీ 260 మందిలో 28 మంది మహిళలకు మాత్రమే సభ్యత్వం వుందని చైనా పర్యటించిన అమెరికను సంపాదక వర్గం పేర్కొన్నది. దాంతో అనేక విషయాలు వెల్లడిఅయినాయి. అయితే ఈ విమర్శను పరిశీలించేటప్పుడు అమెరికను సమాజంలోవున్న అసమానతలను, స్త్రీలకుజరిగే అన్యాయాలను దృష్టిలో వుంచుకొని విమర్శించారనుకోవడానికి ఆస్కారం లేదు. ప్రపంచం మొత్తం మీద సూత్రప్రాయంగా అంగీకరించిన మౌలిక సిద్ధాంతాల దృష్టితో మాత్రమే ఈ విమర్శసాగిందని భావించాలి.

పురుషులపై పోరాటానికి తలపడి, పురుషులలాగే అన్ని రంగాలలో, అన్ని స్థాయిలలో సంచరించటంతో పాశ్చాత్య ప్రపంచంలో "స్త్రీలవిముక్తి ఉద్యమము" ప్రభవిల్లింది. కానీ చైనాలో ఇలాంటి ఉద్యమమూలేదు; ఆ ప్రయత్నం ఏనాడు జరగనూలేదు. ఇలా విమర్శించినంత మాత్రాన చైనాలో మహిళాభ్యుదయం లేదనుకోవటం పొరపాటు.

స్త్రీలకు ఇల్లనే బందిఖానానుండి కొంతగా కొంతవిముక్తి కలిగింది. పిల్లలను గురించి శ్రద్ధతీసుకోవటానికి నర్సరీ, కిండరు గార్డెన్ పాఠశాలలు అశేష సంఖ్యలో వెలిశాయి. అంతేకాదు, ఉద్యోగినులు తమ శిశువులను ఉంచటానికి ఆరోగ్యకేంద్రాలు వున్నాయి. ఆరురోజులుకూడా ఉంచుకొనే కేంద్రాలుకూడా నెలకొల్పబడ్డాయి. దీనితో తల్లులకు వుండే ఆదుర్దా తొలగిపోతుంది. ఆమె నిశ్చింతగా తన కార్యక్రమాలలో, విధి నిర్వహణలో, తన అధ్యయనంలో మునిగిపోగలదు. ఇది ప్రశంసనీయమైన పురోగతి. దీంతోపాటు పటిష్టమైన కుటుంబ నియంత్రణ కార్యక్రమం వారికి తోడ్పడుతుంది. పురుషునికి 28, స్త్రీకి 25 వయస్సు నిండనిదే వారు వివాహమాడరాదు. మామూలుగా ఇద్దరు పిల్లలను మాత్రమే దంపతులు కోరుకుంటున్నారు. శిశుమరణాల సంఖ్య తగ్గిపోయింది. మూడుతరాలవారు వున్న కుటుంబాల

సంఖ్య బాగా తగ్గిపోయింది. రెండు తరాలవారు కలసి కుటుంబంగా సమిష్టి జీవితం సాగిస్తున్నారు. చైనాస్త్రీలు దుస్తులపై, ఆభరణాలపై ఎక్కువ మోజు చూపరు. వాటికై ఆరాటపడటానికి వారికి వ్యవధిలేదని వారు చెప్తున్నారు. వారిదుస్తులు ఆడంబరంతో, వైవిధ్యంతో వుండవు. అవసరానికి అనుగుణంగా దుస్తులు వుండాలనీ, సిద్ధాంత పరమైన ఉపయోగాన్ని కలిగి వుండాలనీ వారిభావన. మనదేశంలో కన్పడే వందల, వేల రకాల దుస్తులు వారికుండవు. పనిచేసేటప్పుడు సౌకర్యంగా వుండేవి, భారీఎత్తున ఉత్పత్తికి అనుకూలమైనవి ఆదరణీయాలు. దేశం అభివృద్ధి చెందుతున్న దశలో, స్త్రీల లైంగిక ఆకర్షణను పెంచి పురుషుల దృష్టిని వారి పనినుండి మరలించేటట్లుగా వుండరాని విధంగా దుస్తులను తయారుచేస్తారు. దీనివల్ల ఈనాడు మనదేశంలో ఉత్పత్తిఅయి చలామణి అవుతున్న 5 వేల రకాల వస్త్రాల ఉత్పత్తి చాలా నష్టదాయకమని, వస్త్రాలరకాల సంఖ్య చాలా తగ్గించవలసి వుంటుందనే నగ్న సత్యాన్ని మనమూ, మనదేశమూ గమనించక తప్పదు,

వ్యవసాయ క్షేత్రాలలో, వైద్యవృత్తిలో, ఇంజనీర్లుగా, పారిశ్రామిక కార్మిక శక్తిగా ఈ నాడు చైనామహిళలు పురోగమిస్తున్నారని, సమానపనికి సమానవేతనాలు, హోదానువారు అనుభవిస్తున్నారని, వారియెడ అంతకు క్రితం పురుషులు ప్రవర్తించే తక్కువ చూపు చాలాభాగం తొలగిపోయిందని 'క్రిస్టియన్ సైన్సు మానిటరు' పత్రిక వ్రాసింది. ఏది ఏమైనా, ఎంత ప్రగతివున్నా, ఎన్ని చట్టాలు చేసినా ఆ దేశంలో సైతం స్త్రీలు పురుషాధిపత్యానికి లోబడి వుంటున్నారని గమనిస్తున్నాం.



పశ్చిమ యూరప్ రాజ్యాల స్త్రీలు

1848 లోని విప్లవాలలో స్త్రీలు పాల్గొన్నారు. ఇటలీలో, హంగేరిలో విప్లవ పురుషులను బలపరిచారు. బెర్లిన్‌లో స్త్రీలు వేరే సంఘాలు పెట్టుకొని కృషిచేశారు. జర్మనీలో ఉద్యోగాలుచేస్తున్న తల్లులు పిల్లలకు 0 ఏళ్ళు నిండేదాకా ఉద్యోగాలు చేయరాదని నిశ్చయించుకున్నారు. తల్లిగా ఆమె హక్కులను గుర్తించమని ఆందోళనచేసారు ఇటలీస్త్రీలు శాసనం మారక పోయినా తల్లిహక్కులను ప్రభుత్వం గుర్తించింది వారి పోరాటఫలితంగా.

జర్మనీలో స్కాండినేవియన్ (నార్వే, స్వీడన్, డెన్మార్కు) దేశాల్లో, అమెరికాలో కొన్నిసంస్కరణలు వచ్చాయి. 1888 లో నార్వేలో వివాహిత స్త్రీలకు శాసనపరమైన హక్కులు వచ్చాయి. 1927లో వివాహంలో వధూవరులు సమానమని శాసనంద్వారా ప్రకటించారు.


1873 లో స్వీడన్‌లో వివాహితస్త్రీల హక్కుల సంఘం పుట్టింది. 1874 లో ఆమె ఆస్థి, సంపాదన మీద ఆమెకు హక్కులేర్పడ్డాయి. 1921 లో వివాహబంధంలో భర్తయొక్క ఆధిపత్యం శాసనం ద్వారా తొలగించారు. లైంగికవిద్య జాతీయ స్థాయిలో జరగాలని ప్రబోధం చెయ్యటానికి సంఘం స్థాపించారు. 1933లో స్వీడన్‌లో లైంగికవిద్య నిర్బంధంగా బోధించడం మొదలయింది.

పెళ్ళికి, కుటుంబవిధులకు ప్రత్యామ్నాయంగా విద్యను స్త్రీ విమోచన ఉద్యమకారులు ప్రతిపాదించారు. వివాహం కోసమే విద్య అనే భావాన్ని నిరసించారు. ఆమెలో స్వతంత్రప్రతిపత్తి, స్వావలంబన విద్యద్వారా కల్పించాలని ప్రచారం చేశారు. 1870 లో స్వీడన్‌లో విశ్వవిద్యాలయ ప్రవేశానికై మెట్రిక్యులేషన్ పరీక్షకు కూర్చోనిచ్చారు. 1873 లో మతపరం, చట్టపరమైనవి తప్ప మిగతాచదువులకు అవకాశం లభించింది. 1883 లో ఎలెన్‌ఫ్రిస్ స్వీడెన్‌లో మొట్టమొదటి పిహెచ్.డి పొందిన స్త్రీ. స్వీడెన్‌లో ఓటుకోసం 1881 లో సంఘం పుట్టింది. 1903 లో స్త్రీకి ఓటుహక్కు లభించింది.

మొదట స్త్రీకి ఓటుహక్కు ఇచ్చింది 1907లో ఫిన్లెండులో. నార్వేలో 1880లో ఓటుహక్కు సంఘం పుడితే 1912లో మున్సిపల్ ఎన్నికలలో ఓటు ఇచ్చారు. 1903లో పార్లమెంటుకు ఇచ్చారు. అమెరికన్ స్త్రీలు 1917లో ఓటును పొందగలిగారు. 1919లో జర్మన్ స్త్రీలు పోరాడి ఓటును సంపాదించుకొన్నారు. కానీ ఓటువచ్చినందువల్ల జర్మన్ స్త్రీలకు లాభించింది ఏమిటి? వారు హిట్లరుకు ఓటుఇచ్చి గెలిపించారు. కాకపోతే 1944 తర్వాత క్రిష్టియన్ డెమాక్రటిక్ పార్టీ (మితవాదపార్టీ) ప్రభుత్వంలోకి వచ్చింది. స్త్రీలకు విద్యా, వైద్యం, సంక్షేమం లాంటి విషయాల్లో ప్రభుత్వాలు శ్రద్ధచూపాయి. స్విజర్లాండులో 1960 లో గర్భస్రావం సమస్య కాకపోవటానికి కారణం స్త్రీలకు ఓటువుండడం వల్లనే.

మొత్తం మీద జర్మన్ మహిళలు స్త్రీ విమోచనోద్యమంతో సంబంధం పెట్టుకోటానికి ఇష్టపడలేదు. గృహనిర్వహణలో తల్లిగా తన బాధ్యత పెరగటం. వల్ల మధ్యతరగతి స్త్రీ పట్టించుకోలేదు. తిండి, గుడ్డా, సంతానం వీటితో సతమతమవుతూ కార్మికస్త్రీలు వ్యతిరేకతచూపారు. విమోచన కార్యకర్తలు ధనిక వర్గాలనుండి, మధ్యతరగతిలో ఉన్నతశ్రేణి నుండి వచ్చారు. సమాజంలో స్త్రీయొక్క స్థానంలో మార్పుకోసం జరిగే ఆరాటమే స్త్రీ విమోచన–పారిశ్రామికీకరణ, నగరీకరణల ఫలితంగా వచ్చిన సాంస్కృతిక అఖాతాన్ని అధిగమించడమే అది సాధించిన విజయం.

ఒక్కొక్కదేశంలో స్త్రీలు ఒక్కొక్క అంశంపై నొక్కుచూపారు. ఇంగ్లండులో వోటుహక్కుకు ప్రాధాన్యత, ఫ్రాన్సులో ఆర్థికహక్కులకు ప్రాముఖ్యత, జర్మనీలాంటి దేశాలలో కుటుంబ విషయాలపై శ్రద్ధ, స్కాండినేవియను దేశాలలో లైంగిక స్వేచ్ఛకై తీవ్రకృషి. ఏదయినా ఇవన్నీ స్త్రీ విమోచనలో భాగాలే. ఇలా స్త్రీ ప్రపంచవ్యాప్తంగా, తన వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేసే హక్కులకోసం నిరంతరం పోరాడింది; పోరాడుతున్నది. ఈ పోరాటం అనంతం; అవిచ్ఛిన్నం, అవిభాజ్యం. కనుక ప్రపంచ మహిళోద్యమంలో దేశదేశాల ఉద్యమాలు భాగస్వామ్యం వహిస్తున్నాయి.



ఇటలీ స్త్రీల వైభవాలు

వివాహబంధం చాలా పవిత్రమైనదనీ, శాశ్వతమైనదనీ, చావు తప్ప భార్యభర్తలను వేరుచేయగల శక్తి లేనేలేదని నమ్మిన దేశం ఇటలీ. సనాతనాచారాలకు పుట్టినిల్లు; సంప్రదాయాలకు మెట్టినిల్లు ఆ దేశం. అచ్చటి స్త్రీల స్థాయి, స్థానము, హోదా మధ్యయుగాలనాటి వారసత్వాన్ని అధిగమించలేని దశలో వున్నదనవచ్చు. కొద్దిసంవత్సరాల నాటి సంఘటనే దానికి నిదర్శనం.

కొందరు సంస్కరణాభిలాషులు ఆ ఛాందసదేశంలో విడాకులకు బిల్లు పెట్టారు. ఇక మత వాదులు విజృంభించి హాహాకారాలు చేశారు. ప్రవక్తలంతా ఈ చట్టాన్ని వ్యతిరేకించారు. ఈ చట్టం వస్తే జాతి సర్వనాశనమౌతుందని బిషప్పులు భయపడ్డారు. కార్డినాల్సు కలవరపడి మతవాదులను మేలు కొలిపారు. ఇదొక తరహా తిరుగుబాటు తనమన్నారు సంప్రదాయవాదులు. ఆఖరికి పోపుతోసహా మతస్తులంతా ఈ చట్టాన్ని వ్యతిరేకించారు. చివరకు పోపు ఒక సవాల్ చేశాడు. "ఈ చట్టాన్ని వ్యతిరేకించేవారు 'NO' (అక్కరలేదని), కావాలనేవారు 'YES' అనీ చర్చి గోపురంపై రాయాలి" అని శాసించాడు. 'NO' అని పెద్దఅక్షరాలతో తీర్పుఇచ్చారు జనం. అలా ఇటలీలో తొలిసారి వివాహంరద్దు అయ్యే చట్టం అతికష్టం మీద ప్రజామోద ముద్రను పొందగలిగింది. అలా చట్టాలు అనేక మంది త్యాగాలతో, కష్టాలతో వచ్చినవే కాని స్త్రీల కెవ్వరూ, ఏ దేశమూ పెద్దపీటవేసి ముందు వరుసలో కూర్చోపెట్టలేదని మనకు తెలుసు. అయినా వాటిని మనం అనుభవంలోకి తెచ్చుకోటానికి మన మత సాంప్రదాయం అడ్డుపడుతుంది; మన మనస్సును కట్టి పడవేస్తుంది. అసలు హక్కులనేవి లేకపోతే మన జీవితాలను కట్టిపడేసి మనల్ని సర్వనాశనం చేస్తారు మగవారు. హక్కు అనేది ఒక ఆయుధం లాంటిది. ఆ కత్తితో ప్రాణం రక్షించనూవచ్చు, (ఆపరేషన్ చేసి) ఆ కత్తితోనేపొడిచి ప్రాణం తీయనూవచ్చు. కనుక ఆ ఆయుధాన్ని తుప్పుపట్టించకుండా అవసరమైనప్పుడు మాత్రమే వాడుకునే తాహతు మనకుండాలి.

మతవాదుల గుప్పిట్లో ఆఫ్ఘన్ మహిళల ఇక్కట్లు

ఆఫ్ఘన్ స్త్రీలు 19వ శతాబ్దం వరకు జాతి జీవనంలో ఏ హక్కులూ లేక దాస్యంలో క్రుంగుతూ వుండేవారు. బాల్య వివాహాలు, బలవంతపు పెళ్ళిళ్ళూ, కన్యాశుల్కాలు, మరదులతో విధవల వివాహాలు లాంటివి సర్వ సామాన్యంగా వుండేవి. 1921 లో అమనుల్లా రాజు జారీచేసిన ఫర్మానా వల్ల అమీర్అబ్దుల్ రెహమాన్ సంస్కరణ వల్ల విడాకులహక్కు, వారసత్వపుహక్కు సంక్రమించాయి. బాల్య వివాహాలు, బలవంతపు పెళ్ళిళ్ళు లాంటివి రద్దు అయినాయి. వారి జీవితంలో చెప్పుకో తగ్గ మార్పులు వచ్చాయి. స్త్రీలకు విద్యా సంస్థలలో ప్రవేశం చాల ముఖ్యమని, వారికి ఆ అవకాశాలిస్తున్నందుకు అమనుల్లా రాజును 1929 లో పదవీ భ్రష్టుని చేశారు మతాధికారులు. 1959 లో మహమ్మద్ దావూద్ ప్రభుత్వం పరదాలు ధరించే విషయంలో కొంత స్వేచ్ఛ నిచ్చింది. 1964 లో జఫర్షా తెచ్చిన రాజ్యాంగంతో పాటు స్త్రీలకు ఓటుహక్కు లభించింది. తరాకి, అమీన్, కర్మల్ 1978 లో రాజ్యాంగాన్ని రద్దుచేసినా స్త్రీల హక్కులు ఉపసంహరించలేదు. క్రమేపి స్త్రీల హక్కుల విషయంలో విప్లవ వాదులకు, మతవాదులకు మధ్య వాదోపవాదాలు జరుగుతున్నాయి. ప్రగతి శీలవాదులు ప్రజాజీవితంలో నిలద్రొక్కుకొని స్త్రీల హక్కులను పరిరక్షిస్తారని ఆశించవచ్చును.

* మొదట రాచరికపు వ్యవస్థలో స్త్రీని కేవలం ఒక విలాసవస్తువుగా, శృంగారనాయకిగా వర్ణించేవారు. ఆనాటి కవులకు వాస్తవచిత్రణ అనవసరం. కేవలం అభూతకల్పనలతో, కృత్రిమసన్నివేశాలతో స్త్రీల అంగావర్ణనలుచేస్తూ హంసయాన, గజగమనగా వర్ణించేవారు. కచకుచాది వర్ణనలతోస్త్రీని శల్యపరీక్షచేసి ఆ కావ్యాలను రాజులకు అంకితం చేసేవారు. ఆనాటిస్త్రీ అంటే మనస్సులేని శరీరమే అన్నమాట అందుకే కోమలి, చంద్రముఖి, హరిణాక్షిలాంటి స్త్రీ శరీరాన్ని వర్ణించే పదాలు వాడేవారు. అంతేకాదు స్త్రీతొడల్ని అరటిబోదెలతో, ఏనుగుతొండాలతో పోల్చేవారు. స్త్రీని ఎంతగా నఖశిఖపర్యంతం శల్యపరీక్ష చేసివర్ణిస్తే కవులకంత కనకాభిషేకం చేసేవారురాజులు.

బ్రెజిల్ స్త్రీల కడగండ్లు


మార్సియో స్టాన్సియోలి తన భార్య ఎలియోసాను అయిదు సార్లు కాల్చి చంపాడు. ఆమె మరోపురుషుని వల్ల ఆకర్షితురాలయిందని అనుమానించి అడిగితే అమె నిజమేనని ఒప్పుకోవటమే ఈ హత్యకు కారణమని భర్త కోర్టులో వాదించాడు. భర్త తరుపు న్యాయవాది "స్త్రీకి భర్త, పిల్లలే ముఖ్యమని అతనలా చంపటానికి ఆమె ప్రవర్తనే కారణమని" వాదించాడు. ఈ వాదనను కోర్టు అంగీకరించి మార్సియోను విడిచిపెట్టింది. మరోచోట రోచా అనే వ్యక్తి రెజీనా అనే తన భార్యను ఇలాగే కాల్చి చంపాడు. ఆమె రోజూ సిగరెట్లు తాగేదని, డ్రైవరు లేకుండా కారులో షికారు చేసేదని, తను ఇంటికి వచ్చినప్పుడు ఎప్పుడూ వుండేది కాదని, ఉన్నా తనను గౌరవించకుండా టెలివిజన్‌లో శృంగార దృశ్యాలు చూస్తూ గడిపేదని రోజా ఆరోపించాడు. ఆమె మినీస్కర్టు వేసుకొని వున్నప్పుడే తాను ఆకర్షితుడయినా ఆమె ఆ దుస్తులు వేసుకొని పరపురుషుల్ని ఆకర్షిస్తుందని నేరారోపణ చేశాడు. ఇంకో పురుషుడితో రెజీనా శృంగారానికి సిద్ధమవుతుంటేనే కాల్చి చంపానని చెప్పాడు. రోజా నిర్దోషి అని కోర్టు అతన్ని వదలివేసింది, ఇంకా ఇలాంటి సంఘటనలు కొన్ని జరిగాయి. దీంతో మహిళా సంఘాలు ఆందోళన చేస్తున్నాయి. ఇప్పటికే పురుషాధిపత్యం విలయ తాండవం చేస్తుందని, ఇలాంటి తీర్పుల వల్ల పెట్రేగి పోతుందని వారు వాపోతున్నారు. 'పెళ్ళంటే మరణానికి మార్గమా' అన్న నినాదాలు గోడల నిండా దర్శన మిస్తున్నాయి. తప్పును స్త్రీల మీద నెట్టి, పురుషులు చట్టాల కళ్ళుకప్పి తిరుగుతున్నారని మహిళలు విమర్శలతో, భయాందోళనలతో కాలం గడుపుతున్నారు. ఇది ప్రపంచ స్త్రీలను అవమాన పర్చటం, కించ పరచటం, న్యాయాన్ని అణగత్రొక్కటం కాదా ? ? ?

జపాన్ స్త్రీలపై ఆంక్షలు

పారిశ్రామికంగాను, వైజ్ఞానికం (సైన్సు)గాను జపాన్ ఈనాడు ప్రముఖస్థానంలో వుంది. ఎన్నో రంగాలలో అభివృద్ధిని సాధించింది. కాని స్త్రీలపై వివక్ష బాగా పెరుగుతుంది. ఎవరెస్టు నధిరోహించిన జపాన్ మహిళలు 'వామిని' శిఖరాన్ని ఎక్కరాదు. ఆ శిఖరం మాతృమూర్తి అని, దాన్ని అధిరోహిస్తే స్త్రీని కాలదన్ని నట్లేనట! మరి పురుషులకు ఎందుకు ఆ ఆంక్షలేదో! అలాగే స్త్రీలకు భూగర్భమార్గాలలోకి, గనులలోకి ప్రవేశార్హతలేదు. కర్మాగారాలలో స్త్రీల సంఖ్య పెరిగినా వారికి సదుపాయాలు లేవు. చాలామంది స్త్రీ వుద్యోగినులను 'టెంపరరీ' సర్వీసుల్లో వుంచుతారు. ఉద్యోగభద్రత అసలే లేదు. కేవలం తమను కర్మాగారాలలో అలంకరణ వస్తువుగానే ఉపయోగిస్తున్నారని జపాన్ మహిళలు వాపోతున్నారు. శిశు సంక్షేమానికి పెట్టే ఖర్చులు తగ్గించారు. గర్భవతులకు ఏరక్షణా లేదు. పెన్షన్ అనేది అందరు స్త్రీలకు లేదు. ఇవికాక అనేక చోట్ల స్త్రీలకు ఉద్యోగాలు లభించుట దుర్లభం. ఈ వివక్షకు కారణాలేమిటో అన్వేషించి, మార్గాలను సిఫారసు చేయమని ప్రభుత్వం ఒక కమీషన్‌ను నియమించింది. కాని ఆ శాఖలో ఒక్క స్త్రీ కూడా లేకపోవటం గమనార్హం కాదా!

జపాన్ యువతుల కోర్కెలు చాలా వింతగా వుంటాయి. తమ భర్తలు ఇంటికి త్వరగా వచ్చేవాడైతే మంచివాడుగా భావిస్తారు. రాత్రి పూట ఆఫీసులోనో, స్నేహితులతానో గడిపితే వారు అతనిపై ఆసక్తి చూపరు. తమను విహారాలకో షికార్లకో తీసుకెళ్ళే వారిపై మక్కువ పెంచుకుంటారు. అలాంటి వాదిని వరులుగా తెమ్మని పెళ్ళిళ్ళ పేరయ్యలను అడుగుతారు. కన్యల కోర్కెలనాధారంగా వరుల్ని కుదిరించే సంస్థలు మెండుగా వున్నాయి. ఆ సంస్థకు 5,6 వేల ఎన్‌లు ఇవ్వాలి. పెళ్ళి ఖర్చులు చాలా అధికంగా 30 లక్షల 'ఎన్' ల వరకూ వుంటాయి. (మన లక్షానలభై వేలతో సమానమన్న మాట.) వధువుకు కన్నవారు దాదాపు

పాతిక వేల రూపాయలు ఇవ్వాలి. ప్రతి అతిథికి 3,4 వందల రూపాయల ఖరీదు చేసే బహుమతి ఇవ్వాలి. ఆశ్చర్యమేమంటే తమకు కాబోయే భార్య తూర్పు తెల్లారకముందే లేచి ఇంటి పనులన్నీ చెయ్యాలనీ, తమను నసపెట్టరాదని వరునికోర్కె. కన్యల కోరికలేమంటే - స్వంతగా శ్రమించి, ప్రేమించేకన్నా వరాన్వేషణా బాధ్యతను ఇతరులకు అప్పగించవలెనని జపాన్ మహిళలు నమ్ముతున్నారు. మరి ఈ నమ్మకా సడలిపోయే దశ ఎప్పటికో ! !



* "స్త్రీలు తాము పాటించాల్సిన విధినిషేధాలను గురించి తెలుసుకోవాలి. వివాహం నిశ్చయంకాగానే అతడు ఆమెకు స్వామి. అతనిసేవద్వారానే ఆమె స్వర్గానికి చేరుకుంటుంది. అతడు పతిదేవుడు. దేవతలకన్నా గొప్పవాడు. అతడు దుష్టుడైనా, అవినీతి పరుడైనా, విషయువాంఛ పరుడైనా ఆమె అతన్ని సంతోషపెట్టాలి. చనిపోయినాక కూడా అతన్నే స్మరించాలి. ఆమెకు వ్యక్తిత్వం వుండరాదు. తన భర్త కీర్తిచ్ఛాయల్లో మనుగడ సాగించాలి."

విదేశాల వివాహాల్లో మార్పులు

కాల చక్రం గిర్రున తిరుగుతూవుంటే కరుడు గట్టిన సనాతన ఛాందస సంఘం కూడా మారక తప్పదు. ఒకవేళ ఆ సంఘం ఘనీభవించి పోయి మార్పుకు వ్యతిరేకంగా వున్నా చుట్టూవున్న యితర దేశాల ఆలోచనా రీతుల ప్రభావం, ప్రపంచ వ్యాప్తి ఉద్యమ ప్రభావాలు దానిపై ప్రసరించక మానవు. సరిగ్గా అదే జరిగింది. ఇటలీ, ఇంగ్లండు దేశాల వివాహ విధానాల విషయంలో.

పోప్ అధిపతిగా వున్న రోమను కాథలిక్కు మతాన్ని అనుసరించే ప్రజలతో ఇటలీ దేశం నిండివుంది. 1921 నుండి 45 వరకు ముస్సోలిని నియంతృత్వ పాలనలో ఫాసిజం యొక్క విలయ తాండవంతో గిలగిల లాడి పోయిన దేశం అది. 1945 నాటికి సాంస్కృతికంగా మధ్య యుగాన్ని అధిగమించని దేశం. 'స్త్రీకి ఇల్లే స్వర్గం' అనే సూక్తిని వల్లె వేసిన దేశం. ఆ దేశంలో మహిళల పరిస్థితి మెరుగు పడటం సాధ్యమా? స్త్రీలు, అభ్యుదయ కాముకులైన పురుషులు సమష్టిగా 8 సంవత్సరాలు పార్లమెంటులో జరిపిన పోరాట ఫలితమే వారు నూతనంగా సంపాదించుకున్న నూతన వివాహ శాసనం. ఈ శాసనంలోని కొన్ని అంశాలు భారతదేశంలోని ఆధునిక మహిళలకు చిరపరిచితం కావచ్చు. బ్రిటిషు సాంస్కృతిక పరిచయం వల్ల, రాజకీయ సంబంధము వల్ల చెప్పుకోతగినంత శ్రమ లేకుండానే భారత మహిళలు అనేక హక్కులు పొందగలిగారు. కనుక వాటి విలువ వారికంతగా తెలియకపోవచ్చు. శ్రమించి పోరాడి సంపాదించుకున్న హక్కుల పట్ల గౌరవం అయాచితంగానో లేక అతి సులభంగానో వచ్చిన హక్కులపై ఉండక పోవటం సహజం. మరో అంశం మనం గమనించాలి. ఇటలీ దేశస్తుడు మజినీ అన్నట్లు "స్వేచ్ఛ గాలి లాంటిది. అది లభ్యమైనంత సేపూ దాని విలువ మనకు తెలియదు. అది లేనప్పుడు మనం గిలగిలా గింజుకుంటాము." అలాగే ఇటలీ దేశపు స్త్రీలు శతాబ్దాలుగా దాస్య జీవనం గడిపారు. కనుక వారు సంపాదించుకున్న హక్కులు వారికెంతో విలువైనవి.

ఇటలీ స్త్రీలు సాధించిన ఘన విజయాలలో ముఖ్యమైనది "భార్యా భర్త లిద్దరూ కుటుంబ జీవనంలో, ఇంటిలో భాగ స్వాములు" అనే సూత్రం. ఇది అంగీకారమయింది. అలాగే "పిల్లలపై పెత్తనం తండ్రిదే" అన్న సూత్రాన్ని మార్చి తల్లిదండ్రు లిద్దరికీ పిల్లలపై అధికారాన్ని సుస్థిరం చేసింది క్రొత్త శాసనం. ఇలాగే ఎన్నో విప్లవాత్మకమైన భావాలకు శాసన స్వరూపం వచ్చింది. వైవాహిక జీవిత కాలంలో భార్యా భర్తలు సంపాదించిన ఆస్థిపై ఇరువురికి హక్కు ఏర్పడింది. ఇంతకు క్రితం భార్య సంపాదించిన ఆస్థిపై కూడా భర్తదే యాజమాన్యం, పెత్తనం సర్వాధికారాలు వుండేవి.

భారతదేశంలో హిందూ స్త్రీకి స్త్రీ ధనం మొదటి నుండీ అంగీకరింపబడినా కొన్నిరకాల స్త్రీ ధనంపై భర్తకు ఆధిపత్యము వుండేది. దరిమిలా ఆంగ్లేయుల రాకతో ఆ పరిస్థితి మారింది. కనుక ఈ సంస్కరణ విలువను హిందూ స్త్రీలు అంతగా గ్రహించలేక పోయారు.

ఇటలీలో మరో విప్లవాత్మకమైన మార్పు వచ్చింది వివాహ బంధానికి వెలుపల కల్గిన సంతానాన్ని గురించి. వివాహం నాటికి పూర్వపు భర్త వల్ల గర్భవతిగా వున్నా ఆమెకు కలిగిన సంతానం, అట్లే పూర్వపు భార్య వల్ల కలిగిన సంతానం వీటిని ఈ నాటి భర్త వల్లా లేక భార్య వల్లా అనుమతి పొంది తమ కుటుంబంలోని పిల్లలుగా పరిగణించ వచ్చు. పిల్లల దృష్ట్యా ఆలోచిస్తే ఇది బ్రహ్మాండమైన మార్పు. పాపు చేయని తప్పుకు వారిని శిక్షించడం అన్యాయం కాదా?

ఒకనాటి హిందూ సంఘంలో గూఢజులను సహోఢజులను ధర్మ సంతానంగా పరిగణించారు. వివాహం నాటికి గర్భవతి అయిన స్త్రీని పెళ్ళాడిన పురుషుడు ఆమె ప్రసవించిన తర్వాత ఆ సంతానానికి తండ్రిగా పరిగణించింది ఆనాటి ధర్మశాస్త్రం. తండ్రి ఎవరో నిర్ణయించడం తేలికఅయింది. ఇటలీ లోని ఈ చట్టం వల్ల గర్భోత్పత్తికి కారణ భూతుడయిన పురుషుని నిర్ణయించడానికి కోర్టులు అన్ని రకాల పరీక్షా విధానాలను అవలంభించవచ్చు; అవులు పర్చవచ్చు.

పూర్వం విడాకులు పొందటం, వేరుగా వుండటంఅతి కష్టంగా వుండేది ఇటలీలో. ఇప్పుడు ఆ చట్టాన్ని సడలించారు. అవతలివారు ఏదో నేరమో, తప్పో చేసినట్లు రుజువు చేస్తే తప్ప అదివరకు విడాకులు వచ్చేవి కావు. అలాగే వివాహ వయఃపరిమితి స్త్రీకి 14, పురుషునికి 18 వుండాలి యిది వరలో. ఇప్పుడు ఇద్దరికీ 18 ఏండ్లు నిండాలి ఈ కొత్త శాసనం ప్రకారం. ఇలాంటి అభివృద్ధిని ఇటలీ స్త్రీలు గణించడం గణనీయం.

ఇంగ్లండులో పెళ్ళినాటి ప్రమాణాల మార్పు

బ్రిటన్‌లోని క్రైస్తవ మతాధిపతుల సంఘం సమావేశమై అంతర్జాతీయ మహిళా సంఘపు భావ ప్రభావాల దృష్ట్యా పెళ్ళినాటి ప్రమాణాలలో సవరణలు చేశారు.

పెండ్లికి ముందు పురోహితుడుగా వుండే మతాధికారి ప్రారంభోపన్యాసం చేస్తాడు. అందులో వివాహం యొక్క విశిష్టతను, ప్రాముఖ్యాన్ని వివరిస్తాడు. సంతానోత్పత్తికి, పాపపు జీవితంలో అడుగు పెట్టకుండా వుండటానికి, వ్యభిచార నిర్మూలనకు, పరస్పర సాంగత్యము, సహాయము, సౌఖ్యము సంపాదించు కొనుటకు వివాహం అవసరమని ఉద్బోధించేవారు. కష్టసుఖాలలో పరస్పర విశ్వాసముతో భార్యాభర్తలు కలిసి మెలసి జీవించాలని, ప్రేమ సందర్భంగా సంతోషంగా, మృదువుగా దంపతులు సంచరించుకోవాలని, సంతానాన్ని కనడం, పెంచడం, వారిపట్ల శ్రద్ధ వహించడం వారికి వరప్రసాదంగా భావించాలని యీనాటి హితవు చెపుతుంది. పూర్వము భర్తను కుటుంబానికి యజమానిగా భావించేవారు. భర్తకు విధేయురాలుగా వుంటానని ప్రమాణం చేసే వధువు. ఇపుడు నూతన నిబంధన ప్రకారము ఆ ప్రమాణం ఆమె విధిగా చేయనక్కర లేదు. కాగా ఆమెకు యిష్టమైతే ఆమె అలాంటి ప్రమాణాన్ని చేయవచ్చును. తన సంపదనంతా వధువుతో కలసి అనుభవిస్తానని పూర్వం వరుడు ప్రమాణం చేసేవాడు. వధువుకు అలాంటి ప్రమాణము లేనేలేదు. కారణం ప్రమాణం రూపొందిననాడు శతాబ్దాల క్రిందట ఆమెకు స్వంత ఆస్తి లేదు. ఆమె ఆస్థి భర్త ఆస్థిగా పరిగణించేవారు. ఇపుడు బ్రిటనులో శాసనం

ప్రకారము వివాహిత స్త్రీ వ్యక్తిగత ఆస్థి కలిగి వుండవచ్చు. కనుక ప్రమాణాన్ని మార్పు చేస్తున్నారు. 'నన్ను నేను మీకు అర్పించు కుంటు న్నాను, నా సంపదను నీతో కలసి అనుభవిస్తాను" అని వధువు ప్రమాణము చెయ్యాలి కొత్త పద్ధతి ప్రకారము.

పూర్వం బ్రిటన్‌లో కన్యాదానం వుండేది. నేడది పోయింది. వధువు వేల్రికి మాత్రం వరుడు ఉంగరాన్ని పెట్టేవాడు. కాని పరిస్థితి మార్పువల్ల వధూవరులిద్దరూ ఉంగరాలు మార్చుకోవాలి.

సంప్రదాయంలో ఎక్కువ విశ్వాసంతోవున్న బ్రిటిష్ ప్రజలు, మత మౌఢ్యంతో అంధకారంలో వున్న ఇటాలియను ప్రజలుకూడా పురోగమిస్తు న్నారు. మరి భారతదేశం కూడా ఆ పరుగును అందుకుంటుందా?



అణ్వాయుధ ఉన్మాదం: మానవ విలువల విధ్వంసం

ఈ విశ్వం మనది. ఈభూమి మీద జీవపరిణామాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత మనది. మన బిడ్డల ప్రాణాల్ని కాపాడవలసిన వాళ్ళం మనం. ఆహారం తినాలని, సంతానం కనాలనే కోర్కె ఎంతసహజమో, ఆ సంతానాన్ని రక్షించుకోవటం అంతకన్నా ముఖ్యమనేది మనం విస్మరించరాదు. అసలు అణుయుద్ధమంటే ఏమిటో తెలుసా ?

అది 1945వ సంవత్సరము. మంటలు మండే ఎండాకాలం. ఉ॥ 8.15ని.లకు హిరోషిమా నగరంపైన నాగసాకి పట్టణం మీద ఒక్క బాంబు పడింది. దాని తాకిడికి భూమి కంపించింది. సముద్రం దద్దరిల్లింది. అలలు ఉవ్వెత్తున లేచినై. సాగరగర్భంలోని జంతుజాలాలన్నీ భస్మీపటలమైనాయి. సముద్రుడు చెలియలి కట్టదాటాడు. ఇప్పటికీ సాగరంలోని చేపలు విషపూరితాలయి తిన్నవారి ప్రాణాలను హరిస్తున్నాయి. ఆ బాంబు ప్రేలుడికి లక్షల జన సంఖ్య ఆహుతి అయింది. లెక్కకు మిక్కుటంగా పశుపక్ష్యాదులు నశించినై. జీవరాశి నిర్జీవమయింది. లక్షల యకరాలపంట మాడిపోయింది. చావగా మిగిలినవారు అంగవికలులయ్యారు. ఈ మారణ హోమానికి కారణం ఆ అణుబాంబు ప్రయోగఫలితం. ఈ దుస్సంఘటన ఫలితంగా అనేక మంది స్త్రీలు గొడ్రాళ్ళు అయ్యారు. 36 సం॥ క్రిందట ఈ ప్రయోగం జరిగినా ఇప్పటికీ అనేక మంది కేన్సరుతో చనిపోతూనే వున్నారు. ఈ బాంబులు మనుష్యుల్ని ఒక్కసారిగా చంపవు; చంపుతూనే వుంటాయి. అయినా మనం గుణపాఠం నేర్చుకోము.

1960 లో ప్రపంచం మొత్తం మీద 22 వేల కోట్ల డాలర్లు ఖర్చుచేసి అణ్వాయుధాలను తయారు చేశారు. అదే 1980 నాటికి 45వేల కోట్ల డాలర్లు ఆయుధాలకై వెచ్చించినట్లు లెక్కలొచ్చినాయి. యుద్ధ ఆయుధాల ఉత్పత్తి వేగం రోజు రోజుకూ పెరుగుతుంది. ఈనాడు ౬౫ దేశాలు

అణ్వాయుధాలు తయారు చేస్తున్నాయి. ప్రపంచం ఆయుధాలపై నిమిషానికి పది లక్షల అమెరికన్ డాలర్లను వెచ్చిస్తున్నట్లు కామన్‌వెల్తు ప్రధాన కార్యదర్శి శ్రీదత్ రాంఫాల్ చెప్పారు. ఈ దశాబ్దాంతానికి ఈ మొత్తం రెండింతలు కాగలదని ఆయన అన్నారు. నిన్న ఇక్కడ జరిగిన ఆయుధ పోటీ వేగంగా విస్తరిస్తున్నదనీ, దానికి ముందు చూపుగాని, వెనక చూపుగాని లేవని చాలామంది మేధావులు బాధపడుతున్నారు. ప్రపంచం మొత్తం మీద ఆయుధాలకై ఒక్కొక్క మనిషిపై 110 డాలర్లు ఖర్చు అవుతున్నాయని, మొత్తం మిలటరీ వ్యయంలో మూడు వంతులు అభివృద్ధి చెందిన దేశాలు ఖర్చు చేస్తున్నాయని, ఇటీవల బడుగు దేశాలు కూడా ఆయుధాలపై అపరిమితంగా ఖర్చు చేస్తున్నాయని, ఇలాగే కొనసాగుతూ పోతే రెండువేల సం॥ నాటికి నూరు దేశాలు ఆ స్థాయికి చేరుకోగలవని తేలింది. ఆ నాటికి(2వేల సం॥ కు) నూటికి అరవై మంది మాత్రమే జీవించ గలరని కూడా అంచనాలు వచ్చాయి. అంతకన్నా తగ్గే ప్రమాదం కూడా లేక పోలేదు. నిరాయుధీకరణకు చేసిన రెండు ప్రయత్నాలు విఫలమయి నాయంటే ఇందులో ఏదోలోపం ఉండాలి. కనుక శాంతి కోసం మహిళలు రంగంలోకి దిగాల్సిన అవసరం ఏర్పడింది.

శాంతికోసం స్త్రీలు పనిచెయ్యటం ఈనాటిది కాదు. "లిసిస్ ట్రాటా" ట్రోజన్ స్త్రీలు" నాటకాలలో ఈ విషయం వ్రాయబడింది. అలాగే 1982 జూన్ 12న న్యూయార్కు నగరంలో బ్రహ్మాండమైన శాంతి యాత్ర జరిగింది. అనేక వృత్తులవారు, మతాలవారు, కార్మిక; విద్యా; రాజకీయ సంఘాలవారు మూడు మైళ్ళ పొడవున లక్షల జనం పాల్గొన్నట్లు "న్యూయార్కుటైమ్సు" ప్రచురించింది.

డా॥ హెలెన్ కాల్డికాట్ ప్రపంచ వ్యాప్తంగా శాంతి ఉద్యమానికి దోహదం చేసింది. 81 సెప్టెంబరులో ఆమె రష్యావెళ్ళి అధికార్లను, అనధి కార్లను కలసి అణ్వాయుధ పోటీని ఆపమని అర్థించింది. రెండు సం॥రాలు వైద్యవృత్తిమాని శాంతి ప్రచారం సాగించింది. ఈమెను ఉత్తమ హ్యూమనిస్టుగా అమెరికన్ హ్యూమనిస్టు అసోసియేషన్ వారు పేర్కొని గౌరవించింది. ఆమె ప్రపంచ శాంతికి అనేక సూచనలను ప్రబోధించింది. ముఖ్యంగా స్త్రీలు మార్గదర్శకత్వం వహించాలని హెచ్చరించింది.

ఈనాటి సమాజంలో స్త్రీ పురుషులకు వేర్వేరు సామాజిక పాత్రలు నిర్ణయింప బడ్డాయి. స్త్రీలు ప్రేమను, శాంతస్వభావాన్ని అలవర్చుకోవాలని, పురుషులు కత్తులు తుపాకుల లాంటి ఆటవస్తువులతో ఆడుకుంటూ చంపటం నేర్చుకోవాలని ఈ వ్యవస్థ నేర్పుతుంది. ప్రపంచ శాంతి కోరేవారు ముందుగా ఈ వ్యవస్థలో మార్పుతేవాలి. ఉద్యోగ, విద్యా అవకాశాలు, సంతానప్రాప్తి విషయంలో స్త్రీకి స్వేచ్ఛ విధిగా వుండాలి; స్త్రీ పురుషుల మధ్య సమానత్వం ప్రపంచ శాంతికి అవసరం. జనాభాను పెంచి తద్వారా యుద్ధాన్ని ప్రోత్సహిస్తుంటే స్త్రీలు ప్రేక్షకులుగా వుండరాదనేది గ్రహించాలి. స్త్రీలు పిల్లల్ని కనే ఫ్యాక్టరీలు కారాదు.

ఈనాటి సమాజంలో స్త్రీలకు తల్లులుగా కంటే ముఖ్యంగా కుమారుల తల్లిగా మాత్రమే విలువ వుంది. అలాగే ఇంతవరకు పురుషులే సామాజిక నాయకత్వాన్ని ఆక్రమించుకున్నారు. అలాకాక స్త్రీలు ప్రముఖపాత్ర వహించి నాయకత్వ స్థానాల్లోకి వస్తేనే ప్రపంచ శాంతికి దోహదం కలుగుతుంది. అంటే ఏ ఒక్కస్త్రీ మాత్రం నాయకత్వం వహిస్తే చాలదు. స్త్రీలంతా మూకుమ్మడిగా వచ్చి ప్రేమ, శాంతి విద్యుక్తధర్మ నిర్వహణ అనే సూత్రాలను సమాజంలో ప్రవేశ పెట్టాలి. మృదువైన స్త్రీతత్వపు విలువలు పరిపాలనా రంగంలోకి రావాల్సిన అవసరం ఆసన్నమైంది. అంటే పురుషాధికృత సమాజపు యుద్ధతత్వానికి, సమసమాజ భావన ప్రత్యామ్నాయం కావాలి.

ఈనాడు ప్రపంచపు శాంతికి కావాల్సింది స్త్రీతత్వస్వభావపు విలువలు. అంటే ఉత్పత్తి చెయ్యటం, పోషించటం, శాంతిస్థాపన నెలకొల్పటం, జీవసృష్టి చెయ్యటం. ఈవిలువలను నెలకొల్పటానికి స్త్రీలకు శక్తివుంది. శాంతి ప్రియత్వం, పోషించే స్వభావం, ప్రేమించేతత్వం, అహింసాభావం స్త్రీలకు క్రొత్తగాదు. అందుకే అహింసను ప్రభోధించిన గాంధీని మహిళా మనస్థత్వం కలవాడని చమత్కరించేవాళ్ళు. శాంతస్వభావుల్ని 'ఆడదానిలా' అంటారు.

ఈనాడు ప్రపంచమంతా విపరీతమైన సాంకేతికాభివృద్ధి సాధించింది. ఇది చాలా గొప్పఅభివృద్ధిగా మనం భావించాలి. కాని ఇది ప్రపంచశాంతికి

కాకుండా ప్రపంచ విధ్వంసానికి, మారణాయుధాలను ఉపయోగించటం అమానుషంగా గుర్తించాలి. జాతి వెనుకబాటుతనానికి నిదర్శనంగా భావించాలి. అసలు అణుబాంబులు తయారుచేసేది అవసరమొస్తే వాడటానికే కదా! వాడినప్పుడు మనగతి ఏమిటి? కనుక ఈ తరుణంలో తల్లులు ప్రముఖ పాత్ర వహించక తప్పదు. శాంతి సందర్భంగా మనం బిడ్డల్ని గురించి ఆలోచించాలి. కమ్యూనిస్టుల శిశువులని, పెట్టుబడిదారుల శిశువులని రెండు తెగలు లేవు. శిశువులు శిశువులే కనుక వారి శ్రేయస్సు కోసమై తల్లులు ప్రపంచ శాంతిని నెలకొల్పాలి. జాతి విధ్వంసానికి అడ్డుగోడలై నిలవాలి.

అణ్వాయుధ ఉత్పత్తిని ఆపెయ్యాలనీ అలజడులు, ప్రదర్శనలు స్త్రీల ఆధ్వర్యంలో జరగాలి. దానికై స్త్రీల శాంతి సంఘాలు నెలకొల్పాలి. రెండువేల సం॥నాటికి మనపిల్లలు బ్రతకరని వింటే ప్రతితల్లీ ఈ శాంతి సంఘంలో చేరుతుంది. స్త్రీలు చైతన్య వంతులయితే ఈ ప్రపంచాన్ని రక్షించుకోగలరు. ప్రపంచాన్నీ, పిల్లల్నీ రక్షించటానికి స్త్రీల పాత్ర అద్వితీయం అనక తప్పదు.

ప్రపంచ శాంతికై U.N.O వారు ప్రపంచ మహిళా సంవత్సరాన్ని ప్రకటించటం గమనార్హం. శాంతి, స్వేచ్ఛ, సమానత్వం, అభివృద్ధి అనే మూలసూత్రాలపై ప్రపంచ మహిళల స్థాయిని పెంచి, స్త్రీలకు సమాన ప్రతిపత్తినిచ్చి, తద్వారా ప్రపంచ శాంతి పరిరక్షణ జరపాలనేదే ప్రపంచ మహిళా సంవత్సరం, మహిళా దశాబ్దివుత్సవాల లక్ష్యాలు. ఆ సందర్భంగా 76 లో మెక్సికోలో, బెర్లిన్‌లో జరిగిన సభలు ప్రపంచ స్త్రీలలో సంచలనాన్ని కలిగించినై. 150 దేశాలనుండి 1000 ప్రతినిధులు హాజరై 206 అంశాలతో విద్య, ఉద్యోగం, ఆరోగ్యం, గృహవసతి, ప్రసారసాధనాలు, కుటుంబం, పోషకాహారం, రాజకీయ విముక్తిలాంటి ప్రణాళిక తయారుచేసి ప్రపంచ స్థాయిలో చర్చలు జరిపారు. అలాగే 80 లో 'కోపెన్‌హేగన్' లో మరో ప్రపంచ మహిళాసభ జరిపి స్త్రీలకు కొంతవరకు జాగృతిని కలిగించింది. ఆ ఫలితంగా స్త్రీలు కొంతవరకు పురోగమిస్తున్నారనుటలో సందేహం లేదు. శాంతి స్థాపనకై స్త్రీల ఆరాటమే దానికి తార్కాణం.

యూరప్‌లోను, అమెరికాలోను ఇంకా కొన్నిదేశాల్లో స్త్రీలు శాంతి స్థాపనకై ప్రదర్శనలు చేస్తున్నారు. "మేము పిల్లల్ని కనేది చంపుకోటానికి కాదు; అసలు శాంతియుత సమాజం ఏర్పడే వరకు మేము పిల్లలనే కనము" అనే దాకా పోతున్నారు. "మేము సంతానము కనే ఫ్యాక్టరీలుగా జీవించ లేము. మాకు మాతృహృదయంవుంది. మమ్మల్ని అర్థంచేసుకుంటే సరి. లేదా అవసరమొస్తే తిరుగుబాటు ద్వారానైనా శాంతి స్థాపనకు పునాదులు వేస్తాం" అని వీరోచితంగా ఎలుగెత్తి అరుస్తుంది స్త్రీ లోకం. కనుక పురుషులు సమాజానికి, శాంతిస్థాపనకు కృషి చేస్తూ స్త్రీ శక్తిని పెంపొందించగలరని ఆశిద్దాం.

మన శాసనాలు : వాస్తవ పరిస్థితులు

భారతదేశంలో అనేక మతాలవారు ఉన్నారు. హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, పార్శీలు అందులో ముఖ్యులు. వివాహము, విడాకులు, దత్తత, సంరక్షకత్వం, వారసత్వం మొదలైన విషయాలు పౌరుని యొక్క మతంపై ఆధారపడి వుంటున్నాయి. 1857 లో సిపాయి తిరుగుబాటు సంభవించిన తరువాత బ్రిటిష్ ప్రభుత్వ వైఖరిలో మార్పు వచ్చింది. రాణి విక్టోరియా మత విషయంలో జోక్యం చేసుకోనని ప్రకటించింది. 1856 లో ఆమోదించిన విధవావివాహచట్టం, సతీ సహగమన చట్టం తర్వాత బ్రిటిష్ ప్రభుత్వం సంస్కరణోద్యమాలకు మద్దత్తు ఇవ్వలేదు. కాని వారు దానిని వ్యతిరేకించలేదు.

1929 బాల్య వివాహ నిరోధశాసనం కేంద్ర ప్రభుత్వం పెట్టింది. మొదట్లో ఈ శాసనం వధువుకు 13 సం॥ నిండాలన్నది. తర్వాత 18 – 21 (స్త్రీ - పురుషులకు) ఏళ్ళు నిండాలని సవరించింది. ఇది మహమ్మదీయులకు వర్తించదు. బాల్య వివాహం చేస్తే తల్లి దండ్రులకు ఆ శాసనం ప్రకారం శిక్షలు జరిమానా వున్నాయి. అయినా, ఆ వివాహం చెల్లేది. కాని ఇప్పుడు ఆ వివాహం చెల్లదని ఆం॥ ప్ర॥ హైకోర్టు 1975 లో తీర్పు ఇచ్చింది. ముసల్మాన్లలో పెళ్ళి చేస్తే చెల్లుతుంది, కాని ఆమె వ్యక్తురాలైనాక కాదంటే రద్దు అవుతుంది. బాల్య వివాహాల మీద కేసు పెట్టే వాళ్ళు తక్కువ కనుక అక్కడ కూడా జరుగుతూనే వున్నాయి.

వరకట్నం నిషేధం 1961 లో చట్టమయింది. 1981 నాటికి ఒక్క కేసు మాత్రమే నమోదయింది. లాంఛనాల మీద సరి అయిన పరిమితి లేదు. దాని పేరుతో గుంజుకుంటున్నారు. ఏ తండ్రి కేసు పెడతాడు? కనుక ఆ చట్టం నిరుపయోగ మయింది. ముస్లింలలో వరకట్నం లేదు. స్త్రీకే మహర్ ఇవ్వాలి. అది రెండు రకాలు – అడిగినప్పుడు ఇచ్చేది; భర్త చని పోయినప్పుడు కాని, లేక విడిచిపెట్టి పోతేనో ఆ 'మహర్' తిరిగి ఇచ్చేది రెండవది. కాని ఇవ్వఖర్లేదని ఆమెచేత ప్రాయించుకుంటారు. ఇలా వాస్తవంగా విఫలమవుతుంది. కనుక చట్టాలకు కట్నాలు పోవని తేలింది.

వివాహ పద్ధతులు మతాల వారీగా అనేక విధాలుగా వున్నాయి. హిందూ వివాహచట్టం 1955 లో కేంద్ర ప్రభుత్వం పెట్టింది. పూర్వం కన్యాదానం, పాణిగ్రహణం, సప్తపది ముఖ్యంగా వుండేవి. సప్తపదిలో ఏడు అడుగులు వేస్తేనే పూర్తి అయినట్లు. ఆరు అడుగులు వేసి అతడు పడిపోతే వివాహం కానట్లే. 1955 తర్వాత ఆ మూడు అవసరం లేకుండా పోయినాయి. దేశం లోని వాసులైన ముస్లిం, క్రైస్తవ, పార్శీ, యూదులు కాని వారంతా హిందువులే కనుక హిందువుల ఆచారం ప్రకారం జరుగవచ్చని సవరణ చేశారు. తమిళనాడులో పూలదండలు, స్వయం వరం, ఆత్మ గౌరవం అనే సవరణ 7 A సెక్షన్ 1.67 లో పెట్టారు.

ముస్లిం వివాహం స్త్రీ పురుషుల ఒప్పందం మీద ఆధార పడుతుంది. ఒప్పందాన్ని రిజిష్టరు చేస్తారు. 'నికా' రిజిష్టరులో సాక్షుల సంతకాలు వుంటాయి. వరుని దస్కతు వుంటుంది. వధువు తరపున ప్రతినిధిగా (వకీలు) మేనమామో, సోదరుడో, పిన తండ్రో దస్కతు పెడతాడు. పిల్ల మేజరయినా దస్కతు పెట్టదు. వకీలు సాక్షుల సమక్షంలో ఆమెను 'సమ్మతేనా' అని అడుగుతాడు. ఆమె అవునన్నా లేక మౌనంగా వున్నా సమ్మతించినట్లే. సభలో ఈ విషయం మత గురువు (నాయుబ్) ఎదుట వకీలు ఆమె సమ్మతించిందని చెప్తాడు. నాయుబ్ సాక్షుల్ని అడుగుతాడు. వాళ్ళు అవును అంటారు. అప్పుడు దస్కతులు చేస్తారు వరుడు, వకీలు, సాక్షులు. శాసనం ప్రకారం స్త్రీ పురుషుల సమానత్వం ప్రతిపాదించబడినా వాస్తవంలో వధువు అస్వతంత్రురాలు. క్రైస్తవ వివాహ శాసనంలో భర్తకు విధేయురాలుగా వుంటానని ప్రమాణం చేయిస్తారు చర్చిలో.

స్పెషల్ మ్యారేజి యాక్టు (ప్రత్యేక వివాహచట్టం) 1954 లో వచ్చింది. ఈ తరహా పెళ్ళికి రిజిష్టరు తప్పక కావాలి. దీనికి 18 – 21 సంవత్సరాలు నిండాలి; ముగ్గురు సాక్షులుండాలి. ఇది మతాలవారి మధ్య, దేశాలవారి మధ్య జరగవచ్చు.

"బహు భార్యాత్వం నిరోధిస్తూ 1948 లో మద్రాసులో కాశేశ్వరరావు చట్టం తెచ్చాడు. 1955 లో దీన్ని కేంద్ర శాసనంలో హిందువుల కంతా వర్తించేలా చట్టం పెట్టారు, కాని ఎంతో మంది స్త్రీలు సవతిని సహించి

వూరుకుంటున్నారు. భర్త మరో అమ్మాయిని చేసుకున్నాడని రుజువు చేయడం కష్టం. ఆమెను వివాహ మాడలేదు, వుంచుకున్నానని చెప్తాడు. ఉంపుడు కత్తెను పెట్టుకుంటే శిక్ష లేదు. ఇదీ జరుగుతున్న వ్యవహారం, ముస్లింలలో ఏక కాలంలో నలుగురు భా ర్య ల ను కలిగి వుండవచ్చు. నలుగురినీ సమదృష్టితో చూడగలిగినప్పుడే చే సు కో మ ని మహమ్మదు పెట్టిన ఆంక్షను ఎవ్వరూ ఖాతరు చెయ్యటం లేదు. పార్శీల్లో, క్రైస్తవంలో బహు భార్యాత్వం అమల్లో లేదు.

జుడిషియల్ సపరేషన్ అనగా కోర్టుద్వారా ఉత్తరువు పొంది వేరే వుండుట. దానికి వెసులు బాట్లు హిందూ వివాహ శాసనంలో ప్రత్యేక వివాహ శాసనంలో ఉన్నాయి.

వివాహితులలో ఎవరో ఒకరు ఈ దాంపత్య జీవితం కొనసాగించలేను అని నిర్ద్వంద్వంగా ప్రకటిస్తే కోర్టు విడాకులు ప్రసాదించటం సమంజసం. అలాంటి సౌకర్యం మత పరమైన శాసనాలలో కాని, 1954 లోని ప్రత్యేక వివాహ చట్టంలో కూడా లేకుండుట శోచనీయం.

విడాకుల చట్టాలు హిందూ, ముస్లిం, క్రైస్తవుల మతాలలో వేరువేరుగా వున్నాయి. ముస్లిం వివాహ రద్దుచట్టం 1939 లో పుట్టింది. ముస్లిం పురుషుడు మూడు సార్లు 'తలాక్' అంటే చాలు. కాని ముస్లిం స్త్రీ అదే పరిహారం నిమిత్తం దావా వేయవలసి వున్నది. క్రైస్తవ వివాహ రద్దు శాసనం బహు పురాతనమైనది. 1890 లో పుట్టింది. క్రైస్తవ వివాహం రాష్ట్ర హైకోర్టులోని ముగ్గురు జడ్జీలతో ఏర్పడిన ధర్మాసనం మాత్రమే రద్దు చేయాలి. దీనివల్ల అనవసర జాప్యం, కాల హరణం జరుగవా? ప్రస్తుతం హిందూ వివాహ శాసనంలోను ప్రత్యేక వివాహ శాసనంలోనూ వివాహ రద్దుకు పెట్టిన షరతులు ఒకటిగానే వున్నాయి. 1976 సవరణలచట్టం ప్రకారం ఇద్దరి అంగీకారం మీద హిందూ వివాహం రద్దు కాగలదు. ఇటీవల **(Incompatability of Temperment)** అంటే మనస్థత్వాలు సరిపడనందున విడిపోవడానికి అవకాశం కావాలనే బిల్లు ప్రస్తుతం సెలెక్టు కమిటీదశలో వుంది. సాక్ష్య సేకరణ పూర్తి అయింది. 1917 లో రష్యాలో విప్లవం

వచ్చినప్పుడు పోస్టుకార్డ్ డైవర్సు ఉండేది యూనిలేటర్‌గా (ఏక పక్షంగా) జపాన్, రష్యా, చైనా లాంటి దేశాలలో కుటుంబ న్యాయస్థానాల ద్వారా పార్టీల మధ్య రాజీ కుదర్చటానికి ప్రయత్నాలు జరుగుతై. మన దేశంలో ప్రత్యేక న్యాయస్థానాలు లేవు. అందువల్ల నష్టపోయేది స్త్రీలేనని చెప్పక తప్పదు.

మనోవర్తి : (Hindu Adoption & Maintanance Act) వివాహం రద్దు అయినప్పుడు కూడా భర్తదే తప్పు అయినప్పుడు, కోర్టు భార్యకు మనోవర్తి ఇవ్వవచ్చును. ముస్లింలు వివాహం రద్దు అయిన తర్వాత 'ఇద్దత్' గడువు వరకు అంటే మూడునెలల వరకు మాత్రమే ఆమెకు మనోవర్తి లభిస్తుంది. భార్య వేరుగా వుండాల్సిన పరిస్థితుల్లో కోర్టు మనోవర్తి ఇప్పించవచ్చు. క్రిమినల్ కోర్టు కొన్ని పరిస్థితుల్లో నిరాదరణ చేయబడిన భార్యకు మనోవర్తి ఇప్పించవచ్చు. కాని నెలకు 500 రూ. కన్నా ఎక్కువ ఇప్పించరాదు. విడాకులు ఇవ్వబడిన ము ం స్త్రీకి కూడా ఈ సెక్షన్ క్రింద మనోవర్తి ఇప్పించవచ్చు సెక్షన్ 125 క్రిమినల్ ప్రొసీజరు కోడుక్రింద. ఇది ముసల్మాన్ స్త్రీలకు వర్తించరాదని 'షాబుద్దీన్' పార్లమెంటు సభ్యుడు బిల్లు పెట్టాడు. దీనిని సెక్యులరిష్టులు వ్యతిరేకిస్తున్నారు.

దత్తత : (Adoption) ముసల్మాన్లకు దత్తతలేదు. వాళ్ళ పిల్లలను ఇతరులు దత్తు చేసుకునే అవకాశం కల్పిస్తూ 1972 లో బిల్లు పెడితే సనాతనులు అయిన ముస్లింలు వ్యతిరేకించారు. హిందువులలో 1956 కు పూర్వం విధవరాలుకు భర్త ఇచ్చిన అధికారంతో కాని, దగ్గర వారసులు ఇచ్చిన అనుమతితో కాని ఆ దత్తు చేసుకోటానికి వీలువుండేది. వేశ్యలు తప్ప బాలికను దత్తు చేసుకునే హక్కు లేదు. 1956 శాసనం ప్రకారం పురుషుడు బాలుణ్ణికాని, బాలికనుగాని దత్తు చేసుకోవచ్చు. కాని భార్య సమ్మతి వుండాలి. పూర్వం భార్య సమ్మతితో నిమిత్తం లేకుండా జరిగేది. విధవరాలు స్వతంత్రించి దత్తు చేసుకునే హక్కుకూడా 56 లో వచ్చింది.

సంరక్షకత్వం : (Guardian ship) హిందూ మైనారిటీ అండ్ గార్డియన్ షిప్ యాక్టు 1956 లో హిందువులలో తండ్రి లేనప్పుడు మాత్రమే

తల్లికి గార్డియన్‌గా అధికారం వస్తుంది. ముస్లింలలో తండ్రి తర్వాత, తండ్రి వీలునామాలో వ్రాసిన వ్యక్తికి వస్తుంది, వీలునామా లేనిచో తాతకు సంక్రమిస్తుంది. లేదా తాత వీ లు నా మా లో ని వ్యక్తికి వుంటుంది. ఈ నాలుగూ కాకపోతే కోర్టువారు నిర్ణయించే వ్యక్తికి చెందుతుంది కాని, కన్నతల్లికి ఆ హక్కు లేదు. కాకపోతే ఆడపిల్లను 7 ఏళ్ళు మగవాణ్ణి 5 ఏళ్ళు దగ్గర వుంచుకొని పెంచటానికి అర్హత వుంది. మైనరు ఆస్తికి, అతని సంరక్షకత్వానికి ఆడదానికి హక్కు లేనేలేదు కోర్టువారు దయతలచి ఇస్తేతప్ప. క్రై స్త వు ల కు Guardian and wards Act వర్తిస్తుంది. అంటే తండ్రి లేనప్పుడు కోర్టు నిర్ణయిస్తుంది.

వారసత్వపు శాసనాలు : (Succession Act) సమిష్ట హిందూ కుటుంబంలో వుండి చనిపోయిన వాని భార్యకు 1937 పూర్వం మనోవర్తి వుండేది. తర్వాత కొడుకులలో ఒక కొడుకుతో సమానంగా భర్త ఆస్తిని జీవిత కాలపు హక్కుతో అనుభవించే హక్కు ఇచ్చారు. ఇది పొలాలకు వర్తించదని తీర్పు వచ్చింది. మద్రాసులో 1946 నవంబరు నుండి ఇది పొలాలకు కూడా వర్తింపజేశారు. 1955 లో మారిన హిందూ వారసత్వ శాసనంలో ఒక పురుషుడు సమిష్టి హిందూ కుటుంబంలో సభ్యుడై చనిపోతే ఆరోజున పంపిణీ అయినట్లు ఎంచుకొని అతని వాటాను కొడుకులు, కూతుళ్ళూ, భార్యా సమానంగా పంచుకుంటారు సర్వహక్కులతో. దీనివల్ల అంతకుముందు చనిపోయిన పురుషుడి భార్య జీవిత హక్కులు సర్వ హక్కులుగా మారాయి. కాగా తర్వాత చనిపోయిన వాని భార్యకు వచ్చిన కాస్తా సర్వహక్కులతో వచ్చినా వచ్చినవాటా విపరీతంగా తగ్గిపోయింది. అంటే పిత్రార్జితపు ఆస్తిలో జన్మతః తండ్రితో సమానముగా వాటాను కుమారుడు పొందుతాడు. తిరిగి తండ్రి వాటాలో తన తల్లి, నాయనమ్మ, సోదరిలు వాళ్ళతో సమానమైన వాటా పుచ్చుకుంటాడు. కనుక భర్త వాటా నీరుకారి పోయింది. మగబిడ్డకు 1956 లో సమిష్టి ఆస్థిలో జన్మతః హక్కు రద్దుకావాలని పెట్టిన బిల్లు స నా త ను లు వమ్ము చేశారు. ముసల్మాన్ పురుషుడు చనిపోతే భార్యకు పరిస్థితులను బట్టి 1/8 కాని 1/4 కాని వస్తుంది. 1925 భారత వారసత్వపు శాసనం ప్రకారం భార్యకు 1/3 వంతున్నూ, సంతానంలేని స్త్రీకి సగం వస్తుంది. ఆడ, మగ బిడ్డలకు ఆస్తి వాటాలో తేడా

లేకున్నా భార్యకు లాభం చాలా తక్కువ. మన రాష్ట్రంలో 18-3-83 న ఆస్తి హక్కు బిల్లు పెట్టారు. ఈ బిల్లు చట్టమైతే ముఖ్యంగా పుట్టుకతో కొడుకులకు సమిష్టి హిందూ కుటుంబాస్తిలో ఎలాంటి హక్కువుందో అలాంటి హక్కు ఆడపిల్లకిచ్చారు. రాజ్యాంగంలో ఆర్టికల్ 14 ప్రకారం స్త్రీ పురుషుల మధ్య వివక్ష చూపరాదు. కాగా స్త్రీలకు విద్యా ఉద్యోగ విషయాలలో సౌకర్యాలు కలుగజేయ వచ్చని 15, 16 ఆర్టికల్స్‌లో చెప్పబడింది. కనుక కాలేజీలలో, వృత్తి కళాశాలల్లో, ఉద్యోగాలలో, శాసన సభలలో స్త్రీలకు రిజర్వేషన్లు ఇవ్వడానికి చట్టం అడ్డురాదు. అడ్డుపడేది అధికార్లూ, పోతుందని బాధపడే పురుషులూ, అమాయకంగా వద్దనే స్త్రీలు మాత్రమే.

సాంఘిక భీమా పథకాలు కార్మిక స్త్రీలకు – సంఘటితం కాని రంగాలలో వర్తించటం లేదు. అంటే వ్యవసాయ కూలీలకు జీతం మీద ప్రసూతి శలవలు లేవు. వాస్తవంగా శాసనంలేని లోపంవల్ల వారి పరిస్థితి శోచనీయమయింది. అలాగే ఇళ్ళూ, ప్రాజక్టులూ వగైరాల కట్టుబడి, రోడ్లు వేయడం లాంటి వాటిలో స్త్రీలకు సౌకర్యాలు లేవు, శాసనం లేదు, అనుభవములో లేవు. కాబట్టి ఈ పరిస్థితిని మూడు రకాలుగా విభజించవచ్చు.

1) శాసనాలు మంచివి వున్నా స్త్రీలకు తెలియక అవలు పర్చుకోటానికి శక్తిలేక అనుభవంలోకి రాకపోవటం.
2) శాసనాలు లోపభూయిష్టమై నందువల్ల స్త్రీలు బాధ పడడం.
3) కొన్నిరకాలైన శాసనాలు అసలు లేనందువల్ల స్త్రీలు కష్ట నష్టాలకు లోను కావడం.

ఈ పరిస్థితి బాగుపడాలంటే స్త్రీలలో జాగృతి, చైతన్యం కలగాలి. సంఘటనతో కృషి సాగాలి. ఆందోళన, పోరాటాలు జరిగితేనే స్త్రీలు సమాజంలో సరియైన న్యాయంగా తమకు రావల్సిన స్థానాన్ని హక్కుగా పొంది అనుభవించ గలుగుతారు. దానికి ప్రజోద్యమ కార్యకర్తలు సర్వ విధాలా తోడ్పడాలి.



		రు. పై.
హేతువాదం అంటే:	ఎం. వి. రామమూర్తి	4—00
ఎమర్జెన్సీలో జైలు అనుభవాలు	,,	3—00
ఆధునిక స్త్రీ	మల్లాది సుబ్బమ్మ	12—00
మనం దేనికి బానిసలం?	,,	3—50
వెలిగిన జ్యోతి	,,	12—00
తల్లే పిల్లను చంపితే	,,	3—50
విముక్తి ఉద్యమాలు : మహనీయులు	,,	3—50
ఓ మహిళా! ముందుకుసాగిపో	,,	7—00
మారుతున్న సమాజం మహిళలు	,,	5—00
మహిళాభ్యుదయము	,,	15—00
మాతృత్వానికి మరోముడి	,,	12—00
ఎం. ఎన్. రాయ్ జీవితం: సిద్ధాంతం	కోగంటి రాధాకృష్ణమూర్తి	25—00
గాంధీ మార్గం	,,	12—00
నవ్యమానవవాదం ఎం. ఎన్. రాయ్	అ॥ఎ.జి.కె. & ఎం.వి.ఆర్.	6—00
ఫాసిజం ,,	రావిపూడి వెంకటాద్రి	7—00
మానవ నాగరికత ,,	డా॥ భట్టిప్రోలు హనుమంతరావు	8—00
నాస్తికత్వం: నాస్తితత్వం	రావిపూడి వెంకటాద్రి	12—00
మహామనీషి: ఎం. ఎన్. రాయ్	కొల్లా సుబ్బారావు	8—00
ఎం.ఎన్.రాయ్: భారతకమ్యూనిజం	రావిపూడి వెంకటాద్రి	45/60—00
శాస్త్రీయ దృక్పథం	ఎన్. ఇన్నయ్య	4—00
సెక్యులరిజం	పి. సత్యనారాయణ	3—00
స్వేచ్ఛాపథంలో (ఆ. గో. కృ సంచిక)		5—00
కమ్యూనిజానికి అవతల - ఎం. ఎన్. రాయ్.	అ॥ ఎం. వి. రామమూర్తి	10—00
ఎం.ఎన్. రాయ్. భారతనారి ఆదర్శం	,,	10—00
ఆం. ప్ర. లో హేతువాద ఉద్యమం	ఎం. వి. ఆర్. మల్లాది సుబ్బమ్మ	2—00

ప్రజాస్వామ్య ప్రచురణలు **వికాసం**

9, ఎం. ఐ. జి. హెచ్. కాలనీ, మెహిదీపట్నం,

హైదరాబాదు. 500 028. ఫోను 31423.